కన్యాశుల్కం

గురజాడ వేంకట అప్పారావు

కన్యాశుల్కం

మహాకవి

గురజాడ వేంకట అప్పారావు

జయంతి పబ్లికేషన్స్
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 520 002.

KANYAAULKAM

By :
GURAJADA APPARAO

First Edition : **1897**
Second (Recast) Edition : **1909**

JAYANTHI PUBLICATIONS
KARL MARX ROAD
VIJAYAWADA - 520 002.
Ph : **0866-2577828**
Mobile : **8978261496**

First Edition : **2013**

Price : ₹ : **100-00**

Title Design :
GIRIDHAR

DTP :
SRI SRINIVASA GRAPHICS
Ph : 9440397989

Printers :
NAGENDRA ENTERPRISES
VIJAYAWADA - 520 002.
Ph : **0866 - 2442001.**

యుగకర్త గురజాడ సాహిత్యంపై

మహాకవి శ్రీశ్రీ సమీక్ష

వేసిన దారంట వెళ్ళిపోవడం సులభం. అంతేకాదు పదిలం. నలుగురికి తెలిసిందీ, చిరకాలం నుంచి నలిగిందీ ఒక దారి సిద్ధంగా సుప్రసిద్ధంగా ఉంటూనే ఉన్నప్పుడు వేరే ఒక కొత్తదారి వెదకడం అవివేకం, ప్రమాదం అని అంటారు కొందరు. కాని పురోగమనానికి కొత్తదారులే రాచబాటలు. అలుపులేని అన్వేషణ గతానుగతికత్వాన్ని సహించలేదు. కాలిబాటలోనే మానవుడు తృప్తి పడిపోయివుంటే వ్యోమయానాలు సాధ్యమై ఉండేవి కావు. ఆ కాలిబాట కూడా ఒకప్పుడు శతాబ్దాల క్రిందట, శతాబ్దాల క్రిందట అగమ్యాలైన అరణ్యాలను ఛేదించి సాధించడానికి మానవుడు చేసిన యత్నమే, వేసిన మార్గమే అని మనం మరచిపోకూడదు.

ప్రముఖ సాహిత్యాలన్నింటిలోనూ వచన రచన ఇటీవల పరిణామమే. అంటే ప్రాచీన సాహిత్యకారులకు గద్యగ్రంథన తెలియని విద్య అని ఉద్దేశ్యం కాదు. భారత భాగవతాదులలో, ప్రబంధాలలో, యక్షగానాలలో వలసినంత వచనం లేకపోలేదు. అయితే ఆ వచనం ఏదీ ఆధునిక కాలపు ప్రత్యేకావసరాలకు సరిపోయేది కాదు. కాదంబరి యావత్తూ గద్యంలోనే ఉన్నా ప్రధానంగా అది కావ్యపాకంలోనే సాగింది. అలాగే శ్రీనాథుని వచనం. అలాగే మను, వసు చరిత్రాదులలో వచనం. వాటిలోని కావ్య సౌందర్యం నేటికీ మనల్ని ఆకర్షిస్తుంది. కాని ఆధునిక వచనం అంటే మనకి అర్థం అయ్యే పద్ధతిలో అవేవీ లేవని మాత్రం అంగీకరించక తప్పదు.

ఈ కారణాల వల్లనే చిన్నయసూరిని కూడా నిరాకరించ వలసి ఉంటుంది. ఆయన నవీన కాలంలో పరివేషించిన ప్రాచీనుడు. ఇప్పటికీ అతని వారసులనేకులు మనలో ఉన్నారు. ఆయన ఒరవడి ననుసరించి చక్కని గ్రాంథిక శైలిలో వచన సాగిస్తున్న వారు చాలామంది ఉన్నారు. కాని ఇటువంటి రచనలు చెయ్యడం ఇదివరకు వేసిన దారంట వెళ్ళడం వంటిదే. నేటి కాలపు ప్రత్యేకావసరాలను పురస్కరించుకొని ప్రత్యేక పంథాలలో సాగే వచన రచనలకే ఆధునికం అనే విశేషం అంగీకరించడం యుక్తం.

అటువంటి గద్య రచనకి ప్రారంభకుడూ, ప్రవక్తా గురజాడ అప్పారావు. ఎన్నెన్నో సాహిత్య రంగాలలో ఆయన కొత్తమార్గాలు తెరచి కొత్త ప్రక్రియలు అవలంభించారు. ప్రత్యేకంగా వచన రచనలో ఆయన వాడుక భాషను స్వీకరించి దానిని మహోన్నతమైన

సాహిత్య స్థాయికి తీసుకు వెళ్ళాడు. గురజాడ చేపట్టక పూర్వం, ఆయన మాటల్లోనే... "గ్రామ్య భాష దిక్కుమాలిన స్త్రీ.... ఆమెను పండితులు నిష్కారణంగా దూషించి అవమానించగా కనికరించి ఫీజు లేకుండా వకాల్తా పట్టితిని".... అన్నాడు గురజాడ. ఈనాడు వాడుక భాష దిక్కుమాలినది కాదు. గుడిసెల్లో పుట్టి పెరిగి, స్వయం ప్రతిభతో కళాశిఖరాలందుకున్న నటీమణితోనో, స్వల్ప ప్రారంభాల నుంచి బైటపడి, స్వయంకృషితో చదువులన్నీ నేర్చి, పార్లమెంటు భవనాల నలంకరించే విదుషీమణితోనో నేటి వ్యావహారిక భాషను సరిపోల్చవలసి ఉంటుంది. వాడుక భాషకు ఏ ఒక్కరైనా ఇంత గౌరవం సాధించారంటే అతడు గురజాడ అప్పారావనే చెప్పాలి. అయితే అప్పారావుగారి పేరు స్ఫురించినప్పుడల్లా పాయక పాకశాసనికి భారత ఘోర రణమునందు నారాయణు నట్లు.... సాయపడి నిలుచున్న గిడుగు రామమూర్తిగారు కూడా జ్ఞాపకం వచ్చి తీరుతారు, వ్యవహారిక భాషాస్థాపనకి జరిగిన అనేకానేక యుద్ధాలలో గురజాడ వారు సృజనాత్మకమైన రసగోళాలు ప్రయోగిస్తే, శాస్త్రీయమైన వ్యూహ నిర్మాణాలతో బాసట ఇచ్చిన వారు గిడుగు పంతులు.

ప్రధానంగా గురజాడ అప్పారావుగారు వచన రచనలంతటినీ నాలుగు విభాగాలలో చేర్చవచ్చు. 1. నాటకీయం, 2. కథనాత్మకం, 3. విమర్శనాత్మకం, 4. వ్యక్తిగతం. వ్యక్తిగతమైన ఈ నాలుగో విభాగం కింద గురజాడవారి లేఖలూ, డైరీలూ, నోట్సూ వస్తాయి. వీటిలో చాలా మట్టుకు చెల్లా చెదరైపోయి ఇప్పుడు మనకు దొరకవు. దొరికినవైనా కొన్ని ఇంగ్లీషులో, కొన్ని తెలుగులో రేఖాప్రాయంగా కొన్ని, అసంపూర్ణంగా కొన్ని ఉన్నాయి. వీటినన్నింటినీ ఒక్కచోట చేర్చగల్గిననాడు అప్పారావుగారి సమగ్రసాహిత్య వ్యక్తి మనకి సాక్షాత్కరిస్తాడు. ఇప్పటి మట్టుకు ఉన్న దానిని మాత్రం ఆధారం చేసుకొని అప్పారావుగారిని మనం అర్థం చేసుకోవాలి. చరిత్ర, సైన్సు, సాహిత్యం ఒకటేమిటి విద్యాపిపాసినాకర్షించే అన్ని వెలుగుల వైపూ ఆయన దృష్టి ప్రసరించింది. ఏ విషయాన్ని స్పృశించినా దాని మీద ఆయన వ్యాఖ్యానించే తీరు ఆయనదెంత ఆధునిక మనస్తత్వమో అతి స్పష్టంగా తార్కాణిస్తూనే ఉంటుంది. వ్యక్తిగతమైన ఈ వ్రాతలన్నింటిలో కూడా ఆయన ఆలోచన ఎంతసేపూ సంఘపరంగానే సాగుతూండడం మనకి గోచరిస్తుంది.

ఇక ఇంతకుముందు నేను చేసిన విభాగాల ప్రకారం అప్పారావు గారి రచనా రీతు లొక్కటొక్కటే పరిశీలిస్తాను. వీటిలో మొదటిది నాటకీయం. మనదేశ భాష

లన్నింటిలోనూ, పూర్తిగా వచనంతో, అందులోకి పాత్రోచితమైన వ్యావహారిక శైలిలో మొట్టమొదటిసారిగా నాటకం రాసింది గురజాడ అప్పారావు గారనే అనుకుంటాను. సాంఘిక వాస్తవికతను దర్పణంలో వలె యధాతథంగా ప్రతిబింబించిన కళాఖండం మన భాషలోనే కాదు, మరే ఇతర భారతీయ భాషల్లోనైనా మొదటిదీ, ఆఖరిదీ కన్యాశుల్కమే అనుకుంటాను. కన్యాశుల్కం నాటకాన్ని ఆ తెగలో మించడం మాట అటుంచి, ఆ దరిదాపులకైనా రాగల నాటకం మన దేశంలో ఏదైనా ఉంటే దాని సంగతి ఇంతవరకూ ఎవరికీ తెలియకపోవడం ఆశ్చర్యకరమే అని మాత్రం నేననక తప్పదు.

వాస్తవిక నాటకాల్లో స్వగతాలు అస్వాభావికం అనే వాదం ఉంది, ఈ వాదంతో నేను ఏకీభవిస్తాను. ఒక ప్రతిమ యెదుట మాట్లాడడం, జనాతికంగా ప్రేక్షకులను మాత్రమే ఉద్దేశించి చెప్పడం, తనలో తానుగా స్వగతం, ఇవన్నీ సంప్రదాయ సిద్ధమైన నాటక లక్షణాలే అయినప్పటికీ, రసపోషణకి ఉపకరించగలిగినవే అయినప్పటికీ ఇటువంటి వాటన్నిటికీ వాస్తవిక నాటకంలో చోటులేదనే నా నమ్మకం. షేక్స్పియరు స్వగతాలు సాహిత్యకళా కిరీటాలని అంగీకరిస్తాను. యూజీన్ ఓనీల్ ఒక నాటకం. నాటకం అంతా వ్యక్తుల మాటలతోనూ, వాటి చాటున వారి మనస్సుల్లో భావాలతోనూ జమిలించి నడిపించాడు. ఇది ఒక పద్ధతి రచన. స్వగతానికి ఎంతో శక్తి ఉంది కాబట్టే వాస్తవికతకి విరుద్ధమైన కన్యాశుల్కంలో స్వగతములు లేకపోతే బాగుండునని అనుకొనే వాళ్ళలో నేనొకణ్ణి కాలేకపోతున్నాను. గిరీశం స్వగతాలు మాట ఇటుండగా, ఎన్నోచోట్ల గురజాడ మహాకవి స్వగతాలను సార్థకంగా ఉపయోగించాడు. ఒకటి రెండు ఉదాహరణలు చూపిస్తాను...

మనిషి మనస్సు లోతులకు దిగి, అతని అవస్థను అమాంతంగా దేవి పట్టుకొని పైకెత్తి చూపించి అందులోనుంచే ఒక నీతి బోధచెయ్యడం.

లుబ్ధా : ఓరి కుంకపీనుగా! నీ కళ్ళు యావైపోయినాయిరా... రేపు రాత్రి బయల్దేరి కాశీపోయి, గంగలో మునిగానంటే అన్ని పాపాలూ పోతాయి. భగవంతుడు బుద్ధొచ్చేట్టు చేశాడు. లేకుంటే, ముసలి వెధవకి పెళ్ళి చేసుకోవడవు పోయీ కాలవేవిటి ?

దొంగవుత్తరం తానే బనాయించినట్లు మధురవాణితో చెప్పిన తర్వాత,

రామ : ఇదెక్కడికి పారిపోతూంది ? యిదే చెప్పేసింది – దొంగ పని చేసినప్పుడు రెండో వారితో చెప్పకూడదు. వెధవని చెవులు నులుపుకుంటాను.

– ఇది రామప్పంతులు సుభాషితం.....

అన్నిటికన్నా మిన్నగా నేటి సినీమారంగానికి కూడా సాధ్యం కాని మనోవేగాన్ని స్ఫురింపజేసే స్వగతం ఇంకొకటి ఉంది. రామప్పంతులు మధురవాణి ఇంట్లో మంచం కింద దాగుని ఉంటాడు. గిరీశం వస్తాడు. ఇప్పుడు గిరీశానికీ, మధురవాణికీ జరిగిన సంభాషణలో ఒకచోట. "యవడీ మాటలు పేల్తున్నాడో వాడి పేరు తక్షణం చెబుతావా చెప్పవా ?" అని గిరీశం అడిగితే మధురవాణి "రామ రామ ఒహరు చెప్పేదేవిటి" అంటుంది. ఇందులో మొదటి "రామ" చెవిని పడగానే రామప్పంతులు గుండెల్లో రాయి పడుతుంది. "చచ్చాన్రా, పేరు చెప్పేసింది" అని తనలో అనుకుంటాడు. నాటకంలో "రామ" అని మధురవాణి ఆగడం, రామప్పంతులు స్వగతం, 'రామ రామ' అని మధురవాణి అందుకోవడం అచ్చై ఉంటుంది. ఇక్కడ గురజాడ మహాకవి కాలాన్ని రెండు మూడు క్షణాలపాటు ఆగమని ఆజ్ఞాపించాడు.

ఇటువంటిదే ఇంకొకచోటు. ఈసారి స్వగతం కాదు. సంభాషణ రామప్పంతులు కొండిభొట్లుని చెల్లిస్తాడు.

"మధురవాణి పాడింది కాదేం ?"

రామప్పంతులు కే జవాబు కావాలో అదే తప్ప నిజమా అబద్ధమా అన్న సంగతి చూడడు కొండిభొట్లు, పాడిందంటే సంతోషిస్తాడేమో అనుకొని 'పాడింది' అంటాడు.' 'ఆఁ ?" అని రామప్పంతులు గర్జించగానే సర్దుకొని 'కాదండీ' అని కలుపుతాడు. కొండిభొట్లు పాత్ర చిన్నదే ఐనా ఈ ఘట్టంలో నటించగలిగిన వాడిని మహానటు డనడానికి సందేహం మరి ఉండకూడదు.

కన్యాశుల్కంలో ఎక్కడ 'ఎప్పుడు' ఎవరి మాటలైనా తీసుకోండి. ఇక్కడ అప్పుడు సరిగా ఆ పాత్ర ఆ మాట తప్ప మరొకటి అనడానికి వీల్లేదు. ఇది నాటక రచనకి పరాకాష్ట, గురజాడ కవి మహత్తర విజయం.

'కన్యాశుల్క' మంత గొప్ప నాటకాలు కాకపోయినా 'కొండుభొట్టీయం', 'బిల్హణీయం' అనే మరో రెండు నాటకాలు సంభాషణ నడిపించడంలో గురజాడ కవి చాతుర్యాన్ని

విశదంచేస్తూ కన్పిస్తాయి. వీటిలో 'బిల్హణీయం' అసంపూర్ణం ఐనా అందులో చిత్రించిన పాత్రలు మానవ స్వభావ పరిశీలనలో గురజాడ అప్పారావుగారి కళాదృష్టి ఎంత నిశితంగా ప్రసరిస్తుందో నిదర్శిస్తాయి.

తరవాత విభాగం కథనాత్మక వచనం. నిజానికి వచనం యొక్క ప్రథమ ప్రయోజనం కథనమే అనవచ్చును. పూర్వకవులు కథనానికి కూడా పద్యమే ఉపయోగించి ఉండవచ్చును. ఆ మాటకొస్తే వారు పద్యం ఉపయోగించనిదంటూ ఏదైనా సందర్భం ఉందా ? శాస్త్రాలూ పద్యాల్లోనే రాశారు, శాసనాలూ పద్యాల్లోనే రాశారు. ఇక కథ చెప్పకుంటూ పోయేటప్పుడు పద్యాలచేత వీరు రకరకాలుగా కథ కదను-తొక్కించారు. అదే రసానందం వచనంలో తీసుకురావాలంటే మాటలతో పనికాదు. పొరపాటు మాటలతో పనికాదనా అన్నాను ? ముమ్మాటికీ మాటలతోనే పని! దిద్దుబాటు; అనే కథలో గురజాడ అప్పారావుగారి ఈ దిగువ ఎత్తుబడి చూడండి...

"తలుపు.... తలుపు."

తలుపు తెరవబడలేదు. ఒక నిమిష మత డూరుకొనెను.

గదిలోని గడియారము టింగుమని ఒంటిగంట కొట్టింది.

ఎవరినాకర్షించదు ఈ ప్రారంభం ? కథయినా, కావ్యమైనా, నవలైనా, నాటకమైనా, కళారూపం ఏదైనా సున్నితంగా ఏరోడ్రోమునుంచి బయల్దేరే విమానంలాగ ప్రారంభించి ప్రయాణం యావత్తూ దూరమైనా, చేరువైనా సాగించి, సాగించి తుదకు సురక్షితంగా గమ్యస్థానంలోకి దిగాలి. విమాన చోదకుడిలాగా కళాకారుడెక్కడా కనబడకూడదు.

ప్రారంభం, నిర్వహణ, ఉపసంహారం – ఇవే కళావస్తువు నాణ్యం తెలియజేసే నికషాలు, "దిద్దుబాటు" ప్రారంభం చూశాము. నిర్వహణ ఏ యే రీతులుగా సాగిందో పరిశీలించడానికి కిప్పడదనులేదు. ఆఖరి వాక్యం మాత్రం ఇక్కడ ఉటంకిస్తాను...

"అంతట మంచము క్రిందనుండి అమృతనిష్యందిని యగు కల కల నగవును, కరకంకణముల హృద్యారావమును విననయ్యెను."

ప్రారంభంలో గడియారం చప్పడు జ్ఞాపకం తెచ్చుకోండి. అప్పడీ వాక్యంలోని స్వారస్యం మరీ చక్కగా ఆస్వాద్యమవుతుంది. ఇంతకన్నా గొప్పకథ "మీ పేరేమిటి ?" అన్నది. కథ చెప్పడం అంటే ఏమిటో ఎలాగో తెలుసుకోవాలంటే మనభాషలో ఈ కథను

మించిన ఉదాహరణ ఇంకోటి నాకు కనబడదు. మొపాసాం కథన విధానాన్ని మెచ్చుకుంటూ ఒక విమర్శకుడు మొపాసాలో వర్ణన, సంభాషణ, కవిత్వం, ధర్మబోధ ఎప్పుడు 'ఏది' ఎంతవరకు అవసరమో ఆ మోతాదులో దొరుకుతాయని పేర్కొన్నాడు. "మీ పేరేమిటి" అన్న కథకి కూడా ఈ విమర్శ అక్షరాలా వర్తిస్తుంది.

నేను చేసిన విభాగాలలో నాలుగవదీ, అఖరిదీ విమర్శాత్మక వచనం. వ్యాసరచనని ఒక కళారూపంగా పెంపొందించడం ఇటీవలి కాలంలోనే జరిగిందనడం నిర్వివాదాంశం. ఒక రచయితలో ఉన్న అన్ని సుగుణాలనూ దుర్గుణాలనూ బైట పెట్టగలిగినది సాహిత్య వ్యాసం ఒక్కటే అనుకుంటాను. అతనిలోని అన్నిగుణాలూ ఒక్కుమ్మడిగా వ్యాసరచనలో పెల్లుబుకుతాయి. ఒక పద్యాన్నిబట్టి కవియొక్క యావచ్ఛక్తి సామర్థ్యాలనూ మదింపు చెయ్యడం కష్టమేమో కాని ఒక్క 'వ్యాసం చదివి ఆ రచయిత యొక్క అంతు పొంతులు సులువుగా గ్రహించగలం. గురజాడ అప్పారావుగారి వ్యాసం ఏదిచూచినా అందులోంచి అతని అసాధారణ ధీశక్తి తొంగిచూస్తూ వుంటుంది. కత్తినాదరకన్నా పదునైన హాస్యం పలకరిస్తుంది. ఒకానొక క్రమశిక్షణతో కూడుకున్న వాదపటిమ గోచరిస్తుంది.

అప్పారావుగారే ఒకచోట అన్నారు : "విద్వాంసుల ధోరణులు వేరు వేరు రీతుల నుంటవి. హాస్యరసముమీద కొందరి కలము పరుగులిడుతుంది. కొందరి బుద్ధులు దోషాన్వేషణములో వాడితేరుతవి. మరి కొందరి బుద్ధులు తిట్లకు తీరి వుంటవి. ఈ మూడు రీతులూ చాలినంత లేకపోవడం వల్లనే మన భాష ఇప్పటి ఈ దురవస్థలో వున్నదని నా అభిప్రాయము.." అని ఇంకొకచోట "ఆధునిక వచనం తెలుగు విద్యార్థుల మనోవికాసానికి ఉపకరించడం లేదు..." అన్నారు. ఆ లోపాన్ని తొలగించడానికే రాశారేమో అన్నట్టుంటాయి అప్పారావుగారి వ్యాసాలు.

బుద్ధి తెచ్చుకొమ్మని ఆకాశరామన్న ఉత్తరం రాసిన ఒకబ్బిని గురజాడ ఎంత సున్నితంగా వేళాకోళం చేశాడో చూడండి...

"చిన్ననాటి బెత్తపు దెబ్బలవల్ల బుద్ధి రాలేదు. పెద్దలమాట వినక దాట్లు వేసినపుడు కాలువిరిగినా బుద్ధి రాలేదు. నాటికీ నేటికీ ఎప్పటికప్పుడు బుద్ధిని ఎంత ఆసక్తితో బతిమాలి పిలిచానా రాలేదు. అరవైఏళ్ళకు అగ్గి గండం ఉన్నట్టు ఇప్పుడు మా మిత్రులు నొక్కి నొక్కి వ్రాసినాడని, బుద్ధిని విరిచికట్టి తెచ్చి పెట్టుకున్నా భరించడం కష్టం. ఆ

శ్రమకు నేను పూనుకోజాలను. మిగిలివున్న నాలుగురోజులూ కొంచెం స్వేచ్ఛగా బతక వలెనని వున్నది. ఎవరికుండదు ? అంతేగాక – నావంటి వాళ్ళకు కూడా బుద్ధి గలిగితే బుద్ధి చవకైపోతుంది. కనుక ఆ బుద్ధున్న దేదో ఆకాశరామన్న గారు భద్రంగానూ, రహస్యముగానూ దాచుకుంటేనే విలువ."

అదే వ్యాసంలో వేరొకచోట గురజాడ అప్పారావుగారు మానవుడి మీద తనకున్న మమకారాన్ని బయలుపెట్టే ముక్కలు రెండు మూడన్నాడు. ఆ మాటలు గురజాడ మహాకవి సాహిత్య వ్యాసంగం అంతటికీ కీలకప్రాయమైనవని నేను భావిస్తున్నాను. ఆయన ఏమన్నాడంటే....

"చిన్నతనంలో బొమ్మలాట నేర్చి వుండుటచేత లోకమనేరంగంలో చిత్రకోటిరీతులను ఆటాడే మనుష్యులనే పాత్రముల సొగసునే కనిపెట్టటము నాకు అలవాటైనది. సొగసులేని మనిషే వుండడు. స్నేహము, ప్రేమా, అనే అనాది అయిన్నీ ఎప్పటికి సరికొత్తగా వుండే రెండు వెలుగులను నరునిమీద తిప్పి కాంచితే వింత సొగసులు బయలుదేరుతవి. అసూయ అనే అంధకారంలో అంతా ఏక నలుపే."

మహానుభావుడు గురజాడ.

గురజాడ ఆధిక్యానికి కారణాలు

1909వ సంవత్సరం మే 1 వ తారీఖున ఉదకమండలములోని 'ఎల్క్‌హిల్ హౌస్'లో కూర్చుని రెండో ముద్రణ కాబోతున్న తన నాటకానికి పీఠిక రాసుకుంటున్నాడొకాయన. అతని వయస్సు 45 సంవత్సరాలు. ఇంకో ఆరేళ్ళలో అతను విశాఖపట్టణంలో మరణించ బోతున్నాడు. ఉన్ని గుడ్డలు కట్టుకొని శాలువలు కప్పుకొని జాగ్రత్తగా శరీరాన్ని కాపాడుకొంటున్నాడు. అప్పటికే అతన్ని పీడిస్తున్న వ్యాధి అత్యంత తీవ్రరూపం ధరించింది. ఆరోగ్యం కోలుకోవడానికే ఉదకమండలం వెళ్లాడతను. స్థలం ఊటీ. సమయం 1909 మే డే. రాస్తున్నది కన్యాశుల్కానికి ద్వితీయ ముద్రణ పీఠిక, రాతగాడు గురజాడ అప్పారావు.

ఈ పీఠిక ఇంగ్లీషులో ఉన్నందువల్ల తెలుగు మాత్రమే తెలిసిన ఆంధ్రులనేకులకి అందులో వున్న అమూల్య విషయాలు అందిరాక పోతున్నాయి. నాటక రచన, సంఘ సంస్కరణ, వ్యావహారిక భాషా ప్రాశస్త్యం, రచయితలు తాము రాసిన పుస్తకాలు అచ్చు

వేయించుకోవడానికి పడేపాట్లు, పాఠ్యపుస్తక నిర్ణేతల నిరర్థక నిరంకుశత్వాలు, విశ్వ విద్యాలయాధ్యాపకుల సాహిత్య పరాఙ్ముఖత్వం, సమకాలిక విద్వాంసుల ఛాందసాలు, ఒకటేమిటి, ఎన్నో సంగతులున్నాయి ఆ పీఠికలో.

"తెలుగుదేశంలో గ్రంథకర్త అయినవాడు తన పుస్తకాలు తానే అచ్చొత్తించుకోవాలి. తానే అమ్ముకోవాలి" అని ఆనాడు మహాకవి అన్నమాట ఈనాటికీ యదార్థంగానే వుంది. అందుకనే అతనింకోమాట అన్నాడు :

"Modern life which presents complex social conditions is neglected by play wrights".

అనగా అతి క్లిష్టమైన అనేక సాంఘిక పరిస్థితుల్ని ప్రదర్శించే ఆధునిక జీవితాన్ని నాటక రచయితలెవ్వరూ కథావస్తువుగా స్వీకరించడం లేదు అని. కొద్ది మినహాయింపులతో నాటక రచయితల గతి నాటికీ నేటికీ ఒక్కలాగే ఉంది.

ఆ మరుసటి సంవత్సరం తోకచుక్క కనబడ్డ యేడు. బరంపురంలో నానాజాతి సహపంక్తి భోజనం జరిగిన ఏడు. మహాకవి గురజాడ అప్పారావు మొట్టమొదటిసారి ముత్యాలసరాలు గుచ్చిన ఏడు. అప్పుడే తెలుగు కవిత్వంలో విప్లవశకం ఆరంభమయింది.

ఈ విషయాన్నిక్కడ కొంచెం విపులీకరించదలచుకున్నాను. కందుకూరి వీరేశలింగం, తిరుపతి వెంకటేశ్వర కవులు, ఆఖరికి రాయప్రోలు సుబ్బారావు వీళ్ళెవరూ కారు ఆధునిక సాహిత్య విప్లవ నాయకులు. ఇప్పుడు చెప్పిన వాళ్ళంతా గురజాడ అప్పారావు కంటే గొప్పవారు కూడాను. కాని, సాహిత్య పరిణామంలో ఈ చెప్పిన నలుగురికి గురజాడ అప్పారావుకి ఉన్న తేడా, సామాజిక వ్యవస్థలో సంస్కరణ ప్రియత్వానికి, విప్లవ నేతృత్వానికీ మధ్య వున్న భేదం వంటిదే. ఆధునిక సాహిత్యంలో ఆచార్యపీఠం ఎవరిదీ అన్న ప్రశ్నకు కందుకూరి వీరేశలింగం గారిదని కొందరూ, తిరుపతి వెంకటేశ్వర కవులదని కొందరూ, రాయప్రోలు సుబ్బారావువని మరికొందరూ జవాబిస్తారు. కొన్ని పరిమితమైన ఆవరణల్లో వీరి జవాబులన్నీ అంగీకరింపదగ్గవే. నిశ్చయంగా కందుకూరి వీరేశలింగం యుగపురుషుడే. తిరుపతి వెంకటేశ్వరులు మార్గదర్శకులే. రాయప్రోలు ఒకానొక కవితా పద్ధతికి ఒరవడి పెట్టినవాడే. అయితే గురజాడలో ఎక్కడుంది విశిష్టత ? ఎందులో ఉంది ఆధిక్యం ? రాయప్రోలు మీద

అభిమానం కొద్దీ ఆయన భక్తులతని కాచార్యత్వం ఇచ్చినట్లు గురజాడ మీద మూఢవిశ్వాసంతో అతణ్ణి నాయకునిగా అంగీకరిస్తున్నానా లేక వ్యక్తిగతాభిరుచుల కతీతమైన విశేష ప్రామాణ్యాలు మరేవైనా వున్నాయా ?

ఉన్నాయంటాను నేను. వీటిలో ముఖ్యమైనదీ మొట్టమొదట చెప్పకోవలసినదీ ఏమిటంటే, ఏ కవికైనాసరే అతని చుట్టూ ఒక సమాజం; ఆ సమాజానికొక చరిత్రా, ఆ చరిత్రకొక పరిణామం వుంటాయి. సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవియొక్క సాహిత్యస్థానం నిర్ణీత మవుతుంది. కవి ప్రగతిశీలి, ప్రతిభాశాలీ అయితే ఈ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవ పంథాలో వేగం సాధించిన మహాకవి గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను.

ఇక రెండోది మొదటి అంశం నుండే మొగ్గ తొడుగుతుంది. మొదటిది టెంపోకి సంబంధించిందైతే, రెండోది డైరెక్షన్‌కి చెందింది. పరిణామం ఎంత వేగంగా సాగింది అనే కాకుండా ఏ దిక్కుగా సాగింది అని కూడా ఆలోచించాలి. పురోగమనమా పశ్చాద్గమనమా అనే విషయం ఆలోచించాలి. ఇంగ్లండులో టి.ఎస్. ఈలియట్‌ని ఈనాటి మహాకవులలో ఒకడని అందరూ అంగీకరిస్తారు. కాని అతని దృక్పథం మాత్రం అభ్యుదయ నిరోధకం. మన విశ్వనాథ సత్యనారాయణ గారున్నారు, ఆయనా అంతే. గ్రీకు రోమన్ కాలాల సంస్కృతి ఈలియట్‌ని ఆకర్షించినట్టే రామాయణ భారత కాలాల వైభవం విశ్వనాథ వారిని ముగ్ధుల్ని చేస్తుంది. ఆ వేళకి ఈ వేళకీ మానవజాతి చాలా ముందంజ వేసిందంటే ఇద్దరూ ఒప్పకోరనుకుంటాను. ఇందుకు నిదర్శనంగా ఈ కాలపు మానసికాందోళనలను వేలెత్తి చూపిస్తారు. "ఆ పీనుగులు మనలాగే ఏడుస్తూ వుండేవారు. మనకంటే అధ్వాన్నంగా వుండేవారు" అనగలిగిన సాహసం అప్పారావుకే చెందింది. దృక్పథాలలోని తేడా యిది. భూతకాలం మీద ఈలియట్‌కున్న అభిమానాన్ని అర్థం చేసుకుంటూనే భవిష్యత్తు మీద గురజాడకున్న విశ్వాసానికి నే నిక్కడ నివాళు లెత్తుతున్నాను.

నవ్యాంధ్ర సాహిత్యానికి ఏకైక నాయకునిగా గురజాడ అప్పారావుని నే నంగీకరించటానికి మూడో కారణం భాషకి సంబంధించింది. ఇందాకా నేను చెప్పిన పీఠికలో గురజాడ ఇలా అన్నాడు : "సంకెళ్ళను ప్రేమించేవాళ్ళు దాన్ని – అనగా గ్రాంథిక భాషను – ఆరాధిస్తారుగాక. నా మట్టుకు నా మాతృభాష సజీవమైన తెలుగు.

'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్టు, అనిపించుకున్న ఈ తెనుగులో మన సుఖాల్ని మన దుఃఖాల్ని వెల్లడించుకోవడానికి మనం యెవరమూ సిగ్గుపడలేదు గాని కాగితం మీద పెట్టడానికి మాత్రం మనలో కొంతమంది బిడియపడుచున్నారు!" అన్నాడు.

వ్యావహారికాంధ్రం తరఫున గిడుగు రామమూర్తి పంతులు ఆనాటి పండితలోకంతో సంకుల సమరాలు సాగిస్తూ ఉంటే, శిల్ప ప్రపంచంలో గురజాడ అప్పారావు నూతన సృష్టికి ఉపక్రమించి నూతన విజయాలు సాధించాడు. కన్యాశుల్కం మొదటి ముద్రణ పీఠికలో ఈ విషయమై ఆయన ఇలా రాశాడు.

"It has been remarked that the use of What is wrongly termed the vulgar the tongue mars the dignity of a literary Production but that is a piece of criticism which one need not heed at the present day when the progress of the science of Language has established better standards for Judging the quality and usefulness of tongues than the whims of the grammarians of old linguistic Strata."

"గ్రామ్యం అని పొరపాటు పేరు పెట్టి పిలిచే వాడుక భాషను కావ్య రచనలలో ప్రవేశపెడితే ఉత్తమకావ్యాల కుండవలసిన గౌరవం దిగజారిపోతుందనే విమర్శను మనం లెక్కచెయ్యనక్కరలేదు. ఎందుచేతనంటే కావ్య ప్రశస్తి కావ్య ప్రయోజనమూ నిర్ణయించేవి పాతకాలపు వైయాకరణుల ఛాందసాలు కావు. భాషా శాస్త్రవిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన ఈ రోజులలో అంతకన్న మంచి గీటురాళ్ళే మనకందుబాటులో కొచ్చాయి."

సినిమాలూ, రేడియోలూ అభివృద్ధి చెందిన ఈ రోజులలో జీవద్భాషకు గల ప్రాధాన్యం మరీ స్పష్టంగా మనకి కనిపించకపోదు. కాని ఆనాడు మొదటిసారిగా అభ్యుదయ మార్గం తీసిన వ్యక్తులు ఎన్నో ఆటంకాల ఎదుర్కోవలసి వచ్చింది. కాని, వాళ్లు సువిస్పష్టంగా భవిష్యత్తును చూశారు. భాషాగమనం ఏ దిశగా పరుగెత్తుతుందో వారికి తెలుసు. యధాపూర్వ స్థితికోసం పెనుగులాడే అభివృద్ధి నిరోధకుల అభ్యంతరాలేవీ వారిని అడ్డడం లేదు. ఈ సందర్భంలో ఒక చిన్న సంఘటన గురజాడ అప్పారావుగారి జీవితంలోది ఇక్కడ స్మరించవచ్చును. ఆనంద గజపతి మహారాజు అప్పారావుగారిని విజయనగర సంస్థాన శాసన పరిశోధకునిగా నియమించిన తర్వాత అప్పారావుగారు కళింగదేశ చరిత్రను రాయడానికి కావలసిన సామగ్రినంతా సమకూర్చుకున్నారు. ఆ గ్రంథాన్ని తాము ప్రచురిస్తామనీ, అయితే అది గ్రాంథిక భాషలోనే ఉండితీరాలని

విజ్ఞానచంద్రికా గ్రంథమండలి వారు కోరగా, గురజాడ అప్పారావుగారందు కొప్పుకోలేదు. అప్పుడు ఆయన అన్న మాటలివి. "నాది ప్రజల ఉద్యమం, దానిని ఎవరిని సంతోషపెట్టడానికి వదలుకోలేను." అని అంత విశ్వాసం ఉందన్న మాట, ఆయనకి తన ఉద్యమం మీద.

"మాట్లాడినట్టే సరిగ్గా రాయడం కూడా ఎవరికి సాధ్యం ? అధవా రాసినప్పటికీ అందులో ఏమి పస ఉంటుంది ?" అనే వారికి కన్యాశుల్కంలోని ప్రతీవాక్యమూ, ప్రతీమాటా తిరుగులేని జవాబిస్తాయి. సామాజిక వాస్తవికతను కన్యాశుల్కం ప్రతిబింబించినంత సంపూర్ణంగా మన దేశంలోని మరే యితర నాటకమూ ప్రతిబింబించ లేదని నిస్సందేహంగా చెప్పవచ్చును. సంఘంలోని వివిధ వర్గాలకు, కులాలకు, వృత్తులకు, మనః ప్రవృత్తులకు చెందిన ఎందరో వ్యక్తులు నిత్య జీవితంలో తాము ఎలాగ మాట్లాడతారో, అలానే కన్యాశుల్కంలో మాట్లాడతారు. ప్రేక్షకులను మనస్సులో పెట్టుకొని వారిని నవ్వించడానికి కృత్రిమంగా ప్రవేశ పెట్టిన సంభాషణ లేవీ నాటకంలో లేవు. గిరీశం, రామప్పంతులు, పోలిశెట్టి, అసిరిగాడు ఒకరేమిటి ఎవరి గొంతుకయినా ఎక్కడైనా స్పష్టంగా పోల్చుకోవచ్చును. వాస్తవానికి దూరంగా నిలుచుని జీవితానికి మెరుగు పెట్టాలనుకుంటేనే భాషలోకి కృతకత ప్రవేశిస్తుంది. ఈ సందర్భంలో "శిల్పం వాస్తవికతకు అతీతమైనది" అని వాదించి ప్రయోజనం లేదు. ఫోటోగ్రఫీ కళ కాదని పొరపడే వాళ్ళ దృక్పథం ఇది. ఫోటోగ్రఫీని కూడా ఉత్తమ శిల్పంచేసే నిబంధనలు దీనిలోనే గర్భితమై వున్నాయి. గురజాడ సాహిత్యంలో జీవితాన్ని ఫోటోగ్రాఫ్ మాత్రమే కాదు. యక్సురే ఫోటోగ్రాఫ్ కూడా చేశాడు.

గురజాడ ఆధిక్యానికి నాలుగో కారణం అతని సర్వజనీనత. తక్కిన వాళ్ళంతా తెలుగుదేశంలో యోధానుయోధులైతే ఒక్క గురజాడ మాత్రమే ప్రపంచంలో ఎప్పటి ప్రామాణ్యాలకైనా నిలవగల సార్వజనీనతను సాధించినవాడు. ప్రాచీనాంధ్ర కవులలో వేమన అటువంటివాడు. మళ్ళీ ఈనాడు గురజాడ అప్పారావు, తిరుపతి వేంకటేశ్వరుల ప్రతిభని తెలుగుదేశం ఆదరించినంతగా తక్కిన దేశాలు గుర్తిస్తాయని నేననుకోను. పోతన కవి తెలుగువాళ్ళ కర్థమైనంతగా, తెలుగువాళ్ళని ఉత్తేజపరచినంతగా వెలుపలి ప్రపంచానికి కలసి వస్తాడనుకోను. నూటికి నూరుపాళ్లు తెలుగుకవిగా ఇంట గెలుచుకొని సార్వజనీన, సార్వకాలీన విశిష్టత్వంతో రచ్చ గెలువగలిగినవాడు వేమన ఒక్కడే వెనుకటి

కాలంలో తెలుగుకవి. అలాగే ఆధునిక సాహిత్య ప్రపంచంలో తెలుగుదేశపు సరిహద్దునకవతల అంతర్జాతీయ కవి సమ్మేళనంలో తెలుగువారి తరపున ప్రతినిధిగా నిలుచుకో గలిగినవాడు గురజాడ అప్పారావు ఒక్కడే. కవిగా మాత్రమే కాదు. కథారచయితగా గురజాడ ధ్రువతార. అతను రాయక ముందు ఉన్న కవిత్వానికీ అతను రాసిన తర్వాత వచ్చిన కవిత్వానికి పోలికే లేదు. అతనికి పూర్వం ఉన్న నాటక రంగానికి, అతని తర్వాత నాటకరంగానికి మశకహస్త్యంతరం ఉంది. కవిగా, నాటక కర్తగా గురజాడ ప్రతిభను దేశమంతా గుర్తించింది గాని కథారచయితగా అతనికున్న ఉన్నతోన్నత స్థానం చాలామందికి తెలియదనుకుంటాను. "దేవుడు చేసిన మనుషుల్లారా, మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటి ?" అనే ఒక్క కథానిక చాలును, కథకులలో గురజాడకు అగ్రేసరత్వం స్థాపించడానికి.

ఒకందుకు నాకు విచారం వేస్తుంది. తమిళులు తమ జాతీయ కవిగా సుబ్రహ్మణ్య భారతిని అంగీకరిస్తారు. మళయాశీలకు వల్లథోల్ ఉన్నాడు. వంగీయుల మహాకవి రవీంద్రనాథ ఠాగూరు. అలాగే ఇతర ప్రాంతాలకు ఇతర కవులు. కాని తెలుగులో మాత్రం తమ జాతీయ కవి విషయమై తెలుగువారు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఎవరిని గొప్పవాడంటే ఇంకెవరికి కోపం వస్తుందో అనో, లేక ఎవరిగొప్ప వారిది మనం ఎవరము నిర్ణయించడానికి అనో! మళ్ళీ కవిపూజలో తెలుగువారు మరే ఇతర ప్రాంతీయులకూ తీసిపోరు. బహుశా భారతదేశం అంతట్లోకి కవులను హెచ్చుగా ఆరాధించేది తెలుగుదేశమే యేమో కూడా. అయినప్పటికి రాజకీయాలలో వలెనే సాహిత్యంలో కూడా మనకి బహు నాయకత్వం తప్ప లేదు.

('పరిశోధన సంచిక; జనవరి' **1956**)

DEDICATION

To

His Highness the Maharajah Mirja
Sri Ananda Gajapati Raj, Manea Sultan,
Bahadur of Vizianagaram, G. C. I. E.

May it Please your Highness.

It is fabled that when the ancient demigod of your noble race was making a causeway across the sea to rescue his consort from captivity, the faithful squirrel brought at the end of its tail a few grains of sand, not indeed hoping to advance the high enterprise in any appreciable degree, but to show an inclination to serve. Ten years ago, when the question was engaging, Your Highness's attention of saving a very helpless section of our womankind from a galling type of slavery, fraught with the germs of social demoralisation, an humble servant made a feeble effort to arouse public opinion on the subject by exposing the evil in a popular drama. The success that attended its production on the boards, and demand for copies from various quarters emboldened him to publish it. No one is better aware than the writer himself how great are the imperfections of the piece, and how unworthy it is of presentation to such an exalted personage and ripe scholar as Your Highness but he has ventured to seek Your Highness's indulgence as he deems it the highest honour and his greatest ambition to be permitted to dedicate the fruits of his intellect, poor though in merit, to a Prince with whom knowledge is an absorbing passion and whose appreciative encouragement of letters, has attracted to his court, literary stars of the first magnitude and inaugurated a brilliant epoch in the history of Telugu literature.

I have the honour to subscribe myself
May it please Your Highness
One Ever Loyal to The Ever Loyal

PREFACE TO THE SECOND EDITION

It was my original intention to reprint the play with slight alterations but at the suggestion of my friend, Mr. S. Srinivasa Iyengar, for whose literary judgements I have great respect, I recast it. In the process, it has gained considerably in size. In its present shape, it is almost a new work.

The first edition (1897) was a marked success. The Press gave it a cordial reception and hailed it as an event in the history of Telugu literature, and men, women and children read it with interest. The only exception was *Mahamahopadhyaya* K. Venkataratnam Pantulu Garu who cannot stand two things in this otherwise perfect world-social reform and spoken Telugu. The first edition was exhausted in a few weeks, and there has since been a constant demand for copies. I long postponed the worry of a second edition and I undertake it now only at the importunity of friends.

In the Telugu country an author has generally to be his own publisher and book-seller. There is no book selling enterprise, and what book-reading enterprise there is, is due entirely to the exertions of that venerable body, the Board of Studies. The Christian Gospels do not speak of an eleventh Commandment "Thou shall read!" But it is given to the Telugu Board of Studies to command. "Thou shalt read", and straight thousands of unfortunate young men read books that no mortal can read with profit or with pleasure.

When I wrote the play, I had no idea of publication. I wrote it to advance the cause of social reform and to combat a popular prejudice that the Telugu language was unsuited to the stage. Itinerant Maharatta troupes staged Hindi plays in the Telugu district and made money. Local companies copied their example and audiences listened with delight to what they did not understand. The bliss of ignorance could not have been more forcibly illustrated *Kanyasulkam* gave little scope to vulgar stage attractions such as flaring costumes, sensuous dances,

bad music and sham fights; yet it derw crowded houses and vindicated the claims of the vernacular.

I am glad to find that Hindi plays are on the decline. But the conditions of the Telugu stage can, by no means, be considered to be satisfactory. There are no theatres worth the name, and no professional actors who practise acting as an art. There are not many good plays either. Modern life which presents complex social conditions is neglected by playwrights except for purposes of the broadest farce, and poverty of invention is manifested by the constant handling of thread romantic topics. Few writers display any knowledge of technique. Such a low level of literary workmanship is a matter for wonder after fifty years of university education and domination of Western culture and it can be attributed only to the defective teaching of English literature in our colleges, A better state of things cannot, perhaps, be expected until a strong sense of duty impels English Professors and Educational Officers to cultivate the vernaculars.

The Telugu intellect is also seriously handicapped by the tyranny of authority - of a highly artificial literary dialect, a rigid system of alliterative versification. and literary types which have long played out. I shall say a word here about the literary dialect. Since I wrote the preface to the first edition, the spoken dialect has gained ground. My friend, Principal P.T. Srinivasa Iyengar, recently started a Telugu Teaching Reform Society among the aims and objects of which the cultivation of vernacular Telugu holds a prominent place, and Mr Yates, whose name will always be remembered in the Telugu districts for the introduction of rational methods of teaching into our schools, has lent weight to the movement by accepting the presidentship of the society.

I cannot understand how modern writers fail to see the merits of spoken Telugu, its softness which elicited the admiration of foreigners, and its range of expression. At this movement, the best prose in the language is in the spoken dialect. Strange as it may sound. Telugu prose owes its origin and development not to the patronage of kings or

to the influence of foreign literatures, but to the exertions of a curious Englishman who stimulated compilation of local histories in the vernacular during the early years of the last century. The Mackenzie Collections, no doubt, comprise tracts of unequal merit but for rhythm flow and directness, some of them beat the best work in the literary dialect, and what is rare in Telugu literature, they reflect the mind of the people and bear impress of the times. Unconsciously possibly, Raj Bahadur K. Viresalingam Pantulu Garu rendered great service to Telugu by issuing as the first volume of the collected works adaptation of English acting plays and farces of Indian life written in vernacular of various degrees of purity, and the choice does credit to his shrewd commonsense because that first volume contains his very best work, in fact, his only work that took the public by storm. The credit of deliberately introducing the vernacular into Telugu Drama in keeping with Sanskrit tradition belongs to my friend V. Venkataraya Sastri Garu whose *Prataparudriyam* owes not a little of its charm to dialogue in the dialects. I believe my play is the first ambitious work in the spoken dialect and certainly it has not failed, but success or failure of individual authors is no test of the capacity of a language.

While the vernacular is thus gaining recognition, the literary dialiect itself is approximating to the spoken dialect in the best modern prose which manifests great freedom of usage. Raj Bahadur K. Viresalingam Pantulu Garu, the most prominent figure in the Telugu world of letters at the present day, has set the example of laxity in the observance of the law of interchange of soft and hard consonants after a dilect nasal. Hardly a modern writer would escape censure if judged by rules of grammar and established usage, and in the school room. Pandits have relaxed insistance on rigid observance of rules of sandhi. The moral of this tendency to break through traditional restrictions is clear. The old literaray dialect is felt to be an inconvenient instrument and there is an unconscious effort to form a new literary dialect. My complaint is that this movement is illogically slow.

I view the Telugu literary dialect as a great disability imposed by tradition upon the Telugus. Let those who love letters venerate it. My own vernacular, for me, the living Telugu, the Italian of the East in which none of us is ashamed to express our joys and sorrows, but which some of us are ashamed to write well. Literature in the vernacular will knock at the door of the peasant, and it will knock at the door of Englishman in India. Its possibilities are immense.

No argument in favour of a vernacular literature is needed with persons who are conversant with the history of the English dialects and the Prakrits, and I know it is not arguments that will evolve a new literary dialect for Telugu. A great writer must write and make it. Let us prepare the ground for him.

The cause of social reform has received strong support from a recent decision of the Madras High Court at which a Full Bench consisting of Chief Justice Sri Arnold White, and Justices Miller and Munro ruled. "That a contract to make payment to a father in consideration of his giving his daughter in marriage is immoral and opposed to pubic policy within the meaning of Section 23 of the Indian Contact Act."

I had to contend with one difficulty in printing this book. There are many sound in the spoken dialect which are not represented in the Telugu alphabet. In the present state of Telugu phonetics. I had to content myself with indicating such sounds by a horizontal line placed over the nearest symbols, and I employed the Ardhanuswara after nasal. The creation of new symbols and their adoption into type can be effected only after a more widespread recognition of the spoken dialect.

My best thanks are due to Messers G. Ramaswamy Chetty Co., who cheerfully undertook to adopt my innovations, and did their part of the work to my entire satisfcation.

G.V.A.

"ELK HILL HOUSE"
OOTACAMUND
1st May 1909

పాత్రములు

అగ్నిహోత్రావధానులు	:	కృష్ణారాయపురం అగ్రహారీకుడు
వెంకమ్మ	:	అతని భార్య
బుచ్చమ్మ	:	పెద్దకూతురు, వితంతువు
సుబ్బమ్మ	:	రెండవ కూతురు
వెంకటేశం	:	కుమారుడు
కరటకశాస్త్రి	:	అగ్నిహోత్రావధానులు బావమరిది, విజయనగరం సంస్కృత నాటక కంపెనీలో విదూషకుడు.
కరటకశాస్త్రి యొక్క శిష్యుడు	:	పెళ్ళికూతురు వేషము, దాసరి వేషము వేయును.
లుబ్ధావధానులు	:	రామచంద్రపురం అగ్రహారికుడు.
మీనాక్షి	:	అతని కుమార్తె, వితంతువు.
రామప్పంతులు	:	రామచంద్రపురం అగ్రహారం కరణం.
గిరీశం	:	లుబ్ధావధానులు పింతల్లి కొడుకు, వెంకటేశమునకు చదువుచెప్పు అయ్యవారు.
సౌజన్యారావు పంతులు	:	వకీలు.
భీమారావు పంతులు	:	ప్లీడరు.
నాయుడు	:	ప్రైవేటు వకీలు.
పూజారి గవరయ్య	:	వైద్యుడు, మాంత్రికుడు.
మధురవాణి	:	వేశ్య.

డిప్టీకలక్టరు, హెడ్ కనిష్టీబు, పోలిశెట్టి, బైరాగి, దుకాణదారు, గ్రామ మునసబు, హవల్దారు, యోగిని, లుబ్ధావధానులు యొక్క నౌకరు అసిరిగాడు, మనవాళ్ళయ్య, వీరేశ- ఇతర పాత్రములు.

కన్యాశుల్కం

ప్రథమాంకము

1వ స్థలము : విజయనగరములోని బొంకుల దిబ్బ

(గిరీశము ప్రవేశించును)

గిరీ : సాయంకాలమైంది. పూటకూళ్ళమ్మకు సంతలో సామాను కొనిపెడతానని నెలరోజుల కిందట యిరవై రూపాయలు పట్టుకెళ్ళి డాన్సింగర్లు కింద ఖర్చు పెట్టాను. ఇవాళ ఉదయం పూటకూళ్ళమ్మకీ, నాకూ యుద్ధమైపోయింది. బుఱ్ఱ బద్దలు కొడదామా అన్నంత కోపం వచ్చింది గాని, పూర్రిచర్డు చెప్పినట్లు పేషెన్స్ వుంటేనేగాని లోకంలో నెగ్గలేం. ఈలా డబ్బు లాగేస్తే యిదివరకు యెన్ని పర్యాయాలు ఊరుకుంది కాదు. ఇప్పుడేదో కొంచెం డాన్సింగర్లు మాట ఆచోకి కట్టినట్టు కనబడుతుంది. ఓర్వలేని వెధవ యెవరైనా చెప్పి యుంటాడు. ఉదయం కథ ఆలోచిస్తే యిటుపైని తిండి పెట్టేటట్టు కానరాదు. ఈ ఊళ్ళో మరి మన పప్పు ఉడకదు. ఎటుచూసినా అందరికీ బాకీలే. వెంకు పంతులుగారి కోడలికి లవ్ లెటర్ రాసినందుకు యెప్పుడో ఒహప్పుడు, సమయం కనిపెట్టి దేహశుద్ధి చేస్తారు.

Can love be controll'd by advicer ?
Will cupid our mothers obey ?

శీఘ్రంగా యిక్కణ్ణించి బిచాణా యెత్తివెయ్యడమే బుద్ధికి లక్షణం; కాని మధురవాణిని వదలడమంటే యేమీ మనస్కరించకుండా వున్నది.

It is women that seduce all mankind

నేను ఏదో ఉద్యోగాలూ, ఊళ్ళూ యేలి తనతో వైభవం వెలిగిస్తాననే నమ్మకంతో వుంది, పూర్ క్రీచర్!

ఎవరా వస్తున్నది ? నా ప్రియశిష్యుడు వెంకటేశంలా వున్నాడు. యివాళ 'కిస్‌మిస్' శలవులు యిచ్చి వుంటారు. వీడి వైఖరి చూస్తే పరీక్ష ఫెయిలయినట్టు కనబడుతుంది. వీడ్ని కొంచెం ఓదార్చి, వీడికి శలవుల్లో చదువు చెప్పే

మిషమీద వీడితో వీడి ఊరికి ఉడాయిస్తే చాలా చిక్కులు వొదుల్తాయి. అట్నుంచి నరుక్కు రమ్మన్నారు!

(వెంకటేశం ప్రవేశించును)

ఏమివాయ్, మైడియర్ షేక్స్పియర్! మొహం వేల వేశావ్ ?

వెంకటే: ఇక మీర్నాతో మాట్లాడకండి. మా మాష్టరు మీతో మాట్లాడొద్దన్నారు. మీ సావాసం చేయడం చేత నా పరీక్ష పోయిందన్నారు.

గిరీ : నాన్సెన్స్, మొదట్నుంచీ నేను అనుమానిస్తూనే ఉన్నాను. నీ మాష్టారుకి నన్ను చూస్తే కిట్టదు. అందుచేత నిన్ను ఫెయిల్ చేశాడు గాని లేకుంటే నువ్వేవిఁటి, ఫెయిల్ కావడవేవిఁటి! అతనికీ, నాకూ ఎందుకు విరోధం వచ్చిందో తెలిసిందా ? అతను చెప్పేదంతా తప్పుల తడక. అది నేను న్యూసుపేపర్లో యేకేశాను. అప్పట్నుంచి నేనంటే వాడిక్కడుపుడుకు.

వెంకటే : మీవల్ల నాకు వచ్చిందల్లా చుట్టకాల్చటం ఒక్కటే. పాఠం చెప్పమంటే యెప్పుడూ కబుర్లు చెప్పడవేఁకాని ఒక్క మారయినా ఒక ముక్క చెప్పిన పాపాన్ని పోయినారు ?

గిరీ : డామిట్! ఇలాంటి మాటలంటే నాకు కోపం వస్తుంది, ఇది బేస్ ఇన్గ్రాటిట్యూడ్, నాతో మాట్లాడ్డవేఁ ఒక ఎడ్యుకేషన్. ఆ మాటకొస్తే నీకున్న లాంగ్వేజి నీ మాస్టరుకుందీ! విడో మారియేజ్ విషయమై, నాచ్చికొశ్చన్ విషయమై నీకు ఎన్ని లెక్చర్లు ఇచ్చాను! నా దగ్గర చదువుకున్నవాడు ఒహడూ అప్రయోజకుడు కాలేదు. పూనా డక్కన్ కాలేజీలో నేను చదువుతున్నప్పుడు 'ది ఇలెవెన్ కాజస్ ఫర్ది డిజనరేషన్ ఆఫ్ ఇండియా'ను గూర్చి మూడు ఘంటలు ఒక్క బిగిని లెక్చర్ యిచ్చేసరికి ప్రొఫెసర్లు దంగయిపోయినారు. మొన్న బంగాలీవాడు యీ ఊళ్ళో లెక్చరిచ్చినప్పుడు ఒక్కడికైనా నోరు పెగిలిందీ! మనవాళ్ళు వొట్టి వెధవాయిలోయ్! చుట్ట నేర్పినందుకు థాంక్స్ చెయ్యక తప్పు పట్టుతున్నావ్ ? చుట్ట కాల్చడం యొక్క మజా నీకు యింకా బోధపడకపోవడం చాలా ఆశ్చర్యంగా వుంది. చుట్ట కాల్చబట్టే కదా దొర్లంత గొప్పవాళ్ళయినారు. చుట్ట కాల్చని ఇంగ్లీషువాణ్ణి చూశావూ ? చుట్ట పంపిణీ మీదనే స్టీము యంత్రం వగయిరా తెల్లవాడు కనిపెట్టాడు. లేకపోతే వాడికి పట్టుబణ్ణా! శాస్త్రకారుడు యేవఁన్నాడో చెప్పానే, సూత ఉవాచ –

క॥ ఖగపతి యమృతము తేగా
భుగ భుగమని పొంగి చుక్క భూమిని వ్రాలెన్!
పొగ చెట్టయి జన్మించెను
పొగతాగనివాడు దున్నపోతై పుట్టున్॥

ఇది బృహన్నారదీయం నాలుగవ ఆశ్వాసంలో వున్నది. అది అలా వుణ్ణీ గాని, నీ అంత తెలివైన కుర్రవాణ్ణి ఫెయిల్ చేసినందుకు నీ మాష్టరు మీద నా వొళ్ళు మహా మండుతూంది. ఈమాటు వంటరిగా చూసి వొక తడాఖా తీస్తాను. నువ్వు శలవుల్లో ఇక్కడుంటావా, ఊరికి వెళతావా ?

వెంకటే: వెళ్ళాల్నుంది కాని పాసుకాలేదంటే మా తండ్రి చావకొడతాడు ?

గిరీ : ఆ గండం తప్పే ఉపాయం నేన్చెబుతాను. నే చెప్పినట్టల్లా వింటానని ప్రమాణం చేస్తావూ ?

వెంకటే: (గిరీశం కాళ్ళు పట్టుకొని) మీ శలవు ఎప్పుడు తప్పాను ? మా తండ్రికి మా చెడ్డకోపం. పాసుకాలేదంటే యెవిఁకలు విరగ్గొడతాడు. (కన్నీరు చేత తుడుచుకొనును.)

గిరీ : దటీజ్ టిరనీ. ఇదే బంగాలీ కుర్రవాడయితే ఏం జేస్తాడో తెలిసిందా ? తాతయేది తండ్రియేది కర్ర పట్టుకుని చమ్డా లెక్క గొడతాడు. మీ అగ్రహారం కుర్రవాళ్ళు మరి యవళ్ళయినా యీ ఊళ్ళో చదువుకుంటున్నారా ?

వెంకటే : మరెవళ్ళూ లేరు.

గిరీ : ఐతే నేనో ఉపాయం చెబుతాను విను. నేను కూడా నీతో మీ ఊరొచ్చి పరీక్ష పాసయినావని మీ వాళ్ళతో చెబుతాను. అక్కడ నీకు చదువు చెప్పడానికి ఒచ్చానని మీ వాళ్ళతో చెప్పు. శలవు లాఖర్ని నిన్ను టవును స్కూల్లో పైక్లాసులో ప్రవేశపెడతాను.

వెంకటే : మీరేవొస్తే బతికాను. మరేఁవిటి ? కిందటిమాటు శలవులకే మా అమ్మ మిమ్మల్ని తీసుకురమ్మంది.

గిరీ : ఆల్రైట్ గాని, నాకిక్కడ చాలా వ్యవహారములలో నష్టం వస్తుందే! మునసబు గారి పిల్లలకి శలవుల్లో పాఠాల్చెబితే ఫిఫ్టీ రుపీస్ యిస్తావఁన్నారు. అయినా నీ విషయమై యెంత లాస్ వచ్చినా నేను కేర్ చెయ్యను. ఒక భయం

మాత్రం వుంది. మీ వాళ్ళు బార్ బరస్ పీపుల్ గదా, నన్ను తిన్నగా ట్రీట్ చేస్తారో, చెయ్యరో. నీవు నన్ను గురించి మీ మదర్‌తో గట్టిగా రికమెండ్ చెయ్యవలసి వుంటుంది. కొత్త పుస్తకాలికి వొక జాబితా రాయి. కొంచెం డబ్బు చేతిలో వుంటేగాని, సిగర్సుకి ఇబ్బంది కలుగుతుంది. నోటుబుక్కు తీసి రాయి. 1. రోయల్ రీడర్, 2. మాన్యూల్ గ్రామర్, 3. గోష్ జియామెట్రీ, 4. బాస్ ఆల్జీబ్రా, 5. శ్రీనివాసయ్యర్ అర్థమెటిక్, 6. నలచరిత్ర, 7. రాజశేఖర చరిత్ర, 8. షెపర్డు జనరల్ ఇంగ్లీషు, 9. వెంకట సుబ్బారావు మేడీజీ, యెన్ని పుస్తకాలయినాయి ?

వెంకటే : తొమ్మిది.

గిరీ : మరొక్కటి రాయి. అక్కడికి పదీ అవుతాయి. కుప్పుసామయ్యర్ మేడ్ డిఫికల్టు, అక్కడికి చాల్ను. మీ వాళ్ళుగాని ఇంగ్లీష్ మాట్లాడమన్నట్లాయనా తణుకూ బెణుకూ లేకుండా పుస్తకాల్లో చదువుకున్న ముక్కలు, జ్ఞాపకం వున్నంతవరకు, యాకరుపెట్టు. నీ దగ్గర కాపర్సు ఏవైనా వున్నవా ? నా దగ్గర కరెన్సీనోట్లు వున్నవిగాని మార్చలేదు. పదణాలుపెట్టి ఓ శేరు మిఠాయి పట్టుకురా. రాత్రి మరి నేను భోజనం చెయ్యను. మార్కెట్టుకు వెళ్ళి బండి కుదిర్చి దానిమీద నా ట్రావెలింగ్ ట్రంకువేసి మెట్టు దగ్గర బండి నిలబెట్టి వుండు. ఇక్కడ కొన్ని రాచకార్యాలు చక్కబెట్టుకొని యెంత రాత్రికైనా వొచ్చి కల్సుకుంటాను. గో ఎట్వన్సు, మై గుడ్‌బాయ్! నువ్ బుద్ధిగా వుండి చెప్పిన మాటల్లా వింటూంటే నిన్ను సురేంద్రనాథ్ బెనర్జీ అంత గొప్పవాణ్ణి చేస్తాను. నేను నీతో వస్తానన్న మాట మాత్రం పిట్టకైనా తెలియనియ్యొద్దు, జాగ్రత్త. (వెంకటేశం నిష్క్రమించును.)

గిరీ : ఈ వ్యవహార మొహటి పైసలయింది. ఈ రాత్రి మధురవాణికి పార్టింగ్ విజిట్ యివ్వందీ పోకూడదు. (రాగవరసతో పాడును)

నీ సైటు నా డిలైటు
    నిన్ను మిన్న
కాన కున్న
    క్వైటు రెచడ్ ప్లయిటు.
మూను లేని నైటు.

(ఒక బంట్రోతు ప్రవేశించును)

బంట్రో : నేను పొటిగరాప్పంతులుగారి నౌఖర్నండి, లెక్క జరూరుగుందండి. పొటిగరాపుల కరీదు యెంటనే యిప్పించమన్నారండి.

గిరీ : (విననట్టు నటించుతూ)

పుల్లుమాను లైటటా
జాసమిన్ను వైటటా
మూను కన్న
మల్లె కన్న
నీదు మోము బ్రైటటా
టా! టా! టా!

బంట్రో : యంతమందిని పంపినా యిచ్చారు కారటండి. నే నాళ్ళలా గూరుకుండేవోణ్ణి కానండి.

గిరీ : అయ్య కోనేటికి తోవ యిదే.

బంట్రో : యక్కడి శెవిఁటిమాలోకం వొచ్చిందయ్యా!

గిరీ : కోవఁటి దుకాణవాఁ ? కస్పా బజార్లోగాని, ఇటువేపు లేదు.

బంట్రో : (గట్టిగా చెవి దగ్గర నోరుపెట్టి) పొటీగరాపుల కరీదిస్తారా యివ్వరా ?

గిరీ : బస, రాదారీ బంగళాలో చెయ్యొచ్చును.

బంట్రో : (మరీ గట్టిగా) యాడాది కిందట మీరూ సాన్దీ కలసి యేసుకున్న పోటిగరాపుల కరీదు మా పంతులు నిలబెట్టి పుచ్చుకొమ్మన్నారు.

గిరీ : ఒహెూ నీవటోయ్! యెవరో అనుకున్నాను. నింపాదిగా మాట్లాడు; నింపాదిగా మాట్లాడు. రేపు ఉదయం యెనిమిది ఘంటలకి పూటకూళ్ళమ్మ యింటికి వొస్తే అణాపయిసల్తో సొమ్మిచ్చేస్తాను. మీ పంతులకి స్నేహం మంచీ చెడ్డా అక్కర్లేదూ ?

బంట్రో : మాటల్తో కార్యం లేదు. మొల్లో సెయ్యెట్టి నిల్చున్న పాట్ని పుచ్చుకొమ్మన్నా రండీ.

గిరీ : పెద్దమనిషివి గదా, నువ్వా తొందరపడ్డం మంచిదేనా ? నీ తండ్రి యెంత పెద్ద మనిషి! యీ చుట్టచూడు, ఎంత మజాగా కాలుతుందో, హవానా అంటారు దొర్లు దీన్ని; రేప్పొద్దున్న రా, రెండు కట్టలిస్తాను.

బంట్రో : శిత్తం. సొమ్ము మాటేం శలవండి ?

గిరీ : చెప్పాను కానా ? రెప్పొద్దున్న యివ్వకపతే మాలవాడి కొడుకు ఛండాలుడు.

బంట్రో : మాలాడి కొడుకు శండాలుడు కాకుంటే మరేటండి ?

గిరీ : నీకు నమ్మకం చాలకపోతే యిదిగో, గాయత్రి పట్టుకు ప్రమాణం చేస్తాను.

బంట్రో : శిత్తం. రేపు పొద్దున్న సొమ్మియ్యకపోతే నా ఆబోరుండదండి.

గిరీ : ఆహాఁ ? నీ ఆబోరు ఒహటీ, నా ఆబోరు ఒహటీనా!

<u>(బంట్రోతు నిష్క్రమించును)</u>

గిరీ : ఇన్నాళ్ళకి జంఝుపోస వినియోగంలోకి వొచ్చింది. థియాసఫిస్టులు చెప్పినట్లు మన ఓల్డు కష్టమ్సు అన్నిటికీ యేదో ఒహ ప్రయోజనం ఆలోచించే మనవాళ్ళు యేర్పరిచారు. అత్మానుభవం అయితేనేగాని తత్వం బోధపడదు. ఈ పిశాచాన్ని ఒదుల్చుకునే సరికి తలప్రాణం తోక్కొచ్చింది. శీఘ్రబుద్ధేః పలాయనం. పెందరాళే యీ వూర్నించి వుడాయిస్తేనే కాని ఆబోరు దక్కదు. ఇక మధురవాణి యింటికి వెళదాం. మేక్ హే వైల్డ్ సన్‌షైన్స్ అన్నాడు.

<u>**2వ స్థలము : మధురవాణి యింట్లో గది**</u>

(రామప్పంతులు కుర్చీ మీద కూర్చుండును. మధురవాణి యెదట కూర్చుండును.)

రామ : (జేబులోంచి చుట్టతీసి పంటకొన కొరికి) పిల్లా! అగ్గిపుల్ల.

మధు : (అగ్గిపుల్ల వెలిగించి చుట్ట కందించుచుండగా రామప్పంతులు మధురవాణి బుగ్గను గిల్లును. మధురవాణి చుట్ట కాలకుండానే అగ్గిపుల్ల రాల్చి యడంగా నిలబడి కోపం కనపర్చుతూ) మొగవాడికయినా ఆడదానికయినా నీతి వుండాలి. తాకవద్దంటే చెవిని పెట్టరుగదా ?

రామ : నిన్ను వుంచుకోవడానికి అంతా నిశ్చయమయి రేపో నేడో మంచి ముహూర్తం చూసి మా వూరు లేవతీసుకు వెళ్ళడానికి సిద్ధవఁయ్యుంటే యింకా యవడో కోన్కిస్కా హేగాడి ఆడాలో వున్నానంటూ పాతివ్రత్యం నటిస్తావేమిటి ?

మధు : వేశ్య అనగానే అంత చులకనా పంతులుగారూ ? సానిదానికి మాత్రం నీతి వుండొద్దా ? మా పంతులుగార్ని పిలిచి “అయ్యా, యిటుపైని మీ

తోవ మీది, నా తోవ నాది" అని తెగతెంపులు చేసుకున్నదాకా నేను పరాధీనురాలినే అని యెంచండి. మీరు దెప్పిపొడిచినట్టు ఆయన వైదీకయితే నేమి, కిరస్తానం మనిషైతేనేమి, పూటకూళ్ళమ్మను వుంచుకుంటేనేమి, నన్ను యిన్నాళ్ళూ ఆ మాహారాజు పోషించాడు కాడా ? మీరంతకన్నా రసికులయినా, నా మనస్సు మీరు యంత చూరగొన్నా, ఆయన యడల విశ్వాసం నాకు మట్టుకు వుండొద్దా ?

రామ : పెద్ద పెద్ద మాటలు ప్రయోగిస్తున్నావు! వాడి బతుక్కు వాడు పూటకూళ్ళమ్మని వుంచుకోవడం కూడానా! పూటకూళ్ళమ్మే వాణ్ణి వుంచుకొని యింత గంజి బోస్తూంది.

మధు : అన్యాయం మాటలు ఆడకండి. ఆయన యంత చదువుకున్నాడు, ఆయనకి యంత ప్రఖ్యాతి వుంది. నేడో రేపో గొప్ప ఉద్యోగం కానైయ్యుంది.

రామ : అహహ! (నవ్వుతూ) యేం వెర్రి నమ్మకం! నీవు సానివాళ్ళలో తప్పపుట్టావు. గిరీశంగారు గిరీశంగారు అని పెద్ద పేరు పెడతావేమిటి ? మా వూళ్ళో వున్న లుబ్ధావధాన్లు పింతల్లి కొడుక్కాడూ వీడూ ? గిర్రడని మేం పిలిచే వాళ్ళం. బొట్లేరుముక్కలు రెండు నేర్చుకోగానే ఉద్యోగాలే! వాడికల్లా ఒక్కటే ఉద్యోగం దేవుడు రాశాడు. యేవింటో తెలిసిందా ? పూటకూళ్ళమ్మ యింట్లో దప్పిక్కి చేరి అరవచాకిరీ చెయ్యడం.

మధు : యీ మాటలు ఆయన్ని అడుగుదునా ?

రామ : తప్పకుండా. కావలిస్తే నేను చెప్పానని కూడ చెప్పు.

మధు : అయినా ఆయన గుణయోగ్యతలతో నాకేం పని ? యేవంయినా ఆయన నాకు యజమాని. ఆయన తప్పులు నా కళ్ళకు కనబడవ్.

రామ : అయితే అతడికి విడాకులు యెప్పుడిస్తావు ?

మధు : యిక్కడి రుణాలూ పణాలూ తీర్చుకోవడానికి మీరు శలవిచ్చిన రెండు వొందలూ యిప్పిస్తే ఈ క్షణం తెగతెంపులు చేసుకుంటాను.

రామ : అయితే యింద (జేబులోంచి నోట్లు తీసి యిచ్చును. మధురవాణి అందుకొంటుండగా రామప్పంతులు చెయ్యిపట్టి లాగును. మధురవాణి కోపంతో చెయ్యి విడిపించుకుని నోట్లు పారవేసి దూరముగా నిలుచుండును.)

మధు : మీతో కాలక్షేపం చెయ్యడం కష్టం, ఒక నిర్ణయం మీద నిలవని మనిషిని యేవఁన్నమ్మను ?

రామ : (నోట్లు యెత్తి) క్షమించు అపరాధం, (నోట్లు చేతికిచ్చును) లెక్కపెట్టి చూచుకో.

మధు : ఆ మాత్రం మిమ్మల్ని నమ్మకపోతే మీతో రానే రాను. యింత రసికులయ్యుండీ నా మనసు కనిపెట్టజాలినారు కారు గదా ? మీ నోట్లు మీ వద్దనే వుంచండి. నేను డబ్బు కక్కుర్తి మనిషిని కాను. (నోట్లు యివ్వబోవును).

రామ : వొద్దు! వొద్దు! నీ మనసు కనుక్కుందామని అన్నమాటగాని మరొకటి కాదు గాని. యీ గిరీశం గుంట వెధవ. వీడెవడో మా గొప్పవాడనుకుంటున్నా వేమిటి ?

మధు : ఆయన్ని నా యదట తూల్నాడితే, యిదుగో తలుపు తీశాను, విజయం చెయ్యండి (తలుపు తీసి వకచేత పట్టుకొని రెండవ చేతి వేలుతో పైకి తోవచూపును) అదుగో, గిరీశంగారే వొస్తున్నారు. ఆ మాటేదో ఆయన్తోటే చెప్పండి.

రామ : వేళాకోళం ఆడుతున్నావూ ?

గిరీ : (వాకిట్లోంచి) మైడియర్!

రామ : (ఆత్మగతం) అన్న! వేళగాని వేళొచ్చాడు గాడిదకొడుకు. తంతాడు కాబోలు, యేమిఁటి సాధనం ? ఈ మంచం కింద దూరుదాం, (మంచం కింద దూరును)

<u>(గిరీశం ప్రవేశించును)</u>

గిరీ : వెల్, మైడియర్ ఎంప్రస్! (భుజము మీద తట్టబోవును)

మధు : (పక్కకు తప్పించుకుని) ముట్టబోకండి.

గిరీ : (నిర్ఘాంతపోయి) అదేమిటి ఆ వికారం ?

మధు : ఆఖరు వికారం

గిరీ : (ఆత్మగతం) నేను వుడాయిస్తానని దీనికెలా తెలిసింది చెప్మా! సానివాళ్ళకి కర్ణపిశాచి వుంటుంది కాబోలు! (పైకి) మైలబడితే స్నానం చేసి వేగిరం రా.

మధు : ఇప్పుడేం తొందర ? తలంటుకుంటాను.

రామ : (ఆత్మగతం) శబాష్. యేమి నీతయిన మనిషి యిది ? వెధవని ముట్టుకో నివ్వకుండా యెత్తు యెత్తింది.

గిరీ : మైలా గియిలా మా ఇంగ్లీషువారికి లక్ష్యం లేదు. ఇలారా. (దగ్గరికి చేరును).

మధు : (వేలు చూపి) అక్కడనే ఆగండి. మీరు కిరస్తానం అయితే కావచ్చును. నేను కిరస్తానం యింకా కాలేదే! మీరు కిరస్తానం అన్నమాట యిప్పుడే ఒహరు చెప్పగా విన్నాను.

రామ : (తనలో) నే చెప్పా'నంటుందా యేమిటి!

గిరీ : ఒకరు చెప్పగా విన్నావూ ? ఎవరా జెప్పింది ? ఎవడికిక్కడికి రావడానికి మగదూర్ వుంది ? యిలాంటి చాడీకోర్ కబుర్లు చెప్పడానికి ఎవడికి గుండె వుంది ? ఆ మాటలు విని నాతో చెప్పడానికి నీ కెక్కడ గుండుంది ? చెప్పు!

రామ : (తనలో) తంతాడు కాబోలు! యరక్క చిక్కడ్డాను.

మధు : మొగాడే చెప్పాలా యేవిఁటి ? ఆడవాళ్ళకి దేవుడు నోరివ్వలేదా ?

గిరీ : (తనలో) పూటకూళ్ళముండే చెప్పింది కాబోలు! (పైకి) ఆడదా ? ఆడదాన్ని నోరుబెట్టుకు బతకమనే దేవుడు చేశాడు. పరువయిన ఆడది నీ యింటి కెందుకొస్తుంది ?

మధు : పరువైన మొగాళ్ళొచ్చినప్పుడు పరువైన ఆడవాళ్ళెందుకు రాకూడదు ? ముందు కూచోండి. తరవాత కోప్పడుదురుగాని, చుట్ట తీసుకోండి. అదిగో అగ్గిపెట్టె.

గిరీ : ముట్టుకోడానికి వల్ల లేకపోతే అగ్గిపుల్ల వెలిగించి యివ్వడానికయినా పెట్టిపుట్టాను కానా ? ఈవాళ మహా ఉత్సాహంగా వచ్చాను గాని ఉత్సాహం భంగం చేశావ్.

మధు : ఏవిటా ఉత్సాహం ?

గిరీ : ఇదిగో జేబులో, హైదరాబాద్ నైజామువారి దగ్గర్నించి వొచ్చిన ఫర్మానా. మా నేస్తం నవాబ్ సదరదాలత్ బావురల్లీఖాన్ ఇష్పహన్ జంగ్ బహద్దర్‌వారు సిఫార్సు చేసి వెయ్యి సిక్కా రూపాయల జీతంతో ముసాయిల్ ఉద్యోగం నాకు చెప్పించారు. అనగా హమేషా బాద్షావారి హుజుర్న వుండడం.

రామ : (తనలో) యేమిట్రా వీడి గోతాలు ?

గిరీ : ఇంత శుభవార్త తెచ్చినా, దగ్గరికి రానిచ్చావు కావు గదా ? నాతో హైదరాబాద్ వస్తావా ?

మధు : (తల తిప్పుతూ) నే యెందుకు ? పూటకూళ్ళమ్మని తీసికెళ్ళండి.

గిరీ : (నిర్ఘాంతపోయి) పూటకూళ్ళమ్మ యేవయినా పెంట పెడుతూందా యేవిటి?

మధు : మీకే తెలియాలి.

గిరీ : నీ తెలివితక్కువ చూస్తే నాకు నవ్వొస్తూంది. యవడేమన్నా నామీద, నమ్మడవేనా ? ఈ ఘోరవైఁన అబద్ధాలు నీతో యవడు చెబుతున్నాడో కనుక్కోలేననుకున్నావా యేవిఁటి ? సప్తసముద్రాల్దాటినా వాడి పిలకట్టుకొని పిస్తోల్తో, వొళ్ళు తూట్లుపడేటట్టు, ఠా ఠా మని కొట్టకపోతినట్టయినా నా పేరు గిరీశమే ? వినదభీషణ శంఖము దేవదత్తమే! ఖబడ్దార్!

మధు : సముద్రాలవతల కెళ్ళి వెతకక్కర్లేదు. ఆ చెప్పిన మనిషి మీ యదటే చెబుతాడు.

రామ : (తనలో) ఈ ముండ నన్ను బయలుబెడుతుంది కాబోలా దైవమా!

గిరీ : (తనలో) థాంక్గాడ్, అయితే పూటకూళ్ళదాన్దెబ్బ తగల్లేదు. (పైకి) ఇలాంటి దుర్మార్గపు కూతలు ఆ యిల్లాలి చెవిని పడితే చాలా ఖేదిస్తుంది. ఆ పాపవంతా నిన్ను చుట్టుకుంటుంది. ఆమె యంత పతివ్రత ? యంత యోగ్యురాలు!

మధు : వెధవముండకి పాతివ్రత్యం అన్నమాట ఈనాటికి విన్నాను.

గిరీ : దానికి.... కాదు, ఆమెకి మొగుళ్ళేకపోయినా ఆమెను వెధవనడానికి వీల్లేదు.

మధు : మీరుండగా వెధవెలా అవుతుంది ?

గిరీ : నాన్సెన్స్ (దీనికో ఠస్సా చెప్పి రంజింపచేద్దాం) ఇదిగో విను. దాని నిజవేమిటంటే, పూటకూళ్ళమ్మ ముచ్చటగా తప్పటడుగులు వేసే రోజుల్లో ఒక కునిష్టి ముసలాడికి కట్ట నిశ్చయించినారు. పుస్తె కట్టబోతూంటేనో, కట్టిన ఉత్తర క్షణంలోనో ఆ ముసలాడు పెళ్ళిపీటలమీదే గుటుక్కుమన్నాడు. అప్పుడు పెళ్ళి అయినట్టా కానట్టా, అని మీమాంస అయింది. కొందరు పుస్తె కట్టాడన్నారు. కొందరు కట్టలేదన్నారు. పిల్ల తండ్రి, పెళ్ళికొడుకు వారసుల మీద దావా తెచ్చాడు. పురోహితుడు వాళ్ళ దగ్గిర లంచం పుచ్చుకుని పుస్తె కట్టలేదని సాక్షమిచ్చాడు. దాంతో కేసుపోయింది. మరి దాన్నెవరూ పెళ్ళాడారు కారు.

మధు : అయితే మరి మీకు తప్పలేదే ?

గిరీ : యేవిఁటి ఈ కొత్తమాటలూ! నాకు ఆదీ అంతూ తెలియకుండా వుందీ! ఆహాఁ.... సరసం విరసంలో దిగుతూందే! హాస్యానికంటే నివ్వేవఁన్నా ఆనందవేఁ. నిజవఁని గానీ అంటివా, చూదు నా తడాఖా. యవ డీ మాటలు పేల్తున్నాడో వాడి పేరు తక్షణం చెబుతావా చెప్పవా ?

మధు : రామ...

రామ : (తనలో) సచ్చాన్రా, పేరు చెప్పేసింది!

మధు : రామ-రామ! ఒహరు చెప్పేదేవిఁటి, లోకమంతా కోడై కూస్తూంటేను ? (వీధిలోంచి "తలుపు, తలుపు" అని ధ్వని)

గిరీ : (తెల్లబోయి) తలుపు తియ్యొద్దు, తియ్యొద్దు. ఆ పిలిచే మనిషి వెర్రిముండ. మనుషుల్ని కరుస్తుంది.

మధు : తలుపు తీసేవుంది.

గిరీ : ఛంగునవెళ్ళి గడియ వేసేయ్.

మధు : అదుగో, తలుపు తోసుకు వొస్తూంది.

గిరీ : గెంటెయ్, గెంటెయ్.

మధు : ఆ వయ్యారం చూస్తే మీ పతివ్రతలా కనిపిస్తూంది. (వాకిట్లోకి వెళ్ళును).

గిరీ : మంచం కింద దూరుదాం (మంచం కింద దూరి, తనలో) దొంగ లంజ! సరసుణ్ణి దాచిందోయ్ మంచం కింద! యిదేవిఁటో మంచి మనిషి అని భ్రమించాను. దీన్తస్సాగొయ్యా! సిగపాయదీసి తందునుగాని యిది సమయం కాదు. అయినా, పోయేవాడికి నాకెందుకు రొష్టు ? (రామప్పంతులుతో మెల్లగా) యవరన్నా మీరు, మహానుభావులు ?

రామ : నేను రామప్పంతుల్నిరా, అబ్బాయీ!

గిరీ : తమరా ? ఈ మాత్రానికి మంచంకింద దాగోవాలా మహానుభావా ? నన్నడిగితే యిలాటి లంజల్ని యిరవైమందిని మీకు కన్యాదానం చేతునే!

రామ : (తనలో) బతికాన్రా దేవుఁడా ? (పైకి) నువ్వురా బాబూ దీన్నుంచుకున్నావు? అలా తెలిస్తే నే రాకపోదును సుమా!

గిరీ : మాట వినపళ్ళేదు, కొంచెం యిసుంటా రండి.

(రామప్పంతులు ముందుకు జరుగును.
గిరీశం అతన్ని తప్పించుకొని గోడవేపు చేరును)

గిరీ : అన్నా, ఈ లంజని యన్నడూ నమ్మకండి. ఇలా ఇరవై మందిని దాచగల శక్తుంది దీనికి.

రామ : రెండువందలు దొబ్బిందిరా బాబూ!

గిరీ : నువ్వులేం జాగర్త చేశారా ?

రామ : అంతేనా ?

గిరీ : మరేవిఁటి ?

(మధురవాణిన్ని, పూటకూళ్ళమ్మ వల్లెవాటులో చీపురుకట్ట దాచిన్ని ప్రవేశింతురు)

మధు : మీరన్న మనిషి యిక్కడ లేరంటే చెవిని బెట్టరు గదా!

పూట : నీ యింట్లో జొరబడ్డాడని వీధులోవాళ్లు చెబితే నీ మాట నమ్ముతానా యేవిఁటి! ఆ వెధవ వుంటే నాకేం కావాలి, వుండకుంటే నాకేం కావాలి ? వాడు నీకిచ్చిన యిరవయి రూపాయలూ యిచ్చెయ్.

మధు : యవడి కిచ్చావో వాణ్ణే అడగవమ్మా!

పూట : వెధవ కనబడితే సిగపాయ దీసి చీపురుకట్టతో మొత్తుదును. యెక్కడ దాచా, వేమిటి ?

మధు : నాకు దాచటం ఖర్మవేఁవి ? నేను మొగనాల్ని కాను, వెధవముండనీ కాను. నా యింటికొచ్చేవాడు మహరాజులాగ పబ్లీగ్గా వొస్తాడు. (కంటితో మంచం కింద చూపును.)

పూట : మంచం కింద దాగాడేమో! (మంచము కిందకు వంగి) నీ పరువు బుగ్గయినట్టే వుంది, లేచి రా. (చీపురుకట్ట తిరగేసి రామప్పంతులను కొట్టును).

రామ : ఓర్నాయనా, నన్నెందుకొ్కడతావే దండుముండా ? (మంచం కింది నించి పైకి వచ్చి, వీపు తడుముకొనును).

మధు : ఆయన్నెందుకొ్కట్టావు ? నా ఇంటికొచ్చి యేవిఁటీ రచ్చ?

పూట : అయితే మంచం కిందెందుకు దూరాడూ ?

మధు : నీకెందు కా గోష ? అదో సరసం.

పూట : ఇదో చీపురుకట్ట సరసం.

రామ : (వీపు తడువుఁకుంటూ) నీ సిగ తరగా, ఆడదానివైపోయినావే! లేకుంటే చంపేసి పోదును. నీ రంకుమొగుణ్ణి కొట్టక నన్నెందుకొట్టావే ముండా ? అందుకా నన్ను ముందుకు తోసి తాను గోడవేపు దాగున్నాడు ?

పూట : ఆ వెధవ కూడా వున్నాడూ మంచం కింద! కుక్కా, పైకి రా.

గిరీ : వెఱ్ఱప్పా! మంచం కిందికి రా, వెఱ్ఱి వొదల గొడతాను.

పూట : అప్పనిట్రా వెధవా, నీకు ? నీకు భయపడతా ననుకున్నావా యేవిఁటి ? నీ సానిముండ యలా అడ్డుకుంటుందో చూస్తాను. (ఒకవేపు నుంచి మంచం కిందికి దూరును. మరివొక వేపునుంచి గిరీశం పైకివచ్చి రామప్పంతులు నెత్తి చరిచి, లఘు వేసి పెరటి వేపు పరిగెత్తి పోవును)

రామ : సచ్చాన్రా నాయనా! (రెండు చేతుల తల పట్టుకొని) మధురవాణీ ? యేవీఁ బేహద్బీ ? కనిష్టీబు క్కబురంపించూ.

మధు : యెందుకు పబ్లీకున అల్లరీ అవమానవుఁన్నూ! రేపో యెల్లుండో మీరే వాడికి దెబ్బకి దెబ్బ తీసి పగ తీర్చుకుందురుగాని. (రామప్పంతుల్ని కౌగలించుకుని తల ముద్దెట్టుకుని చేత రాసి) యేవిఁ దుష్టు! మొగవాడయినవాడు యెదట నిలిచి కొట్టాలి. దొంగదెబ్బ కొడతాడూ! వాడి పొంకం అణుతురుగాని లెండి.

రామ : గవురనుమెంటు జీతవిఁచ్చుంచిన కనిష్టీబులుండగా మనకెందుకు శరీరాయాసం ? ఈ వెధవని పజ్యండు కోర్ట్లంటా తిప్పకపోతే నేను రామప్పంతుల్ని కాను, చూడు నా తమాషా!

మధు : (రామప్పంతుల్ని ముద్దు పెట్టుకొని) మాటాడక వూరుకోండి. (మంచం కిందవేపు చూపించి నోరు మూసి) దొంగదెబ్బ కొట్టిన వారిదే అవమానం; మీది కాదు.

రామ : నొప్పెవడిదనుకున్నావు ? ఆ ముండ మంచం కింద నుంచి రాదేం ? చీపురుకట్ట లాక్కో.

పూట : ఫడేల్మంటే పస్తాయించి చూస్తున్నాను. నీ మొగతనం యేడిసినట్టే వుంది. (పైకి వచ్చును).

<u>(అంతా నిష్క్రమింతురు)</u>

కన్యాశుల్కం

ద్వితీయాంకము

1వ స్థలము : కృష్ణరాయపురం అగ్రహారములో అగ్నిహోత్రావధాన్లు ఇల్లు

(అగ్నిహోత్రావధాన్లు జంఝాలు వడుకుచుండును. కరటక శాస్త్రుల్లు శిష్యుడిచేత లేని పేలు నొక్కించుకొనుచుండును. వెంకమ్మ కూర తరుగుచుండును.)

వెంకటే : నిన్నట్నించి కిశిమీశ్శలవులని కుర్రవాడు వుత్తరం రాశాడు. యెన్నాళ్ళో అయింది వాణ్ణి చూసి, కళ్ళు కాయలు కాసిపోయినాయి. గడియో గడియో రావాలి.

అగ్ని : ఎందుకు వొట్టినే వగచడం ? వొద్దు వొద్దంటూంటే యీ యింగిలీసు చదువులో పెట్టావ్. మెరకపొలం సిస్తంతా వాడి కిందయిపోతూంది. కిందటి యేడు పరీక్ష ఫేలయినాడుగదా ? యీ యేడు యెలా తగలేశాడో తెలియదు. మన కీ యింగిలీసు చదువు అచ్చిరాదని చెబితే విన్నావు కావు. మా పెద్దన్న దిబ్బావధాన్లు కొడుకుని యింగిలీషు చదువుకు పార్వతీపురం పంపించేసరికి వూష్టం వొచ్చి మూడ్రోజుల్లో కొట్టేసింది. బుచ్చబ్బి కొడుక్కి యింగిలీషు చెప్పిద్దావఁనుకుంటూండగానే చచ్చినంత ఖాయలా చేసింది.

వెంకటే : మీరెప్పుడూ యిలాంటి వొఘాయిత్తం మాటలే అంటూ వుంచారు. డబ్బు ఖర్చయిపోతుందని మీకు బెంగ. మొన్న మొన్న మన కళ్ళెదుట మన వాకిట్లో జుట్టు విరబోసుకు గొట్టికాయలాడిన నేమానివారి కుర్రాడికి మునసబీ ఐంది కాదూ ?

అగ్ని : మన వెధవాయికి చదువొచ్చేదేం కనబడదు గాని పుస్తకాల కిందా, జీతం కిందా యిహ నాలుగేళ్ళయేసరికి మన భూమి కడతేరిపోతూంది. ఆపైన చిప్పా దొప్పా పట్టుకు బయల్దేరాలి. నిమ్మళంగా యింటిదగ్గరుంటే యీ పాటికి నాలుగష్టాలు చెప్పేద్దును. వొద్దంటూంటే యీ వెధవింగిలీసు చదువులో పెట్టావు.

వెంకటే :మనవాడికో మునసబీ ఐనా, పోలీసుపనైనా ఐతే రుణాలిచ్చి యీ అగ్గురారం భూవుఁలన్నీ కొనేస్తాడు. యీడాదికో నూర్రూపాయలు కర్చు పెట్టడానికింత ముందూ వెనకా చూస్తున్నారు. మీలాగే వాడూ జంఝాలు వొడుక్కుంటూ బతకాలని వుందా యేవిషి ? మీకంత భారవఁని తోస్తే మావాళ్ళు నాకు పసుపూకుంకానికి యిచ్చిన భూవఁమ్మేశి కుర్రాడికి చదువు చెప్పిస్తాను.

కర : నీ భూవెందు కమ్మాలమ్మా ? మన సొమ్ము చడ దిని కొవ్వున్నాడు. అతడే పెట్టుకుంటాడు.

అగ్ని : ఐతే నన్ను ఆక్షేపణ చేస్తావషే ? యీ మారంటే నీ అన్న వున్నాడని వూరుకునేది లేదు.

(గిరీశం, వెంకటేశం ప్రవేశింతురు)

వెంక : మాబా బ్బాబాబు వచ్చావషోయ్! (వెంకటేశమును కౌగలించుకొనును).

అగ్ని : వెధవాయా, యీ మార్రైనా పాసయినావా ? (వెంకటేశం తెల్లబోయి చూచును)

గిరీ : పా'సయినాడండి, ఫస్టుగా పా'సయినాడు. నేను చాలా శ్రమ పడి చదువు చెప్పా'నండి.

అగ్ని : యీ తురకెవడోయ్!

గిరీ : టర్క్! డా'మిట్, టెల్ మా'న్.

అగ్ని : మానా ? మానులావుంచా, నంఛావూ ? గూబ్బగలగొడతాను.

వెంకటే : (వణుకుతూ తల్లివేపు చూసి) అమ్మా, యీయ్నే నాకు చదువు చెప్పే మేష్టరు.

కర : ఇంటికి పెద్దమనిషొస్తే అపృచ్ఛపు మాటలాడతావేవిఁటి బావా ? ఆయనేదో కుఱ్ఱవాడితో యింగిలీసు మాటంటే పుచ్చకాయల దొంగంటే బుజాల్తడువు కున్నట్టు నీమీద పెట్టుకుంటావేం ?

(బండివాడు సామాను దించును)

గిరీ : (కరటక శాస్త్రితో) తమ బావగారా అగ్నిహొత్రావధాన్లు గారు ? నన్ను తమరు యరక్కపోవచ్చునుగాని డిఫ్టీకలక్టరుగారింటికి తమరు వచ్చేటప్పుడు నేను వారి పిల్లలకి చదువు చెబుతూ వుండేవాణ్ణి. డిఫ్టీకలక్టరుగారు తమర్ని యే మ్మెచ్చుకునే వారనుకున్నారు!

కర : అవును, మీ మొఖం చూచిన జ్ఞాపకం వుంది, డిప్టీకలక్టరుగారు మహాదొడ్డ ప్రభువు.

గిరీ : మీలాంటి చప్పన్న భాషలూ వచ్చిన మనిషి యక్కడా లేడనీ, సంస్కృతం మంచినీళ్ళ ప్రవాహంలా తమరు మాట్లాడతారనీ, తమలాంటి విదూషకుణ్ణి యక్కడా చూళ్ళేదనీ డిప్టీ కలక్టరుగారు శలవిస్తూండేవారు. కవితారసం ఆయన్లా గ్రహించే వారేరీ ? నా కవిత్వమంటే ఆయన చెవి కోసుకుంటారు. మహారాజా వారి దర్శనం కూడా నాకు చేయించారండి.

అగ్ని : (ధుమధుమలాడుతూ) ఈ శషభిషలు నాకేం పనికిరావు. ఇతడి వైఖరి చూస్తే యిక్కడే బస వేసేటట్టు కనబడుతూంది. మా యింట్లో భోజనం యంత మాత్రం వీలుపడదు.

వెంకమ్మ : ఆయన మాటలు గణించకు బాబూ. ఆయన మోస్తరది. మీ దయవల్ల మా వాడికో ముక్కబ్బితే మీ మేలు మరిచిపోం.

గిరీ : అందుకభ్యంతర వేఁవిఁటమ్మా! మీవాడు శలవుల్లో చదువు చెప్పమని ఎంతో బతిమాలుకుంటే పోనీ, పనికొచ్చే కుఱ్ఱవాడు కదా అని వొచ్చా'ను గాని పట్టణంలో మునసబుగారింట భోజనం చేదని వొచ్చా'నా, వారిచ్చే డబ్బు చేదని వొచ్చా'నా అమ్మా ?

వెంక : యీ చదువుకోసవఁని పిల్లవాణ్ణి వొదులుకుని ఉండడం, వాడు పరాయి వూళ్ళో శ్రమదమాలు పడుతూండ్డం. నా ప్రాణాలు ఎప్పుడూ అక్కణ్ణే వుంటాయి. డబ్బంటే యెన్నడూ వెనక చూళ్ళేదుగదా. మేం కనడం మట్టుకు కన్నాం. మీరే వాడికి తల్లి తండ్రీని. యల్లా కడుపులో పెట్టుకు చదువు చెబుతారో, మీదే భారం.

గిరీ : తమరు యింత దూరం శలవియ్యాలమ్మా ? నా మంచిచెడ్డలు మీ కుర్రవాణ్ణడిగితే తెలుస్తుంది. మునసబుగారూ, డిప్టీ కలక్టరుగారూ యెన్నిక చేసిన మనిషిని. నామాట నే చెప్పుకోవాలా ? ఇంతెందుకూ, ఇక మూడేళ్ళు నా తరిఫీదులో వుంచితే క్రిమినల్లో వరుసగా పోలీసు పరీక్ష పాసు చేయిస్తాను.

అగ్ని : మూడేళ్ళే! యీ సంవత్సరం పుస్తకాల కెంతవుతుందిరా అబ్బీ ?

వెంకటే : పదిహేన్రూపాయ లవుతుంది.

అగ్ని : ఒక్క దమ్మిడీ యివ్వను. వీళ్ళిద్దరూ కూడి ఆ రూపాయలు పంచుకు తినేట్టు కనబడుతూంది. నేను వేదం యనభై రెండు పన్నాలూ ఒహ దమ్మిడీ పుస్తకాల ఖర్చు లేకుండా చదువుకున్నాను. ఇదంతా టోపీ వ్యవహారంలా కనబడుతుంది.

కర : (నవ్వుతూ) కోట్లకి విలువైన మాట అన్నావు బావా ?

గిరీ : (కరటకశాస్త్రితో) దిసీజ్ బార్బరస్, చూచారండీ, జెంటిల్మేన్ - అనగా పెద్దమనిషిని యలా అంటున్నారో ? నేను యిక యిక్కడ వుండడం భావ్యం కాదు. శలవు పుచ్చుకుంటాను.

వెంక : చాల్చాలు. బాగానే వుంది; యింటికెవరొచ్చినా నా కిదే భయం. ఆయన మాటల కెక్కడికి బాబూ, వెళ్ళిపోకండి.

కర : అగ్నిహోత్రావధాన్లూ! కుర్రవాడికి రవ్వంత చదువు చెప్పించడానికి ఇంత ముందూ వెనకా చూస్తున్నావు! బుచ్చమ్మనమ్మిన పదిహేను వొందల రూపాయ లేంజేశావ్ ?

గిరీ : సెల్లింగ్గర్ల్సు! డా'మిట్!

అగ్ని : ప్ర'తీ గాడిదె కొడుకూ అమ్మా'వమ్మా' వంచూంచాడు. కూరగాయల్లోయ్ అమ్మడానికి ? ఆ రూపాయలు పుచ్చుకోకపోతే, మొగుడు చచ్చాడు గదా- దాని గతి యావైఁయ్యుండును ?

కర : చచ్చా'డంటే వాడిదా తప్పు! మంచంమీంచి దించెయ్యడానికి సిద్ధంగా వున్నవాడి క్కట్టా'వ్!

గిరీ : తమరేనా నులక అగ్నిహోత్రావధాన్లుగారు ? యీ పట్టెని జటలో తమంతవారు లేరని రాజమహేంద్రవరంలో మా వాళ్ళనుకునేవారు.

అగ్ని : మీది రాజమహేంద్రవరంషండీ ? ఆ మాట చెప్పా'రు కారేం ? రామావుధాన్లుగారు బాగున్నారా ?

గిరీ : బాగున్నారండి. ఆయన మా మేనమాఁవగారండి.

అగ్ని : ఆ మాట చెప్పా'రు కారూ!

గిరీ : మా మావఁ యీ దేశబ్బోగట్టా వొచ్చినప్పుడల్లా తమర్ని యెన్నిక చేస్తూంటారండి.

అగ్ని : నాకూ వారికి చాలా స్నేహం. చూశారా, కొంచం నాకు ప్రథమకోపం, యవరో తెలియకుండా అన్న మాటలు, గణించకండేం.

గిరీ : దానికేవండి. తమవంటి పెద్దలు అనడం, మాలాంటి కుర్రవాళ్ళు పడడం విధాయకమే గదండీ ?

కర : (తనలో) యిన్నాళ్ళకి మా అగ్నిహోత్రుడికి తగినవాడు దొరికాడు.

అగ్ని : చూశారాండీ, మీ పేరేమిటండీ ?

గిరీ : గిరీశం అంటారండి.

అగ్ని : చూశారండి గిరీశంగారూ! మా కరటక శాస్తుల్లు వట్టి అవకతవక మనిషి. మంచీ చెడ్డా యేమీ వాడి మనసు కెక్కదు. అల్లుడు చచ్చిపోయినాడంటే అందువల్ల ఎంత లాభం కలిగింది! భూవుఁలకి దావా తెచ్చా'నా లేదా ? నేను యీ మధ్య దాఖల్చేయించిన పిటీషను మీద ఆర్డరు చదివిపెట్టండి (గదిలోకి వెళ్లి కాగితం తెచ్చి గిరీశం చేతికి యిచ్చును).

గిరీ : (చూసి) ఎవడో తెలివి తక్కువ గుమస్తా వ్రాసినట్లుంది. అక్షరం పోలికే లేదండి.

అగ్ని : మా వకీలు గడగడ చదివేశాడండి.

గిరీ : నేను మాత్రం చదవలేకనా! అంతకన్న గళగ్రాహిగా చదువుతాను. లెక్చరిచ్చే పండితుణ్ణి నాకిది పేలపిండి కాదూ ? అయితే, రాసినవాడి తెలివికి సంతోషిస్తున్నాను. యిది అరటిపండు విప్పినట్టు తర్జుమాచేసి దాఖలు చెయ్యమని శలవా ?

అగ్ని : అంతకంటేనా! (తనలో) డబ్బు ఖర్చులేకుండా వీడిచాత కాగితముక్కలన్నీ తర్జుమా చేయించేస్తాను.

గిరీ : యింకా యింగ్లీషు కాయితాలు యేవఁన్నా వుంటే నామీద పార'య్యండి. తర్జుమా చేసి పెడతాను.

అగ్ని : ఆష్లాగే.

వెంక : మా అబ్బాయీ మీరూ ఒక్క పర్యాయం యింగిలీసు మాట్లాడండి బాబూ!

గిరీ : అలాగేనమ్మా.

My dear Venkatesam.
Twinkle, Twinkle, little star
How I wonder what you are,

వెంకటే : There is a white man in the tent

గిరీ : The boy stood on the burning deck
Where all but he had fled

వెంకటే : Upon the same base and on the same side of it the sides of a trapezium are equal to one another.

గిరీ : Of man's first disobedience and the fruit of that mango tree. sing, Venketesa, my very good boy.

వెంకటే : Nouns ending in 'for' or 'fre' change their 'f' or 'fe' into ves.

అగ్ని : యీ ఆడుతున్న మాటకి అర్థం యేవిఁటండి ?

గిరీ : యీ శలవుల్లో యే ప్రకారం చదవాలో అదంతా మాట్లాడుతున్నావండి.

కర : అబ్బీ, వొక తెనుగు పద్యం చదవరా!

వెంకటే : "పొగచుట్టకు సతిమోవికి"……

గిరీ : డా'మిట్! డోంట్రీడ్ దట్. (మెల్లగా) 'నలదమయంతు లిద్దరు' చదువ్.

వెంకటే : నలదమయంతులిద్దరు మనః ప్రభవానల దహ్యమానులై సలిపిరి దీర్ఘ వాసర నిశల్…

కర : అట్టే అట్టే. 'మనః ప్రభవానల' వంటే యేవిట్రా ?

వెంకటే : (యింటి కప్పువేపు చూసి వూరుకుండును)

గిరీ : పసిపిల్లలకి అలాంటి కఠినవైఁన పద్యానికి అర్థం తెలుస్తుందా అండి ?

అగ్ని : పద్యానికి అర్థం చెప్పరూ!

గిరీ : యిప్పటిమటుకు వేదంలాగే భట్టీయం వేయిస్తారు. తెల్లవాళ్ల స్కూళ్లలో తెలుగు పద్యాలమీద ఖాతరీ లేదండి. యంతసేపూ జా'గర్ఫీ, గీగర్ఫీ, అర్థిమెటిక్, ఆల్జీబ్రా, మా'థమా'టిక్స్ యివన్నీ హడలేసి చేప్తారండి.

కర : (తనలో) తర్ఫీదు మా చక్కగా వుంది. వీణ్ణి పెందరాళే తోవ పెట్టకపోతే మోసవొ౦స్తుంది.

అగ్ని : అన్నోటి చెప్తారండి ?

గిరీ : మరేవఁనుకున్నారు ? మీ కుర్రవాళ్లాగ చదువుకొనేవాడికి ఒక నిముషమైనా తెరిపుండదు.

అగ్ని : అదుగో, చదువంటే అష్లాగే చదువుకోవాలి. గొట్టికాయలాడకుండా మావాణ్ణి ఖాయిదా చేస్తే యంత చదువైనా వొస్తుంది.

గిరీ : నా దగ్గిర గొట్టికాయలు గిట్టికాయలు పనికిరావండి. పుస్తకం చాతపడితే వేళ్లకి పుస్తకం అంటుకుపోవాలి. అలా చదివిస్తానండి.

అగ్ని : అలాగే చేస్తే మా వాడికి చదువొచ్చి అన్ని పరీక్షలూ పాసవుతాడండి. మా వాడికి డబ్బు ఖర్చు లేకుండా పెళ్లయే సాధనం కూడా తటస్థించిందండి.

వెంక : మీ నైజం కొద్దీ చిన్రూ కొన్రూ మంఛారుగాని మీకు మాత్రం అబ్బిమీద ప్రేవఁలేదా యేవిఁషీ ? పట్నంలో గొట్టాలమ్మొచ్చినప్పుడు యంతో బెంగపెట్టుకుని అబ్బీని శలవర్జీ రాసి వెళ్లిపో రమ్మన్నారు కారా ? చదువూ చెప్పించక, పెళ్లీ చెయ్యక తీరుతుందా యేవిషి ?

కర : డబ్బు ఖర్చు లేకుండా కొడుక్కి పెళ్లి చేస్తావుషోయి బావా ? ఆడపిల్లల్ని అమ్మినట్టే అనుకున్నావా యేవిఁషి ? పదిహేనొందలైనా పోస్తేనే గాని అబ్బికి పిల్లనివ్వరు.

అగ్ని : డబ్బు ఖర్చు లేకుండా వెంకడికి యలా పెళ్లి చేస్తానో నువ్వే చూతువుగాని. రామచంద్రపురం అగ్రహారంలో లుబ్ధావధాన్లు గార్ని యెరుగుదువా ?

కర : యరగను.

అగ్ని : అయ్న లక్షాధికారి. పద్దెనిమిది వందలికి సుబ్బిని అడగొచ్చారు. ఉభయ ఖర్చులూ పెడతారష. పెళ్లి మా వైభవంగా చేస్తారష. మనం పిల్లని తీసికెళ్లి వాళ్లింటే పెళ్లి చెయ్యడం. మనకి తట్టుబడి అట్టే వుండదు. ఆ పద్దెనిమిది వొందలూ పెట్టి వెంకడికి పెళ్లి చేస్తాను.

వెంక : పెళ్లి కొడు క్కెన్నేళ్లు ?

అగ్ని : యెన్నేళ్లయితేనేవిఁ ? నలభైయ్యయిదు.

గిరీ : లుబ్ధావధాన్లుగారు మా పెత్తల్లి కొడుకండి. తమతో సమ్మంధవంటే నాకు సంతోషవేఁగానండి, ఆయనకి అరవయ్యేళ్లు దాటాయండి. యీడేఁవయినా సెల్లింగ్ గరల్స్ – అనగా కన్యాశుల్కం, డామిట్! యంత మాత్రం కూడదండి. నేను పూనాలో వున్నప్పుడు అందు విషయమై ఒహనాడు నాలుగ్గంటలు ఒక్క బిగిని లెక్చరిచ్చానండి. సావకాశంగా కూర్చుంటే కన్యాశుల్కం కూడని పనని తమ చేతనే వొప్పిస్తాను.

కర : బావా! యీ సమ్మంధం చేస్తే నీ కొంపకి అగ్గెట్టేస్తాను.

అగ్ని : వీళ్లమ్మా శిఖ తరగా. ప్రతీ గాడిదకొడుకూ తిండిపోతుల్లాగ నా యింటజేరి నన్ననేవాళ్లే. తాంబోలం యిచ్చేశాను; యిహ తన్నుకు చావండి.

వెంక : నాతో చెప్పకుండానే!

అగ్ని : ఆడముండల్తోనా ఆలోచన ? యీ సమ్మంధం చెయ్యకపోతే నేను బారిక రావుణ్ణే! (లేచి వెళ్లును)

కర : యేం మార్దవం!

వెంక : అన్నయ్యా! ఈ సమ్మంధం చేస్తే నే న్నుయ్యో, గొయ్యో చూసుకుంటాను. పెద్దదాన్ని రొమ్ముమీద కుంపట్లాగ భరిస్తూనే వున్నాం. ఆయనకి యింత యీడొచ్చినా కష్టం సుఖం వొళ్లు నాటక యీ దౌర్భాగ్యపు సమ్మంధం కల్పించుకొచ్చారు, నే బతికి బాగుండాలంటే యీ సమ్మంధము తప్పించు.

కర : గట్టి అసాధ్యం తెచ్చిపెట్టావే. వొట్టి మూర్ఖప గాడిదకొడుకు. యెదురు చెప్పినకొద్దీ మరింత కొ(్రెక్కుతాడు. యేం చేయగలుగుదునని నీకు భరువసా చెప్పను ? యేమీ పాలుపోకుండా ఉంది.

గిరీ : అమ్మా! మీరు యెందుకలా విచారిస్తారు ? అవుధాన్లుగారు సావకాశంగా వున్నప్పుడు ఒక గంట కూర్చుంటే డబ్బుచ్చుకు ముసలివాళ్ళకి పెళ్లి చెయ్యడం దౌర్జన్యవఁని లెక్చరిచ్చి మనసు మళ్లిస్తాను.

వెంక : బాబూ! అతడు మీ మేనత్తకొడుకైతే, మీ కాళ్లు పట్టుకుంటాను. మీరు వెళ్లి అయన్న మనసు మళ్లిస్తురూ, నా చర్మం చెప్పులు కుట్టిస్తాను.

గిరీ : అమ్మా, యేం చెప్పను! వాడో త్వాష్ట్రం. పిల్ల దొరకడవేఁ చాలు వాడికి. యీ సమ్మంధం వొదులుకుంటే వాడికి పెళ్లే కాదు. వాడని వా డొదిలే ఘటం కాడు.

కర : అమ్మీ, నేనో ఉపాయం చెబుతాను యిలారా.

(కరటకశాస్త్రి, శిష్యుడు, వెంకమ్మ నిష్క్రమింతురు)

గిరీ : మైడియర్ షేక్స్పియర్! నీ తండ్రి అగ్గిరావుడోయి. మీ యింట్లో యవళ్లకీ అతణ్ణి లొంగదీసే యలోక్వెన్సు లేదు. నా దెబ్బ చూడు, యివాళేం జేస్తానో! వీరేశలింగం పంతులుగారు కన్యాశుల్కం విషయంపై రాసిన ఉపన్యాసం పైకి తీయ్. మావఁగారికి లెక్చరివ్వడానికి కత్తీ కఠారీ నూరాలి.

వెంకటే : మీ లెక్చరుమాట అలా వుణ్ణీండికాని యీవాళ గండం గడిచింది గదా అని సంతోషిస్తున్నాను. మీ రొకపోతే పరీక్ష ఫెలయినందుకు మా నాన్న పెయ్యకట్టు తాడుతో చమ్డా లెక్కగొట్టును.

గిరీ : యీలాంటి ప్రమాదా లప్పించుకోవడవేఁ ప్రజ్ఞ. ఏవైనా డిఫికల్టీ లొచ్చినప్పుడు ఒక రస్సా వేశావంటే అది బ్రహ్మభేద్యంగా వుండాలి. పొలిటీషనంటే మరేవిఁటనుకున్నావ్ ? పూజా పునస్కారాల్లేక, బూజెక్కున్నాను కాని మన కంట్రీయే ఇండిపెండెంట్ అయితే గ్లాడ్స్టన్ లాగ దివాన్ గిరీ చలాయిస్తును. ఏమివాయ్! మీ తండ్రి వైఖరి చూస్తే పుస్తకాలకి సొమ్మిచ్చేటట్టు కనబడదు. చుట్టలు పట్నంనించి అరకట్టే తెచ్చాం గదా, ఏమి సాధనం ?

వెంకటే : నాన్నివ్వకపోతే అమ్మనడిగి డబ్బు తెస్తాను.

గిరీ : నీ బుద్ధి యలా వికసిస్తూందో చూశావా ? యిలా తర్ఫీదవుతుంటే నువ్వు కూడా పెద్ద పొలిటీషను వవుతావు.

(బుచ్చమ్మ ప్రవేశించును)

బుచ్చ : తమ్ముడూ, అమ్మ కాళ్లు కడుక్కోమంచూందిరా

గిరీ : (తనలో) హౌ బ్యూటిఫుల్! క్వైటనెక్స్పెక్టెడ్!

బుచ్చ : అయ్యా, మీరు చల్దివణ్ణం తించారా ?

గిరీ : నాట్దిస్లైసె స్టబ్జక్షన్. అనగా యంత మాత్రం అభ్యంతరం లేదు. వడ్డించం డిదిగో వస్తున్నాను. తోవలో యేటి దగ్గర సంధ్యావందనం అదీ చేసుకున్నాను.

(బుచ్చమ్మ వెళ్ళును)

గిరీ : వాట్! యీమె నీ సిస్టరా! తల చెడ్డట్టు కనబడుతున్నదే ?

వెంకటే : మా అక్కే, జుత్తుకి చవుఁర్రాసుకోదు.

గిరీ : తల చెడ్డం అంటే, విడో అన్నమాట. చవుఁరూ గివుఁరూ జాంతేనయ్. గాని యిన్నాళ్ళాయి నీకు విడోమారేజి విషయమైఁ లెక్చర్లిస్తూ వుంటే యీ కథ యెప్పుడూ చెప్పావు కావు ? మీ యింట్లోనే ఓ అన్ఫార్చునేట్ బ్యూటిఫుల్ యంగ్ విడో వుందటోయ్! ఏమి దురవస్థ! మై హార్ట్ మెల్ట్స్. నేనే తండ్రినైతే యీ పిల్లకి విడోమారియేజ్జేసి శాశ్వతమైన కీర్తి సంపాదిస్తును. (తనలో) ఏవిఁ చక్కదనం! యీ సొంపు యక్కడా చూళ్ళేదే! పల్లెటూరు వూసుపోదనుకున్నాను గాని పెద్ద కాంపేనుకి అవకాశం యిక్కడ కూడ దొరకడం నా అదృష్టం.

వెంకటే : మా నాన్న నాక్కూడ పెళ్లి చాస్తాడు.

గిరీ : యీవాళో పెద్ద పెళ్ళి నీకు తలవెంట్రుకంత వాసిలో తప్పిపోయింది! యీ శలవులాఖర్లోగా తాళాధ్యాయం కాకుండా తప్పించుకుంటే నువ్ పూరా ప్రయోజకుడివే. ఇహ నిజమైన పెళ్ళా ? యింత చదువూ చదువుకుని నీ తండ్రి కుదిర్చిన యేవీఁ యరగని చిన్నపిల్లకా పుస్తె కడతావ్ ? మాంచి యెర్రగా బుర్రగా వున్న యంగ్విడోని నువ్ పెళ్ళాడకపోతే ఐ షుడ్బి యషేమ్డాఫ్యూ!

2వ స్థలము : దేవాలయం

(పువ్వుల తోటలో మండపం మీద కూచుని, శిష్యుడు ప్రవేశించును)

శిష్యు : ఆర్నెల్లకోమాటు పుస్తకం పట్టుకుంటే కొత్త శ్లోకాలు, పాత శ్లోకాలు ఒక్కలాగ్కనపడతాయి. యిప్పుడు కొత్త శ్లోకం కనుక్కోమంటే నా శక్యవాఁ ? సిద్ధాంతి నెవణ్ణయినా ప్రశ్నడిగి కనుక్కోవాలి. లేకుంటే చటుక్కున పుస్తకం విప్పి యే శ్లోకం కనబడితే ఆ శ్లోకం చదువుతాను.

"మృగాః ప్రియాళు ద్రుమమంజరీణాం"

యిదేదో చదివిన జ్ఞాపకం లీలగా వుంది. లేళ్ళు పరుగెత్తుతాయని కాదూ? యేం గొప్పమాట చెప్పాడోయి కవి! లేళ్ళు పరుగెత్తితే యవడిక్కావాలి, పరుగెత్తకపోతే యవడిక్కావాలి ? కుక్కలు పరిగెత్తుతున్నాయి కావా, నక్కలు పరిగెత్తుతున్నాయి కావా ? పిల్లులు పరిగెత్తుతున్నాయి కావా! పనికొచ్చే ముక్క ఒక్కటీ యీ పుస్తకంలో లేదు. నాలు గంకెలు బేరీజు వేయడం, వొడ్డీ, వాశీ కట్టడం కాళిదాసుకేం తెలుసు ? తెల్లవాడి దా మహిమ! ఏ పట్నం యెక్కడుందో, యే కొండ లెక్కడున్నాయో అడగవయ్యా గిరీశంగార్ని, నిలుచున్నపాట్న చెబుతాడు.

"ప్రియాముఖం కింపురుషశ్చుచుంబ"

ముద్దెట్టుకున్నా డటోయి ముండాకొడుకు, ముక్కట్టుకొన్నాడు కాడూ!

(కరటకశాస్త్రి శిష్యుడికి కనబడకుండా వెనకనుంచి ప్రవేశించును)

"వర్ణ ప్రకర్షే సతి కర్ణికారం!
ధునోతినిర్గంధ తయాస్మచేతః"

యిది కూడా చదివినట్టే వుందోయి. ఆ పువ్వేదో కవి కిష్టం లేదట. యిష్టం లేకపోతే ములిగిపోయింది కాబోలు ? మా గురువుగారికి దొండకాయ కూర యిష్టం లేదు. గురువుగారి పెళ్ళాం పెరట్లో దొండ పాదుందని రోజూ ఆ కూరే వొండుతుంది. బతికున్న వాళ్ళ యిష్టవేఁ యిలా యేడుస్తూంటే చచ్చినవాడి యిష్టా యిష్టాలతో ఏం పని ? యీ చదువిక్కడితో చాలించి గిరీశంగారి దగ్గర నాలు గింగిలీషు ముక్కలు నేర్చుకుంటాను. వెంకడికి యింగిలీసొచ్చునని యేం గర్రాగా వుంది.

కర : యేవిఁట్రా అబ్బి అంటున్నావు ?

శిష్యు : ఏదో నా స్వంత ఘోష.

కర : గురువుని కదా, అదేదో నాకూ కొంచెం చెబుదూ.

శిష్యు : చెప్పడాని కేవుఁందండీ ? నాటకంలో నాచేత వేషం కట్టించి పెద్ద చాంతాళ్ళలాంటి హిందుస్తానీ ముక్కలూ, సంస్కృతం ముక్కలూ అర్థం తెలియకుండా భట్టీయం వేయించడానికి మీకు ఓపికుందిగాని నాకు నాౘ్రోజులి కో శ్లోకం చెప్పడానికి శ్రద్ధ లేదుగదా ? పట్నం వొదిలి ఆర్నెల్ల కోమాటు అగ్రహారాలంట వొచ్చినప్పుడు మరేం వూసుపోక "పుస్తకం తియ్య"ంటే సంస్కృతం యేం వచ్చేని ?

కర : యిటుపైన్నుంచి యెలా చెబుతానో, రోజుకు నాలుగేసి శ్లోకాలు చెబుతాను. కొత్త శ్లోకం చదువు.

శిష్యు : "అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా
హిమాలయో నామ నగాధిరాజం"

కర : మొదటి కొచ్చావేం ?

శిష్యు : మొదలూ కొసా వొక్కలాగే కనబడుతూంది.

కర : (నవ్వి) పోనియ్, మొదణ్ణించే చదువుదాం.

శిష్యు : చదివినా యేం లాభం వుంది ? యీ శ్లోకం శుద్ధబద్ధమట.

కర : యవరు చెప్పారు ?

శిష్యు : గిరీశంగారు.

కర : యేం చెప్పాడు ?

శిష్యు : హిమాలయం రెండు సముద్రాలకీ దాసి. రూళ్ళ కర్రలాగ లేదట, మాపులో చూపించాడు.

కర : హిమాలయం శిగగోశిరి గాని, ఆ పుస్తకం ముడిచి, నా మాట విను.

శిష్యు : చిత్తం. (పుస్తకం మూయును)

కర : చదువన్న దెందుకు ? పొట్ట పోషించుకోడానిగ్గదా ?

శిష్యు : అవును.

కర : యీ రోజుల్లో నీ సంస్కృత చదు వెవడి క్కావాలి ?

శిష్యు : దరిద్రులి క్కావాలి.

కర : బాగా చెప్పావు. నీకు ఇంగ్లీషు చదువుకోవాల్నుందా ?

శిష్యు : చెప్పించే దాతేడీ ?

కర : నేను చెప్పిస్తాన్రా!

శిష్యు : నిజంగాను!

కర : నిజంగాన్రా. గాని ఒక షరతుంది.

శిష్యు : యేవిఁటండి ?

కర : నాకో కష్ట సాధ్యమయిన రాచకార్యం తటస్థించింది. అది నువ్ నిర్వహించి చేసుకురావాలి.

శిష్యు : నా వల్లయ్యే రాచకార్యాలు కూడా వున్నాయా ?

కర : యీ రాచకార్యం నీ వల్లే కావాలి. మరెవడివల్లా కాదు. అదేవిటంటే, ఓ పది రోజులు ఆడపిల్లవై పోవాలి.

శిష్యు : గణియం పట్టణంలో వుండిపోయిందే!

కర : అట్టే గణియం అవసరం లేదు. నీకు తలదువ్వి, కోకకడితే పజ్యెండేళ్ళ కన్నె పిల్లలా వుంటావు. నిన్ను తీసుకెళ్ళి లుబ్ధావుధాన్లకి పెళ్ళి చేస్తాను. నాలుగు పూటలు వాళ్లింట నిపుణతగా మెసిలి, వేషం విప్పేసి పారి పోయి రా, నిజమైన పెళ్ళి ముహూర్తము చాలా వ్యవధుంది.

శిష్యు : యిదెంత పని.

కర : అలా అనుకోకు. అతి చేస్తి వట్టాయనా, అనుమానపడతారు. పట్టుబడ్డా వంటే పీక తెగిపోతుంది.

శిష్యు : మీ కా భయం వొద్దు.

కర : నువ్వు నెగ్గు కొస్తే, మా పిల్లన్నీకిచ్చి యిల్లరికం ఉంచుకుంటాను.

శిష్యు : అలా ప్రమాణం చెయ్యండి.

కర : ఇదుగో, యీ పుస్తకం పట్టుకు ప్రమాణం చేస్తున్నాను.

శిష్యు : ఈ పుస్తకం మీద నాకు నమ్మకం పోయింది. మరో గట్టి ప్రమాణం చెయ్యండి. గిరీశంగారిని అడిగి ఒక యింగిలీసు పుస్తకం పట్టుకురానా?

కర : తప్పితే భూమితోడ్రా.

శిష్యు : మీరు యెగేస్తే భూవేఁవిం జేస్తుంది ? మీ మాటే చాలును. కానీయండి.

3వ స్థలము : అగ్నిహోత్రావధాన్లు యింటి యదటి వీధి.

(గిరీశం, వెంకటేశం ప్రవేశింతురు)

వెంకటే : రాత్రి కన్యాశుల్కం మీద లెక్చరిచ్చారా ?

గిరీ : లెక్చరేవిఁటోయ్. ధణు తెగిరి పోయింది. మీ తండ్రిది మైరావణ చరిత్రోయ్. మీ అంకుల్ కరటక శాస్త్రి స్కౌండ్రల్లా కనబడుతున్నాడు.

వెంకటే : యేం జరిగిం దేం జరిగిందేవిఁటి ?

గిరీ : విను, రాత్రి భోజనాలవేళ లెక్చరు ఆరంభించమని రోజల్లా బురిడీలు పెట్టాడోయ్ మీ మావఁ. సబ్జక్టు నేను కొంచెం యెత్తగానే తను కూడా గట్టిగా సపోర్టు చేస్తానని ప్రామిస్ చేశాడు. నీ తండ్రి వైఖరి చూస్తే మాత్రం కొంచెం ధైర్యం వెనకాడి నాలిక్కొస కొచ్చిన మాట మళ్ళీ మణిగి పోతూండేది. పెరుగూ అన్నం కలుపుకునే వేళకి యిక టైమ్మించి పోతూందని తెగించి లెక్చరు ఆరంభించాను. ఇంట్రడక్షన్ రెండు సెంటెన్సులు యింకా చెప్పనేలేదు. నాలుగు యింగిలీషు మాటలు దొర్లాయోయ్. దాంతో నీ తండ్రి కళ్ళెర్రజేసి “ఈ వెధవ ఇంగ్లీషు చదువు నించి బ్రాహ్మణ్యం చెడిపోతూంది. దేవభాషలాగ భోజనాల దగ్గిరకూడా ఆ మాటలే కూస్తారు. సంధ్యావందనం, శ్రీసూక్త పురుషసూక్తాలు తగలబడిపోయినాయి సరేగదా!” అని గట్టిగా కేకవేసి చెప్పేసరికి నేను కొంచెం పస్తాయించి “థ్రోయింగ్ పెర్ల్సు బిఫోర్ స్వైన్” అనుకొని కరటక శాస్తుల్లు వేపు చూసేసరికి, యేం చేస్తున్నాడనుకున్నావ్ ? రాస్కెల్,

వులకలేదు, పలకలేదు సరేకదా మొహం పక్కకు తిప్ప కడుప్పగిలేటట్టు నవ్వుతున్నాడు. యిక లెక్చరు వెళ్ళింది కాదు, సరేకదా, నోట్లోకి ముద్ద కూడా వెళ్ళింది కాదు. ఛీ! యింత యిన్సల్టు జరిగిం తరవాత తక్షణం బయలుదేరి వెళ్ళి పోదామనుకున్నాను.

వెంకటే : అయ్యో! వెళ్ళిపోతారా యేవింటి ?

గిరీ : నాటింది లీస్టు. కొసాకి విను, నీ తండ్రిని పోకెట్లో వేశాను.

వెంకటే : నా తండ్రికి లెక్చరిచ్చి పెళ్ళి తప్పిస్తాంవన్నారే ?

గిరీ : పెళ్ళి ఆపడానికి బ్రహ్మశక్యం కాదు. డిమాస్థనీసు, సురేంద్రనాథ్ బానర్జి వచ్చి చెప్పినా నీ తండ్రి ఈ పెళ్ళి మానడు. లెక్చర్లు యంతసేపూ సిటీలోనేగాని, పల్లెటూళ్ళలో యంత మాత్రం పనికి రావు. పూనాలాంటి సిటీలో లెక్చర్ యిచ్చావంటే టెంథౌజండు పీపిల్ వింటానికి వొస్తారు. మన టౌన్లోనే, పెద్ద మీటింగులు చెయ్యాలంటే, డప్పులు బణాయించి, నోటీసులు కట్టి, బజార్లు కాసి, తోవంట పోయేవాళ్ళని యీడ్చుకు వొచ్చినా, యాభైమంది కారు. పల్లెటూరి పీపిల్ లెక్చర్లకి అన్‌ఫిట్. మొన్న మనం వొచ్చిన బండీవాడికి నా'షనల్ కాంగ్రెస్ విషయవైం రెండు గంటలు లెక్చరు యిచ్చేసరికి ఆ గాడిదకొడుకు వాళ్ళ వూరు హెడ్ కానిస్టేబిల్ని కాంగ్రెస్‌వారు యెప్పుడు బదిలీచేస్తారని అడిగాడు! విలేజస్‌లో లెక్చర్లు యంత్రమాత్రం కార్యం లేదు. నీ తండ్రి దగ్గర మాత్రం లెక్చరన్న మాట కూడా అనకూడదు.

వెంకటే : అయితే నాన్నని యలాగ జేబులో వేశారేవింటి ?

గిరీ : అది పోలిటిక్సు దెబ్బోయ్! ఆ తరవాత కథ విను. నా మీద కా'క లేసిన తరువాత కోపవంణక్క ధుమధుమలాడుకుంటూ, పెరుగూ అన్నం కుమ్మడం ఆరంభించాడు. ఇంతలో మీ అప్ప వచ్చి గుమ్మం దగ్గర నిలబడి కోకిల కంఠంతో "నాన్న, తమ్ముడికి పెళ్ళి చెయ్యాలంటే నా సొమ్ము పెట్టి పెళ్ళి చెయ్యండిగాని, దాని కొంపముంచి లుబ్ధావధాంన్లకి ఇవ్వొ"ద్దని చెప్పింది. దాంతో నీ తండ్రికి వెర్రికోపం వొచ్చి ఉత్తరాపోశనం

పట్టకుండానే ఆ పెరుగూ అన్నంతో విస్తరి తీసికెళ్ళి దాన్నెత్తిన రుద్దేశాడు! కరటకశాస్తుల్లు అడ్డుపడకపోతే చెంబుతో నీళ్ళు వాడి నెత్తిం దిమ్మరించాడు. కరటక శాస్తుల్లుకి కోపం వొచ్చి శిష్యుణ్ణి తీసుకు వాళ్ళ వూరెళ్ళిపోయినాడు.

వెంకటే : దీని పేరేనా యేవిఁటి, మా నాన్నని జేబులో వేసుకోవడం ?

గిరీ : పేషన్స్! కొసాకీ విను. స్కౌండ్రల్ కరటక శాస్తులు వెళ్ళిపోయినాడని సంతోషించాను గానీ, నీ సిస్టర్ ఫేట్ విషయమై మహా విచారమైంది. నేనే దాని హజ్బెండ్నై వుంటే, నిలబడ్డపాటున నీ తండ్రిని రివాల్వర్తో షూట్‌చేసి వుందును. మీ అమ్మ యేడుస్తూ ఒక మూల కూచుంది. అప్పుణ్ణే వెళ్ళి పొయ్యిలో నిప్పేసి, నీళ్లుతోడి, నీ సిష్టర్ని స్నానం చెయ్యమన్నాను. సిగర్సు కాల్చుకుందామని అరుగుమీద నేను బిచాణా వేసేసరికి, నీ తండ్రికి పశ్చాత్తాపం వొచ్చి తానూ ఆ అరుగు మీదే బిచాణా వేసి ఒక్క సిగరయినా కాల్చనియ్యకుండా రాత్రల్లా కబుర్లలో పెట్టి చంపా'డోయ్. మొత్తానికి కత్తు కలిపేశాను.

వెంకటే : యలాక్కలిపా రేవిఁటి ?

గిరీ : ఒక పొలిటికల్ మహాస్త్రం ప్రయోగించి కలిపేశాను.

వెంకటే : యేవిఁటం డా అస్త్రం ?

గిరీ : ఒకడు చెప్పిందల్లా మహాబాగుందండవే. సమ్మోహనాస్త్రవఁంటే అదేకదా?

వెంకటే : లెక్చరిచ్చి మా తండ్రిని వొప్పించడానికి బదులుగా ఆయన చెప్పిందానికి మీరే ఒప్పుకున్నారూ ?

గిరీ : కుంచం నిలువునా కొలవడానికి వీల్లేనప్పుడు తిరగేశైనా కొలిస్తే నాలుగ్గింజలు నిలుస్తాయి. బాగా ఆలోచిస్తే యిన్ఫెంటు మా'రియేజి కూడున'నే తోస్తూంది.

వెంకటే : యిన్నాళ్ళూ కూడదని చెప్పేవారే నాతోటి ?

గిరీ : ఒపీనియన్స్ అప్పుడప్పుడు ఛేంజి చేస్తూంటేనేగాని పొలిటీషను కానేరడు. నాకు తోచిన కొత్త ఆర్గ్యుమెంటు విన్నావా ? యిన్ఫెంటు మా'రేజీలు అయితేగాని యంగ్ విడోజ్ వుండరు. యంగు విడోజ్ వుంటేనేగాని

విడో మా'రియేజ్ రిఫారమ్‌కి అవకాశం వుండదు గదా ? సివిలిజేషన్కల్లా నిగ్గు విడో మా'రియేజ్ అయినప్పుడు యిన్ఫెంటు 'మారేజి లేకపోతే, సివిలిజేషన్ హాల్టవుతుంది! మరి ముందు అడుగు పెట్టలేదు. గనక తప్పకుండా యిన్ఫెంటు మా'రేజి చెయ్యవలసిందే. ఇది ఒహ కొత్త డిస్కవరీ. నంబర్ టూ, చిన్న పిల్లల్ని ముసలాళ్ళకిచ్చి పెళ్ళి చెయ్యడం కూడా మంచిదే అని నేను వాదిస్తాను.

వెంకటే : సుబ్బిని లుబ్ధావధాన్లకి యివ్వడం మంచిదంటరా ఏమిటి ? అమ్మ ఆ సమ్మంధం చేస్తే నూతులో పడతానంటూందే ?

గిరీ : ఫెమినైన్సు ఫూల్సన్నాడు. "పడు పడు అన్న నా సవితే గాని పడ్డ నా సవితి లే"దంది టెవర్తోను. నూతులోపడడం, గీతులో పడడం నాన్సెన్స్. ఓ రెండు తులాల సరుకోటి మీ నాన్న చేయించి ఇచ్చా'డంటే, మీ అమ్మ ఆ మాట మానేస్తుంది, గాని నా ఆర్గ్యుమెంటు విను.

వెంకటే : యేవిఁటండి ?

గిరీ : పెళ్ళనే వస్తువ శుభవాఁ. అశుభవాఁ ? మంచిదా. చెడ్డదా ? చెప్పు.

వెంకటే : మంచిదే!

గిరీ : వెరీగుడ్! పెళ్ళ'నేది మంచి పదార్థవైఁతే "ఆధికస్య అధికం ఫలం" అన్నాడు గనక చిన్నపిల్లని ఒక ముసలాడికి పెళ్ళి చేసి, వాడు చస్తే మరోడికి, మరోడు చస్తే మరోడికి, యిలాగ పెళ్ళి మీద పెళ్ళి, పెళ్ళి మీద పెళ్ళి అయి, వీడి దగ్గిరో వెయ్యి, వాడి దగ్గిరో వెయ్యి, మరోడి దగ్గిర మరో వెయ్యి, రొట్టెమీద నెయ్యి, నేతిమీద రొట్టెలాగ యేకో్త్రవృద్ధిగా కన్యాశుల్కం లాగి, తుదకు నాలాంటి బుద్ధివంతుణ్ణి పెళ్ళాడితే చెప్పావ్ మజా ? ఇహసౌఖ్యం పూర్తిగా లభిస్తుంది. ఇహసౌఖ్యం వుంటే పరసౌఖ్యం కూడా సాధించావేఁ అన్నమాట. యలాగో తెలిసిందా ? ఈజ్‌మెంట్ హక్కు యష్టాబ్లిష్ అవుతుంది.

వెంకటే : కన్యాశుల్కం కూడా మంచిదంటున్నా రేవిఁటి ?

గిరీ : మరేవిఁటనుకున్నావ్ ? నెవ్వెర్థ్గా బై హోప్సన్నాడు. చేస్తే శుద్ధక్షవరమేగాని తిరుపతి మంగలాడి క్షవరం చెయ్యకూడదు. యీ అస్త్రంతోటే, మీ తండ్రి

వశ్యం అయినాడు. యింగ్లీషువాడు "థింక్" అన్నాడోయి. ఆలోచిస్తేగాని నిజం బోధపడదు. బాగా ఆలోచించగా కన్యాశుల్కలం లేని మా'రేజే యీ భూప్రపంచంలో లేదు. విన్నావా ?

వెంకటే : యెలాగండి ?

గిరీ : అలా అడగవోయి! ఏం ? డబ్బుచ్చుకుంటేనే కన్యాశుల్క వయిందేం ? యిన్ని తులాలు బంగారం పెట్టాలి, యింత వెండి పెట్టాలి అని రూపాయలకి బదులుగా వెండి, బంగారాల కింద ధనం లాగితే, కన్యా శుల్కం అయిింది కాదేం ? యీ పెద్ద పెద్ద పంతుళ్ళ వారంతా యిలా చేస్తూన్నవారేనా ?

వెంకటే : అవును.

గిరీ : యిక దొరల్లోనో ? వాళ్ళ తస్సాగొయ్యా, యిల్లు గుల్లచేస్తారోయి! అవి గుడ్డలు కావు. అవి శెంట్లు కావు, అవి జూయల్సు కావు. మా'రియేజి సెటిల్‌మెంటని బోలెడు ఆస్తి కూడా లాగుతారు. యీ ఆర్గ్యుమెంటు నేను చెప్పేసరికి నీ తండ్రి బ్రహ్మానంద భరితుడైనాడు. లుబ్ధావధాన్లు పెళ్ళికి అన్నిటికన్న పెద్ద సవబొకటి నీకు చెబ్తాను విను.

వెంకటే : ఏవిఁటండి ?

గిరీ : లుబ్ధావుఁధాన్లు ముసలాడూ, బంగార ప్పిచ్చికాన్ను. రెండేళ్ళకో, మూడేళ్ళకో అమాంతంగా బాల్చీ తన్నేస్తాడు. అనగా "కిక్స్ ది బకెట్." దాంతో నీ చెల్లెలు రిచ్చి విడో అవుతుంది. నువ్వు పెద్దవాడివైన తరువాత దానికి విడో మా'రియేజి చేసి శాశ్వతమైన కీర్తి అతి సులభంగా సంపాదించవచ్చును, యేవఁంటావ్ ?

వెంకటే : అవును.

గిరీ : మరో గొప్పమాట! యీ సంబంధం అయితే నీకూ, నాకూ సంబంధం కలుస్తుందోయి.

వెంకటే : అది నా కిష్టవేఁ.

గిరీ : రాత్రి నీ తండ్రి, నీకు హైకోర్టు వకాల్తీదాకా చదువు చెప్పిస్తానన్నాడు!

ప్రస్తుతోపయోగం పుస్తకాలమాట కదిపానుగాని, పెళ్ళి నుంచి వచ్చిం తరువాత ఇస్తానన్నాడు. యీ లోగా చుట్టముక్కల్లేకపోతే గుడ్లెక్కొస్తాయి. సిగర్సు కోసం కాపర్సేవఁయినా సంపాదించావా, లేదా ?

వెంకటే : లేదు. యీ వుదయవఁల్లా అమ్మ ధుమధుమలాడుతూనే వుంది. మా నాన్న పొడుం కోసం కొట్లో నిలవ చేసిన పొగాకులోని వో కట్ట వోణిలో దాచి తీసుకొచ్చాను.

గిరీ : దటీజ్ పోలిటిక్స్! మరి యింతసేపూ చెప్పా'వు కావేం ? చుట్టల్చుట్టుకొని యీ కోవిలగోపురంలో కూచుని కాల్చుకుందాం రా!

వెంకటే : కోవెల్లో చుట్ట కాల్చవచ్చునా ?

గిరీ : కాలిస్తే కోవిల్లోనే కాల్చాలోయి. దీని పొగ ముందర సాంబ్రాణీ, గుగ్గిలం యే మూల ? యేదీ, కట్ట యిలాతే. (కట్ట అందుకొని వాసన చూచి) ఆహా యేవిఁ పొగాకోయ్! నిజంగా కంట్రీ లైఫులో చాలా చమత్కారం వుంది ? బెస్టు టోబా'కో. బెస్టు గేదె పెరుగు. మాంచి ఘీ. అంచేతనేనోయ్ పోయట్స్ "కంట్రీలైఫ్ కంట్రీలైఫ్" అని దేవులాడుతాడు.

వెంకటే : మీరూ పోయట్సే గదా ?

గిరీ : అందు కభ్యంతరవేఁవిటి ? నాకూ కంట్రీలైఫ్ యిష్టవేఁగాని సీవఁలోలాగా బ్యూటిఫుల్ షెపర్డెస్లూ, లవ్ మేకింగూ ఉండవోయ్. గ్రాస్ గరల్సు తగు మాత్రంగా వుంటారుగాని, మా డర్టీ స్మెల్. ఆదొహటిన్నీ, మన దేశంలో మెయిడన్సు వుండరోయి. యెంతసేపూ లవ్ మేకింగ్ విడోజ్కి చెయ్యాలిగాని మరి సాధనాంతరం లేదు.

వెంకటే : మీరు విడోమీద చేసిన పొయిట్రీ రాసి యిస్తానని యిచ్చారు కాదుగదా?

గిరీ : అడగ్గానే యిస్తే వస్తువ విలువ తగ్గిపోతుంది. అదొహటిన్నీ మఠ్రెండేళ్ళు పోతేనేగాని దాని రసం నీకు బాగా బోధపడదు. అయినా స్పెషల్ కేసుగా నీకు ఉపదేశం చేస్తాను. నోటుబుక్కు తీసి రాయి.

(గిరీశం చుట్ట కాలుస్తూ, మధ్య మధ్య చుట్ట చేతపట్టి, ఒక్కొక్క ముక్క చెప్పగా వెంకటేశం వ్రాయును.)

THE WIDOW

She leaves her bed at A.M. four,
And sweeps the dust from off the floor,
And heaps it all behind the door. The widow!

Of wondrous size she makes the cake,
And takes much pains to boil and bake,
And eats it all without mistake. The widow!

Through fasts and feasts she keeps her health,
And pie on pie, she stores by stealth,
Till the town talk of her wealth. The widow!

And now and then she takes a mate,
And lets the hair grow on her pate
And cares a hang what people prate, The widow!

I love the widow... however she be.
Married again... or single free,
Bathing and praying,
Or frisking and playing,
A model of saintliness,
Or model of comeliness,
What were the earth,
But for her birth ? The widow!

యిది నేను రిఫార్మర్లో అచ్చువేసేటప్పటికి టెన్నిసన్ చూసి గుండె కొట్టుకున్నాడు. (చుట్ట తాగడం సమాప్తం చేసి) యింటికి పోదాంరా, చాలా సేపైంది. (నాలుగడుగులు యిద్దరూ నడిచేసరికి అగ్నిహోత్రావధాన్లు కలియును.)

అగ్ని : ఏవఁండీ హనుమాన్లుగారు.... మీ పేరేవిఁటండీ ?

గిరీ : గిరీశం అంటారండి.

అగ్ని : ఇదిగో, గిరీశంగారూ! రాత్రి మనవంనుకున్న ప్రకారం మన దావాలు గెలుస్తాయనే మీ అభిప్రాయవాం ?

గిరీ : గెలవకపోతే నేను చెవి కదపాయించుకు వెళ్ళిపోతాను. మీ వూహాపోహలు సామాన్యవైంనవా ? అందులో "యతోధర్మ స్తతోజయః" అన్నట్టు న్యాయం మీ పక్షం వుంది. బుచ్చమ్మగారి కేసు విషయవైం జబ్బల్పూర్ హైకోర్టు తీర్పొహటి మనకి మహాబలంగా వుంది. మా పెత్తండ్రి గారు యిలాంటి కేసే ఒహటి యీ మధ్య గెలిచారండి.

అగ్ని : దీనికల్లా అసాధ్యం యీ కేసు కాకినాళ్ళో తేవలసొచ్చింది. మా కరటక శాస్తుల్లుని పంపిస్తే యవడో చవట వకీల్ని కుదిర్చా'డు. వాడెప్పుడూ డబ్బు తెమ్మని రాయడవేంగాని కేసు భోగట్టా యేవీం రాయడు. గడియ గడియకీ వెళదావంంటే దూరాభారం గదా ?

గిరీ : మీ శలవైతే స్టీమరుమీద నేను వెళ్ళి ఆ వ్యవహారవంంతా చక్కబెట్టుకు వస్తాను. మా పెత్తండ్రిగారు కాకినాడకల్లా తెలివైన ప్లీడరు ఆయన పట్టిన కేసు యెన్నడూ పోయిందన్నమాట లేదండి.

అగ్ని : మీరు వెళితే నేను వెళ్ళినట్టే. య'ంత ఫీజయినా మీ పెత్తండ్రిగారికే వకాల్తీ యిద్దాం. యీవంంటారు ?

గిరీ : మీ దగ్గర ఫీజు పుచ్చుకోవడం కూడానాండి ? ఖర్చులు మట్టుకు మీరు పెట్టుకుంటే, ఫీజక్కర్లేకుండానే పని చేయిస్తానండి.

అగ్ని : మీరలా అంటార న్నేనెరుగుదును గాని గెలిచిం తరువాత మనకి తోచిన బహుమతీ యిద్దాం.

గిరీ : యిచ్చినా సరే యివ్వకపోయినా సరేనండి.

(బుచ్చమ్మ ప్రవేశించును)

బుచ్చ : నాన్నా! అమ్మ స్నానానికి లెమ్మంచూంది.

అగ్ని : అలాగే. (బుచ్చమ్మ వెళ్ళిపోతుండగా గిరీశం క్రీగంట చూచును) భోజనం చేసిన తర్వాత కాయితాలు మీ చేతికిస్తాను. అవన్నీ సావకాశంగా చూడండి. మా యింటి తూరుప్పారుగు రావాంవుధాన్లు మీద మందడిగోడ విషయమై

మనం తెచ్చిన దావా, లంచం పుచ్చుకుని మునసబు అన్యాయంగా కొట్టేశాడు. జడ్జీకోర్టులో అప్పీలు చేశాం: మా వకీలు అవతల పార్టీ దగ్గిర కతికి మన కేసు ధ్వంసం చేశాడు. మీ వంటివారు నాకు చెయ్యాసరా వుంటే రావాఁవుధాన్లు పిల కూడదీసేదును. కానిండిగానీ తూర్పు మందడిగోడ రావాఁవుధాన్లి దయితే పడవcటి మందడిగోడ మందవాల్నా లేదా ? న్యాయం చెప్పండి. చూడండీ, దానిమీద ఎలా కొజా యెత్తా'డో ? క్రిమిన ల్నడిపించమని భుక్త సలహా చెప్పాడు.

<u>(బుచ్చమ్మ మళ్ళీ ప్రవేశించును)</u>

బుచ్చ : నాన్నా! అమ్మ స్నానం చెయ్యమంచూంది.

అగ్ని : వెధవముండా సొద. పెద్ద మనుషుల్తో వ్యవహారము మాట్లాడుతూంటే రామాయణంలో పిడకల వేట్లాటలాగ అదే పిలవడవాఁ ?

గిరీ : తప్పకుండా క్రిమినల్కేసు తా'వలసిందే. క్రిమినల్ప్రోశిజ్యూర్ కోడు 171 శక్షను ప్రకారం తెద్దావాఁ ? 172 డో శక్షను ప్ర'కారం తెద్దావాఁ ?

అగ్ని : రెండు శక్షన్లూ తా'లేవేఁ ?

గిరీ : నేరంగల ప్ర'వేశం, ఆక్రమణ.... రెండు శక్షన్లూ కూడా ఉపచరిస్తాయి సరేగదా, కళ్ళతో చూశాను గనుక ఈ గోడమీదయినట్టు జల్లీల్తెగపొడిచి సాక్ష్యం కూడా పలగ్గలను. యీ గోడ స్పష్టంగా మీదాన్లాగే కనబడుతూంది.

అగ్ని : అందుకు సందేహం వుందండీ ? ఏమరిచి ఇన్నాళ్లు వూరుకున్నాను. పెరటిగోడ కూడా చూతురుగాన్రండి. అక్కాబత్తుడి ముక్కు నులిపి గెల్చుకున్నాను. కాని యీ దావాలకింద సిరిపురంభూవిఁ అమ్మెయ వలసి వచ్చిందండి, రావాఁవుధాన్లు కేసుగూడా గెలిస్తే ఆ విచారం నాకు లేకపోవును.

<u>(అందరు నిష్క్రమింతురు)</u>

తృతీయాంకము

1వ స్థలము : రామచంద్రపురం అగ్రహారంలో రామప్పంతులు యింట్లో సావిట్లో గది.

(మధురవాణి ప్రవేశించును)

మధుర : ఈ రామప్పంతులు కథ పైకి పటారం. లోపల లొటారంలా కనిపిస్తూంది. భూవుఁలన్నీ తాకట్టుపడి వున్నాయట; మరి రుణం కూడా పుట్టదట. వాళ్ళకీ, వీళ్ళకీ జుట్టు ముడేసి జీవనం జేస్తూన్నాడు. యీ వూరు వేగం సంవరించి చెయ్ చిక్కినంత సొమ్ము దక్కించుకొని పెందరాళే మరో కొమ్మ పట్టుకోవాలి. (పాడును) "తెలియక మోసపోతినే, తెలియక" (పాడుతుండగా రామప్పంతులు ప్రవేశించును.)

రామ : యేవిఁటో ఆ మోసపోవడం ? తరవాత ముక్కేవిఁటి, పాడూ.

మధుర : తరవాత ముక్కేవుంది ? మిమ్మల్ని నమ్మి మోసపోయినాను.

రామ : అదేం అలా అంటున్నావు ? నిన్ను మోసపుచ్చలేదే ? నిర్ణయం ప్ర'కారం రెండొందలూ పట్నంలో యిచ్చాను. నెల జీతం నెలకు ముందే యిచ్చాను. యిహ మోసవేఁవుంది ?

మధుర : యేం చిత్రంగా మాట్లాడుతారు పంతులుగారూ! నాకు డబ్బే ప్రధానవైఁనట్టు నీ మనసుకి పొడగడుతూంది కాబోలు. నాకు డబ్బు గడ్డిపరక. మీ భూవుఁలు రుణాక్రాంతవైఁనాయని అప్పట్లో నాకు తెలిసుంటే మీ దగ్గిర రెండొందలూ పుచ్చుకొందునా ? మీరు ఖర్చువెచ్చాలు తగ్గించుకొని సంసారం బాగు చేసుకోకపోతే నేను మాత్రం వొప్పేదాన్ని కాను. ఫలానా పంతులుగారు ఫలానా సాన్నుంచుకొని బాగుపడ్డారంటేనే నాకు ప్రతిష్ఠ, మా ఇంటి సాంప్రదాయం ఇది పంతులుగారూ! అంతే గాని లోకంలో సాన్ల మచ్చుని వూహించకండి.

రామ : భూవుఁలు తణఖా అన్న మాట శుద్ధ అబద్ధం. యవరన్నారో గాని; నేను మహారాజులా ఉన్నాను.

మధుర : నా కంటికి మహారాజులా కనపడబట్టే యిట్లా ఇల్లూ వాకిలీ వొదిలి మానం ప్రా'ణం మీ పాలుచేసి నమ్మి మీ వెంట వొచ్చా'ను. నన్ను మోసం మాత్రం చెయ్యకండి. మిమ్మల్ని పాపం చుట్టుకుంటుంది.

రామ : నేను మోసం చేసే మనిషి నేనా ?

మధుర : అలాగయితే లుబ్ధావధాన్లుగారికి పెళ్ళెందుకు కుదిర్చారు ? నాకు తెలియదనుకున్నారా యేవిఁటి ? ఆ ముసలాడికి పెళ్ళెందుకు ? మీ కోసమే యీ యెత్తంతాను.

రామ : ఆహా! హా! హా! యిదా అనుమానం! కొంచెం గెడ్డం నెరుస్తూంది. నన్ను కూడా ముసలాణ్ణంటావా యేవిఁటి ?

మధుర : చట్లకి చావ నలుపు. మనిషికి చావ తెలుపూ, అనగా చీకట్లో నక్షత్రాల్లాగా అక్కడక్కడ తెల్ల వెంట్రుక తగిల్తేనే చమక్.

రామ : స్వారస్యం మా చమత్కారంగా తీశావ్! యేదీ ముద్దు (మధురవాణిని ముద్దెట్టుకోబోవును.)

మధుర : (చేతులతో అడ్డి ముఖము ఓరజేసుకొని) వేళాపాళా లేదా ? లుబ్ధావధాన్లు పెళ్ళి తప్పించేస్తేగాని నేను ముద్దు పెట్టుకోనివ్వను.

రామ : అంతా సిద్ధవైఁం తరవాత నా శక్యమా ఆపడానికి ? (బలాత్కారంగా ముద్దు పెట్టుకొనును.)

మధుర : సత్తు వుందనా మోటుతనం ?

రామ : నా సత్తు విప్పుడేం జూశావ్! చిన్నతనంలో ధ్వజస్తంభం దండతో కొడితే గణగణమని గంటలన్నీ ఒక గడియ వాగేవి. నాకు జబ్బు చేసిందగ్గర్నుంచీ డీలా అయిపోయినాను.

మధుర : యిదా డీలా ? నా చెయి చూడండి యలా కందిపోయిందో ? అన్నా, మోటుతనం.

రామ : చాప చిరిగినా చదరంతని, నీ ప్రాణానికి యిప్పటి సత్తువే ఉద్దోలుంలా కనబడుతూంది.

మధుర : ఈ పెళ్ళి మాన్పించకపోతే నేను మీతో మాట్లాడను.

రామ : వెఱ్రి కుదిరింది. రోకలి తలకి చుట్టమన్నాట్ట! రెండేళ్ళాయి ఆ ముసలి గాడిద'కొడుకు మీద నా లౌక్య ప్ర'జ్ఞంతా వినియోగపర్చి పెళ్ళి సిద్ధం చేసి, యిప్పుడెలా తప్పించడం ?

మధుర : ఏం లౌక్యం చేశారు ?

రామ : అలా అడుగు. నా బుద్ధి సత్తువ కూడా నీకు తెలుస్తుంది. లుబ్ధావధాన్లు పరమ లోభి. వాడి గుణం యిలా వుండబోతుందని పోల్చారేమో అన్నట్టు చిన్నతనంలో వాడికీపేరు పెట్టారు. పెళ్లాడితే వొల్లమాల్ని ధనం వొస్తుందని ఆశ పెట్టించాను.

మధుర : యలా చేశా రీ మహాచిత్రం ? పెళ్ళయితే ధనం ఖర్చౌతుంది గాని, రావడవెఁలాగ ?

రామ : లౌక్యవఁంటే మరేవిఁ టనుకున్నావు ? అసాధ్యాలు సాధ్యం, సాధ్యాలు అసాధ్యం చేయడమే కదూ! మన సిద్ధాంతిని దువ్వేటప్పటికి వాడేం చేశాడనుకున్నావు ? లుబ్ధావధాన్లు జాతకం యగాదిగా చూసి శీఘ్రంలో వివాహ యోగ వుఁందన్నాడు. ఆ వివాహం వల్ల ధనయోగ వుఁందన్నాడు. దాంతో ముసలాడికి డబ్బొస్తుందన్న ఆశ ముందుకి, డబ్బు ఖర్చౌతుందన్న భయం వెనక్కీ లాగడం ఆరంభించింది. ఇంతట్లో పండాగా రిక్కడికొచ్చారు. ఆయన్నికూడా తయారుచేశాను. లుబ్ధావధాన్లు అనుమానం తీర్చుకుందావని ఆయనికి జాతకం చూపించేసరికి పండాగారు యేమన్నారూ ? వివాహ ధనయోగాలు జవిలిగా వున్నాయి. అయితే, మీరు పెద్దవాళ్ళు. ఇప్పుడు మీకు పిల్లనెవరిస్తారు ? పెళ్ళెలా అవుతుంది? యిలాంటివి జరగడానికి వీల్లేని మహాయోగాలు, జాతకాల్లో పట్టినప్పుడు గొప్ప మేలుకు బదులుగా గొప్ప కీడు సంభవిస్తుంది. అనగా మీకు మార్కవోఁ, ధననష్టవోఁ సంభవిస్తుంది. గ్రహశాంతి చేసి బ్రాహ్మణ భోజనం బాహుళ్యంగా చెయ్యండి. కొంత జబ్బో గిబ్బో చేసి అంతటితో అరిష్టం పోతుంది. మంచిరోజు చూసి సూర్య నమస్కారాలు ఆరంభించండి" అని చెప్పేసరికి అవుధాన్లు గుండ రెండు చెక్కలై వివాహ ప్రయత్నం ఆరంభించాడు. యిదీ కథ.

మధుర : యేమి కల్పన ?

రామ : యింకా వుంది. యిహను కృష్ణారాయపురంలో అగ్నిహోత్రావధాన్లు కూతురు జాతక వెఁలావుందట, చెప్పడానికి అలవిలేదు. అది కాలుపెట్టిన యిల్లు పది యిళ్లౌతుందట. అది పట్టిందల్లా బంగార వౌఁతుందట.

మధుర : నిజవేఁనా లేక అదీ మీ బనాయింపేనా ?

రామ : అది మట్టుకు నా బనాయింపు కాదు. అగ్నిహోత్రావధాన్లే జాతకం అలా బనాయించాడు. మా బ్రాహ్మల్లో యిది పరిపాటే. పెళ్లిళ్ళలో పంపించేది ఒహ జాతకవూఁ నిజం వుండదు.

మధుర : యేమ్మోసం!

రామ : లౌక్యం, లౌక్యవఁను.

మధుర : రెండింటికీ యేవిఁటో భేదం!

రామ : నమ్మించోట చేస్తే మోసం, నమ్మంచోట చేస్తే లౌక్యవూఁను.

మధుర : తాను చేస్తే లౌక్యం! మరోడు చేస్తే మోసం అనరాదా ? అబద్ధానికి అర్థవేఁవిటి ?

రామ : యావఁన్నావూ ? అబద్ధవఁనా ? ఉద్యోగ ధర్మం లౌక్య వృత్తి అని, అది ఒక వృత్తి భగవంతుడు కల్పించాడు. ఆ లౌక్య వృత్తి యెటువంటిది ? నిజాన్ని పోలిన అబద్ధవాఁడి ద్రవ్యాకర్షణ చేసేది. యీ ధర్మసూక్ష్మాలు నీకెలా తెలుస్తాయి ?

మధుర : నాకెలా తెలుస్తాయి, నిజ'వేగాని, ద్రవ్యాకర్షణ యలాగ యీ పెళ్ళివల్ల ?

రామ : (తనలో) క్రాసెగ్జామినేషను చేస్తూందోయి. దీం తస్సాగొయ్యా! (పైకి) నీకు మేజువాణి నిర్ణయించుకున్నాను కానూ, నీకు పది రూపాయల సొమ్ము దొరకడం ద్రవ్యాకర్షణ కాదా!

మధుర : యేం చిత్రవైన మనుష్యులు పంతులుగారూ! (తమలపాకుచుట్టతో కొట్టి) నేను రాబోతానని రెండేళ్ళ కిందట కలగని, యీ కాబోయే మేజువాణి బుద్ధిలో వుంచుకుని యీ పెళ్ళి కావడానికి విశ్వ ప్రయత్నం చేశారూ ? ద్రవ్యాకర్షణ యలాగో నాకు బోధపడ్డది. పెళ్ళి కూతుర్ని యిలాకా చేసుకుని

దాంద్వారా ముసలాడి మూటా, ముళ్ళా లాగేస్తారు. యంత సత్యకాలప దాన్నయినా ఆ మాత్రం ఊహించుకోగల్ను. లేకపోతే నే యంత బతిమాలుకున్నా యీ పెళ్ళి తప్పించకపోవడవేఁవిఁ ? మీ బుద్ధికి అసాధ్యం వుందంటే నమ్ముతానా?

రామ : ఆమాట్ని'జవేఁగాని, అన్ని పనులూ ద్రవ్యాకర్షణ కోసవేఁ చా'స్తానను కున్నావా యేవిఁటి ? ఆ ముసలాణ్ణి కాపాడదావఁనే యీ పెళ్ళి తలపెట్టా'ను.

మధుర : "చిత్రం చిత్రం మహాచిత్రం" అని కథుంది. అలా వున్నాయి, మీ చర్యలు!

రామ : ఆ కథేదో చెబుదూ, నా క్కథలంటే మా సరదా.

మధుర : పొగటిపూట కథలేవిటి! ముందు యీ చిత్ర కథేవిఁటో శలవియ్యండి.

రామ : అది చెప్పేదికాదు, చెప్పను.

మధుర : చెప్పకపోతే వొప్పను.

రామ : ఒప్పకేం జేస్తావు ?

మధుర : యేం జేస్తానా ? యీ జడతో కొడతాను. శాస్త్రంలో కాముకులకు జెప్పిన ఆయుధవిఁది.

రామ : నేను దెబ్బలకి మనిషిని కాను. శాస్త్రం, గీస్త్రం వొకపక్క నుంచి మోట సరసం మాను. చెప్పమంటే చెబుతాను గాని అలాంటి కబుర్లు నువ్వు వినకూడదు. మరేం లేదు, లుబ్ధావధాన్లు వెధవ కూతురు మీనాక్షి ప్రవర్తన మంచిది కాదు. నాల్రోజుల కొహమారు అది పీకల మీదికి తెస్తూంటుంది. పోలీసువాళ్ళు బెదిరించి పది డబ్బులసొమ్ము లాగేస్తూంటారు. డబ్బు ఖర్చంటే ముసలాడికి ప్రాణపోకట. సంసారం కూడా మీనాక్షి దూబర చేస్తుందంటాడు. పెళ్ళయితే దాని ఆట కడుతుంది.

మధుర : మీనాక్షి ప్రవర్తన బాగుందికాదంటూ మీరే చెప్పాలి ? మీరు కంటపడ్డ తరవాత యే ఆడదాని ప్ర'వర్తన తిన్నగా వుంటుంది ?

రామ : అదుగో చూశావా ? అలా అంటావనేకదూ చెప్పనన్నాను.

మధుర : ఈ చిక్కులు నాకేం తెలియవు. పెళ్ళి మానిపిం చెయ్యండి.

రామ : యీ పెళ్ళిలో నీ మేజువాణీ పెట్టి పదిరాళ్ళిప్పిస్తాను. మాటాడ కూరుకో.

మధుర : (ముక్కుమీద వేలుంచుకుని) లుబ్ధావధాన్లు యదట నేను మేజువాణీ ఆఁ?

రామ : పేరు వాడు గాని, సభలో పెద్ద న్నేనేకదూ ?

(హెడ్ కనిష్టీబు చుట్ట కాలుస్తూ ప్రవేశించి కుర్చీమీద కూర్చుండును.)

హెడ్ : రావఁప్పంతులూ! యినస్పెక్టరికే టోపీ వేశావటే ?...

రామ : (హెడ్ కానిస్టేబు చెవిలో) గారూ గారూ అనవయ్యా!

హెడ్ : యెప్పుడూ లేంది గారేవఁటి, గీరేవిఁటి, చింతగారూ ?

రామ : ఆడవాళ్ళున్న చోటికి తోసుకు రావటవేఁనా, అన్నా ?

హెడ్ : ఆడవాళ్ళంటున్నావు. నువ్వు కూడా అందులోనే జమా యేవిఁటి! అహా! హా!

రామ : హాస్యానికి వేళాపాళా వుండాలి.

హెడ్ : నేను హాస్యం కోసం రాలేదు. యినస్పెక్టరు పేరు చెప్పి రావిఁనాయడి దగ్గర పాతిక రూపాయల్లాగా'వట. యిలా యందరి దగ్గిర లాగా'డో రావఁప్పంతుల్ని నిలుచున్న పట్టాన్ని పిలకపట్టుకు యీడ్చుకు రా అని నాతో ఖచ్చితంగా చెప్పి ఇనస్పెక్టరు పాలెం వెళ్ళిపోయినాడు.

రామ : చిన్నప్పుడు వొక్క బళ్ళో చదువుకున్నాం ఇనస్పెక్టరూ, నేనూను. అంచా'త అతని పిలక నేనూ, నా పిలక అతనూ లాగినా ఫర్వాలేదు. రావిఁనాయడి మాట మాత్రం శుద్ధాబద్ధం. మీరు ముందు పదండి. గుఱ్ఱం కట్టించుకుని స్టేషను దగ్గిర కలుస్తాను.

హెడ్ : నేనెలా వొస్తాను నీ తోటి! నాకు వొల్లమాల్న పనుంది. ఒక కనిస్టీబుని నీతో పంపిస్తాను.

రామ : (హెడ్ చెవిలో) నా యింట్లో మాత్రం నకార ప్రయోగం చెయ్యకు. నీ పుణ్య వుంటుంది.

హెడ్ : అదా నీ ఘోష! అలా క్కానియి. (నిష్క్రమిస్తాడు)

రామ : (తనలో) అదుగో మళ్ళీ ఏకవచనవేఁ కూస్తాడు! (పైకి) యవఁడ్రా అక్కడ.

నౌఖ : (ప్రవేశించి) సిత్తంబాబు.

రామ : గుర్రం కట్టమను.

నౌఖ : సిత్తంబాబు. (నిష్క్రమించును)

రామ : చూశావూ మధురవాణీ ? నే న్నిలబడ్డచోట రూపాయలు గలగర్లాల్తాయి. యీ యినస్పెక్టరుగాడికి యీ తాలూకాకి వొచ్చిం తరవాత అయిదారువేలు యిప్పించాను. వీథి తలుపు వేసుకొని సంగీత సాధనం చేసుకో. విద్యవంటి వస్తువు లేదు. (గుమ్మం దాటి నాలుగడుగులు వెళ్ళి తిరిగివచ్చి) అప్పుడే వీణ తీశావు ? మా వూళ్ళో మా దుర్మార్గులున్నారు. నా స్నేహితులవఁనీ, బంధువులవఁనీ పేరు పెట్టుకొస్తారు. రానీకుసుమా! (తలుపు పైనించి వేసి) గడియ వేసుకో. (నిష్క్రమించును.)

2వ స్థలము : రామప్పంతులు యింట్లో పడక గది.

(మధురవాణి తివాసీమీద కూచుని వీణ వాయించుచుండును. వాయిద్యం ముగించి)

మధు : విద్య వంటి వస్తువు లేదు. నిజమే – ఒక్కటి తప్ప. అదేవిటి ? విత్తం. డబ్బు తా'ని విద్య దారిద్ర హేతువు. యీ వూళ్లో నారదుడు వొచ్చి పాడితే నాలుగు దమ్మిడీ లివ్వరు. గనుక యీ వీణ యిటు పెడదాం. హెడ్డు కనిస్టీబు సౌఁజ్ఞ చేసి వెళ్ళాడు. అతడు యిచ్చేది, చచ్చేది లేదు గాని, జట్టీ లేవైనా వొస్తే ఓ వొడ్డు కాస్తాడు.

(వీథి తలుపు తట్టబడును)

మధు : వొచ్చా'డు కాబోలు! (తలుపు దగ్గిరికి వచ్చి) యవరు మీరు ? బంధువులా?

(తలుపవతల కరటకశాస్త్రుల్లు, కన్యవే'షంతో శిష్యుడున్నూ)

కర : ఆపద కడ్డంబడ్డవారే బంధువులు. మేమ్మీకు బంధువలం కావుఁగాని, మీరు మాకు బంధువులు కాగర్లు.

మధు : నా'స్తులా ?

కర : (తనలో) యీ కంఠం విన్నట్టుంది. (పైకి) నా'స్తం కట్టడానికే వొచ్చాం.

మధు : దేంతో కడతారు ?

కర : (తనలో) యీ వేశ్య మధురవాణి కాదు కదా ? కంఠాన్ని పోలిన కంఠం ఉండకూడదా ? (పైకి) నా'స్తం కట్టడానికల్లా వున్నది వక్కటేగదా–టంకం?

మధు : ఏమిటో ఆ టంకం ?

కర : బంగారం!

మధు : మా పంతులుగారికి మీరు నా'స్తులూ, బంధువులూ కూడా కాకపోతే తలుపు తియ్యోచ్చును. (తలుపు తియ్యును)

కర : (తనలో) అరే! మధురవాణే!

మధు : (ముక్కు మీద వేలుంచుకుని) చిత్రం!

కర : యేవిఁటి చిత్రం ?

మధు : యీా వేషం ?

కర : ఉదర నిమిత్తం బహుకృత వేషం! యిది దేవుడిచ్చిన వేషవేఁను.

మధు : నా దగ్గిరేనా మర్మం ? యీా పిల్లెవరో ?

కర : నా కొమార్త.

మధు : నాటకవఁల్లా చెడి పొగటి వేషాల్లో దిగిందా ? పెట్టిపుట్టారు గదా యేల యీా అవస్థ ?

కర : నీ దయవల్ల దేవుడిచ్చిన స్థితికేం లోపం రాలేదు. నిన్ను చూద్దామని వొచ్చాను.

మధు : యిన్నాళ్ళకైనా యీా దీనురాలు మీకు జ్ఞాపకం రావడం అదెంతగాదు ?

కర : నీలాంటి మనిషి మళ్ళీ వుందా ? నిన్ను చూడ్డం బ్రహ్మానందం కాదా ? నీ దగ్గరికి రావడం చేదనా యిన్నాళ్ళూ రాలేదనుకున్నావు ? డిప్టీ కలక్టరుగారి కుమారరత్నంగారు నిన్ను చేపట్టా'రని తండ్రికి తెలిసిం తరవాత నేనుగానీ నీ యింటికి వొస్తే పీక ఉత్తరించేస్తాడేమో అనే భయం చాత కొంచెం యడబెట్టి, యితడికి యెప్పుడు బదిలీ అవుతుంది. మా మధురవాణ్ణి యెప్పుడు చూస్తాను. అని దేవుణ్ణి సదా ప్రార్థిస్తూ వుంటిని. నువ్విక్క డెన్నాళ్ళాయి వున్నావు ?

మధు : డిప్టీ కలక్టరుగారి కుమారరత్నంగార్ని తండ్రి, చదువుపేరు పెట్టి, చన్నపట్టం తరిలిన రెండు నెల్లదాకా ఆయన నా'స్తుడు గిరీశంగారి ద్వారా డబ్బు పంపించా'డు. ఆ తరవాత మొన్నటిదాకా గిరీశంగారు నన్ను వుంచా'రు

గాని డబ్బుకి యటాముటీగా వుండేది. నా యింటికి వొచ్చినవాడల్లా తన కొడుక్కి దోస్తీ అయివుంటాడని డిప్టీ కలక్టరు అనుమానిస్తాడేమో అని పేరుగల వాడెవడూ నాయింటికి రావడం మానేశాడు. సంజీవరావు గారి అల్లరి కొంచెం మరుపొచ్చిందాకా పైనుందావఁని యీ వూరొచ్చాను.

కర : (ముక్కుమీద వేలుంచుకుని) గిరీశం నిన్నుంచుకున్నాడా ? మా మేనల్లుడికి చదువు చెప్పడానిక్కుదురుకొని మా వాళ్ళింటో చేరా'డు. వాడికి పెందరాళే ఉద్వాసన చెప్పాలి.

మధు : (ముక్కుమీద వేలుంచుకొని) నా దగ్గిరకు వచ్చిన వాడల్లా చెడిపోయినాడో? నా దగ్గిరకు మీరు రాకుండా అవరోధం కలిగిందని యిప్పుడే డిప్టీ కలక్టరుగార్ని తిట్టా'రే. ఆయన కంటే మీ న్యాయం యేం బాగా వుంది ? నా దగ్గిరకు వచ్చినందుకు మీ భార్యగారు ముందు మిమ్మల్ని మెడ పట్టుకొని యింట్లోంచి తరవ్వఁలిసింది. తనకు రొట్టా, ఒహడికి ముక్కానా?

కర : క్రియలలో అంతవరకు జరక్కపోయినా మాటలో ఆ మర్యాద హమేషా నాకు జరుగుతూనే వున్నది.

మధు : (చిరునవ్వుతో) యీ యిల్లాలు మా పంతులు కంటపడితే యీవిడ' గుట్టు బట్టబయలౌతుంది.

కర : యిల్లా అనేస్తున్నావేం అప్పుడేను ? కన్నెపిల్ల. దీన్ని పెండ్లి చేయడానికే, నీ దగ్గిరకి తీసుకొచ్చాను.

మధు : మా పంతులకేనా పెళ్ళి ?

కర : "ఏకనారీ సుందరీ వాదరీవా" అన్నాడు. త్రిలోక సుందరివి నువ్వు దొరికిం తరవాత నీ పంతులుగారికి యింకా పెళ్ళెందుకు ?

మధు : ఐతే, మరెవరికి పెళ్ళి చెయ్యడం ? నాకా యేమిటి ? అలాగైతే, సైయేఁ. మొగవేషం వేసుకొని, పెళ్ళి పీటలమీద కూర్చుంటాను. యిలాంటి పెళ్లాం దొరకడమెఁలాగ. జగత్ప్రసిద్ధులైన కరటకశాస్త్రుల్లుగారి అల్లుణ్ణి కావడం యెలాగ ? దివ్యసుందర విగ్రహమని పొగడగానే నా భుజాలు పొంగుతాయనుకున్నారు కాబోలు! యీ పిల్ల దగ్గర నా బోట్లు దివిఁటీ ముందర దీపాలు. ఆడది మెచ్చిందే అందం! మొగాడి కన్ను మసక. మీకేం తెలుసును. మరి నా పెళ్ళాన్ని నాకిచ్చేసి మీ తోవన మీరు వెళ్ళండి. (శిష్యుడి చెయ్యిపట్టి లాగును.)

శిష్య : చూశావురా నాన్నా, యలా పట్టుకుందో ?

మధు : (ఆపుకోలేకుండా నవ్వుతూ) శాభాషు! యిదేనా పెద్దమనిషి తరహా! యిరుగు పొరుగమ్మ లేవంటారో మొగుడు పిలిస్తే వెళ్ళకుంటేను.

శిష్య : కొడుతుంది కాబోల్రా నాన్నా, యింటికెళ్ళిపోదాం రా!

మధు : యేం నంగనాచివే! తరువాత పెళ్ళి చేసుకుంటాను. అందాకా ముద్దియ్యి. (ముద్దెట్టుకొనును)

కర : నేరని పిల్లని చడగొడుతున్నావు.

మధు : నాలాంటివాళ్ళకి నూరు మందికి నేర్పి చెడగొట్టగలడు. ఎవరి శిష్యుడు ? ఈ కన్నెపిల్ల నోరు కొంచెం చుట్ట వాసన కొడుతూంది.

కర : అంచాతే కాబోలు డబ్బీలో చుట్టలు తరచు మాయమౌఁతూంటాయి. మధురవాణీ! దేవుణ్ణాకు నిన్ను చూపించాడు. పంతుల్లేని సమయం కనిపెట్టి వొచ్చాను. మళ్ళీ అతనొచ్చేలోగా నా మాటలు నాలుగూ విని, మాకు వొచ్చిన చిక్కు తప్పించు.

మధు : మీ కొచ్చిన చిక్కేవిఁటి, నేను చెయ్యగలిగిన సహాయవేఁవిటి ?

కర : చిక్కన్నా చిక్కు కాదు. విను. యీ వూళ్ళో గిరీశం పెత్తల్లి కొడుకు లుబ్ధావుధాన్లని ఓ ముసలా'డున్నాడు. వాడికి మా మేనగోడల్నివ్వడానికి మా బావ నిశ్చయించాడు. ఈ సంబంధం చేస్తే నా చెల్లెలు నూతులో పడతానని వొట్టేసుకుంది. యేం వుపాయం చా'స్తావో, దాని ప్రాణం కాపాడాలి.

మధు : యీ పిల్లని అంతకి తక్కువ సొమ్ముకి అమ్మితే, లుబ్ధావుధాన్లు చంకలు గుద్దుకొని చేసుకుంటాడు. అతని దాకా యెందుకు ? నేనే కొనుక్కుంటాను.

కర : చూపితే అందుకుపోయేదానికి నీకు మిక్కిలి చెప్పాలా యేవిఁటి ?

మధు : ఇదివరకే నిర్ణయమైన సమ్మంధం యేమ్మిష పెట్టి తప్పించడం ?

కర : నీ బుద్ధి కసాధ్యం వుందా ? డబ్బు కసాధ్యం వుందా ?

మధు : బుద్ధికి అంతా అసాధ్యమేగాని, డబ్బుకి యక్కడా అసాధ్యం లేదు. యీ పెళ్ళిలో మా పంతులుకో పదిరాళ్ళు దొరుకుతాయనుకుంటున్నాడే ?

కర : నా సంబంధం చేసుకుంటే నేను యిరవై రాపాషాణాలు యిస్తాను.

మధు : సరేగాని, నాటకంలో ఎంత హాస్యమైనా చెల్లుతుంది. నటనలోకి హాస్యం తెస్తే యేవిఁ మూడుతుందో ఆలోచించారా ?

కర : మధ్య నీకొచ్చిన ఫర్వా యేవిఁటి, నా కొచ్చిన ఫర్వా యేవిఁటి ? యీ కత్తెర మీసం కత్తెర గెడ్డం కడిగేసుకుని నా తోవని నేను వెళతాను. యీ కోక నీ దగ్గిర పారేసి మా శిష్యుడు వెళతాడు. ఆ తరవాత యిదేవిఁటమ్మా యీ చిత్రవఁని నువ్వూ నలుగురమ్మలక్కలతో పాటు ఆశ్చర్యపడుదువు గాని, మీ పంతులుతో సిఫార్సు చేసి యీ మంత్రం యెలా సాగిస్తావో గట్టి ఆలోచన చెయ్యి.

మధు : మా పంతులు వక్కడివల్లా యీ పని కానేరదు.

కర : మరి యింకా యెవరి కాళ్ళు పట్టుకోవాలో చెప్పు.

మధు : మా పంతులుతో మాట్లాడ్డం ఐన తరవాత అవధాన్లు కూతురు మా నా'స్తం మీనాక్షిని తండ్రికి తెలియకుండా చూసి ఓ రెండు కాసులు యిస్తానని చెప్పండి. ఆపైని సిద్ధాంతిని చూసి అతనికీ అలాగే ఆశ పెట్టండి. ఈ పనికి సిద్ధాంతే కీలకం. నేను తెర వెనకనించి సమయోచితంగా హంగు చా'స్తాను.

కర : నీ మాట వేరే నే చెప్పాలా ? నిన్ను సంతోష పెట్టడం నా విధి.

మధు : ఆ మాట మీరు శలవివ్వడం నాకు విచారంగా వుంది. వృత్తిచేత వేశ్యని గనుక చెయ్యవలసినచోట్ల ద్రవ్యాకర్షణ చేస్తానుగాని, మధురవాణికి దయాదాక్షిణ్యాలు సున్న అని తలచారా ? మీ తోడబుట్టుకి ప్రమాదం వొచ్చినప్పుడు నేను డబ్బుని ఆశిస్తానా ? యెటుంచి యెటొచ్చినా కాపాడతాడు. హెడ్ కనిస్టీబుకి మాత్రం కొంత నిజం చెపుదాం. అతగాడు ఇప్పుడే వస్తాడు. మాట్లాడతాను. మీరు యిక్కడ కూచోండి.

కర : స్వాధీనుడేనా, కొంప ముంచడుగదా ?

మధు : గులాం (నిష్క్రమించును)

కర : కూచుందాం రా.

శిష్యు : నా పేరేవింటండోయి ?

కర : కొంప ముంచుతావు కాబోలు, సుబ్బి! సుబ్బి! మధురవాణ్ణి చూడగానే మతిపోయిందా ఏవింటి ?

శిష్యు : దాని నవ్వు పట్టుబడాలని నిదానిస్తున్నాను.

కర : సబ్బు అన్నమాట జ్ఞాపకం వుంచుకుంటే, సుబ్బి అనే పేరు జ్ఞాపకం వుంటుంది.

(రామప్పంతులు గుఱ్ఱం దూరాన్న దిగి నడిచి వస్తాడు)

రామ : (కరటకశాస్త్రితో మెల్లిగా) లోపలి కెవరైనా వెళ్లారా ?

కర : (గట్టిగా) యవరో యిద్దరు ముగ్గు రొచ్చారుగాని మీ యిల్లాలుగా రొచ్చి పైకి పొమ్మని గెంటేశారు.

రామ : మీ రెవరు ? యెందుకొచ్చారు ?

కర : మాది కృష్ణాతీరం. నా పేరు గుంటూరు శాస్త్రుల్లంటారు. తమ దగ్గర రాచకార్యవుండి వొచ్చానండి.

వీధిలోనుంచి జవాను : యినస్పెక్టరుగారు నే వొచ్చిందాకా మఱ్ఱిచెట్టుకింద గుఱ్ఱాన్ని నిలబెట్టుంచుతావన్నారు. రూపాయలు వేగం ఇవ్వండి.

(మధురవాణి ప్రవేశించును)

రామ : యవరు, వొచ్చారట ?

మధు : యవరొస్తారు ? మీ నా'స్తులట. తగిలా'ను.

జవా : రూపాయలండోయ్!

రామ : (మధురవాణితో) యేవీ, మొన్న నీకిచ్చిన రూపాయలు ? సాయంత్రం మళ్ళీ ఫిరాయిస్తాను. యీ సైతాను ప్రాణం తింటున్నాడు.

మధు : మీరిచ్చిన రూపాయలు పట్టం తోలేశాను. నేను డబ్బిక్కడ దాచుకుంటే మా తల్ల'క్కడ కాలక్షేపం చెయ్యడమెలాగ ?

రామ : వొట్ట'బద్ధాలు!

మధు : (తాళముల గుత్తి మొలలోనుంచి తీసి రామప్పంతులు మీద విసిరి) చూసుకోండి.

రామ : (భుజం తడువుఁకుంటూ) దురహంకారం కూడదు. విసిరికొడితే దెబ్బ తగల్దనుకున్నావా యేవిఁటి ?

మధు : దుష్టమాట లనగా తగిల్తే తప్పా!

జవా : యేవఁయ్యోయి! పోయి, రూపాయి లిచ్చావు కావని ఇనస్పెక్టరుగారితో చెబుదునా ?

మధు : (మెడలో నాను తీసి) ఇది తాకట్టుపెట్టి కావలసిన సొమ్ము తెచ్చుకోండి.

రామ : (తనలో) ఆహా! యేమి యోగ్యమైన మనిషి. లేనిపోని అనుమానాలు పడకూడదు.

కర : పంతులుగారూ, యెన్ని రూపాయలు కావాలండీ ?

రామ : పాతిక.

కర : నే దాఖల్చేస్తాను. (జవానుకు యిచ్చును.)

రామ : ధనజాతకానికి డబ్బులా వొస్తూ వుంటుంది. యేవిఁటి మీ రాచకార్యం.

కర : యిది నా పిల్లండి. దీనికి వివాహం చేయించి ఆ సుకృతం తమరు కట్టుకోవాలి.

రామ : వివాహం చేయించడానికి నేను వైదీకిని కాను! నాకు మంత్రాలు రావే ? (చుట్ట జేబులోంచి దీసి కొన కొరికి) యేఁవంటావు మధురవాణీ, అగ్గిపుల్ల.

మధు : (అగ్గిపుల్ల అందిస్తూ పంతులు నుంచి, శిష్యుడి వేపూ, శిష్యుడు నుంచి పంతులు వేపూ కోపముతో చూచును.)

కర : మంత్రవఁన్నప్పుడు వైదీకపవాడి దేం మంత్రవఁండి ? ఈ రోజుల్లో వైదీకమంత్రాల మహిమ పోయిందండి. మంత్రవఁంటే నియ్యోగ ప్రభువుదే మంత్రం! తమ వంటి ప్రయోజకులకు మంత్రం మాటాడుతుందండి.

రామ : మధురం! యేవఁంటావు ? ఈ పిల్ల న్నే పెళ్ళి చేసుకుందునా ?

మధు : (రామప్పంతులు వేపూ, శిష్యుడివేపూ చురచుర చూసి నిష్క్రమించును.)

రామ : సొగసుకత్తెలకి అలక కూడా అదో శృంగారం సుమండి, శాస్తుల్లుగారూ!

కర : వైదీకపాళ్ళం మా కా శృంగారాలు యలా అనుభవౌఁతాయండి ? మా యిల్లాళ్ళకోప్కపం వొస్తే చీపురుకట్టలు యెగురుతాయండి. సరసవఁన్నది పుస్తకాల్లో చదవటవేఁగాని మాకు అనుభవ వేద్యం కాదండి. శ్రీ కృష్ణమూర్తి వారు రాధికతో శలవిస్తున్నారు : "ఓ రాధికా! నీ కోపం తీర్చుకోవాలన్న ష్షాయనా – ఘటయ భుజబంధనం రచయ రదఖండనం యేనవా భవతి సుఖజాలం." అనగా యేవఁంచున్నాడంటే కవీశ్వరుఁడు. చేతుల్తోటి ఉక్కిరిబిక్కిరి అయ్యేటట్లుగా కౌగలించుకో. మరిన్నీ పెదవులు రక్తాలొచ్చేటట్టు కొరికెయ్యి అంచున్నాడు.

రామ : (మధురవాణి వెళ్ళిన గుమ్మము వేపు చూసి) ఉప్పు లేకనే ముప్పందుం. మధురవాణికి మాత్రం ఈ వెర్రి మొర్రి కవిత్వాలు చెప్పకండి. నాలాంటి మృదువర్లు మోట సరసం సహించరు.

కర : ఆమె మీ భార్యా కారండీ ? సంసారికన్నా మర్యాదగా ఉంది ఈ వేశ్య! మీది యే వఁదృష్టం!

రామ : యెంపిక. యెంపికలో వుందండి! మీ రాచకార్యం చెప్పారుకారు ?

కర : లుబ్ధావుధాన్లుగారికీ, తమకీ చాలా స్నేహవఁని విన్నాను. ఆయన తమ మాట అడుగు దాటరట ?

రామ : ఆ గాడిద కొడుక్కి ఒకరితో స్నేహం యేమిటండీ ? వాడి ప్రా'ణానికీ డబ్బుకీ లంకె. డబ్బుకీ వాడికే స్నేహంగాని మరి యవరితోనూ స్నేహం లేదు. అయితే వాడికి వ్యవహారజ్ఞానం లా'కపోవడంచేత, కోర్టులంటే భయంచాతా, నా సలహా లా'క బతకలేడు. వాడే అన్నమాటేవిఁటి. ఈ తాలూకాలో సివిలు మేజిస్ట్రేట్లు యెక్కడొచ్చినా రామప్పంతులు పప్పు లేని పులగం వుండదు.

కర : ఆ మాట వినే తాము నియ్యోగ ప్ర'భువులు, మంత్రబలం చాత చక్రం అడ్డేస్తారని తమర్ని వెతుక్కొచ్చాను. మా పింతల్లి కొడుకు బియ్యేబియ్యల్ పా'సయినాడండి. డిప్టీకలక్టరీ చేస్తున్నాడు. బంధువులకి అతని వల్ల గడ్డిపరకంత సాయం లేదుగదా, మీదిమిక్కిలి కూరానారా యవళ్ళయినా గృహస్థులు గృహస్థు మర్యాదకి పంపించి, తల్లయినా, పెళ్ళాం అయినా

అవి పుచ్చుకుంటే తిరగగొట్టిందాకా అభోజనం కూచుంటాడు! పెట్టడానికీ, పుచ్చుకోవడానికీ నియ్యోగ ప్రభువులు, తమకి చెల్లిందిగాని, మా వాళ్ళ ఉద్యోగాలు మంటిగడ్డ ఉద్యోగాలండి. "ఇయ్యా ఇప్పించగల అయ్యలకే గాని మీస మన్యులకేలా రొయ్యకి లేవా బారెడు" అని కవీశ్వరుడన్నాడు.

రామ : యీ యింగిలీసు చదువులు లావైనకొద్దీ వైదీకులే అన్న మాటేవిఁటి అడ్డవైఁన జాతుల వాళ్ళకీ ఉద్యోగాలవుతున్నాయిగాని యంత చదువుకున్నా మీ వైదీక ప్పంతుళ్ళవారికి మా చాకచక్యా లబ్బుతాయండీ? మా లౌక్యం మాతో స్వతహాగా పుట్టినది. మీరు తెచ్చి పెట్టుకున్నది. యెరువు సరుకు యెరువు సరుకే విన్నారా ? మీ వాళ్లు లంచాలు పుచ్చుకోవడం చాతకాక, పతివ్రతలమని వా'షం వేస్తారు.

కర : అదే పతకవైఁతే అది అమ్ముకు బతకనా అన్నట్టు మా వాళ్ళకే చాతయితే నాకు యీ అవస్థేవఁండి ? మావాడు పదిమంది పార్టీలతో చెపితే పది రాళ్ళ సొమ్ము దొరుకును, యీ చిక్కులు లా'క పోవును.

రామ : యేవిఁటా చిక్కులు ?

కర : ఋణబాధ చాలా లావుగా ఉందండి. రేపటి పున్నంలోగా ఒక దస్తావేజు తాలూకు రూపాయలు చెల్లకపోతే దావా పడిపోతుందండి. యీ పిల్లని నల్లబిల్లిలో వెంకటదీక్షితులుగారికి పదహారు వందలకి అమ్మ నిశ్చయించుకొని తీరా వొచ్చేసరికి యిప్పట్లో రూపాయ లివ్వలేం, పెళ్ళయిన నెలరోజుల్లో యిస్తావఁన్నారండి. అందుచేత అది వొదులుకొని లుబ్ధావుధాన్లుగారు వివాహ ప్రయత్నంలో వున్నారని విని తమ దర్శనానికి వొచ్చా'నండి. యిదిగాని తాము సమకూరిస్తే పది వరహాల సొమ్ము దాఖలు చేసుకుంటాను.

రామ : నేను నలభై యాభై రూపాయల వ్యవహారాల్లో జొరబడే వాణ్ణి కాను.

కర : తాము చేసే సదుపాయాన్ని బట్టి య'ంతయినా దాఖలు చేసే వాణ్ణేనండి. నా రుణాలు పదహారువంద లుంటాయండి, ఆపైని యేవొఁచ్చినా తాము దాఖలు చేసుకోండి.

రామ : "ఐతె, గియ్తే" బేరాలు మా కవసరం లేదు. అగ్నిహొత్రావధాన్లకి పద్దెనిమిది వందలిస్తున్నాడు గదా. అందుకు సగానికి తగ్గితేనేగాని, అవుధాన్లు ఆ సంబంధం మాని మీ సంబంధం చేసుకోడు. అందులో

మీ రుణాలు తీరేదేవిఁటి, నాకిచ్చేదేవిఁటి ? యేవైఁతేనేవి ? ఆ వ్యవహారం యలాగా మించిపోయింది. పది రోజులకిందటొస్తే ఘోక్తు పరుస్తును. ఆ సంబంధం భోగట్టా మొదట నేనే తెచ్చాను. నా చేతుల్లోంచి ఆ వ్యవహారం పోలిశెట్టి లాగేశాడు. కృత్యాద్యవస్థమీద మధురవాణి మేజువాణికి వాణ్ణొప్పించేసరికి నా తాతలు దిగొచ్చా'రు. మరి వక ఉపాయం చెబుతాను వినండి. మీకు మయనరు కొమాళ్లున్నారా!

కర : చిన్నవాడికి మయినారిటీ దాటి మూడేళ్ళయిందండి.

రామ : అయితే యిహ లేందేవిఁటి! ఆ కుఱ్ఱవాడు మయినరని వాదిద్దాం.

కర : సాక్ష్యం యలా వొస్తుందండి ?

రామ : ఓహోహో! మీకు యేమీ తెలియదే. యిలాంటి వ్యవహారాలు నా తలమీద యెన్ని వెంట్రుకలున్నాయో అన్ని మోసేశాం. విన్నారా ? ఉర్లాం బసవరాజుగారి సంభావన్ల రేటే సాక్ష్యాల క్కూడా గేజిటార్డర్ చేశాం. కుండలాలు వేసుకున్న వారికి ఓ రూపాయి జాఫా.

కర : జాతకం ఉందిగదా, యేం సాధనం.

రామ : కాకితవైఁతే అగ్గిపుల్లతో ఫైసల్! తాటాకైతే నీళ్ళపొయ్యి! కొత్త జాతకం బనాయించడం అయిదు నిమిషాలు పని, మా సిద్ధాంతి మట్టుకు నాలుక్కాలాలు చల్లగా వుండాలి. నా దగ్గిర పాత తాటాకులు అలేఖాలు అటకనిండా వున్నాయి. ముప్ఫై యేళ్ళ నాటి కాకితాలున్నాయి. రకరకాల సిరా లున్నాయి. ఒక నూరు రూపాయలు నాకు ఫీజుకింద ఇచ్చి ఖర్చులు పెట్టుకోండి. గ్రంథం నడిపిస్తాను.

కర : దారి ఖర్చులకోసం తెచ్చిన రూపాయలు మీకు దాఖలు చేశాను. మరి బుఱ్ఱ గొరిగించుకుందావఁంటే దమ్మిడీ లేదు. కోర్టంట తిరగడానికయినా చేతిలో ఓ డబ్బు సొమ్ముండాలి గదా ? యిదొహర్తె టొంపలా నాతో వుంటే యలాగండి కోర్టంట తిరగడం ? తమ లౌక్యానికి అసాధ్యమన్నది ఉంటుందంటే నే నమ్మజాలను. యలాగయినా కుదిర్న సంబంధం తప్పించి, మా సంబంధం కుదిర్చి నాకు యిచ్చే సొమ్ములో పదోవంతు తాము అంగీకరించి మిగిలిందే నాకు దయచెయ్యండి. దీన్ని మొగుడింట అప్పజెప్పి ఆ పైన యీ గ్రంథం యేదో కొస చూపిందాకా తమర్ని అంటగాగి వుంటాను.

రామ : పదోవంతు పనికిరాదు. మా బేరం యెప్పుడూ సగానికి సగం.

కర : సంగోరు మీకిస్తే మరి నేను ఋణాలేం తీర్చుకోను ?

రామ : ఋణాల్తీర్చుకో అఖ్ఖర్లేకుండా గ్రంథం జరిగిస్తాం కదూ ? అప్పుడే మీ చేతుల్లో రూపాయలు పడడానికి సిద్ధంగా వున్నట్లు మాట్లాడుతావేవింటి, నేను యంత శ్రమపడ్డ పైని పతకం తిరగాలి ? అది ఆలోచించారా ?

కర : తాము అలా అంటే నేనేం మనవి చెయ్యనండి ? రక్తమాంసం అమ్ముకుంటూన్నప్పుడు ఆ కాని కూడయినా సంతుష్టిగా దొరకడం న్యాయం గదండి ? వ్యవహారాల తొౖట్రుపాటుచాతనూ, పిల్ల కట్టుదప్పి వుండడం చాతనూ తొందరబడుతున్నాను గానండి. కొంచెం వ్యవధి వుంటే రెండువేలకి పైగా అమ్ముకుందునండి.

రామ : "అయితే గియితేలు" అనుకున్న లాభం లేదని చెప్పాను కానా ? ఐదో వొంతుకు యేవఁంటారు ?

కర : ఈ పాపపు సొమ్ముకే తమరు ఆశించాలా అండి ?

రామ : పాపపు సొమ్ము మా దగ్గరికి రాగానే పవిత్రవైఁపోతుంది. ఒకర్ల కివ్వడం కోసవేఁగాని నా క్కావాలా ఏవిఁటి ?

కర : ఐతే కానియ్యండి.

రామ : ఇక నా ప్రయోజకత్వం చూడండి. మధురం! మధురం! కాకితం, కలం, సిరాబుడ్డి తీసుకురా. మామూలు సిరాబుడ్డి కాక గూట్లోది–పెద్ద సిరాబుడ్డి తే.

మధు : (అవతల నుండి) నా కంటే మధురం కంటబడ్డ తరవాత నేనెందుకు ?

రామ : ఆడవాళ్ళకి అనుమానం లావండి. వింటున్నారా ? అదో ముచ్చట.

కర : కేవలం వజ్రాన్ని సంపాదించారు.

రామ : వజ్రవేఁగానండి. పట్ణవాసపు అలవాటుచేత పదిమందితో మాట్లాడితేగాని దానికి వూసుబోదు.

కర : ఆ మాత్రం స్వేచ్ఛ యివ్వడవే మంచిదండి; ఆడదాన్నట్టే రొకాయించ కూడదండి.

రామ : రొకాయిస్తే యేం జేస్తుందేవిఁటండి ?

కర : యిలాంటి మానంగల మనిషైతే నూతులో గోతులో పడుతుందండి.

రామ : అలాగనా అండీ ?

కరట : అందుకు సందేహ మేమిటండి ? నాజూకైన మనస్సు గల స్త్రీని మల్లె పూవులాగ వాడుకోవాలండి.

రామ : ఆ నాజూకులూ గీజుకులూ మీకేం తెలుసునండి ?

కరట : పుస్తకాల్లో చదువుకున్న ముక్కలు, నాయకుడు నిరాకరిస్తే నాయిక ఉద్యానాల్లో వుండుకున్నటువంటి లతలతో ఉరిపోసుకుంటుందదండి. మహాకవుల నాటకాల్లో అష్లాగే జరిగినట్లు రాశారండి.

రామ : మరెవళ్ళతో మాట్లాడినా తప్పులేదుగాని, హెడ్ కనిష్టీబుతో మాత్రం మాట్లాడవద్దని బుద్ధి చెప్పండి, మీరు తండ్రిలాంటివారు గదా ?

కరట : ప్చు! అంత అదృష్టవాఁ అండి. అట్లాంటి పిల్లే నాకు వుంటే, మూడు నాలుగువేల కమ్ముకుని ఋణాలూ, పణాలూ లేకుండా కాలక్షేపం చేసి వుందును. దీన్నయినా నాలుగు దిక్కులా అమ్మజూపితే రెండు మూడు వేలు యిదివరకే చేతులో పడి వుండునండి. మేనరికం చెయ్యాలని దీం తల్లి భీష్మించుక్కూచోబట్టి యీ దురవస్థ మా కొచ్చింది. అంచాతనే యింట్లో చెప్పకుండా యీ పిల్లని వెంట తీసుకొచ్చి యీ దేశంలో పెళ్ళికి చూపుతున్నాను.

రామ : నా సహాయలోపం వుండబోదు.

కరట : ఐతే కార్యవయిందే!

రామ : యేదీ పిల్లా, యిలారా, చెయి చూపించూ.

(శిష్యుడు భయం నటించి వెనక్కి తగ్గును.)

కరట : చూపించమ్మా. భయంలేే చ్చూపించు.

(కరకటశాస్తుల్లు శిష్యుణ్ణి రామప్పంతులు దగ్గిరికి తోయును. రామప్పంతులు చెయ్యి పట్టుకుని అరచెయ్యి చూచుచుండును. శిష్యుడు చెయ్యి లాక్కొంటున్నట్లు నటించును. మధురవాణి సిరాబుడ్డి, కలం, కాగితం పట్టుకు వచ్చి రామప్పంతులు వెనక నిలుచుండును.)

రామ : ఆహా! యేం ధనరేఖా! సంతాన యోగ్యత బాగా వుంది.

మధు : మీరు చేపట్టిం తరువాత, అందుకు లోపం వుంటుందా ? (సిరా బుడ్డిలోని సిరా రామప్పంతులు ముఖం మీద పోసి చ(రున వెళ్ళిపోవును.)

3వ స్థలము : కృష్ణరాయపురం అగ్రహారంలో అగ్నిహోత్రావధాన్లుగారి యిల్లు

(వీథి గుమ్మం యదట గిరీశం నిలిచి సన్నని గొంతుకతో పాడును)

గిరీ : "కాముని విరిశరముల బారికి నే
నేమని సహింతునే, చెలీ, యేమని సహింతునే!"

వీడి తస్సాగొయ్యా, వీడి బాణాలు పువ్వులటోయి ? ఆ మాట యవడు నమ్ముతాడు ? వెర్రికుట్టె యెవడైనా నమ్మాలిగాని ? అనుభవ వేద్యవైన దీని నిజం యేవిఁటంటే – మంచి పదును బట్టిన లోహం మొనకి డయమండ్ పోయంట్ వేసి పోయిజన్‌లో ముంచి కంటికి కనపడకుండా మంత్రించి విసురుతాడు. అంచేతనే పైకి గాయం కనబడదుగాని పోలీసువాళ్ళ దెబ్బల్లా లోపల తహతహ పుట్టిస్తాయి. యీ విడో బ్యూటీ చూస్తే ఏమీ తోచకుండా వున్నది. అయితే ఇది చెప్పినట్టల్లా వశమయ్యే మనిషి కాదు. పాతరస్త్రా లేం పనికిరాకుండా వున్నాయి. నా యక్స్పీరియన్సూ, నా శృంగార చేష్టలూ గుడ్డిగవ్వంత పనిచెయ్యకుండా వున్నాయి. యింత సింప్లిసిటీ యక్కడా కానలేదు. దీనికి లవ్ సిగ్నల్సు, రామరామా, యేవీఁ తెలియవు. చమత్కారం మాటలు ఆడితే ఏమిన్నీ అర్థం చేసుకోలేక ఆ లేడికళ్ళతో తెల్లబోయి చూస్తుంది. అయామ్ డ్రెడ్ఫుల్లీ యిన్ లవ్ విత్ హర్. దీన్ని చూసిన దగ్గర్నించే టౌన్‌లవ్‌సూ, డాన్సింగర్లసూ మీద పరమాసహ్యం పుట్టింది. పోజిటివ్ యబహొరెన్స్ – వాళ్ళ పెంకె మాటలూ, పెడర్థాలూ, దొంగవేషాలూ, డామిట్! అంతా యిన్సిన్సియారిటీయే గదా ? ఇన్నాళ్ళూ మధురవాణి వల్లో పడి యెలాగు యాస్‌ని అయిపోయినానో నాకు నా మట్టుకే ఆశ్చర్యంగా వుంది. మధురవాణికీ, యీ మనిషికీ కం'పారిజన్ వున్నదా ? అది రంగువేసిన గాజుపూస. యిది ప్యూర్ డైమండ్! కాదని యవడైనా అభాజనుడు అంటే అమాంతంగా వాడి పిల కూడదీస్తాను. దీనిని చెడగొట్టడానికి ప్రయత్నం చెయ్యకూడదు; చేసినా సాగేది కాదు. గనక కొత్తదారి, కొంత న్యాయమైన దారి తొక్కాలి. ఏవిటయ్యా అది ? మాయోపాయం చేసి దీన్ని లేవదీసుకు పోయి విడో మా'రియేజి చేసుకుంటి నట్టాయనా కీర్తి, సుఖం కూడా దక్కుతాయి. "టూ బర్డ్స్ యట్ వన్ షాట్!" ఇలాంటి అట్టర్లీ ఇన్నోసెంట్ విడోని వొప్పించి తీసుకుపోయి పెళ్ళా'డితే మజా, ప్రయోజకత్వముగాని, రెండేసి మూడేసి సంతానాలు కలిగి తురకాడితోనో, దూదేకులవాడితోనో లేచిపోవడానికి సిద్ధంగా వున్న దండుముండల్ని విడో మా'రియేజి

చేసుకుంటే హెల్! పూటకూళ్ళమ్మలాంటి ముండని పెళ్ళాడ్డం విడో మా'రియేజి అనిపించుకోదు. అది దొంగముండా మా'రియేజి. ఇదేవిఁటయ్యా ఇది,యీ బుచ్చమ్మ ? సాక్షాత్తూ పరమపవిత్రమైన విడో విత్ గిల్ట్ లెటర్స్. అయితే గియితే మ.రా.రా. శ్రీ యన్. గిరీశం గారు విడో మా'రియేజి చేసుకోవడమేనా ? టు మా'రీ యె విడో, ఆర్, నాట్ టు మా'రీ దటీజ్ ది క్వొశ్చన్! షేక్స్పియర్ పడ్డ అవస్థలో పడ్డా "తొందరపడి హాజి సాహేబు తురకల్లో కలిసిపోయినా" దన్నట్లు నా వంటి బుద్ధిమంతుడు ఏ పని చెయ్యకూడదు, దాని లాభనష్టాలు బేరీజువేసి, జమా ఖర్చు చేసుకుని మరీ డిసైడ్ చెయ్యాలి. లెటస్ సీ యింప్రిమిస్. ఒకటో పద్దు డెబిట్ (నష్టం), విడో మా'రియేజి చేసుకుంటే మా వాళ్ళు అక్కర చెయ్యరు. అందుకు క్రెడిట్ (లాభం)– వాళ్ళిప్పుడు చేస్తున్న అక్కరే వుంది ? గనుక బా'లెన్స్ (గాక బాకీ) – నిల్, బండిసున్నా! రెండో పద్దు డెబిట్ (ఖర్చు) లోకం నన్ను బహిష్కారం చేస్తారు. అందుకు క్రెడిట్ (జమ). లోకంలోకల్లా విలువైన వస్తువును నేను అంకించుకుని, పసలేని ఆ లోకానికి నేను బహిష్కారం వేస్తాను. గనుక క్రెడిట్ బా'లెన్సు (నిలవ) ఏవిఁటయా ? నెగెటివ్ యడ్వాంటేజి, హా'వింగ్ నథింగ్ టు డూ విత్ ప్రాపర్ వర్ల్డు. పోజిటివ్ యడ్వాంటేజి, పొజెసింగ్ ఆలిట్స్ వెల్త్. మూడో పద్దు డెబిట్ (నష్టం) "వీడి పెళ్ళాం వెధవముండ" అంటారు – నోటా బినీ – ఈ పద్దు నిజంగా డెబిటే. ఆడిట్ డిపార్టుమెంటు వార్నడిగి ఈ సంశయం తీర్చుకోవాలి. అందాకా మ.రా.రా. శ్రీ. గిరీశంగారి అభిప్రాయం ఏమంటే– విడో అనేది ఏవిఁటి ? ఏ నేమ్! ఓ పేరు. ఆ పేరు మనిషి మొహమ్మీద రాసుందా ? మనిషిని ముస్తాబు చేసి యదట నిలబడితే యిది పునిస్త్రీ. యిది విడో అని చెప్పగలిగిన పెద్దమనిషి యవడు ? ఒహడూ లేడు. గనక విడో అనే వస్తువు యక్కడుందయ్యా ? వెక్కిరించే వెధవల నోళ్ళలో ఉంది. దీనికి క్రెడిట్ (లాభం) ఏమనగా – విడో పెళ్లాడిందంటే అశుభం, వోగాయిత్యం అని అటెవడూ కన్నెయ్యడు. యిక డెబిట్లేని శుద్ధక్రెడిట్, నంబర్ ఫోర్, "చుక్కలవలె, కర్పూరపు ముక్కలవలె నీదుకీర్తి మిన్నుముట్టుతుంది. గిరీశంగారి విధవా వివాహ మహోత్సవం కథ న్యూస్ పా'పర్లలో పెద్దక్షరాల్తో పడుతుంది. క్రెడిట్ నంబరు ఫైవ్, విడోమా'రియేజి యసోసియేషన్ వారు ఒక తృణం యిస్తారు. బుచ్చమ్మ క్కూడా కొంచెం డబ్బుంది. డెబిట్–దావా తెస్తేగాని అవుధాన్లు మావఁగారు దాన్లో దమ్మిడీ యివ్వడు.

ప్రొజెండ్ కాన్సన్నీ విచారించగా అవశ్యం విడో మా'రియేజి చేసుకుని తీరవలసిందే. అయితే సాధనవేఁవిటి ? ఏదైనా యాసెన్బ్రిడ్జి వొడ్డు చేరాలి.

(పైకి ముఖం యెత్తి ఆలోచించి) వెంకమ్మ, మొగుడితో దెబ్బలాడి నూతిలో పడ్డప్పుడు నేను సాహసించి వురికి పైకి తీసిం దగ్గర్నుంచీ వూరంతా నేను సాక్షాత్తూ సత్యహరిశ్చంద్రుణ్ణిగా భావిస్తున్నారు. అడుగడుక్కి బుద్ధి దాట్లేస్తూంటుంది కాని, నే నంతవాణ్ణీ కానా యేవిఁటి ?

స్నేహంపట్ల పీకిచ్చేస్తారే గిరీశంగారూ! సాధారణులా ? గనుక బుచ్చమ్మని మనం లావు చనుంచేసినా సుతిమించే వరకూ యవరూ తప్పు బట్టబోరు. రాత్రిళ్ళు అరబ్బీనైట్లు, కాశీ మజిలీలు, మదనకామరాజుకథలూ చెబుతూ వుంటే యంతో సర్దాగా పక్కని కూచుని వింటుంది. లవ్ స్టోరీస్ బుర్ర కెక్కించాను. కొంత గ్రౌండ్ ప్రిపేరైంది గనక, యిహ విడో మారియేజి మంచిదని, బోధపరుద్దాం. పాచిక పారినట్టాయినా, రామవరం చలో, విడో మా'రియేజి కరో! లెట్ మీ బిగిన్ ది కాం'పైన్ ఎట్ వన్స్. (తలుపు కన్నములోనుంచి తొంగి చూచి) నడవలో కూర్చుని విస్తళ్ళు కుడుతున్నది. మొట్టమొదట కొంచెం మ్యూజిక్ విసురుదాము. ('ఎటులోర్తునే చెలియా' అను జావళీ కూనిరాగముతో పాడి) బుచ్చమ్మ వదినగారూ, తలుపు తీయండి. (బుచ్చమ్మ తలుపు తీయును) వదినా.... వెల్! వెంకటేశం ఏమి చేస్తున్నాడు ?

బుచ్చ : పెరట్లో గొట్టికాయలాడుతున్నాడు.

గిరీ : ఈ వూరు వస్తే మరి చదువు చెడిపోతుంది. పట్నంలో వున్నప్పుడు డస్కు దగ్గిరనుంచి కదిలితే వొప్పేవాడను కాను... ఒకమాటు పి...పిలుస్తారా, పాఠం చెబుతాను.

(బుచ్చెమ్మ తమ్ముని తీసుకొని వచ్చుటకు వెళ్ళును)

గిరీ : ఆహా! దీని తస్సాగొయ్యా, మొహం యెదటికి వచ్చేటప్పటికి కొంచెం ట్రెంబ్లింగ్ పట్టుకుంటుంది. వకటి అనవలెనని మరివకటి అనేస్తూ వుంటాను. మరెవళ్లూ లేరు. వంటరిగా దొరికింది గదా. యిలాంటప్పుడు నా మనస్సులో మాట చెప్పేస్తే తీరిపోవునా! ఆ కోతి వెధవని తీసుకు రమ్మనమని చెప్పాను. కానీ, పాఠాలలో చిన్న లెక్చరు వేతాము. (వెంకటేశ్వరులు, బుచ్చమ్మ ప్రవేశించును) ఏమివాయి, మైడియర్ బ్రదరిన్లా వెంకటేశం, పాఠాలు చడవడం శుభ్రంగా మానివేశావు ? ఇక్కడ మరి మాసం రోజులు వుంటే వచ్చింది కూడా మరిచిపోతావు. యేదీ టెక్స్టు బుక్కు పట్టుకురా (వెంకటేశము పుస్తకము పట్టుకొని వచ్చును.) గాడ్స్ వర్క్సు అనే పాఠం తియ్యి. రీడ్ ఆన్ మై గుడ్‌బోయ్!

వెంకటే : (తడుముకుంటూ) దేర్ యిజ్ నాట్ ఏన్ ఆబ్జక్ట్ ఇన్ క్రియేషన్ వుచ్ డజ్ నాట్ సెర్వ్ సమ్ యూస్‌ఫుల్ పర్‌పజ్.

గిరీ : అట్టె! అట్టె! అక్కడ నిలువు. క్రియేషన్ అనగా యేమిటి ?

వెంకటే : క్రియేషన్ అనగా... అనగా.. ఆవులు.

గిరీ : నాన్సెన్స్. చదవేస్తే ఉన్న మతి కూడా పోతున్నది. ఆవులు యెదుట వున్నాయనా ఆవులంటున్నావు. మళ్ళీ ఆలోచించి చెప్పు.

వెంకటే : యే మాటకి అర్థం అడిగారండి ?

గిరీ : క్రియేషన్.

వెంకటే : అదా! క్రియేషన్ అంటే ప్రపంచం. నేను, యెదట ఆవులు కనబడితే యీ ఆవు పెరుగు నెలరోజులే కదా తినడవఁని ఆలోచిస్తున్నాను.

గిరీ : వన్ థింగ్ ఎట్ ఏ టైమ్, యిప్పుడు పాఠం మాట ఆలోచించు. క్రియేషన్ అనే వక్కమాట పైనే వక్కఘంట లెక్చరు యివ్వవచ్చును. ప్రపంచం యెలాగున్నది ? కపిద్ధాకార భూగోళా అని మనుధర్మశాస్త్రంలో చెప్పినాడు. కపిద్ధమంటే ఏమిటి ?

వెంకటే : నారింజపండు.

గిరీ : వెరీ గుడ్. అందుకు అమరనిఘంటువులో పద్యం నీకు వచ్చునా ?

వెంకటే : రాదు. చెప్పండి రాసుకుంటాను.

గిరీ :

> యింతలు బదరీఫలములు.
> యింతలు మారేడుపళ్ళు యీడుకు జోడై,
> బంతులు తామరమొగ్గలు,
> దంతీకుచకుంభములబోలు తరుణీకుచముల్.

యీ ప్రపంచములో ఏమి వస్తువులుంటవి ?

వెంకటే : ఆవులు.

గిరీ : డా'మ్ నాన్సెన్స్. యెంతసేపూ ఆవులేనా ? ఏవిఁటి వుంటవో బాగా ఆలోచించి చెప్పు.

వెంకటే : గేదెలు.

గిరీ : దట్ విల్ నాట్ డు. మళ్ళీ ఆలోచించి చెప్పు.

వెంకటే : అయితే నాకు తెలియదు.

గిరీ : విడోస్. ఇంత చిన్న ప్రశ్నకు నీకు జవాబు తెలియదు. ప్రపంచమందుండే వస్తువులన్నిటిలోకి ముఖ్యమైనవి విధవలు. దాని విషయమై పెద్ద లెక్చరు ఇవ్వవచ్చును. మన దేశములో ఒక దురాచారము వున్నది. మొగవాడికి పెళ్ళాము చచ్చిపోతే తిరిగి పెళ్ళాడతాడు. ఆడదానికి మొగుడు చచ్చిపోతే, యంత యవ్వనములో వున్నా, యంత సొగసుగా వున్నా, మరివకడిని పెళ్ళా'డ వల్లలేదు. ఇది అన్నాయవంటావా, కాదంటావా ?

వెంకటే : తప్పకుండా అన్యాయమే.

బుచ్చ : యేవండీ గిరీశంగారూ, వెధవలు పెళ్ళా'డడం పాపం కాదూ ?

గిరీ : ఆహా! మీ సత్యకాలం చూస్తే నాకు విచారంగా నున్నది. వెధవలు పెండ్లా'డవలసిందని పరాశరస్మృతిలో స్పష్టంగా నున్నది. వేదంలో కూడా నున్నది. రాజమహేంద్రవరంలో యిదంతా పండితులు సిద్ధాంతం చేసినారు. పూర్వకాలంలో వెధవలు పెండ్లా'డేవారు. వెంకటేశం, నలచరిత్రలో దమయంతి రెండో పెండ్లి పాటించిన పద్యం చదువు.

వెంకటే : నాకు రాదు.

గిరీ : ఇంత ముఖ్యమైన పద్యం రాకపోవడం యంత తప్పూ! నోటుబుక్కు తీసి రాసుకో – "దమయంతి రెండో పెళ్ళికి ధరనుండే రాజు లెల్ల దడదడ వచ్చిరీ", చూశావా! లోకంలో ఉండే రాజులంతా విధవని పెళ్ళా'డడానికి వచ్చారట. (బుచ్చమ్మ వైపు జూచి) చూశారా ? శాస్త్రాలన్నీ వొప్పుకోవడమే కాకుండా మీదుమిక్కిలి విధవలు పెళ్ళా'డకుండా వుండిపోతే దోషమని కూడా చెప్తూతూ ఉన్నాయి. ఇందు విషయమై శంకరాచార్యులవారు పత్రిక కూడా యిచ్చి యున్నారు.

బుచ్చ : అయితే మనవాళ్ళంతా విధవల్ని పెళ్ళి చేసుకోకూడదంటారే ?

గిరీ : అదంతా యింట్లో చాకిరీ చేయించుకోవడము కోసరముగాని మరేమీ కాదు. ఝాముురాత్రి ఉందనగా లేచి మరునాడు రెండు ఝాముల దాకా యెద్దులాగా పని చేయిస్తారు కదా! ఒక పూట కంటె యెక్కువ భోజనం చెయ్యనివ్వరు గదా! అప్సరసలాగున యెంత సొగసుగా వున్నా మంచిగుడ్డ

కట్టుకోనివ్వరు. సరుకు పెట్టుకోనివ్వరు. తుమ్మెద పంక్తుల్లా వుండే జుత్తు కూడా తీసేస్తారు కదా! ఫర్ ఎగ్జాంపిల్, మీ అక్కయ్యకు ఆ చంద్రబింబము వంటి ముఖముపైని ఒక కుంకుమబొట్టుంటే త్రినేత్రుడికైనా చూడడానికి అలవి వుండునా ? ఆహా! యీ అవస్థ చూస్తే నా హృదయం కరిగి పోతున్నది. ఆల్‌రైట్! ప్రపంచములో యింకా యేమి వస్తువులున్నవి ?

వెంకటే : చేగోడీలు.

గిరీ : డా'మ్ నాన్సెన్స్! ఎంతసేపూ తిండి విషయమయ్యే ఆలోచిస్తావు. బా'చిలర్స్ – బ్రహ్మచారులు కూడా వున్నారు. వాండ్లు చెయ్యవలసిన పని ఏమిటి ?

వెంకటే : వేదం చదువుకోవడం; పెయ్యలకి గడ్డి తా'వడం.

గిరీ : నాన్సెన్స్ – అది మీ తండ్రి దగ్గర చదువుకునే విద్యార్థుల మాట. బ్రహ్మచారి యొక్క రియల్ డ్యూటీ – అంటే విధింపబడిన పని యేమనగా, విధవలను పెండ్లా'డడమే. ఇంకా క్రియేషన్‌లో ఏమున్నది ?

వెంకటే : నాకు తెలియదు.

గిరీ : రామవరములో విధవావివాహము చేసుకున్న వాళ్ళకల్లా నెల వక్కంటికి నూరు రూపాయలు యిచ్చి పోషించడమునకు విడోమా'రేజి సభ వకటి వున్నది. ఇది వరకు అయిదువేలమంది విధవలకు వివాహము అయి పునిస్త్రీలు అయిపోయినారు. ఆల్‌రైట్, క్రియేషన్ అనే మాట అయినది. ఆ సెంటెన్సు అంతకూ అర్థము చెప్పు.

వెంకటే : మీ రొకమాటు చెప్పిన తరవాత నే చెబుతాను.

గిరీ : ఆల్‌రైట్. ప్రపంచంలో దేవుడు ప్రతివస్తువునూ ఏదో వొక ఉపయోగము కొరకు చేసియున్నాడు. చేగోడీ యెందుకు చేసినాడూ ?

వెంకటే : తినడముకు,

గిరీ : దట్ ఈజ్ రైట్! ఆవుల నెందుకు చేశాడు ?

వెంకటే : పాలు యివ్వడమునకు.

గిరీ : పెర్‌ఫెక్టలీ రైట్! ఆడవాళ్ళ నెందుకు చేశాడు ?

వెంకటే : వంట చెయ్యడానికి.

గిరీ : నాన్సెన్స్! పెండ్లాడడమునకూ, పిల్లల కనడముకున్నూ, గనుక పెండ్లా'డకుండా వున్న విధవపిల్లలు దేవుని ఆజ్ఞను అతిక్రమించిన పాపమును చేస్తున్నారు.

(అగ్నిహోత్రావధాన్లు ప్రవేశించును)

అగ్ని : ఏమండీ గిరీశంగారూ, మా కుర్రాడికి చదువు చెప్పుతున్నారూ ?

గిరీ : ఘంటసేపాయి చెబుతున్నానండి.

అగ్ని : యేదీ, నే కూడా వింఛాను. కొద్దిగా చెప్పండి.

గిరీ : మైడియర్ బోయ్, గాడ్ మేడ్ క్రియేషన్. సృష్టి యెవడు చేసినాడు ?

వెంకటే : దేవుడు.

గిరీ : ఫాదర్ ఈజ్ నెక్స్ట్ టు గాడ్. దేవుని తరవాత ముఖ్యం యెవరు ? సే ఫాదర్.

వెంకటే : తండ్రి.

అగ్ని : మొత్తంమీద మీ యింగ్లీషు చదువు మంచిదిలాగే కనబడుతూన్నది. భాషభేదంగాని మన ముక్కలే వాళ్ళవిన్నీ.

గిరీ : వెంకటేశం! దేవుడు సృజించిన ప్రపంచంలో ఏమి వస్తువులున్నవి ? సే కోర్ట్స్.

వెంకటే : వెధవలు.

గిరీ : నాన్సెన్స్! సే కోర్ట్స్.

అగ్ని : యిదేవిఁటండోయి. ప్రపంచంలో విధవలున్నా రంచున్నాడు. ఇంగ్లీషు పుస్తకాల్లో యిదేనా యేమిషి వున్నది.

గిరీ : వెధ్వల్ అన్నది లాటిన్ మాటండి, ఆ మాట కర్థం కచేరీలు. కచేరీలు యెందుకున్నవి ?

వెంకటే : దావాలు తేవడముకు.

గిరీ : దట్ ఈజ్ రైట్! చూచారండీ, మీ వాడికి కచేరీల భోగట్టాలు కూడా నేర్పుతున్నాను.

అగ్ని : అయితే మన దావా విషయమై నే నిచ్చిన కాకితాలు సమగ్రంగా చూశారా ?

గిరీ : కేసు గెలవడముకు యేమీ అభ్యంతరం లేదు. మీకు తెలియడం కోసం గ్రంథం అంతా తెలుగు చేస్తున్నాను. మామగారూ, మీ విషయమై యెంత శ్రమయినా పడి అమలాపురం వెళ్ళి అక్కడ కోర్టులో కేసు గెలిపించకపోతే నన్ను పేరు పెట్టి పిలవ వద్దు.

అగ్ని : యేదో అంతా మిమ్మల్నే నమ్ముకుని వున్నాము. యెంత డబ్బయినా, కేసే గెలిస్తే చాలును. పెళ్ళి పనులకి మీ కుమ్మక్కు వుంటేనే కాని తూగదు సుమండీ! నా మీద కోపం చేత కరటకశాస్తు'ల్లూ వాళ్ళూ వెళ్ళిపోయినారు. వాళ్ళు వొచ్చేటట్టు కనపడరు.

గిరీ : మీరు కూర్చున్న దగ్గిర్నించి కాలు కదపకుండా, ఎరేంజిమెంటు యావత్తూ నేను చేస్తాను కాదూ!

(నిష్క్రమించుచున్నారు)

4వ స్థలము : పెరటిలో జామచెట్టు కొమ్మమీద వెంకటేశం కూచుని జామపండు కొరుకుచుండును.

(చెట్టుకొమ్మలు ఆవరించి వున్న నూతిలో బుచ్చమ్మ నీరు తోడుచుండును.)

బుచ్చ : తమ్ముడూ, గిరీశంగారు గొప్పవారట్రా ?

వెంకటే : గొప్పవారంటే అలా యిలాగా అనుకున్నావా యేవింటి ? సురేంద్రనాధ్ బానర్జీ అంత గొప్పవారు.

బుచ్చ : అతగా డెవరు ?

వెంకటే : అందరికంటే మరీ గొప్పవాడు.

బుచ్చ : అయితే గిరీశంగారికి వుద్యోగం కాలేదేమి ?

వెంకటే : నాన్సెన్స్! నువు ఆడదానివి; నీకేం తెలియదు. ఉద్యోగవంటే గొప్పనుకుంటున్నావు. ఉద్యోగవంటే యేమిటో తెలిసిందా ? సర్వెంట్ అన్నమాట.

బుచ్చ : అనగా యేమిటి ?

వెంకటే : సర్వెంటనగానా ? నౌఖర్ అన్నమాట. మన గేదెని కాసే అసిరిగాడు ఒక సర్వెంట్. మన యిల్లు తుడిచే అంకి ఒక సర్వెంట్. వీళ్లు మన నౌఖర్లు. పోలీసూ, మునసబూ తెల్లవాడి నౌకర్లు. జీతం లావురాగానే

గొప్పనుకున్నావా యేవిఁటి ? సురేంద్రనాథ్ బా'నర్జీ, గిరీశంగారులాంటి గొప్పవాళ్లు తెల్లవాడి దగ్గిర కాదు – దేవుడి దగ్గిరైనా నౌఖరీ చెయ్యమంటే చెయ్యరు. కలక్ట రేవంఁటాడో తెలిసిందా ? పోలీసు వెళ్ళితే "స్టాండ్!" నిలుచో అంటాడు. గిరీశంగారు వొచ్చారంటే షేక్ హాండ్ చేసి "కుర్చీమీద కూచోండి" అంటాడు. ఆయనకి హైదరాబాదు నవాబు వెయ్యి రూపాయల పని యిస్తామంటే, నీ పనెవడిక్కావాలి పొమ్మన్నాడు.

బుచ్చ : ఆయనకి పెళ్ళైందిరా ?

వెంకటే : లేదు.

బుచ్చ : తమ్ముడూ, విధవలు పెళ్ళాడ్డం మంచిదంటారు గదా, ఆయనెందుకు పెళ్ళా'డారు కాద్రా ?

వెంకటే : నీకు యంత చెప్పినా తెలియదు. (గట్టిగా) ఆయన ఉద్యోగం చెయ్యక పోవడం, పెళ్ళి మానుకోవడం లోకం మరామత్తు చెయ్యడానికట! యిప్పుడు తెలిసిందా ?

బుచ్చ : యలా మరమ్మత్తు చేస్తున్నార్రా ?

వెంకటే : నా వంటి కుర్రాళ్ళకి చదువు చెప్పడం; (నిమ్మళంగా) చుట్టునేర్పటం. (గట్టిగా) నాచ్చికొశ్చన్, అనగా సానివాళ్ళందర్నీ దేశంలోంచి వెళ్ళగొట్టడం ఒహటి. నేషనల్ కాంగ్రెస్, అనగా దివాన్గిరీ చలాయించడం ఒహటి. యిప్పుడు తెలిసిందా ?

బుచ్చ : ఉద్యోగం చెయ్యరన్నావే ? దివాన్గిరీ యే రాజు దగ్గిర్రా ?

వెంకటే : యే రాజు దగ్గిరా ?.... ఆడదానివి నీ కెందుకూ ఈ భోగట్టా అంతాను ?

బుచ్చ : నువ్వు కూడా లోకం మరమ్మత్తు చా'స్తావుష్రా ?

వెంకటే : ఓ!

బుచ్చ : ఐతే వెధవముండని కూడా పెళ్ళా'డతావురా ?

వెంకటే : నాన్న తన్నకుండా వుంటే తప్పకుండా పెళ్ళా'డతాను. కాని బోడిగుండు చేస్తే మాత్రం నా కక్ఖరలేదు.

<u>(గిరీశం ప్రవేశించును)</u>

గిరీ : వదినా! ఈ చెట్టుకింద నిలబడితే మీరు వనలక్ష్మిలా వున్నారు. (బుచ్చమ్మ వైపు తేరి చూచును.)

బుచ్చ : విన్నారా ? తమ్ముడు వెధవని పెళ్ళా'డతాష్ట!

గిరీ : నా ప్రియశిష్యుడూ, మీకు ప్రియసోదరుడూ అయిన వెంకటేశం విధవావివాహవేఁ చేసుకొంటే మేం యావన్మందివిఁన్నీ బ్రహ్మరథం పట్టవాఁ ?

బుచ్చ : గురువులుగదా. ముందు మీరెందుకు చేసుకోరు ?

గిరీ : అడగవలసినమాట అడిగారు. చెప్తాను వినండి. మీ రడిగిన తరవాత చెప్పకపోవడం తప్పని చెబుతున్నానుగాని, ఈ మాటలు చెప్పవలసినవి కావు. ఏవంటారా ? నా గొప్ప నే చెప్పుకోకూడదు గదా ? అదొహటి. అంతకంటె ప్రమాదమైన మాట మరోటుంది చూశారా వొదినా – మొదట్నించీ విధవ వివాహం కూడదు కూడదు అని తప్పు అభిప్రాయంలో పడిపోయివున్న అత్తగారూ, మావఁగారూలాంటి పెద్దవాళ్ళకి యెన్ని శాస్త్రాలూ సవబులూ మనం చెప్పినా, వాళ్ళకి నెత్తికెక్కవు. యిలాంటి మాటలు వాళ్ళతో మనం చెప్పినట్టాయనా, కఱ్ఱుచ్చుకుంటారు. మావఁగారు వేదం మటుకే చదువుకున్నారు గాని, నేను శాస్త్రాలు అన్నీ చదువుకున్నాను. అబ్బో, నేను మన శాస్త్రాల్లో వుడ్డోలుణ్ణి. శాస్త్రకారుడు యేవఁన్నాడూ ? "బాలాదపి సుభాషితం" అన్నాడు. అనగా మంచిమాట చంటిపిల్లాడు చెప్పినా విని ఆ ప్రకారం చెయ్యండయ్యా అన్నాడు. అయితే మన పెద్దవాళ్ళు శాస్త్రంలో చెప్పిన ప్రకారం నడుస్తారూ ? యంతమాత్రం నడవరు. మనం శాస్త్రమూ, సవబులూ చూపిస్తే, యావఁంటారు ? యీ గుంట వెధవలు చెప్పడం, మనం విండవూఁనా అని కఱ్ఱుచ్చు కుంటారు. నా మాటకేవిఁ చప్పకండి నాది యినుం లాంటి శరీరం... కొడితే కఱ్ఱ విరిగిపోవాలి గాని చెక్కు చ'దరదు. నా ప్రియశిష్యుడి కైతేనో, మీ అందరివీ మెత్తని మృదువైన శరీరాలు అవుట చా'త యెవిఁకలు విరిగిపోతాయి. గనక యీ మాటలు మన్లో మనం అనుకోవలసినవే గాని మరొహళ్ళతో.... ప్రాణం పోయినా... అనవలసినవి కావు. యావఁంటారు ?

బుచ్చ : అవును.

గిరీ : అవునంటే చాలదు. యెవరితోనూ యీ మాటలు చెప్పనని మీరంటేనేగాని నా మనసులో మాటలు నాలుగూ యెలా చెప్పడం ?

బుచ్చ : యవరితోనూ చెప్పను.

గిరీ : వొట్టేసుకోవాలి.

బుచ్చ : యావఁని వొట్టేసుకునేది ?

గిరీ : యావఁనా ? మీరు యెవరితోటైనా చెపితే నా బుఱ్ఱ పగిలిపోవాలని వొట్టేసుకోండి.

బుచ్చ : అహఁ అలా వొట్టేసుకోను. మీ బుఱ్ఱ చల్లగా వుండాలి. చెపితే నా బుఱ్ఱే పగిలిపోవాలని వొట్టేసుకున్నాను.

గిరీ : అందుకు నేనొప్పుతానా యేవిఁటీ ? నా బుఱ్ఱ పగిలిం తరవాత మీ బుఱ్ఱజోలికి యవడైనా రావాలిగాని, మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డువెయ్యనా ?

బుచ్చ : మా అమ్మని బతికించారు కారా ? మీరు అలాంటి వారే.

గిరీ : ఆ మాట మీరే అన్నారు గనుక, వినండి – చెప్తాను. నేను పెళ్లా'డి పెళ్ళాం బిడ్డలు నాకుంటే, వాళ్ళని తల్చుకున్న తరవాత ప్రాణానికి తెగించి మీ అమ్మని తియ్యడానికి నూతిలోకి గెంతగలిగి వుందునా ? ఈ జన్మవఁంతా లోకోపకారం కింద వినియోగపర్చుకుందామని నిశ్చయించుకుని యిది వరదాకా ఏకాకినై వుంటిని సత్యమే. మీలాంటి నా మేలు కోరినవాళ్ళు "పెళ్ళి చేసుకో" అంటే ఆ మాట తోసేయడం కష్టమే; గాని ఒక మాటకి మాత్రం జవాబు న్యాయంగా చెప్పండి. ఒక్కళ్ళకి ఉపకారం చేయడం గొప్పా, అందరికీ ఉపకారం చేయడం గొప్పా ?

బుచ్చ : అందరికీ చెయ్యడవేఁ గొప్పనుకుంటాను.

గిరీ : సరే! ఆ మాట మీద నిలవండి. పెళ్ళా'డి, ఆలుబిడ్డలకి, ముచ్చకాయ ముగ్గురికి ఉపకారం చేయడం కంటే లోకోపకారం కింద యీ ప్రాణం వినియోగపర్చడం పుణ్యం కాదా ? చచ్చేకాలానికి స్వర్గం యెదురుగుండా వొస్తుందే!

బుచ్చ : లోకానికి యేం ఉపకారం చాస్తారు ?

గిరీ : అలా అడగండి. సోషల్ రిఫారమ్. సోషల్ రిఫారమ్ అంటే సంఘ సంస్కారం. అసలు యింగ్లీషు మాట యంత అర్థమౌతుందో మీకు, దాని తర్జుమా కూడా అంతే అర్థం అవుతుంది. విప్పి చెప్పాలంటే ఒక సిమిలీ. అనగా ఉపమానం, చెప్పి మీకు బోధపరుస్తాను. లోకం తప్పు తోవలో వెళ్ళుతూంటే ఆ తోవలోంచి మళ్ళించి మంచి తోవలో పెట్టడమనేది సోషల్ రిఫారమ్.

బుచ్చ : యేమిటా తప్పుతోవ ?

గిరీ : జారూ, బురదా, గట్టూ, గతుకులూ వున్న తోవ యలా వుంటుందో యిప్పుడు మనవాళ్ళ ఆచారాలు అలా వున్నాయి. ఆ తోవలోంచి బండీ తప్పించి, మంచి దిమ్మిసా కొట్టిన హైరోడ్డులోకి మళ్ళించాలి. ఆ బండికి రెండు చక్రాలు. ఒకటి విధవా వివాహం, రెండు నాచ్చికొశ్చన్, అనగా సానివాళ్ళని హతమార్చడమున్నూ. యీ రెండే రాజమార్గాలు.

బుచ్చ : మనవాళ్ళ దురాచారాలేవిఁటో నాకు బోధ పడలేదు.

గిరీ : ఐతే చెబుతాను వినండి. ముసలాళ్ళకి చిన్నపిల్లల్నిచ్చి పెళ్ళి చెయ్యడం ఒకటి, డబ్బుకి పిల్లల్ని అమ్ముకోవడం ఒకటి. అవునంటారా కాదంటారా ?

బుచ్చ : అవును.

గిరీ : ఆ ముసలాళ్ళు చేస్తే కష్టం, సుఖం యరగని పసిపిల్లలు వెధవలు అవుతారు. ఉప్పూ, పులుసూ తినడంచేత యేమీ యరగని పసిపిల్లలు పూర్ణ యవ్వనం వొచ్చిన తరువాత మనసు పట్టలేకబోతే వాళ్ళదా తప్పు! "వెధవ వివాహం కూడదు, గిధవ వివాహం కూడదు." అని ఓర్వలేని మాటలు చెబుతూ, డబ్బు కాసించి, ముసలి పెళ్ళిళ్ళు చేసే మూర్ఖుల్దా తప్పు ? వూరుకుంటారేం ?

బుచ్చ : నాకు తెలియదు.

గిరీ : అవుఁను మరి మీరేవఁనగల్రు ? తల్లీని, తండ్రినీ యేఁవనుకున్నా మనసులో అనుకుని జీర్ణించుకోవాలిగాని, మీలాంటి మంచివాళ్ళు పైకంటారా ? నాలాంటి వాడు యేవఁండీ మావఁగారూ, పిల్లల్ని రూపవంతుడూ, యవ్వనవంతుడూ, బుద్ధిమంతుడూ అయిన కుర్రవాడికి యిమ్మని శాస్త్రంలో ఉందిగదా, శాస్త్రానికి విరుద్ధంగా యెందుచేత డబ్బు కక్కుర్తిపడి ముసలాళ్ళకి కట్టబెడుతున్నారయ్యా, శాస్త్రంలో "వెధవలకి

పెళ్ళి చెయ్యవలసినది" అని శాసించి చెప్పి వుండగా ఎందుకు చెయ్యరయ్యా అని అడిగితినట్టాయనా అర్థచంద్ర ప్ర'యోగం చేసి అవతలికి గెంటుతారు. అంచాత "శాంతం బోషాణపెట్టె" అనుకుని నోరు మూసుకు వూరుకున్నాను. యిహ నాచ్చికొశ్చన్ మాట వినండి. సానివాళ్ళని హతమార్చడం మంచిదంటారా కాదంటారా ?

బుచ్చ : వాళ్ళని చంపేస్తారా ఏ౦విటి ?

గిరీ : చంపక్కర్లేదు. "పొమ్మనక్కర్లేదు, పొగబెడితే చాలు" నన్నట్లు సానివాళ్ళని పెళ్ళిళ్ళకి పిలవకపోవడం, వాళ్ళని ఉంచుకోకపోవడం, పై చెప్పిన పనులు చేసే వాళ్ళని కనపడ్డచోటల్లా తిట్టడం. యిలా నాలాంటి బుద్ధిమంతులంతా ఒహటై కొంతకాలం చేసేసరికి, కలికంలోకైనా మరి సాంది వుండదు. లేకుంటే చూడండి, మన వెంకటేశం పెళ్ళికి తప్పకుండా సానిమా'ళం తెస్తారు. నే యెరుగుదును, కూడదన్న పనల్లా మావ౦గారు చా'స్తారు. కూడినపని మానేస్తారు. సానిమా'ళం తా'వడమనేది డబ్బిచ్చి తద్దినం కొనుక్కోవడమన్న మాట కాదా ? పెళ్ళినాటికి నా ప్రియశిష్యుడికి కొంచ'ం యీడొస్తుంది గదా! ఆ సానిముండలు యర్రగా, బుర్రగా వుండడం చూసి, పెళ్ళాంమీద అసహ్యం పుట్టి యీ పసిపిల్ల యదగడ వె౦ప్పుడు, కాపరానికి రావడమె౦ప్పుడు, యీ సానివాళ్లు మా మాజా'గా వున్నారని వాళ్ళని వెంకటేశం వుంచుకుంటే కొంప మునిగిపోతుందిగాని తరవాయి వుండి పోతుందా ? యేవ౦ంటారు ?

బుచ్చ : అవును, నిజవే౦.

గిరీ : గనుక లోకం బాగుపడేటందుకుగాను వెధవలకి పెళ్ళి చెయ్యడానికి, సానివాళ్ళని సాగనంపడానికి వీరకంకణం కట్టా'ను. మరే వచ్చి మీ తమ్ముళ్ళాంటి వాళ్ళకి అనేకులికి విద్యాబుద్ధులు చెప్తున్నాను. గజీతగాణ్ణి ఔటచేత నూతుల్లో గోతుల్లో పడ్డవాళ్ళని పైకి తీస్తాను. ఇంకా నా'షనల్ కాం౦గ్రెస్ ఒహటుందిగాని అందులో నే చేసేపని చాం'తాడంత వ్యాఖ్యానం చేస్తేగాని మీకు బోధపడదు. పరిపరివిధాల లోకోపకారం చేస్తున్నాను.

బుచ్చ : యీ పనులన్నీ పెళ్లి చేసుకుంటే మాత్రం చెయ్యకూడదా ?

గిరీ : యలా జేయడం ? లోకవఁంటే ఏవిఁటి. గంజిగుంట అనుకున్నారా ? యేషియా, యూరప్, ఆఫ్రికా, అమెరికా, ఆష్ట్రలేషియా అని ఐదు ఖండాలు. అందులో అమెరికాలో మనుష్యులు బుఱ్ఱ కిందకీ, కాళ్లు పైకి పెట్టి నడుస్తారు. ఇక్కడ పగలు గదా యిప్పుడు ? అక్కడ రాత్రి. నార్తుపోల్ అని మరో దేశం వుంది. అక్కడ ఆర్నెలు పగలే; అప్పుడు మరి రాత్రుండదు. ఆర్నెల్లు రాత్రే, అప్పుడు మరి పగలుండదు. అక్కడేవిఁ టనుకున్నారు ? సముద్రం అంతా మంచుకెరడైపోతే లేళ్ళని బళ్ళకి కట్టి సవారీలు వాయువేగ మనోవేగంగా వెళతారు. యిన్ని దేశాలు వెళ్లి అక్కడి వాళ్లకల్లా ఉపకారం చేస్తేగదా లోకోపకారం అవుతుంది ? పెళ్లాం బిడ్డలూ వుంటే వాళ్ళను వొదిలి యలా పోవడం ? అయితే పెళ్ళా'డమని మీరు చెప్పిన మాట కూడా సుతరామూ కొట్టిపారేయకూడదు. లోకానికోసం బతకడం ఉత్తమం. అయితే లోకం అంతా యంత విలవో అంతకన్న ఎక్కువ విలువైన రత్నం లాంటి ఆడమనిషి దొరికితే తప్పకుండా పెళ్ళా'డవలసిందే. యీ వూరొచ్చేవరకూ నా కలాంటి దివ్యసుందర విగ్రహం కనపళ్ళేదు. మొహవెదట చెప్పకూడదు. అలాంటి మనిషి యీ వూళ్ళో కనపడ్డది. అందరాని పండుకు ఆశించడవెఁందుకని మనస్సు మళ్లించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నానుగాని మనసు లొంగకుండా వుంది. భగవంతుడేం జేస్తాడో! మనస్సుతో యావఁంటున్నానంటే "ఓ వెర్రి మనసా! నువ్వు వలచిన చిన్నది ఆణిముత్యవేఁ గాని యిన్నాళ్లూ పెళ్ళి మానేసి యిప్పుడు 'పెళ్లా'డదాం పెళ్లా'డదాం అని యెందుకు సందడి పడతావు ? 'సంసార సాగరం దుఃఖం, తస్మా జ్జాగ్రత్త జాగ్రత్త' అన్నాడు. సంసారంలో పడిపోతే మళ్ళీ నీకు లోకోపకారం చేయడానికి అవకాశం వుంటుందా' అని మనస్సుకి బోధపరుస్తున్నాను. పెళ్లా'డితే లోకోపకారానికి అవకాశం యంతమాత్రం వుండదు. చూశారా వదినా! మాట వరసకి, మనం పెళ్లా'డదాం అనుకుందాం. సంసారం గడుపుకోవడానికి డబ్బు సంపాదించుకోవాలా ? యిదివరకలా అంటే బ్రహ్మచర్యం ఆచరిస్తున్నాను గనుక 'సత్రాభోజనం, మఠా ని'ద్ర సరిపోయింది. మాటవరసకి మిమ్మల్ని పెళ్లా'డిం తరవాత అలా సరిపోదే! మనంగాని మావఁగారి మూర్ఖానికి లక్ష్యపెట్టక యవరితోనూ చ'ప్పకుండా రామవరం వెళ్ళిపోయి అక్కడ శాస్త్రోక్తంగా పెళ్లాడావఁంటే, ప్రస్తుతం మట్టుకు విడో మా'రియేజి సభవారు

మనకి నెలకి నూర్రూపాయలు యిస్తారు. ఓ నాలుగయిదు మాసాలు అలా కాలక్షేపం చేసి హైదరాబాదులోగాని, బరోడాలోగాని ఓ వెయ్యి రూపాయల ఉద్యోగం సులభంగా సంపాదించుకుంటాను. హయిదరాబాదు నవాబు నెలరోజుల కిందట పెద్ద ఉద్యోగవిఁస్తానన్నాడు. 'నేను ఒకడి దగ్గర నౌఖరీ చేస్తానా ?' అని విర్రవీగి తోసిపారేశాను. మీరు వివాహము చేసుకోమని సలహా యిస్తారని అప్పుడే యెరిగి వుంటే ఆ వుద్యోగం మించి పోనియ్యక పోదును.

బుచ్చ : మీరు ఉద్యోగం చెయ్యరన్నాడే, తమ్ముడు ?

గిరీ : అవును. బ్రహ్మచారిగా వుండి లోకోపకారం చేస్తూ వున్నంత కాలం పెళ్ళి చేసుకోనని శపథం పట్టాను. కాని ఇప్పుడు నా అదృష్టం వల్ల లోకం అంతటికన్నా విలువైన వజ్రంలాంటి భార్యా దొరికితే పెళ్ళా'డక తీరుతుందా ? లోకం యొక్క విలవ వెండి అనుకోండి. లోకం వెండైతే మీలాంటి సువర్ణచ్ఛాయగల కుందనపు బొమ్మ, పజ్యండో వన్నె బంగారం. అవునంటారా, కాదంటారా ? బంగారం విలవ యెక్కువా, వెండి విలవ యెక్కువా ? చప్పండి.

బుచ్చ : బంగారవేఁ యెక్కువ.

గిరీ : సరే. మీలాంటి బంగారం బొమ్మే లభించినప్పుడు లోకం గీకం అవతలబెట్టి పెళ్ళా'డక తీరదుగదా. మాటవరసకి, మనం పెళ్ళా'డతాం అనుకోండి. పెళ్ళా'డిం తరువాత, సంసారం సుఖంగా జరుపుకోవాలంటే లావుగా డబ్బుండాలి కదా! ఉద్యోగం చేస్తేగాని డబ్బు లావుగా రాదే ?

బుచ్చ : అవును.

గిరీ : ఆట్టే డబ్బెందుకని అడుగుతారు ఒకవేళ. చెబుతాను వినండి. సంసారానికి ఇల్లన్నది ఒకటుండాలిగదా! యేవఁంటారు ?

బుచ్చ : అవును.

గిరీ : నాకు మేడలుంటేగాని కుదరదు. యిలాంటి చిన్న ఇళ్ళలో నాకు ఉక్కిరిబిక్కిరిగా వుంటుంది ? ఆ మేడ చుట్టూ తోట వుండాలి. మావిఁడి చెట్లూ, అరటిచెట్లూ, జామచెట్లూ, చెప్పలేనన్ని వృక్షాలు వేస్తాం. మన వెంకటేశం కోతిలాగ పళ్లు తింటూ ఎప్పుడూ ఆ చెట్లమీదే వుంటాడు.

వెంకటే : ఆ చెట్ల పళ్ళన్నీ నేనే కోస్తాను.

గిరీ : అంతవాడివి కావనా ? మనం అలాగ యిల్లూ, వాకిలీ, తోటా దొడ్డీ యేర్పరచుకునేటప్పటికి మనకు చిన్నపిల్లలు పుడతారు. వాళ్ళని సంరక్షణ చెయ్యాలా ? వాళ్లు నేను కుర్చీమీద కూచుని రాసుకుంటూంటే వొచ్చి చెయ్యిబట్టుకు లాగి 'నాన్నా. యిది కావాలి, అది కావా'లంటారు. మీరు బీరపువ్వులాగా వొంటినిండా సరుకులు పెట్టుకుని, చక్కగా పసుపూ కుంకం పెట్టుకుని మహాలక్ష్మిలాగా యింట్లో పెత్తనం చేస్తూ వుంటే ఒక పిల్ల యిటువేపు వొచ్చి మెడ కౌగలించుకునీ, ఒక పిల్ల అటువేపు వొచ్చి మెడ కౌగలించుకునీ, "అమ్మా యిది కావాలి, అమ్మా అది కావా"లని అడుగుతారు. వాళ్ళకి సరుకూ జప్పరా చేయించాలి. జరీ దుస్తులు కుట్టించాలి. గిరీశంగారి పిల్లల్ని తీసుకురా అని ఒకప్పుడు నవాబుగారి శలవౌతుంది. మన పిల్లల్ని వెంకటేశంలాగా కాయగావంచా, తెల్ల చొక్కాయితో పంపించడానికి వల్లకాదు గదా ? వాళ్ళకి చిన్న బళ్ళూ గిళ్ళూ కొనాలి. వాళ్ళకి చదువు సంధ్యా చెప్పించి ప్రయోజకుల్ని చెయ్యాలి. ఇదంతా సంసార తాపత్రయం కాదా ? యిందులో పడిపోతే మరి లోకోపకారం చేయడానికి అవకాశం వుంటుందా ? చెప్పడం మరచిపోయినాను. అప్పుడు మన వెంకటేశం మన దగ్గిరే వుండి చదువుకుంటాడు.

బుచ్చ : అలా అయితే మరి నాన్నకి ఖర్చుండదు! నాన్న, అమ్మా వాడి చదువుకోసం దెబ్బలాడ్రు.

గిరీ : నే వొద్దన్నాన్నా ?

వెంకటే : నాకో చిన్న గుఱ్ఱబ్బండి కొనాలి.

గిరీ : వేరే నీకు బండీ యెందుకు ? మా పిల్లల బండీలో నువ్వు కూడా వెళ్ళుదువుగాని. వాళ్లు అల్లరి చేయకుండానూ, కింద పడిపోకుండానూ చూస్తూ వుందువుగాని.

వెంకటే : అక్కయ్యని పెళ్లా'డేస్తారా యేవింటి ?

గిరీ : మాట వరసకి అని అంటూంటే. మతిపోయినట్లు మాట్లాడతావేవింటి ?

బుచ్చ : అంతేకద ?

గిరీ : అంతేకదంటే, అంతకంటె అదృష్టం నాకు పట్టడం యలాగ. ఆ మాట మీరు అన్నా, నేను అన్నా, మీ వాళ్లు నన్ను తన్ని తగిలేస్తారు. వెంకటేశం గానీ అన్నట్టాయనా, పెయ్య కట్టుతాడు వుణ్ణే వుంది.

వెంకటే : ఓయి నాయనో.... (వీపు తడువుఁకొనును) గుప్ చప్! నేను ఆ వూసెత్తను.

బుచ్చ : మా నా'స్తం రాంభొట్లుగారి అచ్చమ్మ, మీరు వొప్పుకుంటే మిమ్మల్ని పెళ్ళా'డతానంది.

గిరీ : పెళ్ళా'డడవే! వొస్తే, అచ్చమ్మనీ, పిచ్చమ్మనీనా పెళ్లా'డతాను ? యప్పటికైనా ''ఒకళ్ళతో నాకు పనేవిఁటి ? నా బతుకు సుఖవేఁదో నేను చూచుకుంటాను'' అని మీలాంటి దివ్యసుందర విగ్రహమూ, గుణవంతురాలూ, నా మీద కనికరించి "గిరీశంగారూ, నన్ను పెళ్ళా'డండి" అంటే పెళ్ళాడతానుగాని అచ్చమ్మల్నీ, పిచ్చమ్మల్నీ మెడకి కట్టుకుని ఉత్తమ బ్రహ్మచర్యం, లోకోపకారం మానుకుంటా నన్నుకున్నారా యేవిఁటి ?

వెంకటే : మంచి పండు పడిపోయింది, అందుకోండి.

గిరీ : (పండు తీసి) ఆహా! యేమి ఛాయ; వొదినా, మీ వొంటి ఛాయని వుంది ఈ పండు, యిందండి.

బుచ్చ : బిందెలో పడెయ్యండి. తమ్ముడూ, దిగొచ్చి బిందె' యెత్తు.

గిరీ : వాడక్కర్లేదు, నే నెత్తుతాన్లెండి. (యెత్తి) ఆహా! యేమి వయ్యారం! (బుచ్చమ్మ నిష్క్రమించును) శిష్యా! రెండు పళ్ళు రాల్చు.

వెంకటే : నాన్నొస్తున్నాడండోయి దిడ్డీతోవ్వేపు, యేవిఁటి సాధనం ?

గిరీ : ఆకులు దట్టంగా ఉన్నవేపు దాగో, నేను యాతాం తోడ్డం ఆరంభిస్తాను.

(అగ్నిహెూత్రావధాన్లు ప్రవేశించును)

అగ్ని : గిరీశంగారూ, నీరు తోడుతున్నారండీ ? అసిరిగాడు తోడుతాడే. యింగిలీసు చదువుకున్నవాళ్లు మీకెందు కా శ్రమ ?

గిరీ : పని వంటి వస్తువ లోకంలో లేదండి. ఊరికే కూచుంటే నాకు వూసుపోదు. మొక్కలకా మంచిది. నాకా కసరత్తూ. గవునరు తోట్లో గొప్పు తవ్వుతారు. సీవఁరాణీవారు బీదలూ సాదలకి యివ్వడానికి బట్టలు కుడతారు. యింగిలీషువాడు సోమరితనం వొప్పడండి. వాళ్ళలో పెద్ద కవీశ్వరుడు

షేక్స్పియరు యేవఁన్నాడో విన్నారా, "డిగ్నిటీ ఆఫ్ లేబర్" అన్నాడు. అనగా కలక్టరు గొప్పవాడు కాడు, జడ్జీ గొప్పవాడు కాదు; కాయక్లేశపడి కష్టపడే మనిషే గొప్పవాడన్నాడు. అంచాతనే ఈ గొప్ప దొర్లంతా మెప్పు పొందాలంటే తోటమాలీపని చేస్తారు. చెట్లూ చా'వలూ యెక్కడం వొహటి వాళ్ళలో గొప్ప విద్య. లాభం లేని పని యేదీ దొర చెయ్యడండి మావఁగారూ! దొరగారు వూర్నించి వూరికి వెడుతూండగా దాహమేస్తుంది. చెట్లని పళ్లుంటాయి. నడితోవలో, చెట్టెక్కడం నేర్చుకోకపోతే, దాహంతో చావ్వలసిందే గదా! యేజన్సీ కమాన్ చేస్తూవుంటే పెద్దపులి వొస్తుం దనుకోండి. దొరకి చెట్టెక్కడం చాతయితే చపాల్న చెట్టెక్కి ప్రాణం కాపాడుకుంటాడు. అంచేత చదువుతోపాటు చెట్టెక్కడం కూడా నేరుస్తారు.

అగ్ని : దొర్ల తరిఫీదంతా అదో చిత్రం. వెంకడు రాసుకుంచున్నాడా, చదువుకుంచుకున్నాడా అండీ ?

గిరీ : యింతసేపూ చదువు చెప్పి, "చెట్లూ, చా'వఁలూ యెక్కి ఆడుకో" అని తోలేశాను.

అగ్ని : మీకేం మతి పోయిందా ఏవిఁటండీ ? కాలూ, చెయ్యీ విరుచుకుంటే ?

గిరీ : రేపు మనవాడికి గుణుపురం తాసిల్దారీ అయి అడవిలో కమాను వెళ్ళుతూ వుండగా, పెద్దపులొస్తే చెట్టెక్కలేక, కాళ్ళు వొణికి చతికిలబడాలని మీ అభిప్రాయఁవా యేవిఁటీ ?

అగ్ని : మనవాడికి తాసిల్దారీ అవుతుందండీ ?

గిరీ : యెందుక్కాకూడదు ? గుఱ్ఱాలెక్కడం, చెట్లెక్కడం మనవాడు నేర్చుకోకపోతే, "నాయనా! నువ్వు కమాన్లకి పనికిరావు. డసుకు దగ్గిర కూచుని గుమాస్తా పని చేసుకో. తాసిల్దారీ గీసిల్దారీ తలపెట్టకు" అని దొర్లంటారు.

అగ్ని : ఆప్లైతే చిన్నచెట్టెక్కించండిగాని పెద్దచెట్లప్పుడే యక్కనియ్యికండి.

గిరీ : అంచాతనే జామిచెట్టు యక్కమన్నాను, చూశారా ?

అగ్ని : ఓరి కోతివెధవా!

గిరీ : అదిగో తిడుతున్నారూ ? దొర్ల చదువు చదువుకుంటే దొర్ల తరిఫీదు యివ్వక తప్పదు. మీరిలా తిడితే భయపడి కింద పడతాడు. యిలాంటి పనులు మీ కిష్టం లేకపోతే, యింగిలీషు చదువు మానిపించి వేదం చెప్పండి.

అగ్ని : మరిచిపోయి తిట్టాను. యీ యీంగిలీషువాళ్ళ సంగతంతా అదో వెఱ్ఱిమొఱ్ఱి.

గిరీ : మీవంటి ప్రాజ్ఞులు అలా అనడం నాకు ఆశ్చర్యంగా వుంది. వాళ్ళ నడవడిక మంచిదవడంచాతనే దేవుడు యింత రాజైశ్వర్యంగా వాళ్ళకిచ్చాడు. మన శాస్త్రాల్లో మాటలు మనం మరిచిపోయినాము. ఆ మాటలే తెల్లవాళ్లు దొంగతనంగా పట్టుకుపోయి, శాస్త్రం చెప్పినట్టల్లా ఆచరించి మన రాజ్యం లాగుకున్నారు. మీరు యెరిగినవారు గదా ? చెప్పండి. గురువులు దగ్గిర శిష్యులు యేం చేశేవారు ? అడవికి వెళ్ళి చెట్టెక్కి సమిధలు తెచ్చేవారు, రండికీ, మొండికీ ఓర్చేవారు. యిప్పుడు యింత ప్రాజ్ఞులైన మీరే వంటున్నారూ ? మావాడు యిల్లు కదిలి వెళ్ళితే కందిపోతాడు; మావాడు జాంచెట్టెక్కితే కాళ్ళు విరుచుకుంటాడు అని భయపడుతున్నారు. మీ శిష్యులు బ్రహ్మాండవైన మఱ్ఱిచెట్టు కొసకెక్కి ఆకులు కోసి తెస్తున్నారు కారా ? మన పుస్తకాల్లో మర్మం కనుక్కుని దొర్లు బాగుపడుతున్నారు. మన పుస్తకాలు బూజెక్కించి మనం చెడుతున్నాం.

అగ్ని : మీకు చాలా తెలుసును. ఈ తెల్లవాళ్ళు చేసే విద్యలన్నీ మన గ్రంథాల్లోంచి యెత్తుకెళ్ళినవే. యీ రెయిళ్ళూ, గియిళ్ళూ యావత్తూ మన వేదంలో ఉన్నాయష. మీది మా పరిశీలనైన బుద్ధి. మన కేసు గెలవడానికి మీరు రాసిన సవబులు మా బాగున్నాయి.

గిరీ : యింకా బాగుండును. రికార్డు పూర్తిగా లేదు. కొన్ని కాగితాలు మీరే పారేశారో, మీ వకీలే వుంచేసుకున్నాడో నాకు బోధపడకుండా వుంది.

అగ్ని : నేను పారెయ్యలేదండీ! నాకు ఇంగ్లీషు తెలియకపోవడం చాలా చిక్కొచ్చింది.

గిరీ : మీకే యింగ్లీషు వొస్తే భాష్యం అయ్యంగార్లా అయిపోరా ? యీ మడి తడిపేసి వున్న కాగితాలు యావత్తుకూ జావితా రాస్తాను. తమరు వెళ్ళండి.

అగ్ని : మీరు సంసారం పనిపాట్లు యేం శ్రద్ధగా చేసుకుంటారు! మావాడికి మీలా ప్రయోజకత్వం అబ్బితే నా కొహడి అవసరం ఉండదు. దిగేటప్పుడు నిమ్మళంగా, సాయం చేసి మరీ దింపండేం ? కీడెంచి మేలెంచమన్నారు. (నిష్క్రమించును.)

వెంకటే : (నిమ్మళంగా) నాన్న యింట్లో కెళ్ళిపోయినాడు.

గిరీ : నిమ్మళంగా దిగు.

వెంకటే : (వురికి) బతికించారు (వెళ్ళిపోబోవును)

గిరీ : ఆగు ఆగు. ఆ వొళ్ళో పళ్ళి లా పట్రా.

వెంకటే : దొబ్బుతారా యేవిఁటి అన్నీని ? అన్యాయం.

గిరీ : "అన్యాయం పాపనాశనం" అన్నాడు. ఒక్క అన్యాయంతో పాపాలన్నీ పోతాయి ? అన్ని పళ్ళూ నువు మాత్రం తింటావా యేమిటి ? తింటే స్టమకేక్, కడుపు నొప్పొస్తుంది. కడుపునొప్పొస్తే మీ అమ్మ నోరు పగల్దీసి సోలడు ఆవఁదం వసగుండా గొంతులో పోస్తుంది.

వెంకటే : నే నావదం తాగను.

గిరీ : అలా అయితే పళ్ళాట్టే తినకు. (యాతాం వొదిలి వెంకటేశం వొళ్ళోని కాయలు యెంచుచుండును.)

వెంకటే : (యేడుపు మొహంతో) పెద్దపళ్ళన్నీ దొబ్బుతారా యేవిఁటి ?

గిరీ : పెద్దవాళ్ళకి పెద్దపళ్ళూ, చిన్నవాళ్ళకి చిన్నపళ్ళూ. ఇంతసేపూ చెట్టెక్కి చిలకలా కొరికావు చాల్దా ? (నాలుగు పెద్దపళ్లు తీసుకొని వెంకటేశం వీపు తట్టి) మైడియర్ బ్రదరిన్లా! యిహ నీ యిష్టవొఁచ్చినట్లు చెట్లూ, చా'వలూ యెక్కు. ఇంగిలీషువాడు నేచర్ స్డడీ చెయ్యమన్నాడు. జామ చెట్టెక్కినప్పుడు మాత్రం పండూ, పరుపుకాయా, పచ్చికాయా, వీట్ల భేదం బాగా స్టడీచేసి, పళ్లే కొయ్యి. అందులో నాలుగు గురుదక్షిణ కింద నాకియ్యి. లేకుంటే కడుపుబ్బుతుంది. నువ్వొహమాటు చెట్టెక్కిం తరవాత వలేసి చూసినా మరి పరువుకాయ కనబడదు. "యేరకుమీ కసుగాయలు" అన్నాడు, రనెవే! (వెంకటేశం దాటువేసి పారిపోవును) పాచిక పారేటట్టే కనపడుతూంది. ఆహా! యేమి సొగసు ?

కం. నదమా పొక్కిలి, జాంబూ–
నదమా మైచాయ, కోకనదమా పదమా
పదమా జడ, నడుము వియత్
పదమా, నూగారు గూఢపదమా చెలికిన్॥

(నిష్క్రమించును)

కన్యాశుల్కం

చతుర్థాంకము

1వ స్థలము : రామప్పంతులు యింటి సావిడి

(రామప్పంతులు కుర్చీమీద కూర్చుని వుండగా మధురవాణి నిలబడి తమలపాకులు చుట్టి యిచ్చుచుండును.)

రామ : నేనే చిన్నతనంలో యింగిలీసు చదివి వుంటే జడ్జీల యెదట పెళ పెళ లాడించుదును. నాకు వాక్స్థానమందు బృహస్పతి వున్నాడు. అందుచాతనే యింగిలీసు రాకపోయినా నా ప్రభ యిలా వెలుగుతూంది.

మధు : మాటలు నేర్చిన శునకాన్ని వేటకి పంపితె ఉసుకోమంటే ఉసుకో మందిట.

రామ : నేనా శునకాన్ని ?

మధు : హాస్యాఁనికన్న మాటల్లా నిజవఁనుకుంటారేవిఁ ?

రామ : హాస్యానికా అన్నావు ?

మధు : మీతో హాస్యవాఁడకపోతే. ఊరందరితోటీ హాస్యవాఁడమన్నారా యేమిటి ?

రామ : అందరితో హాస్యవాఁడితే యరగనా ?

మధు : అంచాతనే కుక్కన్నా, పందన్నా మిమ్మల్నే అనాలిగాని, మరొకర్ని అనకూడదే! మిమ్మల్ని యేవఁనడానికైనా నాకు హక్కు వుంది. యిక మీ మాటకారితనం నాతో చెప్పేదేమిటి! మీ మాటలకు భ్రమసే కదా మీ మాయలలో పడ్డాను!

రామ : నాకు యింగిలీషే వొస్తే, దొరసాన్లు నా వెనకాతల పరిగెత్తరా ?

మధు : మీ అందానికి మేము తెలుగువాళ్ళము చాలమో ? యింగిలీషంటే జ్ఞాపకం వొఁచ్చింది. గిరీశంగారు మాట్లాడితే దొరలు మాట్లాడినట్లు వుంటుందిట.

రామ : అటా, యిటా! నీకేం తెలుసును ? వాడు వొట్టి బొట్లేరు ముక్కలు పేల్తాడు. ఆ మాటలుగానీ కోర్టులో పేలితే చెప్పుచ్చుకు కొడతారు.

మధు : అదేమో మీకే తెలియాలి గాని, గిరీశంగారు, లుబ్ధావధాన్లు గారి తమ్ములటా ? చెప్పా'రుకారు!

రామ : నీ మనసు వాడిమీదికి వెళుతూందేం ? ఐతే నీ కెందుకు, కాకపోతే నీ కెందుకు ?

మధు : మతి లేని మాటా, సుతి లేని పాటా అని.

రామ : నాకా మతి లేదంటావు ?

మధు : మీకు మతి లేకపోవడవేఁం నాకే.

రామ : యెంచేత ?

మధు : నుదట్న వ్రాయడంచేత.

రామ : యేవఁని రాశుంది ?

మధు : విచారం వ్రాసి వుంది.

రామ : యెందుకు విచారం ?

మధు : గిరీశంగారు, లుబ్ధావుధాన్లుగారి తమ్ముడైతే పెళ్ళికి వొస్తారు. పెళ్ళికి వొస్తే యేదైనా చిలిపిజట్టీ పెట్టి, మీ మీద చేయి చేసుకుంటారేమో అని విచారం.

రామ : అవును, బాగా జ్ఞాపకం చేశావు గాని డబ్బు ఖర్చైపోతుందని అవుఁధాన్లు బంధువుల నెవళ్ళనీ పిలవడు.

మధు : గిరీశంగారు పిలకపోయినా వస్తారు.

రామ : నువుగానీ రమ్మన్నావా యేమిటి ?

మధు : మీకంటే నీతి లేదుగాని నాకు లేదా ?

రామ : మరి వాడొస్తాడని నీకెలా తెలిసింది ?

మధు : పెళ్ళికూతురు అన్నకి చదువు చెప్పడానికి కుదురుకుని, వాళ్లింట పెళ్ళి సప్లయ్ అంతా ఆయనే చేస్తున్నారట. అంచేత రాకతీరరని తలుస్తాను.

రామ : వాడొస్తే యేమి సాధనం ?

మధు : నన్నా అడుగుతారు ?

రామ : పెళ్ళే తప్పిపోతె ?

మధు : యల్లా తప్పుతుంది ?

రామ : తప్పిపోవడానికి ఒక తంత్రం పన్నా'ను.

మధు : అయితే మధురం మాట చెల్లించా'రే ?

రామ : చెల్లించక రావఁప్ప యే చెరువు నీళ్ళు తాగుతాడు ?

మధు : యేదీ ముద్దు. (ముద్దు పెట్టుకొనును)

రామ : గాని మధురం, కీడెంచి మేలిద్దాం. ఒకవేళ దెబ్బ బేజోటు అయిపోయి వాడు రావడవేఁ తటస్థిస్తే యేవిఁటి సాధనం ?

మధు : ఆడదాన్ని నన్నా అడుగుతారు ?

రామ : ఆడదాని బుద్ధి సూక్ష్మం. కోర్టు వ్యవహారం అంటే చెప్పు. యెత్తుకి యెత్తు యింద్రజాలంలా యెత్తుతాను. చెయిముట్టు సరసవఁంటే మాత్రం నాకు కరచరణాలు ఆడవు.

మధు : పెళ్ళి నాలుగు రోజులూ, తలుపేసుకుని యింట్లో కూచోండి.

రామ : ఆడదాని బుద్ధి సూక్ష్మమని చెప్పా'ను కానూ ? మా మంచి ఆలోచన చెప్పా'వు.

మధు : గాని, నాకొక భయం కలుగుతూంది. నిశిరాత్రి వేళ పైగొళ్ళెం బిగించి కొంపకి అగ్గి పెడతాడేమో ?

రామ : చచ్చానేఁ! వాడు కొంపలు ముట్టించే కొరివి ఔను. మరీ యేవిఁగతి ?

మధు : గతి చూపిస్తే ఏమిటి మెప్పు ?

రామ : "నువ్వు సాక్షాత్తూ నన్ను కాపాడిన పరదేవతవి" అంటాను.

మధు : (ముక్కుమీద వేలుంచి) అలాంటి మాట ఆడకూడదు. తప్పు.

రామ : మంచి సలహా అంటూ చెప్పా'వంటే, నాలుగు కాసులిస్తాను.

మధు : డబ్బుడగలేదే ? మెప్పడిగా'ను. నేను నా ప్రాణంతో సమానులైన మిమ్మల్ని కాపాడుకోవడం ఎవరికో ఉపకారం ?

రామ : మెచ్చి యిస్తానన్నా తప్పేనా ?

మధు : తప్పుకాదో ? వేశ్య కాగానే దయాదాక్షిణ్యాలు వుండవో ?

రామ : తప్పొచ్చింది. లెంపలు వాయించుకుంటాను, చెప్పు.

మధు : పెళ్ళి వంటలకి పూటకూళ్ళమ్మని కుదర్చండి.

రామ : శబాష్! ఏమి విలువైన సలహా చెప్పావు. ఏదీ చిన్నముద్దు (పెట్టుకోబోయి ఆగి) గాని గిరీశంగాడు నన్నూ దాన్నికూడా కలిఁయగట్టి తంతాడేమో!

మధు : ఆ భయం మీకక్కరలేదు. పూటకూళ్ళమ్మ కనబడ్డదంటే గిరీశంగారు పుంజాలు తెంపుకు పరుగెత్తుతారు. ఆమె నోరు మహాఁచెడ్డది.

రామ : అవును నోరే కాదు. చెయ్యి కూడా చెడ్డదే. దాం దెబ్బ నీకేం తెలుసును? గాని, మా దొడ్డ సలహా చెప్పావు ఏదీ ముద్దు. (ముద్దు పెట్టుకుంటుండగా, లుబ్ధావధాన్లు ఒక ఉత్తరము చేత పట్టుకుని ప్రవేశించును)

లుబ్ధా : ఏమిటీ అభావచేష్టలూ!

రామ : (గతుక్కుమని తిరిగి చూసి) మావాఁ,పడుచు వాళ్ళం గదా! అయినా, నా మధురవాణిని నేను నడివీధిలో ముద్దెట్టుకుంటే నన్ను అనేవాడెవడు?

మధు : నడికుప్పమీద యెక్కి ముద్దుబెట్టుకోలేరో ? పెంకితనానికి హద్దుండాలి. బావగారికి దండాలు. దయచెయ్యండి. (కుర్చీ తెచ్చివేయును)

రామ : నాకు మావఁగారైతే, నీకు బావగారెలా గేవిఁటి ?

మధు : మా కులానికి అంతా బావలే. తమకు యలా మావఁలైనారో ? (లుబ్ధావధాన్లుతో) కూచోరేం ? ఏమి హేతువోగాని బావగారు కోపంగా కనబడుతున్నారు. రేపు పెళ్ళైన తరవాత అక్కగారిని, వీధి తలుపు గడియ వేసి మరీ ముద్దెట్టుకుంటారేమో చూస్తాను గదా ? అయినా మీ అల్లుడుగారికి చిన్నతనం యింకా వొదిలింది కాదు.

రామ : పైలా పచ్చీసీలో, చిన్నతనం కాక పెద్దతనం యలా వొస్తుంది ? ఏం మావాఁ! కోపవాఁ ?

లుబ్ధా : నాకు పెళ్ళీ వొద్దు, పెడాకులూ వొద్దు.

రామ : (మధురవాణి చెవిలో) చూశావా మధురం, నా యంత్రం అప్పుడే పారింది (పైకి లుబ్ధావధాన్లుతో) అదేం, అలా అంటున్నారు ? నిశ్చయం అయిన తరవాత గునిసి యేం లాభం ?

లుబ్ధా : నీ సొమ్మేం పోయింది ? గునియడం గినియడం కాదు. నా కీ పెళ్ళి అక్కర్లేదు.

మధు : (రామప్పంతులు చెవిలో) ఏమిటా వుత్తరం ?

రామ : (మధురవాణి చెవిలో) అగ్నిహోత్రావధాన్లు పేరుపెట్టి నేనే బనాయించాను.

మధు : (రామప్పంతులు చెవిలో) యేవఁని ?

రామ : (మధురవాణి చెవిలో) నువ్వు ముసలివాడివి గనుక నీ సంబంధం మాకు వొద్దని.

మధు : చిత్రం! చెప్పేస్తాను.

రామ : (మధురవాణి చెవిలో) నీకు మతిపోయిందా ఏమిటి ? పెళ్ళి తప్పించమని నువ్వే నా ప్రాణాలు కొరికితే, యీ యెత్తు యెత్తాను. నోరు మూసుకో.

మధు : (లుబ్ధావధాన్లు చెవిలో) యీ సంబంధం మీకు కట్టిపెట్టాలని పంతులు చూస్తున్నారు. వొప్పుకోకండి.

రామ : (మధురవాణితో) యేమీ బేహద్బీ! (లుబ్ధావధాన్లుతో) స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః అన్నాడు. దాని మాటలు నమ్మకండి. కల్పనకి అంత మనిషి లేదు.

లుబ్ధా : (చేతిలోని ఉత్తరమును ఆడిస్తూ) ఈ కుట్రంతా నీదే.

రామ : (తీక్ష్ణంగా మధురవాణి వైపు చూసి, లుబ్ధావధాన్లుతో) కోపం కోపంలా వుండాలిగాని, ఏకవచన ప్ర'యోగం కూడదు.

లుబ్ధా : ఇదంతా మీ కల్పనే. కొంప ముంచడానికి తలపెట్టా'రు. చదవండి.

రామ : (ఉత్తరం అందుకోక కుర్చీ వెనక్కి తీసుకుని) ఆ ఉత్తరం సంగతి నాకేం తెలుసును ?

లుబ్ధా : చేసినవాడివి నీకు తెలియకపోతే, యెవరికి తెలుస్తుంది ?

రామ : అదుగో, మళ్ళీ యేకవచన ప్ర'యోగం! మెత్తగా మాట్లాడుతున్నానని కాబోలు ఆనాడీ చేస్తున్నారు ? వుత్తరం గిత్తరం నేను కల్పించానని మళ్ళీ

అన్నారంటే కథ చాలా దూరం వెళుతుంది. ఆ సంగతి మట్టుకు కాని వుండండి. రామప్పంతులు తడాఖా అంటే యేవఁనుకున్నారో ?

లుబ్ధా : నువ్వు...

రామ : అదుగో మళ్ళీ.

లుబ్ధా : మీ కల్పనైతేనేం, మరొహరి కల్పనైతేనేమి ? బుద్ధి పొరపాటు నాది. మధ్య వెధవలతో నాకేం పని. వెంటనే బయల్దేరి పోయి, ఆ అగ్ని హొత్రావుధాన్లునే అడుగుతాను.

రామ : మాటలు మా జోరుగా వొస్తున్నాయి. జాగ్రత్త (లుబ్ధావధాన్లు వెళ్ళును.) నన్నేనా వెధవలు అంటున్నాడు ?

మధు : నన్ను కూడా కలుపుకోవాలని వుందా యేవిఁటండి ?

రామ : నన్ను మట్టుకు వెధవకింద కట్టా'వూ ?

మధు : నేనుండగా వెధవలు మీరెలా అవుతారు ?

రామ : నన్ను సప్త వెధవని చేశావు. మరి ఇంకా తరవాయి యేం వుంచావు ?

మధు : అదేవిఁటి ఆ మాటలు ?

రామ : ఆ వుత్తరం నేను బనాయించానని ఆ వెధవతో యెందుకు చెప్పావు ?

మధు : మీతోడు! నేను చెప్పలేదే ?

రామ : మరి నేను బనాయించానని వాడికెలా తెలిసింది ?

మధు : యెందుకీ ఆందోళన ?

రామ : మరి, ఆ వెధవ ఆ వుత్తరం తీసికెళ్ళి అగ్నిహొత్రావుధాన్లుకి చూపిస్తే, నా మీద వాడు వెంటనే ఫోర్జరీ కేసు బనాయిస్తాడే! పీక తెగిపోతుంది, యేవిఁటి సాధనం ?

మధు : యంత్రం యెదురు తిరిగిందో, ఐతే చక్రం అడ్డువేస్తాను (తొందరగా వీధిలోకి వెళ్లును.)

రామ : యిదెక్కడికి పారిపోతుంది ? యిదే చెప్పేసింది. దొంగ పని చేసినప్పుడు, రెండో వారితో చెప్పకూడదు. వెధవని చెవులు నులుపుకుంటాను. పరుగెత్తి

వెళ్ళి చేతులో కాగితం నులుపుకొత్తునా ?.... గాడిద కొడుకు కరిస్తే ? పోయి మీనాక్షి కాళ్లు పట్టుకుంటాను.

(మధురవాణి వక చేతితో వుత్తరం, వక చేతితో లుబ్ధావధాన్లు చెయ్యి పట్టుకుని ప్రవేశించును.)

మధు : (రామప్పంతులుతో) చాలు, చాలు మీ ప్రయోజకత్వం! బావగారికి అన్నా, తమ్ముడా, కొడుకా, కొమ్మా ? మిమ్మల్ని ఆప్తులని నమ్ముకుని సలహాకి వస్తే ఆలోచనా పాలోచనా చెప్పక ఏకవచనం, బహువచనం అని కాష్టవాదం పెట్టా'రు. బావా! కుర్చీమీద కూచోండి. (కుర్చీ మీద కూచోబెట్టి, రామప్పంతులుతో) యీ వుత్తరం యేవిఁటో నింపాదిగా చదివి చూచుకోండి. (వుత్తరం రామప్పంతులు చేతికి ఇచ్చును.)

రామ : (వుత్తరం అందుకుని తనలో) బతికాన్రా దేవుడా! (చూచుకొని) అరె! నా వుత్తరంవేఁ కాదే యిది! నా నీడ చూచి నేనే బెదిరాను, (పైకి) మావాఁ! వొస్తూనే తిట్లతో ఆరంభిస్తే యెంతవాడికైనా కొంచం కోపం వస్తుంది. నెమ్మదిగానూ, మర్యాదగానూ, నన్నొచ్చి యేం సహాయం చెయ్యమంటే అది చెయ్యనూ ?

లుబ్ధా : మరైతే యీ పటాటోపం వొద్దని రాయండి. అతగాడికి పటాటోపం కావలిస్తే ఆ ఖర్చంతా అతగాడే పెట్టుకోవాలి.

మధు : (లుబ్ధావధాన్లు జుట్టుముడి విప్పి దులిపి) యేం ధూళి! సంరక్షణ చేసే వాళ్లు లేకపోబట్టి గదా ? (గూటిలోనుంచి వాసననూనె, దువ్వెన తెచ్చి తల దువ్వుచుండును.

రామ : (వుత్తరం తిప్పి కొసచూసి చదువును) "సేవకుడు, తమ్ముడు గిరీశం"... వీడా!

మధు : పైకి చదవండి.

రామ : నీ గిరీశం అనగానే పైకి చదవాలేం ?

మధు : అయితే, మీరే చదువుకు ఆనందించండి.

లుబ్ధా : 'నీ గిరీశం' అన్నారేం ?

రామ : అది వేరే కథ.

లుబ్ధా : పైకి చదవండి.

రామ : (చదువును.) "సేవకుడు, తమ అత్యంత ప్రియసోదరుడు గిరీశం అనేక నమస్కారములు చేసి రాయంగల విన్నపములు. త॥ యీనాటికి వృద్ధాప్యంలో నయినా మీరు తిరిగి వివాహం చేసుకొని ఒక యింటివారు కావడమునకు నిశ్చయించితిరన్న మాట విని యమందానంద కందళిత హృదయారవిందుడనైతిని."

లుబ్ధా : వెధవ, వృద్ధాప్యవంటాడూ ? నిన్నగాక మొన్ననే గదా యాభై దాటా'యి.

మధు : (దువ్వెన మొలను పెట్టి, లుబ్ధావధాన్లు జుత్తు ముడి వేసి) సంరక్షణ లేక ఇలా ఉన్నారుగాని, యవరు మిమ్మల్ని ముసలివాళ్ళనేవారు.

రామ : (చదువును) "మీకు కాబోవు భార్య నా ప్రియశిష్యుండగు వెంకటేశ్వర్లు చెల్లియ లగుటంచేత నాకు బ్రహ్మానందమైనది. నేను అగ్నిహోత్రావధాన్లు గారి యింటనే పెళ్లి పనులు చేయించుచున్నాడను. వారు నన్ను పుత్ర ప్రాయముగా నాదరించుచున్నారు. బహు దొడ్డవారేగాని చంద్రునకు కళంకమున్నటుల వారికి కించిత్తు ద్రవ్యాశా, కించిత్తు ప్రథమ కోపముం గలవు" వ్యాకరణం వెలిగిస్తున్నాడయ్యా గుంటడూ!

"షరా – ఆ కోపం వొచ్చినప్పుడు మాత్రం యెదట పడకుండా దాగుంటే యెముకలు విరగవు. ప్రాణం బచాయిస్తుంది; మరేమీ ఫర్వా వుండదు... ద్రవ్యాశ అనగా అది వారికిగాని, మీకుగాని ఉపచరించేది కాదు. మీ వూరివా రెవరో గాని వక తుంటరి, మీరు విశేష ధనవంతులనియు, పెళ్లి దేవదుందుభులు మ్రోయునటుల చేతురనియు వర్తమానము చేయుటను, యేబది బండ్లమీద యీ వూరివారి నందరిని తర్లించుకు రానై యున్నారు. ఇంతియకాక దివాంజీ సాహేబువారి నడిగి, ఒక కుంజరంబునూ, మూడు లొట్టియలనూ, యేను గుర్రంబులుగూడ తేనై యున్నారు. బంగారుపుటడ్డల పల్లకీగూడ దెచ్చెదరు.

"షరా – దానిమీద సవారీ ఐ. ఆలండౌబత్తులతో వూరేగి, పెళ్ళి చేసుకోవడం నాకు కన్నులపండువేగాని, యిదంతా వృథావ్యయం గదా,

అని నాలాటి ఆప్తులు విచారిస్తున్నారు. యెద్దుపుండు కాకికి రుచి. రామప్పంతులు సొమ్మేం పోయింది!"

వెధవ, నా వూసెందుకోయి వీడికి ?

"యిందులో ఒక పరమ రహస్యం. అది యెద్దియనిని, యీ రామప్పంతులు చిక్కులకు జాకాల్; తెలివికి బిగ్ యాస్.

యిదేవిఁటోయి యీ బొట్లేరు యింగిలీషు!"

"అనగా...."

వ్యాఖ్యానం కూడా వెలిగిస్తున్నాడయ్యా!

"జాకాల్ అనేది గుంటనక్క"

పింజారీ వెధవ!

"బిగ్ యాస్ అనగా పెద్ద...."

వీడి సిగ దరగా! యేం వీడి పోయీకాలం! వీడిమీద తక్షణం డామేజి దావా పడేస్తాను.

(మధురవాణికి నవ్వొచ్చి ఆపుకోజాలక, విరగపడి నవ్వును.)

రామ : యెందుకలా నవ్వుతావు! నీ మొగుడు తిడుతున్నాడనా ఆనందం!

మధు : (నవ్వుచేత మాట తెమలక, కొంత సేపటికి) కాదు కాదు – మీ తోడు.... లొటి...

రామ : నాతోడేవిఁటి! నేను చస్తే నీకు ఆనందవేఁ!

మధు : (ముక్కుమీద వేలువుంచి, రామప్పంతులు దగ్గరకు వెళ్ళి శిరస్సు కౌగిలించుకొని, ముద్దెట్టుకొనును) యేమి దుష్టమాటా!

రామ : మరెందుకు నవ్వుతావ్ ?

మధు : లొటి... లొటి... లొటి

రామ : యేవిఁటా "లొటి!"

మధు : లొటి.... పిట

రామ : అవును. లొటిపిట. అయితే ?

మధు : (సమాళించుకొని) ఎందుకో ?

రామ : యెందుకో నాకేం తెలుసును!

మధు : వుత్తరం వల్ల మీరే తెమ్మన్నట్లు అగపడుతుందే ?

రామ : నేనా, నేనా ? నా కెందుకూ లొటిపిట ?

మధు : (ఉప్పెనగా తిరిగీ నవ్వుతూ) యెక్కడానికి.

రామ : నేనా యెక్కడం ?

మధు : యెందుకు కూడదూ ? మీరొక లొటిపిట, బావగా రొక లొటిపిట, పో – పో, పోలిశెట్టి–పెళ్ళి సప్లయిదారుడు గనక, అతడో లొటిపిట – యెక్కి పొలాలంట... వూరేగండి... వెన్నుకుప్పెక్కి.... ఆ వైభవం కళారా చూస్తాం! (మిక్కిలిగా నవ్వును. నవ్వు సమాళించుకుని) బావగారూ, క్షమించండి. ఆ దుష్టవ్రాతకి నవ్వాను మరేం గాదు.

రామ : దుష్టంటే దుష్టా! గాడిద'!

లుబ్ధా : మీ రొహ పెద్ద గాడిద'ని కూడా తెమ్మన్నారని కాబోలు రాశాడండీ!

రామ : లేదు. లేదు, గాడిదె మాట వుత్తరంలో యక్కడా లేదు.

లుబ్ధా : వుంది. నేను చదివా'నండీ. 'గాడిద' నెందుకు తెమ్మన్నావయ్యా నా నెత్తిమీదికి ?

రామ : నీకు మతిపోతుందా యేమిటి! గాడిదెమాట లేదంటూంటేనే ? (మధురవాణి తిరిగీ నవ్వుచుండును) నీ క్కూడా మతిపోయిందీ ? యెందుకా నవ్వు ? నన్ను చూశా ? అవధాన్లును చూశా ?

మధు : యెందుకు ఆ అనుమానం ?.... సామెత... వుంది.

రామ : యేమిటా సామెతా గీమితాను ?

మధు : గాడిద' అందిట... పాటకి నేను.... అందానికి.... మా అప్పా...అందిట...

రామ : అంటే ?

మధు : పెళ్లికి గాడిద'... లొటిపిటా' మాట... యిన్నాళ్ళకి మళ్ళీ విన్నాను గదా అని.

రామ : వింటే ?

మధు : నవ్వొచ్చింది. మీరుకూడా నవ్వరాదూ ? యెందుకీ దెబ్బలాట ?

రామ : వీడిమీద డా'మేజి దావా వెంటనే పడేస్తాను.

మధు : (లుబ్ధావధాన్లుతో) బావా! యెందుకు మా పంతులుగారిమీద అన్యాయంగా అనుమానం పడతారు ? ఆయన నిజంగా మిమ్మల్ని అన్నగార్లా భావించుకుంటున్నారు. గిరీశంగారు పంతులుమీద వ్రాయడానికి కారణాంతరం వున్నది. మీతో చెప్పవలసిన సంగతి కాదుగాని, మీ ఉభయులకూ స్నేహం చెడడానికి సిద్ధంగా వున్నప్పుడు చెప్పక తీరదు. మీ గిరీశంగారు నాకు కొన్నాళ్ళు యింగ్లీషు చెప్పేవారు, కొద్దిరోజులు నన్ను వుంచుకున్నారు. మా పంతులుగారు, ఆయన దగ్గిరనుంచి నన్ను తీసుకువెళ్ళిపోయి వచ్చినారనే దుఃఖంచేత లేనిపోని మాటలు కల్పించి, "నక్కా గిక్కా" అని వ్రాశారు గాని, ఆ లొల్లిమాటలు నమ్మకండి.

రామ : "నక్కా గిక్కా" వొట్టినే పోతుందనుకున్నావా యేమిటి ? డా'మేజి దావా పడ్డ తరవాత దాని సంగతి తెలుస్తుంది.

మధు : బావా, మరొకమాటు ఆలోచించండి, పంతులకేం లాభం యేనుగులూ, లొటిపిటలూ, గాడిద'లూ (నవ్వును)

రామ : మనిషివికావా యేమిటి ? గాడిదమాట లేదంటూంటేనే ?

మధు : పోనియ్యండి. మీకెందుకు కోపం ? గాడిద'లు లేకపోతే కడంవ్వే ఆయెను. యివన్నీ మీ యింటిమీద పడి తింటే మా పంతులుగారికి యేం లాభం చెప్పండీ ? ఒకవేళ రాతబుబేరం జరుగుతుంది గనక పోలిశెట్టికి లాభించవచ్చును.

లుబ్ధా : బాగా చెప్పావు.... పోలిశెట్టి చేసిన పనే:

రామ : చవగ్గా చేస్తాడని ఖర్చువెచ్చం కోవఁటాడిమీద పెట్టా'వు. అనుభవించు.

మధు : యిప్పుడు మించిపోయినదేమి ? పెళ్ళికూతుర్ని పంపిస్తే పదిరూపాయలు ఖర్చుతో యిక్కడ ముడిపెట్టేస్తాం! మీరెవరూ రావద్దని మీ మావఁగారి పేర వుత్తరం వ్రాయండి.

లుబ్ధా : మా ప్ర'శస్తమైన ఆలోచన చెప్పావు. మావఁగారూ మధురం మా బుద్ధిమంతురాలు.

రామ : అదిగో! "మధురం గిధురం" అని మీరు అనకూడదు. "మధురవాణి" అనాలి.

లుబ్ధా : పొరపాటు... గాని తీరా మోసి వాళ్ళు పెళ్ళికూతుర్ని ఒక్కర్తైనే పంపించేస్తే?

మధు : మరేం! మీ తీపు దిగదీసింది ? పెళ్ళి చేసుకోండి.

లుబ్ధా : నా ప్రాణంపోతే యీ సంబంధం చేసుకోను ఆ వుత్తరం కొసాకూ చదివితే అభావచేష్టలు మీకే బోధపడతాయి.

మధు : చదవడం మానేసి యేవిటి ఆలోచిస్తున్నారు ?

రామ : గిరీశంగాడి మీద పరువునష్టానికి డా'మేజి దావా తేక మాన్ను.... వాడి మొహంలాగే వుంది ఉత్తరం. చదివేదేవిఁటి ?

లుబ్ధా : మా వెధవ నా పరువు మాత్రం యేమైనా వుంచా'డనా ? అయినా తరవాయి చదవండీ.

రామ : (చదువును) తాజాకలం – చిన్నది బహు లక్షణంగా వుంటుంది. గాని కొంచెం పెయ్యినాకుడుమాత్రం కద్దు. అద్దానిని మనవారు వైధవ్య హేతువ అంద్రు. ఇది వట్టి సూప... సూపర్ స్టి...షన్... అనగా, తెలివితక్కువ నమ్మకం. మనవంటి ప్రాజ్ఞులు లెక్కించవలసినది కాదు. షరా – దీనికి వక చిన్న బైరాగిచిటికీ వున్నది. చిమ్మిటతో పెయ్యినాకుడు వెండ్రుక లూడబీకి ఒక పొడరు... అనగా గుండ కద్దు : ఆ గుండ ప్రామినచో మరల పెయ్యినాకుడు పుట్టనేరదు. ఈలోగా దైవాత్తూ వైధవ్యంబే ప్రాప్తించినచో, పదే పదే క్షౌరంబౌను గావున పెయ్యినాకుడు బాధించ నేరదు. రెండవ నెంబరు షరా – ఒకవేళ వైధవ్యం తటస్థించినా మా వదెనగారు జుత్తు పెంచుకునే యెడల, మీరేం చెయ్యగలరు. నేనేం చెయ్యగలను ?

మధు : చాల్చాలు; యీ పాటికి చాలించండి. గిరీశంగారు యేం తుంటరి!

రామ : యిప్పుడైనా వాడి నైజం మీకు బోధపడ్డదా! (చదువును)

"మూడవ షరా : యీరోజుల్లో స్త్రీ పునర్వివాహం గడబిడ లావుగా నున్నది. తమకు విశదమే. మీరు స్వర్గంబునకుం బోయి ఇంద్రభోగం అనుభవించు చుండ నామెకు పునర్వివాహము చేసికొన బుద్ధి పొడమవచ్చును. అది

మాత్రం నేను ఆపజాలనని స్పష్టముగా తెలియునది. ఏలననిన, వద్దని మందలించుటకు ఎదుట పడితినో "మీ యన్న స్వర్గంబున రంభతో పరమానందంబు నొందుచు వున్నారు కదా, నా గతేమి ?" యని యడిగినచో నేమి యుత్తర మీయువాడ ?"

మధు : మరి చాలించండి.

రామ : నీ యిష్టం వొచ్చినప్పుడు చదివి, నీ యిష్టం వొచ్చినప్పుడు మానేస్తాననుకున్నావా ? (చదువుకు) "నాల్గవ షరా – కొదువ అన్ని హంశములు బహు బాగా వున్నవి. తప్పకుండా యీ సంబంధం మీరు చేసుకోవలసిందే. మీ అత్తగారు సాక్షాత్తూ అరుంధతి వంటివారు. మనలో మన మాట. ఆమెకు యీ సంబంధం యంత మాత్రమూ యిష్టము లేదు. పుస్తెకట్టే సమయమందు, మీ యింటి నూతులో పడి ప్రాణత్యాగం చేసుకుంటానని యిరుగు పొరుగమ్మలతో అంటున్నారు. గాని ఫర్వాలేదు. ఆ నాలుగు గడియలూ కాళ్ళూ, చేతులూ కట్టేద్దాం. మూడు ముళ్ళూ పడ్డ తరవాత నూతిలో పడితే పడనియ్యండి. మన సొమ్మేం బోయింది ? పోలీసువాళ్ళ చిక్కు లేకుండా మాత్రం వాళ్ళకేమైనా పారేసి వాళ్ళని కట్టుకోవలసి వస్తుంది. యీ సంగతులు యావత్తు మీ మేలుకోరి వ్రాసితిని. యిక్కడ వారికి తెలియరాదు. మరిచిపోయినాను. పిల్లజాతకం అత్యుత్కృష్టంగానే వుందట. ఆ బనాయింపు కూడా రామ...

మధు : రామ... ?

రామ : అది ఆడవాళ్ళు వినవలసిన మాట కాదు.

మధు : అదికూడా మీరే బనాయించా రంటాడేవిఁటండీ ?

రామ : వాటినోటికి శుద్ధీ, బద్ధం వుందీ ? డా'మేజి పడితేగాని కట్టదు.

లుబ్ధా : కొంచం అయినా నిజం వుండకపోతుందా, అని నా భయం. అత్తగారికి యిష్టం లేదని పోలిశెట్టి కూడా చెప్పా'డు. యీ సంబంధానికి వేయివేల దణ్ణాలు, నొ కొద్దు బాబూ!

మధు : బాగా అన్నారు. మీ సంబంధం మాకు యెంత మాత్రం వొద్దని మీ మావఁగారిఁ పేర వ్రాయండి. కాగితం, కలం తేనా ?

లుబ్ధా : మావాఁ! మరి ముందూ వెనకా ఆలోచించక వెంటనే ఉత్తరం రాసిపెట్టండి. (నిలబడి మధురవాణి చెవిలో రహస్యము మాట్లాడును. మధురవాణి, లుబ్ధావధాన్లు చెవిలో మట్లాడును.)

రామ : మొహం మీద మొహంపెట్టి, యేవిఁటా గుసగుసలు ?

పైనుంచి పోస్టు జవాను : లుబ్ధావధాన్లుగా రున్నారండీ ? వుత్తరం వొచ్చింది."

(మధురవాణి పైకి వెళ్ళి వుత్తరము తెచ్చి లుబ్ధావధాన్లు చేతికి యిచ్చును. లుబ్ధావధాన్లు రామప్పంతులు చేతికి యిచ్చును.)

లుబ్ధా : సులోచనాలు తా'లేదు. మీరే చదవండి.

రామ : (తనలో చదువుతూ) మరేవీఁ! చిక్కే వొదిలిపోయింది. మీ మావగారి దగ్గర్నించి.

లుబ్ధా : యేవఁని ? యేనుగులూ, లొటిపిటలూ తా'నంటాడా యేవిఁటండీ ?

రామ : మీ సంబంధవేఁ అక్కర్లేదట.

లుబ్ధా : యేవిటీ ? యెంచా'తనో ? వాడికా అక్కర్లేదు ? నాకా అక్కర్లేదు ? తన పరువుకి నే తగా'ను కానో ?

మధు : నిమిషం కిందట పెళ్ళి వొద్దన్నారే ? ఇప్పుడు పెళ్ళి తప్పిపోయిందని కోపవాఁ ?

లుబ్ధా : యింకా యేం కూస్తాడో చెప్పండి ?

రామ : మీరు పీసిరిగొట్టని యెవరో చెప్పారట.

లుబ్ధా : నేనా పీసిరిగొట్టుని ? వొక్క పాటున పద్దెనిమిది వందలు యే పీసిరిగొట్టు పోస్తాడు ? యింత సొమ్ము యెన్నడైనా, ఒక్కసారి, అగ్నిహొూత్రావుధాన్లు కళ్ళతో చూశాడూ ? సంసారం పొక్తుగా చేసుకుంటే పీసిరిగొట్టా ? వాడి సొమ్ము వాడి నెత్తిన కొట్టిన తరవాత, నేనెలాంటివాణ్ణి అయితే వాడికేం కావాలి ?

మధు : యెలాంటివాళ్లేం ? బంగారంలా వున్నారు!

రామ : మీరు ముసలివాళ్ళనీ, మీకు క్షయరోగం వుందని కూడా యెవరో చెప్పా'రట.

లుబ్ధా : నేను ముసలివాణ్ణా! వీడి సిగతరగా! యాభై యేళ్ళకే ముసలిటండీ ? కొంచ'ం దగ్గు వుండటమేఁ కాగట్టండి (దగ్గును) నిలువెడు ధనం పోసి పిల్లని కొనుకున్న తరవాత మరి దాని ఘోషా, నా ఘోషా వాడి కెందుకయ్యా ? డబ్బుచ్చుకున్న తరవాత చచ్చిన శవానికైనా కట్టక తీరదు. మాట్టాడ్రేం ?

రామ : అవును : నిజవేఁ. మీరు ముసలివాళ్ళైతే మాత్రం ?

లుబ్ధా : అదుగో 'ఐతే మాత్రం అంటారేవిటి ? నువ్వే పెట్టా'వు కాబోలు యీ పెంటంతాను.

రామ : అన్ని పెంటలు పెట్టడానికి మీ తమ్ముడు గిరీశం అక్కడే వున్నాడు కదూ?

లుబ్ధా : వీడు అక్కడెలా పోగయినాడయ్యా నాకు, శనిలాగ ?

మధు : ఏమి యీ మగవారి చిత్రం! యింతసేపూ పెళ్ళి వొద్దని వగిస్తిరి: యిప్పుడు పెళ్ళి తేలిపోయిందని వగుస్తున్నారు. నిజంగా మీకు పెళ్ళా'డాలని వుందండీ ?

లుబ్ధా : వుంటే వుంది. లేకపోతే లేదు. గాని యీ దుర్భాషలు నేను పడి వూరుకుంటానా ?

మధు : మరేం జేస్తారు!

రామ : యేం జేస్తారా! డా'మేజీకి దావా తెస్తారు.

లుబ్ధా : దావా వొద్దు. నీ పుణ్యం వుంటుంది. వూరుకో బాబూ!

రామ : కాకపోతే యింతకన్న చవకైనదీ, సాంప్రదాయమైనదీ సంబంధం కుదిర్చి చేసుకున్నావఁంటే అగ్నిహోత్రావధాన్లుని చెప్పుచ్చుకు కొట్టినట్టు వుంటుంది.

లుబ్ధా : చవగ్గా కుదరడవెఁలాగ ?

మధు : నా మాట విని పెళ్ళి మానేసి వూరుకోండి.

లుబ్ధా : యేం ? ముసలివాణ్ణని నీకూ తోచిందా ఏవిఁటి ?

మధు : మీరా ముసలివాళ్ళు ? యవరా అన్నవారు ?

లుబ్ధా : నీకున్న బుద్ధి అగ్నిహోత్రావుధాన్లుకి వుంటే బాగుండును.

మధు : ఓ పన్ను కదిలిందా ? కన్నుకు దృష్టి తగ్గిందా ? చూడండి. మీ కండలు కమ్మెచ్చులు తీసినట్లు యలా ఉన్నాయో ?

లుబ్ధా : (తన దండలు చూసుకొని) మావఁ పెరట్లో గొప్పు తవ్వడం నుంచి దండలు మోటుగా వున్నాయి. గాని నా దండలు సన్నవైనా ఉక్కుఖడ్డీలు.

మధు : (తన చీరకొంగుతో లుబ్ధావధాన్లు ఛాతీ కొలిచి) యెంత ఛాతీ!

రామ : ఏమి టీ వాళకం ?

మధు : ఉత్తరం మీలో మీరు చదువుకుంటారేం ? పైకి చదవండీ ?

రామ : నువ్వు నన్ను ఆజ్ఞాపించే పాటిదానవా ? మేం చదువుకుంటాం. యివి ఆడవాళ్ళు వినవలసిన మాటాలు కావు. నువ్వు అవతలకి వెళ్ళు.

మధు : నేను కదలను.

రామ : అమాంతంగా యెత్తుకెళ్ళి వెనకింట్లో కుదేస్తాను.

మధు : (కుర్చీ వెనకను నిలబడి. లుబ్ధావధాన్లు దండలు చేతులతో గట్టిగా పట్టుకుని) మార్కండేయులు శివుణ్ణి చుట్టుకొన్నట్లు బావగార్ని చుట్టుకుంటాను, యెలా లాక్కు వెళతారో చూస్తాను.

లుబ్ధా : (తనలో) ఏమి మృదువూ చేతులు! తల తలదగ్గర చేరిస్తే ఏమి ఘుమఘుమా! (పైకి) "బాలాదపి సుభాషితం" అన్నాదు మావఁగారూ!... మధురవాణ్ణి వుణ్ణియ్యండి. మంచి బుద్ధిమంతురాలు. నిజం కనిపెడుతుంది.

రామ : అయితే మరి విను – "మీ కొమార్తె ప్రవర్తన బాగా వుండకపోవడంచా'త మిమ్మల్ని వెలేశారని లోకంలో వార్త గట్టిగా వున్నది.

లుబ్ధా : (కొంత తడ వూరుకొని,) నువ్వే నా కొంప తీశావు.

మధు : పంతులేనా ?

లుబ్ధా : ఒహర్ననవలసిన పనేఁ వుంది ?

మధు : (కొంత తడ వూరుకుని) నేను మీ యింటికి వెళ్ళిపోయొస్తాను. రండి. పెళ్ళీ గిళ్ళీ మానెయ్యండి. మీకు పెళ్లాంకన్న ఎక్కువగా సంరక్షణ చేస్తాను.

లుబ్ధా : (ఆనందం కనపరుస్తూ) బీదవాణ్ణి, నేను డబ్బివ్వలేనే ? నీలాంటి విలువైన వస్తువును పంతులుగారే భరించాలి.

మధు : నాకు డబ్బక్కర్లేదు. తిండి పెడతారా ?

లుబ్ధా : ఆహా! అందుకు లోపవాఁ!

మధు : ఐతే పదండి మరి – యీ పంతులుగారి మాయ మాటలు వినక పెళ్ళి మానేసి, సుఖంగా యింట్లో కూచుందురుగాని.

రామ : (మధురవాణి వైపు తీక్షణముగా చూసి) నువ్వు భోజనం చెయ్యలేదన్న మాట జ్ఞాపకం వుందా ? వెళ్ళు.

మధు : మీ చర్య చూస్తేనే కడుపు నిండుతుంది. (చఱ్ఱుమని యింటిలోనికి పోవును.)

లుబ్ధా : యీ మధురవాణి... విన్నారా మావాఁ! వేశ్య అయినా చాలా తెలివైన మనిషి. మన సంసార్లకి, దానికి వున్న బుద్ధి వుంటే బతికిపోదుం.

రామ : అవుఁను. బుద్ధిమంతురాలే, గాని వొళ్ళెరగని కోపం. యేవైఁనా వెఱ్ఱి అనుమానం పుట్టితే తనూ పై కానదు. చూశారా, మావాఁ, మీలాంటి శిష్టులు సానివాళ్ళ శరీరం తాకకూడదు. అది చిన్నతనం చేత మొఖం మీద మొఖం పెడితే, "పిల్లా, యడంగా నిలబడి మాట్లాడు" అని చెప్పాలి. ఒక్కటే వొచ్చింది దీనికి దుర్గుణం. పరాయివాళ్ళతో మాట్లాడితే గాని దానికి తోచదు. పట్ణవాసంలో ఉండడం నించి ఆ దురలవాటు అబ్బింది.

లుబ్ధా : చిన్నతనం గదా! మధురాణి నా పిల్లలాంటిది. ముట్టుకుంటే అదో తప్పుగా భావించకండి.

రామ : నీ సొమ్మేంబోయింది! అదికాదు. చూశారా మావాఁ! వుంచుకొన్న ముండాకొడుకు యదట మరో మొగాణ్ణి పట్టుకుని "వీడి దండలు కమ్మెచ్చు తీసినట్టున్నాయి. వీడి ఛాతీ భారీగా వుంది"... అని చెవిలో నోరు పెట్టి గుసగుసలాడుతూంటే అగ్గెత్తుకొస్తుందా రాదా ?

లుబ్ధా : పొరపాటు. లెంపలు వాయించుకుంటాను. క్షమించండి...

రామ : మీ లెంపలు వాయించుకుంటే కార్యం లేదు. దాని లెంపలు వాయించాలి. మీ మీద దానికి కొంచం యిష్టం ఉన్నట్టుంది. గట్టిగా బుద్ధి చెప్పండి.

లుబ్ధా : నా మీద యిష్టవేఁవిటి మావాఁ! యక్కడైనా కద్దా ?

రామ : మీ యింటికి వెళ్ళిపోయెస్తానంటూందే! మరి తీసికెళ్లు.

(పై మాట లాడుచుండగా మధురవాణి పట్టుచీర కట్టుకుని ప్రవేశించును.)

మధు : అలాగే తీసికెళ్తారు. మీకు భారవైఁతేను. ఆ మహానుభావుడికి చాకిరి చేస్తే పరం ఐనా వుంటుంది.

లుబ్ధా : మామగారు హాస్యానికి అంటున్నారు గాని, నిన్నొదుల్తారా ? నే తగను, తగను.

రామ : అలా గడ్డి పెట్టండి.

మధు : ఆయన హాస్యానికి అంటున్నా, నేను నిజానికే అంటున్నాను. గడ్డి గాడి'దలు తింటాయి; మనుష్యులు తినరు.

రామ : అదుగో, మళ్ళీ గాడిద' అంటుంది! (మధురవాణి నవ్వు దాచుటకు ముఖం తిప్పికొని, లో గుమ్మము దాటి విరగబడి నవ్వును.)

లుబ్ధా : మధురవాణికి మీ దగ్గిర భయం, భక్తి కూడా కద్దు.

రామ : వుంది. కోపం వొస్తే గడ్డిపరకంత ఖాతరీ చెయ్యదు. పరాయిమనిషి వున్నాడని అయినా కానదు.

లుబ్ధా : పెళ్ళి ప్ర'యత్నం యిక మానుకోవడవేఁ ఉత్తమం అని తోస్తుంది. యేవిఁటి తమ శలవు ?

రామ : నా శలవేం ఏడిసింది ? పెళ్ళి చేసుకోవద్దని మధురవాణి శలవైంది. దాని బుద్ధికి ఆనందించి అలా నడుచుకుంటున్నారు. 'స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః' అని చెప్పనే చెప్పారు.

లుబ్ధా : మీరు ఆప్తులనేగదా మీ సలహాకి వొచ్చా'ను. మధురవాణి చెప్పిందనా పెళ్లి వద్దంటున్నాను ? తప్పిన పెళ్లి తప్పిపోయింది. ఖర్చులు కూడొచ్చాయిగదా అని సంతోషిస్తున్నాను.

రామ : రెడ్డొచ్చాడు మొదలా డన్నాడట. సాధక బాధకాలు ఎన్ని పర్యాయములు చెప్పినా అవి అన్నీ పూర్వపక్షం ఐ ముక్తాయింపు మళ్ళీ డబ్బుమీదికి

వొస్తూ వుంటుంది. పెళ్లి చేసుకుని కడుపు ఫలిస్తే మీ ఇల్లు పది యిళ్లౌతుంది. పెళ్లి చేసుకోక గుటుక్కుమంటే యీ కష్టపడి ఆర్జించిన డబ్బంతా యవడిపాలు కాను ?

లుబ్ధా : అదుగో, ఏమో యెక్కువ ధనం వున్నట్టు శలవిస్తారు. నాకేవుంది ?

రామ : వున్నంత ఉంది. పరానికి యిన్ని నీళ్ళచుక్కలు వొదిలే వాడుండాలా ?

లుబ్ధా : అలా అయితే, తమరెందుకు పెళ్లి చేసుకున్నారు కారూ ?...

రామ : నేను పిత్రార్జితం అంతా కరరావుండు చుట్టివేశాను. యిక పరానికా ? శాక్తేయుణ్ణి, యోగసాధనం చేస్తాను. నాకు మరి కర్మతో పని లేదు. లోకం కోసం తద్దినాలు పెడుతున్నాను. అయితే సానిదాన్ని ఎందుకు వుంచుకున్నావయ్యా అని అడగగలరు. "కామిగాక మోక్షకామికాడు." యిక మీ సంగతో ? మీరు నిద్దరపోతూండగా చూసి యెప్పుడో ఒకనాడు మీనాక్షి ఆ పాతు యెక్కదీసి రంకుమొగుణ్ణి తీసుకు పారిపోతోంది. ఆ పైని దరిద్రదేవత మిమ్మల్ని పెళ్ళా'డుతుంది.

లుబ్ధా : అయితే ఏం జేయమంటారు ?

రామ : మీరు పునః ప్రయత్నం చేసి పెళ్లా'డండి. పెళ్ళాం భయం చేత మీనాక్షి ఆట కట్టడుతుంది. మీనాక్షి భయంచేత మీ పెళ్ళాం కట్టుగా వుంటుంది. అవునంటారా, కాదంటారా ?

లుబ్ధా : నిజవైన మాటే.

రామ : నిజవైంతేనేం ? మీకు బహుపరాకు. సాధక బాధకాలు అడుగడుక్కీ జ్ఞాపకం చేస్తూండాలి. మీకు జాతక రీత్యా వివాహం జరక్కపోతే, మార్కం వుందన్న మాట పరాకు పడ్డారా ?

లుబ్ధా : పరాకు లేదు. గాని యిన్నాళ్ళు కొట్టుకుంటూంటే, యీ నాటికి పద్దెనిమిది వందలకి వక సంబంధం కుదిరి; తీరా క్రియకాలానికి తేలిపోయింది గదా ? యిప్పుడు చవగ్గా మనకి సంబంధం కుదురుతుందా ? కుదరదు, కుదరదు.

రామ : నిన్న వొచ్చాడయ్యా గుంటూరునించి వక బ్రాహ్మడు. వున్నాడో వెళ్లిపోయినాడో ?

లుబ్ధా : సంబంధానికా!

రామ : అవును. యంత బుద్ధితక్కువ పని చేశానూ! నా యేరికిని యెక్కడైనా సంబంధం వుందా అని అతగాడు అడిగితే నేను లేదని చెప్పా'ను. యీ సంబంధం తప్పిపోతుందని నేనేం కల గన్నానా ఏవిఁటి ? అతడు జటాంత స్వాధ్యాయిన్నీ. మంచి సాంప్రదాయవైఁన కుటుంబీకుడున్నూ, ఆ సంబంధం చేస్తే అగ్నిహోత్రావుధాన్లుని చెప్పుచ్చుకు కొట్టి నట్టౌను.

లుబ్ధా : బేరం ఏం చెప్పా'డు ?

రామ : బేరం మహాచవకయ్యా! అదే విచారిస్తున్నాను. అతగాడు గుంటూరునుంచి వస్తున్నాడు. అక్కడి వాళ్ళకి, మనదేశపు కొంపలమ్ముకునే బేరాలతాపీ యింకా తెలియదు. అందుచేత నందిపల్లెలో పన్నెండు వందలకి సంబంధం కుదుర్చుకున్నాడు. వ్యవధిగా గాని పెళ్ళికొడుకువారు రూపాయలు యివ్వలేమన్నారట. ఆ బ్రాహ్మడికి రుణాలున్నాయి. వాయిదా నాటికి రూపాయలు చెల్లకపోతే దావా పడిపోతుందని, యెక్కడయినా పిల్లని అంటకట్టడానికి వ్యాపకం చేస్తున్నాడు. ఒకటి రెండు స్థలాల్లో వెయ్యేసి రూపాయలకి బేరం వొచ్చిందట. పన్నెండు వందలకిగాని యివ్వనని చెప్పా'డు.

లుబ్ధా : మరొక్క వొంద వేదాం మనం.

రామ : అతగాడు వుంటేనా, నూరు వేయడానికి, యాభై వేయడానికీని ?

లుబ్ధా : కనుక్కుందురూ మీకు పుణ్యం వుంటుంది. యెక్కడ ఐసో ?

రామ : దాని సిగ గోసిన డబ్బు. డబ్బుమాట అల్లా వుణ్ణీండి. గాని ఆ పిల్ల యేమి యేపుఁ యేమి ఐశ్వర్య లక్షణాలు! ధనరేఖ జెఱ్ఱిపోతులా వుంది. సంతాన రేఖలు స్ఫుటంగా వున్నాయి. పిల్ల దివ్యసుందర విగ్రహం.

(మధురవాణి ప్రవేశించును)

మధు : గ్రహవేఁవిటి ?

రామ : గ్రహవేఁవిటా ? అవుధాన్లుగారి గ్రహస్థితి చూస్తున్నాం. జాతకరీత్యా యీ సంవత్సరంలో వివాహం కాక తప్పదు.

మధు : మీ మాట నేను నమ్మను. (లుబ్ధావధాన్లు దగ్గిరకు వెళ్ళి ముఖం యదట ముఖం వుంచి) ఆ మాట నిజమా ?

లుబ్ధా : అంతా నిజం అంటున్నారు.

మధు : సిద్ధాంతిగా రేవన్నారు ?

లుబ్ధా : జాతకం చూసిన సిద్ధాంతల్లా ఆ మాటే అంటున్నాడు. యిదివరకల్లా నా జాతకం మా గట్టి దాఖలా యిస్తూంది. ఒక్కటీ తప్పిపోలేదు.

మధు : అయితే మీ ప్రారబ్దం. ఆ పెయ్యినాకుడు పిల్లని మాత్రం యీ పంతులు మాయమాటలు విని చేసుకోకండి.

రామ : భోంచేస్తూ వొచ్చావు. యేం పుట్టి మునిగిపోయిందని ?

మధు : వెండిగిన్నె కోసం వొచ్చా'ను.

రామ : తీసుకెళ్ళు. (మధురవాణి నిష్క్రమించును).

లుబ్ధా : పెళ్ళి చేసుకోవద్దంటుం దేవండీ ?

రామ : నిమ్మళంగా మాట్లాడండి. సానిది యెక్కడైనా పెళ్ళి చేసుకోమంటుం దయ్యా ? నీ మీద కన్నేసింది.

లుబ్ధా : నామీద కన్నెయ్యడవేఁవిటి మావఁగారూ ? యవరు విన్నా నవ్వుతారు.

రామ : మీరుగానీ పెళ్ళి చేసుకోవడం మానేస్తే మీయింట్లో వొచ్చి బయితా యిస్తుంది. అది ఘంటాపథంగా చెబుతూవుంటే చెవుల్లేవా యేవిఁటి మీకు ? దానితో మీరేవఁయినా వెర్రివెర్రి చా'ష్టలు చేశారంటే మీకు నాకూ పడుతుంది గట్టి రంధి. జాగ్రతెరిగి మసులుకోండి.

లుబ్ధా : నేనా ? నేనా ? ఏవిఁటి అలా సెలవిస్తున్నారు మావాఁ! నా పిల్ల ఒకటి, అది ఒకటీనా ? ఆ గుంటూరుశాస్తుల్లు వున్నాడో, వెళ్లా'డో ఒక్క మాటు కనుక్కోలేరో ?

రామ : యదటింట్లోనే బసచేశాడు... కనుక్కుంటానుగాని, మధురవాణి భోజనం ఏపాటి అయిందో చూచి మరీ వెళతాను. (లోపలికి వెళ్ళి వచ్చి పైకి వెళ్ళును.)

లుబ్ధా : మధురవాణ్ణి తీసుకుపోతాననుకుంటున్నాడు యీ పంతులు. అహ! హ! (పొడుము పీల్చి) మనిషికీ మనిషికీ తారతమ్యం సొందే కనిపెట్టాలి. పంతుల్లాగ మీసం వుంచుకుని, రంగు వేసుకుంటే తిరిగి యౌవనం వొస్తుంది. యీ చవక సంబంధం కుదిరినట్టాయతే, యేమి అదృష్ట వంతుణ్ణి! (రామప్పంతులు స్త్రీ వేషములోనున్న శిష్యుణ్ణి రెక్కపట్టుకు తీసుకు వచ్చి, అరచెయ్యి చూపించును.)

రామ : మావాఁ! యేం ఖోదా కొట్టుకొచ్చిందోయి నీకు! యిదిగో ధనరేఖ. చెయ్యి కొస ముట్టి రెండో పక్కకి యెగబాకినట్టుందోయి. యివిగో, సంతానరేఖలు. కంఠం దగ్గర చూశావా, హారరేఖలు ?

లుబ్ధా : అట్టే పరిశీలన అక్కర్లేదు. చాల్లెండి.

(పై ప్రసంగము జరుగుచుండగా మధురవాణి వెనకపాటున వచ్చి పంతులు నెత్తిమీద చెంబుతో నీళ్లు దిమ్మరించును.)

రామ : ఏవిటీ బేహద్బీ ?

మధు : మంగళస్నానాలు. (శిష్యుడి గెడ్డం చేతనొక్కి) నీకు సిగ్గు లేదే లంజా ? (నిష్క్రమించును.)

రామ : కోప వొఁస్తే మరి వొళ్ళెరగదు. యిక కొరకంచో, చీపురుగట్టో పట్టుకు వెంట దరువుతుంది. యీ పిల్లని తీసుక పారిపోదాం రండి.

(శిష్యుడి చెయ్యి పట్టుకుని పైకి నడచును)

లుబ్ధా : నడుస్తుంది. రెక్క వొదిలెయ్యండి.

రామ : (రెక్క వొదిలి) ఓహో, కాబోయే యిల్లాలనా ?

(ముగ్గురూ నిష్క్రమించి, వీధిలో ప్రవేశింతురు)

లుబ్ధా : యీ పిల్లని చేసుకోమని మీ అభిప్రాయవేఁనా ?

రామ : నా అభిప్రాయంతో యేం కార్యం ? మీ మనస్సు సమాధానం చూసుకోండి. పిల్ల యేపుగా వుందా ? రూపురేఖా విలాసాలు బాగున్నాయా ? అది చూసుకోండి.

లుబ్ధా : సంసార్లకి సౌందర్యంతో ఏం పని ?
(సిద్ధాంతి తొందరగా యెదురుగుండా వస్తూ ప్రవేశించును)

సిద్ధాం : (లుబ్ధావధాన్లుతో) యెవరు మావాఁ యీ పిల్ల ?

(లుబ్ధావధాన్లు జవాబు చెప్పక, రామప్పంతులువైపు బుఱ్ఱ తిప్పి సౌఁజ్ఞ చేయును.)

రామ : మా వాళ్ళే.

సిద్ధాం : (నిదానించి) భాగ్యలక్షణాలేం పట్టాయి యీ పిల్లకి ?

రామ : ఏవిఁటండీ ?

సిద్ధాం : విశాలమైఁన నేత్రాలూ, ఆ కర్ణాలూ, ఆ వుంగరాల జుత్తూ, విన్నారా ? యేదమ్మా చెయ్యి! (చెయ్యి చూసి) యే అదృష్టవంతుడు ఈ పిల్లని పెళ్ళాడాడోగాని...

రామ : యింకా పెళ్లి కాలేదండీ!

సిద్ధాం : మీరు పెళ్ళి చేసుకోవాలని ఉంటే ఇంతకన్నా అయిదోతనం, అయిశ్వర్యం, సిరి సంపదా గల పిల్ల దొరకదు. ఇది సౌభాగ్యరేఖ. యిది ధనరేఖ. పంతులూ! బోషాణపెట్టెలు వెంటనే పురమాయించండి. ఏదీ తల్లీ, చెయి తిప్పూ; సంతానం ఒకటి, రెండు, మూడు, (చెయ్యి వొదిలి లుబ్ధావధాన్లుతో) ఏదీ మావాఁ పొడిపిసరు. (పొడుం పీల్చి) పోలిశెట్టి కూతురు ప్రసవం అవుతూంది. జాతకం రాయాలి. మళ్ళీ దర్శనం చాస్తా'ను.

రామ : వక్కమాట. (సిద్ధాంతితో రహస్యంగా మాట్లాడును. సిద్ధాంతి చంకలో పంచాంగం తీసి చూచును. మరి నాలుగు మాటలాడి పంచాంగం చంకని పెట్టుకుని తొందరగా వెళ్ళిపోవును.)

లుబ్ధా : ఏవంటాడు ?

రామ : నేనే యీ పిల్లని పెళ్ళి చేసుకుంటా ననుకుంటున్నాడు.. రేపటి త్రయోదశి నాడు పెళ్ళికి మంచిది అన్నాడు.

లుబ్ధా : ఆరోజు వివాహముహూర్తం లేదే!

రామ : 'శుభస్యశీఘ్రం' అన్నాడు. ద్వితీయానికి అంత ముహూర్తం చూడవలసిన అవసరం లేదు. తిథీ, నక్షత్రం బాగుంటే చాలును. యిదిగో, మీ మావఁగారు వొస్తున్నారు.

లుబ్ధా : బేరంవాడి చూడండి.

(కరటకశాస్త్రుల్లు ప్రవేశించును.)

కర : గంగాజలం శిరస్సున పోసుకున్నారా ఏవింటి పంతులుగారూ ? మా పిల్లని యెక్కడికి తీసుకెళ్తున్నారు ?

రామ : (కరటకశాస్త్రితో) మాట.

(ఇద్దరూ రహస్యముగా మాటలాడుదురు.)

రామ : (లుబ్ధావధాన్లని యెడంగా తీసికెళ్ళి) పధ్నాలుగు వొందలు తెమ్మంటున్నాడు. యెవళ్ళో పదమూడు వొందలు యిస్తావంన్నారట.

లుబ్ధా : యిదా మీరు నాకు చేసిన సాయం ? పోనియ్యండి, ఆ పజ్యండుకైనా తగలెట్టండి.

రామ : ఉపకారానికిపోతే నాదా' నిష్ఠూరం ? కోరి అడిగితే కొమ్మెక్కుతారు. యేం జెయ్యను ? (కరటకశాస్త్రితో రహస్యంగా మాట్లాడి, తిరిగి వచ్చి లుబ్ధావధాన్లుతో) మావాc. కృత్యాద్యవస్థ మీద వొప్పించాను.పిల్లదానికి సరుకు పెడితేగాని వల్లలేదని భీష్మించుకుని కూచున్నాడు. ఏవంటావు ?

లుబ్ధా : అది నావల్ల కాదు.

రామ : వూరుకోవయ్యా, అలాగే అందూ. మధురవాణి తాలూకు కంటె తెచ్చి ఆ వేళకి పెట్టి తరవాత తీసుకుపోతాను.

లుబ్ధా : అదేదో మీరే చూసుకోండి.

రామ : నేనే చూసుకుంటాను, ఖర్చు వెచ్చాలేవో మనవేc చేసుకుని, కొంచ'ంలో డబడబ లాడించేద్దాం. పోలిశెట్టిని సప్లయికి పెట్టకండి. పెద్దిపాలెం వెళ్ళి లౌక్యుల్ని యెవరు పిలవడం ?

లుబ్ధా : మరి నా కెవరున్నారు! మీరే పిలవాలి.

రామ : లౌక్యుల్ని పిలవడానికి వెళ్ళినప్పుడు దుస్తు డాబుగా ఉండాలి. దగలా గిగలా తీయించి యెండ వేయిస్తాను...

(నిష్క్రమించును.)

2వ స్థలము : లుబ్ధావధాన్లు యిల్లు.

లుబ్ధా : అవును. మీరు చెప్పిన మాట బాగుంది. దివ్యస్థలాల్లో ఏక రాత్ర వివాహాచారం వుంది.

కర : పెద్ద పెద్ద ఉద్యోగస్థులు కూడా యిప్పటి రోజులలో వివాహాలు అలాగే చేస్తున్నారు. కోదండరామస్వాములవారు స్వయంవ్యక్తవూఁ హనుమ త్ప్రతిష్ఠా అయినప్పుడు దివ్యస్థలం కాదని యెవడనగలడు ?

లుబ్ధా : ఆ మాట సత్యవేఁగాని, ఇది దివ్యస్థలంగా ఆలోచించి యిదివరకు యెవళ్ళూ యిక్కడ ఏకరాత్ర వివాహం చేసి వుండలేదు మావఁగారూ, మనం చేస్తే యేవఁటారో ?

కర : దివ్యస్థలం అయిన తరవాత యెవడేవఁటే మనకేం పోయింది ?

లుబ్ధా : అయితే పంతులుతో చెబుదాం.

కర : యేవిఁటి మీ సత్యకాలం మావగారూ! యీ పెళ్ళిలో యేదో వొక వొంటు బెట్టి నాలుగు డబ్బులు ఆర్జించుకుందావఁని చూస్తూ వున్న పంతులూ, పోలిశెట్టీ ఏకరాత్ర వివాహానికి ఆమోదిస్తారా ? పుస్తె కట్టిందాకా ఆ మాట వాళ్ళతో చెప్పకండి.

లుబ్ధా : పంతులుతో చెప్పకపోతే యేం జట్టీ పెడతాడో ?

కర : యేవిఁటీ మీ భయం! అతగాడు మీకు యజమానా ? జట్టీ గిట్టీ పెడితే, పెణితూడగొడతాను.

లుబ్ధా : మీరు కాదుగాని, సిద్ధాంతిగారి చేతిలో రెండు రూపాయలు పడేస్తే ఆ పూచీ అంతా ఆయన నెత్తిమీద వేసుకుంటాడు. ఆయన యదట పంతులు నోరు యెగియదు.

కర : పావంటిదానికి విరుగుడుంది. పంతులి కుండదా ? (నిష్క్రమింతురు.)

3వ స్థలము : లుబ్ధావధాన్లు యింటి పెరడు.

(కరటకశాస్తుల్లు, మీనాక్షి ప్రవేశింతురు.)

మీనా : మీ పిల్లని నా కడుపులో పెట్టుకోనా తాతయ్యా!

కరట : కడుపుగదా అమ్మా! అంచేత పదేపదే చెబుతున్నాను. దానికి తల్లివైనా నువ్వే, తండ్రివైనా నువ్వే. (దుఃఖము అభినయించును)

మీనా : విచారించకండి తాతయ్యా! దానికి యే లోపం రానియ్యను.

కరట : అమ్మా, నీ కిమ్మని మా అమ్మి చేతికి ఓ పులిమొహురు యిచ్చా'ను, పుచ్చుకో.

మీనా : యిస్తుంది. తొందరేవిఁటి, తాతయ్యా ? దాం దగ్గిర వుంటేనేం, నా దగ్గిర వుంటేనేం ?

(సిద్ధాంతి ప్రవేశించును.)

సిద్ధాం : యెంతసేపూ కూరలు తరగడం, భోజనాల సరంజాం జాగ్రత్త చెయ్యడం సందడేగాని, లగ్నానికి కావలసిన సరంజాం జాగ్రత్త చెయ్యడపు తొందరేమీ కానరాదు. నా శిష్యుడు ముంగిపోతులా పడున్నాడు.

మీనా : నాలు గ్గడియల పొద్దుకి లగ్గవైతే, యిప్పట్నించీ సరంజాం తొందరేమిటి అచ్చన్నమావాఁ ?

సిద్ధాం : చదవేస్తే వున్న మతీ పోయిందన్నాట్ట, నాలు గ్గడియల రాత్రుందనగా శుభముహూర్తం.

మీనా : మా నాన్న యెప్పుడూ యిదే మచ్చు. ఏ మాటా నిజం యింట్లో ముండలతో చెప్పకపోతే యెలా యేడుస్తారు ? నాన్నా! నాన్నా!

(లుబ్ధావధాన్లు ప్రవేశించును)

లుబ్ధా : యెందు కా గావుకేకలు ?

మీనా : నాలు గ్గడియల రాత్రుందనగానట మూర్తం అచ్చన్న మావఁ అంటున్నాడు.

లుబ్ధా : యిదేవిఁటండోయి! నాలు గ్గడియల పొద్దు కనుకున్నానే ముహూర్తం ?

సిద్ధాం : ముప్పైమూడు ఘడియల పొద్దు కనుకున్నారు కారో ? మీ వెర్రులు చాలించి చప్పున కానియ్యండి మంగళ స్నానాలు. ఊళ్ళో బ్రాహ్మల నందర్నీ పిలిచేశాను.

లుబ్ధా : చంపారే! చలి. అయితే రామప్పంతులు కూడా నాలు గ్గడియల పొద్దుకి అనుకున్నాడే ముహూర్తం ? ఆయనే వొచ్చి పెద్దపాలెంలో లౌక్యుల్ని నాలు గ్గడియల పొద్దుకి రమ్మని పిలుస్తారేమో ?

సిద్ధాం : "శతాంధాః కూపం ప్రవిశంతి" అమ్మీ! పిల్లకి స్నానం చేయించూ.

మీనా : యిదిగో, నిమిషంలో చేయిస్తాను.

సిద్ధాం : ఆడవాళ్ళు నయం. పెళ్లి పందిట్లో సరంజాం చూసుకుంటాను.

లుబ్ధా : పంతులు లేకుండా లగ్నం అయితే...

సిద్ధాం : పంతులుకా, మీకా పెళ్లి ? జంకవోడక స్నానం కానీయండి.

(నిష్క్రమించును)

<u>4వ స్థలము : లుబ్ధావధాన్లు యింటి అరుగుమీద పసుపు బట్టలు కట్టుకుని లుబ్ధావధాన్లు, స్త్రీ వేషములో శిష్యుడు, కొందరు బ్రాహ్మలు కూర్చుని వుందురు.</u>

(రామప్పంతులు, తాషామర్ఫా, కావిళ్ళూ, చాకర్లతో ప్రవేశించి అరుగుమీద చతికిలపడును)

రామ : అబ్బ! ఎంత శ్రమపడ్డానండి! (నౌకరుతో) తాషామర్ఫా వూరుకోమను. బోయిలొహాళ్ళూ, బాజావాళ్ళొహాళ్ళూ, వూరు చేరేటప్పటికి కోలాహలం లావు చేస్తారు. కాళ్లు పీక్కువచ్చాయయ్యా, వెధవ పెద్దిపాలెం యంత దూరవుఁదీ! (తిరిగి చూసి) యిదేవిఁటీ పసుబ్బట్టలూ, పెళ్లి కూతురుతో కలిసి కూచోడవూఁను ? పెళ్లికొడుకుం చేయించుకున్నావటయ్యా ? ముదిమికి ముచ్చట్లు లావు.

లుబ్ధా : లగ్నానికి మీరు లేకపోయినారు గదా అని మహా విచారపడుతున్నాను.

రామ : (ఉలికిపడి) యేవిఁటి! లగ్గవేవిఁటి ?

పూజారి గవరయ్య : లగ్నం వేళకి తమరు లేకపోయినారు గదా అని, మేం యావన్మందివీఁ విచారించాం. తమరు యేదో వ్యవహారాటంకం చేత వేళకి రాజాలినారు కారనుకున్నాం. తాము లేకపోవడంచేత సభ సొగుసే పోయింది. "నియ్యోగి లేని సావిడి అయ్యయ్యో వట్టిరోత, అది యెట్లన్నన్ వయ్యారి..."

రామ : ఆట్టే పేలకు. ముహూర్తానికి ముందే పుస్తె యెలా ముడెట్టా'వయ్యా ?

పూజా : సిద్ధాంతిగారు నక్షత్రాలు చూసి ఘడియలు గట్టి, సరిగ్గా ముహూర్తం వేళకే పుస్తె కట్టించారండి.

రామ : నాలు గ్గడియల పొద్దు కాలేదే!

పూజా : నాలుగు ఘడియల రాత్రుందనగా కదండీ, శుభముహూర్తం!

రామ : సిద్ధాంతి ముహూర్తం తెల్లవారి నాలుగు గడియలకని చెప్పా'డే ?

పూజా : పంచాంగం మార్చడానికి యవడి శక్యం బాబూ ? తెల్లారగట్ల నాలుగు గడియలకని సిద్ధాంతిగారు మనవిజేసి వుంటారు. తాము పరాగ్గా విని వుందురు.

రామ : పంచాగానికేం ? యీ వెధవ పల్లెటూర్లో సిద్ధాంతి ఆడింది ఆటా, పాడింది పాటా. యంత ద్రోహం చేశాడయ్యా సిద్ధాంతి.

పూజా : సిద్ధాంతి యంతో నొచ్చుకున్నాడు ? తమరు రాలేదని బాబూ! యేమి ఆటంకం చాత వుండిపోయినారో అని అవుధాన్లుగారు తల్లడిల్లా'రు. తాషామర్ఫా విన్న తరవాత గదా, ఆయన మనసు స్వస్థపడ్డది.

లుబ్ధా : నిజం మావఁగారు!

పూజా : యిక మధురవాణో ? అట్టే ఆ పందిట్లో నిశ్చేష్టురాలై పుత్తడిబొమ్మలాగ నిల్చుందిగాని బ్రాహ్మణ్యం యావన్మందీ గెడ్డం పట్టుకు యెంత బతిమాలుకున్నా పాడింది గాదు.

కొండిభొట్లు : అంతసేపూ హెడ్డు కనిష్ఠీబుగారితో మాట్లాడుతూ నిల్చుందిగాని, యేం? యింతమందివి ప్రార్థించినప్పుడు, ఓ కూనురాగం తియ్య కూడదో ?

మరివక బ్రాహ్మణుడు : ఓరి కుంకాయా, పంతులుగారు సభలో లేందీ యలా పాడుతుందిరా ?

పూజా : హెడ్డుగారితో యేవిఁటి మాట్లాడుతూం దనుకున్నావు ? పంతులుగారు సరుకూ జప్పరా పట్టుకు వెళ్ళా'రు ? యేం ప్రమాదం వచ్చిందో! ముహూర్తం వేళకి రాలేదు. జవాన్లని పంపి వెతికించండి అని బతిమాలుకుంటూందిరా ?

కొండి : యీ గవరయ్యగారు గోతాలు కోస్తాడ్రా. హెడ్డూ, అదీ ఒహరిమీ దొహరు విరగబడి నవ్వుతూంటే, పంతులు కోసం బెంగెట్టుకుందని కవిత్వం పన్నుతాడు.

రామ : వైదికం! వైదికం! మీ యేడుపులు మీరు యేడవక లోకంలో భోగట్టా అంతా మీ కెందుకు ?

పూజా : వూరుకోరా కొండిభొట్లు, పెద్దా పిన్నా అక్కర్లేదూ ?

రామ : నీ పెద్దతనం యెక్కడ యేడిసింది ? నివ్వే ముందు రేపెట్టావు.

పూజా : వై. స. బు. పె. అని యందుకన్నాడు బాబూ!

రామ : అతడేడి, అతడు! అతడి పేరేవిఁటి ?

పూజా : యెవరండి ?

రామ : ఆ గుంటూరు శాస్తుల్లేడయ్యా ?

పూజా : యే గుంటూరు శాస్తుల్లండి ?

లుబ్ధా : ఆయనా, మరే... వొచ్చి ఆయన.... వూరికెళ్ళారు.

రామ : యేవిఁటీ తెలివితక్కువ మాట! కూతురికి పెళ్ళౌతూంటేఁ వూరి కెలా వెళ్ళా'డు ?

లుబ్ధా : పెళ్ళయిపోయింది గదా ?

రామ : తెలివిహీనం ? లగ్నవంటే నేను లేకుండా వెలిగించావుగాని పెళ్ళి ఐదురోజులు తగలబడుతుంది గదూ ?–

పూజా : ఏకరాత్ర వివాహం కదండీ ? అంచేత ప్రధాన హెూమం, శేష హెూమంతో సమాప్తి అయిపోయింది.

రామ : (నిశ్చేష్టుడై లుబ్ధావధాన్లుతో) ఓరీ, స్వామిద్రోహప వెధవా!

పూజా : (నోరు మూసి) బాబ్బాబూ, శాంతించండి! శాంతించండి! (లుబ్ధావధాన్లుతో) పంతులుగారి కాళ్ళమీద పడవయ్యా! (పంతులుతో) తమరు చేయించినది శుభం. అశుభం మాటలు శలవియ్యకండి. సిద్ధాంతిగారూ, వారి మావఁగారూ శాస్త్రచర్చ చేసి, లగ్నం పదినిముషాలుందనగా, ఏకరాత్ర వివాహం స్థిరపర్చారు.

రామ : యేం కుట్ర! వాడికి రూపాయ లివ్వలేదు గదా ?

లుబ్ధా : యెల్లుండి యేవా'ళకైనా రూపాయలు చెల్లించకపోతే దావా పడుతుందని, తొందరపడి పట్టుకు వెళ్ళిపోయినారు. మళ్ళీ వారం నాటికి వొస్తావఁన్నారు.

రామ : నన్ను మధ్యవర్తిని చేసి, నేను లేనిదీ యీ వ్యవహారం యలా పైసలు చేశావు ? నేను యంత యడ్వాన్సు వాడికి యిచ్చానో నీకు తెలుసునూ? అప్పుడే మావఁగారితో కలిసిపోయి నాకు టోపీ అల్లా'వూ ?

లుబ్ధా : మీరు చేసిన నిర్ణయ ప్రకారవే రూపాయలు చేతిలో పడితే గాని, పుస్తె కట్టనివ్వ నన్నాడు – యేం జెయ్యను ?

రామ : పుస్తె కట్టకపోతే నీ పుట్టె మునిగింది కాబోలు! నే నొచ్చేలోగా యేం వుప్పెన వచ్చింది ? వీడేదో పెద్ద దగాచేసి, నే నొస్తే, పట్టుగుంటానని రూపాయలు చేతిలో పడేసుకుని వుడాయించాడు! వాడి పేరేవిఁటి ?

పూజా : ఆయన పేరు..... మరేఁ వచ్చి...... అవధానులుగారు శలవిస్తారు.

లుబ్ధా : నాకు తెలియదు.

రామ : అయ్యో అభాజనుడా! యిహ వాడు పంచాళీమనిషి అనడానికి సందేహ మేమిటి ?

లుబ్ధా : అతగాణ్ణి మీరే తీసుకొచ్చి దొడ్డవాడని చెప్పా'రు. అంచేతనే అతణ్ణి నేను నమ్మా'ను.

రామ : నువ్వు నమ్మితే యెవడికి కావాలి. నమ్మకపోతే యెవడికి కావాలి ? అతనికి నేను పెళ్ళి ఖర్చుల కోసం బదులిచ్చిన నూరు రూపాయలూ అక్కడ పెట్టు.

లుబ్ధా : యెవరి కిచ్చారో అతణ్ణే అడగండి... నాతో చెప్పకండి.

రామ : సరే, నీతో చెప్పను..... నీతో యిక మాటే అణ్ణు. మరి నీ యింట్లో వక్క నిమిషం వుండను. (లేచి నిలుచుని) అంతా వినండయ్యా! యీ గుంటూరు శాస్తుల్లు పచ్చిదొంగ. లేకుంటే యీ తెలివిహీనుడు యిచ్చిన రూపాయలు సంధించుకుని, పేరైనా చెప్పకుండా పరారీ అవుతాడా ? నా తాలూకు సొమ్ము కూడా పట్టుకు చపాయించాడు. వీడి వైఖరీ చూడగా, రెండోపెళ్ళి పిల్లనో, సూద్రప్పిల్లనో యీ తెలివిహీనుడికి అమ్మి, యెగేసినట్లు కనబడుతుంది. కనక, ఒరే బారికీ, ఒరే మంగలీ, హెడ్డుగారి దగ్గరికెళ్ళి యిద్దరు జవాన్లను తీసుకురా. వాడి వెంట దౌడాయింపిస్తాను.

(పై మాటలు అంటూ వుండగా, సిద్ధాంతి ప్రవేశించి, రామప్పంతులు మాటలు ముగించి వెళ్ళిపోతూ వుండగా రెక్కబట్టి నిలబెట్టును.)

సిద్ధాం : యెక్కడికి వెళతారు ? కొంచం నిలబడండి.

రామ : ఏమిటి నీ నిర్బంధం ?

సిద్ధాం : గుంటూరు శాస్తుల్లుగారి పేరేవిఁటో మీ క్కావాలా ?

రామ : యేవిఁటా పేరు ?

సిద్ధాం : పేరు రామశాస్తుల్లుగారు. ఆయన పేరుతో మీకేం పనుంది ?

రామ : వాడు నాకు బాకీ.

సిద్ధాం : మీకు ఒక్క దమ్మిడీ బాకీ లేదు. ఆ నిజం నాకు తెలుసును.

రామ : చెయ్యి నొక్కేస్తున్నా వేఁవిఁటి ?

సిద్ధాం : వైదీకపాళ్ళ చెయ్యి మృదువుగా యలా వుంటుంది ? అవధాన్లుగారు యిచ్చిన సొమ్ము తాలూకు నిలవ యెంతుందో చెప్పండి.

రామ : నువ్వెవరివి అడగడానికి ? అన్న! చెయ్యి నొక్కుతున్నావు ? తంతావా యేవిఁటి ?

సిద్ధాం : శుభమల్లే, పెళ్ళికూతుర్ని ముండా ముతకా అంటే యవరయినా వూరుకుంటారా ?

రామ : ముండ కాదు, పునిస్త్రీయే అంటాను; చెయ్యి వొదిలెయ్యి.

(లుబ్ధావధానులు శిష్యుడికి కొంత యడంగా జరుగును.)

సిద్ధాం : కోపం వొచ్చినప్పుడు లౌక్యం మరచిపోకూడదు. మీరు ప్రభువులూ, మేం ఆశ్రితులం. తమకి లాభించేమాట చెబుతాను. యిలా దయచెయ్యండి.

రామ : మర్యాదగా మాట్లాడితే, నా అంత మంచివాడు లేదు.

సిద్ధాం : అవధాన్లుగారూ, మీరు కూడా యిలా రండి.

(లుబ్ధావధానులు, సిద్ధాంతి, రామప్పంతులు రహస్యముగా మాట్లాడుదురు)

రామ : (ఉత్సాహముతో) సిద్ధాంతీ! యేదీ పొడిపసరు. నియ్యోగపాడన్నవాడు సవబుకి కట్టుబడతాడు. యవరయ్యా వంటబ్రాహ్మలు! మా యింటికి ఫలహారాలు వెళ్ళా'యా ? యేవోఁయి కొండిభొట్లూ! మాట, యిలా రా!

(కొండిభొట్లు వచ్చును)

కొండి : యేం శలవు ?

రామ : మా యింటిదాకా నాతో రా.

కొండి : చిత్తం.

రామ : మా తోట్లో, మంచి పనసకాయలున్నాయి. రెండు కాయలకి బరాతవిఁస్తాను. తెచ్చుకో. మీ అయ్యకి పనసకాయ కూరంటే మా యిష్టం.

కొండి : చిత్తం.

రామ : పెళ్లిలో యేవిఁటోయి గమ్మత్తు ?

కొండి : యేవీఁ గమ్మత్తు లేదండి.

రామ : మధురవాణి పాడింది కాదేం ?

కొండి : పాడింది.

రామ : ఆఁ!

కొండి : కాదండి.

రామ : అలా చెప్పు. అంతసేపూ హెడ్‌కనిష్ఠీబుతో మాట్లాడుతూంది కాబోలు ?

కొండి : లేదండి ఒక్కమాట మాటాళ్ళేదు.

రామ : మరెందు కన్నావూ మాట్లాడిందని యిందాకానూ ? విరగబడి నవ్విందన్నావే ?

కొండి : మరీ... మరీ... మరే వొచ్చి... లింగన్నగారి కాంభొట్లు అలా అనమన్నాడు.

రామ : వాడిపని పట్టిస్తాను. నాతో వెకాస్యాలా'! నువ్వు మాత్రం వాడి జట్టు కూడకు. చిన్నప్పట్నుంచి నిన్ను యెరుగుదును. నువ్వు నిజాయితీ మనిషివి.

కొండి : అవుఁనండి. యెప్పుడూ నేను నిజవేఁ చెబుతాను.

రామ : అవునుగాని హెడ్‌కనిష్ఠీబు మాటమటుకు నిజం చెప్పా'వు కావు. పట్టాభిరామస్వామిమీద ప్రమాణం చేసి, చెప్పు! మధురవాణి యెవరెవరితో మాట్లాడింది ?

కొండి : మరేఁ, పచ్చి..... నిజం చెప్పమన్నారూ ?

రామ : నిజాయితీ మనిషివనే గదా నిన్ను అడుగుతున్నాను.

కొండి : అయితే, అందరితోటీ మాట్లాడింది.

రామ : అందరితోటీ అంటే యవరెవరితోటి ?

కొండి : యవరెవరా అండి ? పెళ్ళి వొదిలేసి, అంతా మధురవాణి చుట్టూ మూగాం. భుక్తగారితో మాట్లాడింది. మరే వచ్చి....

రామ : యింకా యెవరితో మాట్లాడింది ?

కొండి : సిద్ధాంతి మంత్రం చ'ప్పడం మానేసి మధురవాణి చెవులో యేకాంతం మాట్లాడా'డు.

రామ : మరింకా యవరితోటి ?

కొండి : మరే వచ్చి.... హెడ్‌కానిష్ఠీబుతోటి.

రామ : ఓరీ ఛండాలుడా ? హెడ్‌తో మాట్లాడలేదన్నావే ?

కొండి : అవును. మాట్లాళ్ళేదు.

రామ : పుండాఖోర్! మాట్లాడలేదా ?

కొండి : సచ్చాన్రా దేవుడా!

రామ : అసత్యం అంటే, నాకు వెర్రికోపం. ప్రమాణపూర్తిగా నిజం చెప్పు. అబద్ధవాఁడితే తల పేలిపోతుంది. మాట్లాడిందా, లేదా ?

కోండి : లేదు.

రామ : ప్రమాణ పూర్తిగా ?

కొండి : ప్రమాణపూర్తిగానే.

రామ : యిప్పుడు నిజం చెప్పా'వు. విన్నావా ? నీకు చిన్నతనం. ఆడవాళ్ళమీద, ఒహరు అనమన్నా, అన్యాయం మాటలు ఆడకూడదు. తెలిసిందా ?

కొండి : మధురవాణి మా దొడ్డమనిషి.

రామ : వూళ్ళో అలా అనుకుంటారేం ?

కొండి : అంతా అలా అనుకుంటారు.

(రామప్పంతులు యింటి యెదుట)

రామ : నేను తలుపు కొడతాను. నివ్వో చిన్న గమ్మత్తు చెయి.

కొండి : చిత్తం.

రామ : యీ విచ్చుబేడ మొలని పెట్టుకో. మా పెరటిగోడ అవతల ఒక అరఘడియ నిలబడు. దిడ్డీ తోవంట కనిష్ఠీబుగాని, మరెవరుగాని పైకి వొచ్చినట్టాయెనా రెక్కపట్టుకొని, కేకెయి. నే వొస్తాను. లేకుంటే వుడాయించెయి. (కొండిభొట్లు నిష్క్రమించును) తలుపు, తలుపు (తనలో) ఒకంతట తలుపు తియ్యదు. అనుమానానిక్కారణం. వీడు నిజం చెప్పాడా', అబద్ధం చెప్పా'డా ? నేను పాలెం నుంచి వొచ్చి కబురు పంపించిన తరవాత రాక, యిది తుర్రుమని యలా పరిగెత్తి వెళ్ళింది పెళ్ళిలోకి ? తలుపు - తలుపు యిప్పటికీ రాదేం ? (మధురవాణి తలుపు తీయును) యేం జేస్తున్నావు యింతసేపు ?

మధు : ఉదయం నుంచి రాత్రివరకూ చేసే పనులన్నీ, రేపటినుంచి వ్రాసి వుంచుతాను రండి.

(ఉభయులూ నిష్క్రమింతురు)

(కొండిభొట్లు ప్రవేశించును)

కొండి : పంతులుగారూ, పంతులుగారూ!

(రామప్పంతులు మధురవాణి ప్రవేశింతురు)

రామ : (మధురవాణితో) నువ్వు లోపలికి వెళ్లు. (కొండిభొట్లుతో) యేవిఁటి ?

కొండి : మరే వచ్చి.... పట్టుకోలేదు.

రామ : (తీక్షణంగా) యెందుకు పట్టుకున్నావు కావు ?

కొండి : చెప్పరానిదాన్ని యలా పట్టుకోవడం ?

మధు : చెప్పరానిదాన్ని యెందుకు పట్టుకోవడం ?

కొండి : దిడ్డీ తోవంట యవరొచ్చినా పట్టుకొని కా'కెయమని పంతులు చెప్పారు.'

మధు : యేవిఁ చిత్రం ? యేం అప్రతిష్ఠా! బ్రాహ్మడికి వెర్రెత్తుతూంది కాబోలు!

రామ : (మధురవాణి వెనక నిలిచి చేతితో వెళ్ళిపొమ్మని కొండిభొట్లుకు సౌజ్ఞచేసి) పేలుడుగాయ వైదీకపు గుంటడి వెకాశ్యాలు నిజం అనుకుంటావేమిటి? (లోపలికి వెళ్ళును.)

(రామప్పంతులు యింటిలోనికి వెళ్ళగానే మధురవాణి సావిడ వెనక తలుపు పైనుంచి వేసి, కొండిభొట్లును లోపలికి రమ్మని సౌజ్ఞచేసి ముద్దెట్టుకొనును.)

మధు : (నిమ్మళంగా) బాగా కాపాడా'వు!

కొండి : మధురవాణీ! యిదుగో పంతులిచ్చిన బేడ, యిదుగో హెడ్డుగారిచ్చిన పావలా. ఇంకా వెండితొడి పొడికాయ. (యిచ్చును.)

మధు : (పుచ్చుకొని) నువ్వు మంచివాడివి. యీ వేళనుంచీ నీకూ నాకూ నేస్తం... తెలిసిందా ? (మరి వకసారి ముద్దు పెట్టుకుని) యిక వెళ్ళు.

(కొండిభొట్లు చెంగున వీధిలోనికి యెగిరి వీధి నడుమ గెంతులు వేయును. కాంభొట్లు ప్రవేశించును.)

కాంభొ : యెందుకురా యీ గెంతులు ?

కొండి : ముద్దెట్టుకుందిరా!

కాంభొ : వెర్రివెర్రి వేషాలు వేయకు. యీ కోతి మొహాన్నే ?

కొండి : ఓసి వెర్రికుట్టా'! మేం జట్టుకట్టా'ం! (నిష్క్రమింతురు.)

4వ స్థలము : కృష్ణరాయపురం అగ్రహారములో

(అగ్నిహోత్రావధాన్లు యింటి పెరటిలో గిరీశం పనివాళ్ళచేత పందిరి వేయించుచుండును. వెంకటేశం ప్రవేశించును.)

గిరీ : యేమివాయ్ బావా, యెడం దవడ యెర్రబారింది ?

వెంకటే : నాన్న గూబ గదలేశాడు.

గిరీ : యేం జేశావు ?

వెంకటే : సంధ'వార్చలేదని.

గిరీ : వార్చినట్లు ఆ మాత్రం వేషం వెయ్యలేక పోతివో ?

వెంకటే : చూద్దనుకున్నాను.

గిరీ : అనుకోడాలు పనికిరావోయి, బావా! మనం యేదైనా వేషం వేశావంటే, ఒకడు చూస్తున్నాడని అనుకున్నప్పుడూ, ఒకడు చూస్తూ వుండలేదనుకున్నప్పుడూ కూడా, వొక్క మోస్తరుగా వేషం నడిపిస్తే సేఫ్‌సైడ్ చూస్తున్నావుకావా,రోజూ నేను యెంతసేపు తదేక ధ్యానం చేస్తానో.

వెంకటే : యేవఁనీ ధా'నం చాస్తారు.

గిరీ : యేం ధ్యానవాఁ ? యీ చాదస్త బాహ్మడు యంతట్లో దేవతార్చన చాస్తా'డు యంతట్లో విస్తట్లో మెతుకులు పడతాయి అని తదేక ధ్యానం చేస్తాను.

వెంకటే : మంత్రాలు చదివి దేవుఁణ్ణి ధా'నం చెయ్యాలిగాని అన్నం కోసం ధా'నం చేస్తే పాపం కాదా ?

గిరీ : ఇగ్నొరెన్స్! మత సంబంధమైన సంగతులు నీ కేమీ తెలియవు. యీ పెళ్ళి అయిపోయిన తరువాత నిన్ను మతంలో తరిఫీదు చెయ్యాలి. అన్ని మతాలూ పరిశీలించి వాటి తాలూకు యసెన్స్, నిగ్గు తీసి ఓ కొత్త మతం ఏర్పరచాను. అది అమెరికా వెళ్ళి ప్రజ్వలింప చేస్తాను, ఇప్పుడు మట్టుకు నీ సంశయం తీరుస్తాను. ఏమన్నావ్ఁ ? అన్నాన్నా ధ్యా'నించడం అని కదూ ? యేవందోయి నీ ఉపనిషత్తు! "అన్నం బ్రహ్మేతి వ్యజానాత్." అన్నవేఁ బ్రహ్మ అని తెలుసుకో వోయి, వెధవాయి అంది. తెల్లవాడు యేవఁని ధ్యానం చేస్తాడోయి రోజూనూ ? "ఫాదర్ గివ్ అస్ అవర్ డెయిలీ బ్రెడ్!" అనగా "నన్ను కన్నతండ్రీ, రోజూ ఒక రొట్టెముక్క ఇయ్యావోయి" అని. ఇక, మనవేఁవనాలి ? "తండ్రీ, రోజూ కందిపప్పు దప్పళం ఇయ్యవయ్యా!" అని ధ్యానించాలి. మన చమకంలో యేమన్నాడూ "శ్యామాకాశ్చమే" - "చామల అన్నం మా మజాగా వుంటుంది. నాక్కావాలి ఓ దేవుడా!" అన్నాడు. ఆ చమకంలో యవడికి యిష్టమైన వస్తువులు వాడు కలపవచ్చును. "కందిగుండాచమే-యింగువ సునా'చమే." దీనినే రిలిజియస్ రిఫార్మ్ అంటారు.

వెంకటే : గేదె పెరుగూ చమే, చేగోడీ చమే.

గిరీ : శబాష్! అదే ఒరిజినాలిటీ – అడిగితే గాని అమ్మ అయినా పెట్టదు. దేవుఁడు మాత్రం ముద్దిస్తాడనుకున్నావా యేవింటి ? నీకు యెప్పుడు యేమి కావలిస్తే అప్పుడు వస్తువులు సంపుటీచేసి చమకపారాయణ ఆరంభించేది.

వెంకటే : అయితే రేపణ్ణుంచి నేను రోజూ చమక పారాయణ చేస్తాను.

గిరీ : మనసుసలో చెయ్యి. పైకి పారాయణ చేశావంటే, నీ తండ్రి ఎడ్యుకేషన్ లేకపోవడం చేతా, రీజన్ తెలియకా యిదేవింటి చమకం పాడు చేస్తున్నాడని పెణతెక్క గొట్టి తొమ్మిదో అష్టం ఘనం పారాయణ చేస్తాడు.

వెంకటే : మొన్న బుగతగారి యింట్లో మీరు పొగాక్కట్ట యెుత్తుకొచ్చారు గదా, పాపం చేశారని దేవుఁడు కోప్పడ్డా ?

గిరీ : చిన్నతనంలో మా పింతండ్రి, నీ తండ్రిలాగే, అగ్గిరావుఁడోయి. చెవి నులిపి నా చేత వుపనిషత్తులు చదివించాడు. దాంతస్సాగొయ్యా, పేరు మరచి పోయినాను గాని, ఒక ఉపనిషత్తులో, శిష్యుడు ప్రశ్న అడుగుతూ వుంటే గురువు సమాధానం చెబుతూంటాడు. ఆ ఉపనిషత్తులో చెప్పిన శిష్యుళ్లాంటి శిష్యుడివి నువ్వు! అలాంటి గురువుని నేను. మన ప్రశ్నోత్తరాలు యవరైనా తాటా'కు మీద రాసిపారేశాడంటే, ఒక రెండువొందలేళ్లు అయిన తరవాత 'టొబా'కోపనిషత్తు' అవుతుంది. పొగాకు కట్టకు పాపవేవింటోయి. కాల్చిపారేసేదానికి ? అందులో పొడుం చేసే బుద్ధిహీనుల దగ్గిర పొగాకు యెత్తుకు రావడం లోకోపకారవఁని నమ్ము.

వెంకటే : యలాగండి లోకోపకారం ?

గిరీ : యలాగా, యిదిగో యిలా చుట్ట కాలిస్తే స్టీముయింజనులాగ, భగ్‌భగ్‌మని పొగ ఆకాశానికి పరిగెత్తి మేఘమై వర్షం కురిపిస్తుంది. పొడుం గాని పీలుస్తే ఆ ఘాటుకి ఆకాశం ఆర్చుకుపోతుంది. ముక్కంట మాత్రం చిరివర్షం కురిసి యిల్లూ వొళ్ళూ కూడా డర్టీ అవుతుంది. గనుక పొడుం చేసే మూర్ఖుల యింట్లో పొగాకంతా దొంగిలించి చుట్టలు గట్టి తగలెట్ట వలసినదే. ఒకవేళ "గిరీశంగారూ, తమరు దొంగతనం చేశారు. కొద్దిరోజులు నరకానికి విజయం చెయ్యండి" అని దేవుఁడుగానీ అన్నట్టాయెనా – ఒక చిన్న లెక్చరుకొట్టి గభరాయింప జేస్తాను.

వెంకటే : యేవఁని లెక్చరు కొడతారు ?

గిరీ : యేవఁనా! ఓ దేవుడా, 'నా మనస్సు యిండిపెండెంటుగా సృజించావా ? లేక డిపెండెంటుగా సృజించావా ? యిండిపెండెంటుగా అయితే నా యిష్టవొఁచ్చిన పనల్లా నేను చేశాను. నువ్వెవరు అడగటానికి ? ఇలాంటి చిక్కులు పెట్టా'వంటే హెవన్‌లో చిన్న నేషనల్ కాంగ్రెస్ ఒకటి లేవదీస్తాను. లేక, నన్ను డిపెండెంటుగా చేశావూ ? అట్లాగయితే నువ్వే నా చేత పాపం చేయించావు గనక నీకే ఆ శిక్ష కావలసింది. దేర్‌ఫోర్ చలో, నరకానికి చలో. అక్కణ్నించి నువ్వు తిరిగి వొచ్చేలోగా, ఆరు ఘడియలు స్వర్గంలో నీ అధికారం నా కిస్తివట్టాయనా, కొన్ని సృష్టిలో లోపాలు సవరణ చేస్తానంటాను.

వెంకటే : యేవిఁటండి లోపాలు ?

గిరీ : లోపాలన్న లోపాలా! నీ చేత వొప్పిస్తాను. నెంబర్ వన్... నీ మేష్టారులాంటి అభాజనుణ్ణి పుట్టించడం లోపం అంటావా అనవా ?

వెంకటే : లోపవేఁ.

గిరీ : నీ సిస్టరులాంటి బ్యూటీఫుల్ యంగ్ గర్లుని విడోని చెయ్యడం తప్పంటావా, ఒప్పంటావా ?

వెంకటే : తప్పే.

గిరీ : యిలాంటి లోపాలు కోటానుకోట్లు. ఇక రద్దు సృష్టి యంతుందను కున్నావు ? ఫరిన్‌స్టెన్స్, యెన్ని సముద్రాలు వున్నాయి ?

వెంకటే : యేడు.

గిరీ : యేడూ యేడిసినట్లే వున్నాయి. పాలసముద్రం వుంటూ వుండగా మళ్ళీ పెరుగు సముద్రం, నేతి సముద్రం యెందుకోయి! యిది ష్లియోనిజమ్, పునరుక్తి. మరో తెలివితక్కువ చూశావా ? ఎందుకూ పనికిమాలిన వుప్పు సముద్రం మన నెత్తిన కొట్టి, పెరుగు, పాలు, నెయ్యి, చెరుకు పానకం యీ సముద్రాలన్నీ యవడికీ అందుకు రాకుండా దూరంగా విసిరేశా డోయి. ఒక సంవత్సరంగాని, నాకు దేవుఁడు దివాన్గిరీ యిస్తే, భీముని

పట్ణానికి పాలసముద్రం, విశాఖపట్ణణానికి మంచినీళ్ళ సముద్రం. కళింగ పట్ణానికి చెరుకు సముద్రం తెస్తాను, ఈ యిస్టర్ను ఘాట్సు అంతా పొగాకు అరణ్యం చేస్తాను. యీ లెక్చరు నేను కొట్టేసరికి దేవుఁడు యేవఁంటాడో తెలిసిందా ? వీడు అసాధ్యుళ్ళా వున్నాడు. వెనుకటికి "పాత యముడివా, కొత్త యముడివా" అని అడిగిన పెద్దమనిషి కంటే ఒక ఆకు ఎక్కువ చదువుకున్నట్లు కనబడతాడు. గనక వీడి కో జోడుగుఱ్ఱాల బండీ యిచ్చి, స్వర్గంలో వున్న యావత్తు మహలులు, బగీచాలూ చూపించి యేం కావాలంటే అది యివ్వండని దేవదూతలతో చెబుతాడు. నా శిష్యుడు వెంకటేశాన్ని కూడా తీసుకొస్తేగాని నాకేం తోచదని నే చెబుతాను. అప్పుడు నిన్ను విమానమ్మీద తీసుకొస్తారు. మనవిఁద్దరం స్వరంలో మజా వుడాయిద్దాం. యీ వేళకి మతం మీద యింతవరకు లెక్చరు చాలును. యిక వెళ్ళి దేవాలయం తోటలో కోతిపిల్లిని కఱ్ఱ ఆడుకో. సాయంత్రానికి నీ తండ్రి వొచ్చేసరికి మాత్రం దీపం యదట కూచుని పుస్తకం తిరగేస్తూ పులుసటుకులు ధ్యానం చెయ్యి. ఇంగు వేసి బలే సొగసుగా తయారు చేస్తారు! (వెంకటేశం వెళ్ళును) రనెవే.

(బుచ్చమ్మ ప్రవేశించును)

బుచ్చ : యీ రుబ్బురోలు నిండా తాటా'కు ముక్కలు పడుతున్నాయి. ఇవతలికి లాగేసి పెడతారూ ?

గిరీ : అదెంత పని ?

(గిరీశం రుబ్బురోలు పందిరి అవతలకు లాగును. బుచ్చమ్మ రుబ్బురోలు కడిగి మినపప్పు రుబ్బును.)

గిరీ : (పాడును) "భజగోవిందం, భజగోవిందం, గోవిందం భజ మూఢమతే" యేం వదినా, కంట నీరు పెడుతున్నారు ?

బుచ్చ : యేవీఁ లేదు.

గిరీ : మీరు కంట నీరు పెడితే నా మనసు కరిగిపోతూంది.

బుచ్చ : మీకేం.... మహారాజులు.... మా కష్టాలు మమ్మల్నే బాధిస్తాయి.

గిరీ : యేమి కనికరం లేని మాట అన్నారూ! మీరు అలా దుఃఖంలో ములిగి వుంటే, యెందుకు నాకీ వెధవ బతుకు ? మీ కోసం యేం చెయ్యమంటే అది చా'స్తానే! ప్రాణవిఁచ్చేయ్యమంటే యిచ్చేస్తానే! దాఖలా చూడండి. ఇదిగో కత్తిపీట!

బుచ్చ : (కత్తిపీట దగ్గరకు తీసుకుని) చెల్లికి ఈ సమ్మంధం తప్పించారు కారు గదా ?

గిరీ : అదొక్కటి మటుకు సాధ్యవైంది కాదు.

బుచ్చ : అయితే మీతో నాకేంపనీ ? ఇంత సందడిగా పెళ్ళి పనులు చేయిస్తున్నారు. మా నాన్నకి తోచకపోతే, మీకైనా తోచకూడదా యీ సమ్మంధం కూడదని ? మీకు కూడా దానిమీద యింత కనికరం లేకపోవాలా ? లుబ్ధావధాన్లు మీకు అన్నగారని కాబోలు మీకు సంతోషం.

గిరీ : నాకు సంతోషం ? యంత క్రూరమైన మాట అన్నారు! యీ సంబంధం ఔతుందని నా మనసులో యంత ఖేదిస్తున్నానో ఆ భగవంతుడికి తెలుసు. యీ సంబంధం తప్పించాలని చెడచివాట్లు పెడుతూ మా అన్న పేర రెండు టావులు వుత్తరం రాశాను. చెవిని పెట్టా'డు కాడు. నేను యేం చేతును ? వాడిని స్మరిస్తేనే పాపం! ఊరకే కూచుంటే, మీ తండ్రి యేవను కుంటాడో అని మీ యింట అరవచాకిరీ చేస్తూ, నీకు ఏనాటికైనా కనికరం వొస్తుందేమో అని ఒక్క మనిషిని నూరుమంది చేసే పని చేస్తున్నాను. అంతేగాని, యీ నమ్మిన నౌకరుమీద నీ మనసు భారంగా వుంటే, యవరికీ చెప్పకుండా, యీ రాత్రి లేచి మా దేశానికి వెళ్లిపోతాను.

బుచ్చ : వెళ్లిపోకండి.

గిరీ : నేను మాత్రం పోయే సాధనం యలాగ ? యెన్నోమాట్లు యేవను కుంటాను ? యీ పెళ్లి తప్పించలేకపోయినాను గదా ? నా ప్రాణం కంటే యిష్టవైఁన యీ బంగారపు బొమ్మలాంటి బుచ్చమ్మని పునిస్త్రీని చెయ్యలేకపోయినానుగదా ? అని విరక్తి పుట్టి, పోదాం అని నిశ్చయించే సరికి–కాలు ముందుకు వేసినా, మనస్సు వెనక్కి లాగి యేమి తోచేదీ ? "పైకీ పోతానని సందడి పడుతున్నాను. నా బుచ్చమ్మ కనబడకపోతే, పోయి బతకడం యలాగ ? దానికి యంత కనికరం లేకపోయినా, యిక్కడే వుండి, చూశైనా సంతోషిద్దాం" అని వుండిపోతూ వొచ్చాను.

బుచ్చ : మీరు చెబితే, లుబ్ధావధాన్లుగారు పెళ్ళి మానుకుంటారని తమ్ముడు చెప్పా'డు.

గిరీ : నే చెప్పినమాట యీ భూ ప్రపంచంలో యవడూ కొట్టి వెయ్యలేడు. అందుచేత, వెంకటేశం అలా అని వుంటాడుగాని, మీ తండ్రి వకడూ, మా అన్న వకడూ లోకాతీతులు. వాళ్లు బ్రహ్మ చెబితే వినరు. ఈయనకి వెర్రికోపం. అతగాడు శుద్ధ పిసినిగొట్టు. మా అన్న సుఖపడ్డానికా యీ పెళ్ళి తల పెట్టా'డు ? నీ మొగుడు నిన్ను పెళ్ళా'డి ఎంత సుఖపెట్టాడో, మా అన్న నీ చెల్లెల్ని పెళ్ళా'డీ, అంతే సుఖపెడతాడు. ఆఫ్రికా దేశంలో స్లేవరీ అని వుంది. అనగా మనుష్యుల్ని పట్టి పశువుల్లాగ బజార్లలో అమ్ముతారు. యెవరు కొనుక్కుంటే వాళ్ళ యింట్లో, ఆయా మనిషి, బతికినన్నాళ్ళూ చా'కిరీ చెయ్యాలి. అలాగ్గానే మా అన్న మీ చెల్లెలిని పెళ్లి అనే మిషపెట్టి, కొంటున్నాడు. వాడింట యిది జీతంలేని బాపనక్కలాగ పనీ పాటా చేస్తుందని వాడి ఆశ. నేను కూడదని యంత గడ్డిపెట్టినా విన్నాడు కాదు. యీ కష్టాలన్నీ ఇలా వుండగా నాకు మరో భయం వేస్తూంది. చెబితే కోపం తెచ్చుకోవుగదా ?

బుచ్చ : మీరేం చెప్పినా నాకు కోపం లేదు.

గిరీ : ఆ మాత్రం ధైర్యవిఁస్తే, నాక్కావలసిందేవిఁటి ? రామచంద్రపురం అగ్రహారీకులు బహు దుర్మార్గులు. మా అన్న చచ్చిపోయిన తరవాత నీ చెల్లెల్ని తిన్నగా వుండనివ్వరు, అది కూడా మా మీనాక్షి మోస్తరౌతుంది.

బుచ్చ : మీనాక్షి కేం లోపం వచ్చింది ?

గిరీ : ఏఁవని చెప్పను ? కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. అయినా నీ దగ్గిర నాకు దాపరికం యేవి'టి ? దాని మొగుడు పోయిన తరవాత యేటేటా కడుపు అవుతూ ఉండడం, అయినప్పుడల్లా వొల్లమాలిన అల్లరిన్నీ ఒకప్పుడు అది ప్రాణభయం కూడా చేస్తుంది. ఆ వూళ్ళో రామప్పంతులని వొక పరమ దుర్మార్గుడు నియ్యోగప్పంతులు వున్నాడు. వాడు ఒక సానిదాన్ని వుంచుకున్నాడు. యెందరినో సంసార్లని చెడగొట్టా'డు. మా అన్న వ్యవహారాలన్నీ ఆ పంతులే చూస్తాడు. మా అన్న చచ్చిన ఉత్తర క్షణం, నీ చెల్లెలికి వొల్లమాలిన ధనం చేతిలోకి వొస్తుంది. స్వాతంత్ర్యం కలుగుతుంది. "ఏమి ఇది!" అని అడిగేవాడుండడు. యిహ

చెడిపోవడానికి అభ్యంతరవేఁవిటి ? "నేను కట్టుగా వున్నాను కానా ?" అని నువ్వు అనగలవు. నీ మొగుడి తాలూకు ఆస్తి నీ చెయ్యి చిక్కలేదు. మొగుడి యింటికైనా నువ్వు వెళ్ళలేదు.

బుచ్చ : అవును.

గిరీ : తల్లిదండ్రుల చాటున ఖాయిదాగా వున్నావు. పరాయివాడు యింట్లో అడుగు పెట్టలేదు. కాని యిలా యెంతకాలం వెళ్లుతుంది ? నిన్ను తల్లిదండ్రులు కలకాలం కాపాడలేరు గదా ? వాళ్లు పోయిన తరవాత నీకూ స్వాతంత్ర్యం వొఁస్తుంది. ఏ కాలానికి మనసు ఎలా వుండునో ? అప్పుడు కాలుజారిన తరవాత నువ్వు ఏవఁనుకుంటావు ? అయ్యో! నాడు గిరీశాన్ని శాస్త్రోక్తంగా పెళ్లా'డి పునిస్త్రీనయిపోతే పిల్లా పేకా గలిగి అష్టయిశ్వర్యంతో తులతూగుదును గదా! యీ దురవస్థ నాకు రాకపోవును గదా ?" అని విచారిస్తావు. అప్పుడు నే యెక్కడ వుంటానూ ? స్వర్గంలో నీ కోసం యెదురు చూస్తూ వుంటాను. యీ పెళ్ళి అయిపోయిన తరవాత వెంకటేశమూ, నేనూ పట్నానికి వెళ్ళిపోతాము. నిన్ను తలుచుకుంటూ నిద్రాహారం మానేసి కొన్ని రోజులు వుంటాను. యెంతకాలవఁని మనిషన్నవాడు నిద్రాహారం మాని వుండగలడు ? నిన్ను తలుచుకుని నిద్దర పట్టక, రెండుజాముల రాత్ర'ప్పుడు నా గదిలో యీజీచయిరుమీద కూచుని వుండగా' యదట బల్లమీద మెరుపు దీపం, గోడని నిలువుటద్దం వున్నాయి. ఆ అద్దంలో నా ముఖం చూసుకుని, ఏమంటానూ ? "యీ సొగసైన ముఖం, యీ తామర రేకులవంటి నేత్రాలు, యీ సోగమీసాలు ఇవన్నీ వృధా గదా ? యవరు చూసి ఆనందించనూ ? నా బుచ్చమ్మ నన్ను పెళ్ళాడకపోయిన తరువాత నా బతుకు యెందుకు ?" అని నిస్పృహ కలిగి చర్రున టేబిలు సొరుగు తీసి, అందులో వున్న జోడుగుళ్ళ పిస్తోలు యెక్కుబెట్టి గుండె దూసి పోయేటట్టు కొట్టేసుకుంటాను.

బుచ్చ : కొట్టుకోకండి, మీరు అలా అంటే నాకు యేడుపొస్తుంది.

గిరీ : తక్షణం దేవతలు విమానం పంపించి నన్ను స్వర్గానికి తీసుకువెళతారు. స్వర్గానికి వెళ్ళా'నని నాకు అక్కడ మాత్రం సుఖం ఉంటుందనుకున్నావా వొదినా ? నవాభరణ భూషితురాలయి రంభ తక్కుతూ తారుతూ వొచ్చి, "హా! ప్రియా! గిరీశ! నీలాటి సుందరుణ్ణి యన్నడూ నేను చూడలేదు.

రమ్ము. నన్ను చేకొమ్ము" అని రెక్కబట్టుకు లాగుతుంది. నేనేవఁటాను ? "ఛీ! అవతలకి పో! నేను యాంటీనాచ్చి! సానిది తాకితే, పరమ అపవిత్రంగా తలుస్తాను. పియర్సు సబ్బు రాసి కడిగితేనేగాని యీ చేతికి కల్మశం పోదు. నువ్వా రంభవి ? మా బుచ్చమ్మ సొగసుకి నువ్వు వొడ్డీకి పనికిరావు. గో యెవే, డా'మ్, డర్టీగూస్" అని అంటాను. అలాగే మేనకా, ఊర్వశీ, తిలోత్తమా మొదలైన యావన్మంది అప్సర స్త్రీలని తన్ని తగలేసి, కాషాయవస్త్రాలు ధరించి కల్పవృక్షచ్ఛాయని "హా! బుచ్చమ్మా, బుచ్చమ్మా!" అని నీ పేరు జపం చేస్తూ అనేక సంవత్సరాలు పద్మాసనం మీద వుండిపోతాను. అంతట కొన్నాళ్ళకి నా తపస్సు ఫలించి, నువ్వు నందనవనంలోకి చంద్రోదయంలాగ బయలుదేరి వస్తావు. నేను ప్రియురాలా! యెన్నాళ్ళకి వొచ్చావు!" అని అమాంతంగా వెళ్ళి నిన్ను కౌగలించు కుంటాను. అప్పుడు నీ మొదటి మొగుడు, ముసలివెధవ, గావంచాగుడ్డ కట్టుకుని, పొడుం ముక్కుతో "బుచ్చమ్మ నా పెళ్ళాం" అని అడ్డు రాబోతాడు. "వెధవాయా, నువ్వు బుచ్చమ్మకి తగవు. నీ రూపాయలు నువ్వు పట్టుకు పో" అని వొక్క తాపుతన్ని తగిలేస్తాను. మనం ఇద్దరం సుఖంగా స్వర్గంలో శాశ్వతంగా వుండిపోతాం.

బుచ్చ : యేడుస్తూన్న దాన్ని నవ్విస్తారు.

గిరీ : నువ్వు నన్ను పెళ్ళాడి'తే మనం బతికున్నంతకాలం నవ్వుకుంటూ, ఆనందిస్తూ కాలం వెళ్ళబుచ్చుతాం. అప్పుడు నిన్ను యిలా పప్పు రుబ్బ నిస్తానా ? మనకి యెంతమంది నౌకర్లు వుంటారు, యెంతమంది చా'కర్లు వుంటారు! తోటలు, దొడ్లు, గుఱ్ఱాలు, బళ్ళు! నిన్ను నడవనిస్తానా? పుష్పంలాగా నెత్తిమీద పెట్టుకుంటాను. అప్పుడు నీకు కలిగే ఆనందం ఆలోచించుకో.

బుచ్చ : నా జన్మానికి మరి ఆనంద మెఁక్కడిది ?

గిరీ : నేను నీకు దాసుడనై "యిదుగో, నన్ను స్వీకరించు. నన్ను పెళ్ళా'డి ఆజన్మం ఆనందం అనుభవించు. నన్ను ఆనందంలో ముంచు" అని బతిమాలుకుంటూంటే, నువ్వు అట్టి సులభసాధ్యమైన సుఖమును కాలున తన్నుకు వెళ్ళిపోయి, నా బతుకు కూడా బుగ్గిని కలిపితే, నేనేమి చెయ్యగలను?

బుచ్చ : మీ బతుక్కి లోపవేఁవి ? మీరు మహారాజులు.

గిరీ : నువ్వు నన్ను పెళ్ళాడితే నేను మహారాజునే అవుతాను. నీ నోటంట వచ్చినమాట అమోఘం! వొట్టినే పోకూడదు. గనక నాతో వెళ్ళిపోయిరా.

బుచ్చ : అమ్మనాయనో! నే మీతో రాను.

గిరీ : సరే, రాకపోతే నేనే గదా ప్రాణత్యాగం చేస్తాను ? పీడా నాడా కూడా పాయె.

బుచ్చ : అలాంటి మాటలు అనకండి.

గిరీ : చేసేమాట చెబితే తప్పేమిటి ? నే నేమైతేనేంగాని, నీ చెల్లెలి మీదైనా నీకు కనికరం కద్దా ?

బుచ్చ : అదేం అలా అడుగుతున్నారు ?

గిరీ : నిజంగా కనికరం వుందా ?

బుచ్చ : వుండకుండా వుంటుందా ?

గిరీ : వుంటే యీ పెళ్ళి తప్పించే సాధనం నీ చేతుల్లోనే వుంది.

బుచ్చ : నా చేతుల్లోనా!

గిరీ : అక్షరాలా.

బుచ్చ : యేమి చిత్రమైన మాటలు చెబుతారు!

గిరీ : యీ భూ ప్రపంచంమీద వుండుకున్న యావన్మంది స్త్రీలలోనూ నిన్నొకత్తెను వలచి, నేను నీకు సుతరామూ లొంగిపోబట్టిగదా, నా బతుకు హాస్యాలకింద ఐపోయింది.

బుచ్చ : మీ తోడు, అలా అనకండి.

గిరీ : పోనియి. ఆ మాత్రం భరువసా యిచ్చా'వు. ఒకమాట నాకు ప్ర'మాణ పూర్తిగా చెప్తు? నీ చెల్లెలి పెళ్ళి తప్పించడం నీ'చేత అయితే చేస్తావా ?

బుచ్చ : చెయ్యనా ?

గిరీ : యేమో, చేస్తావో చెయ్యవో ? చేస్తానని ప్రమాణం చేస్తేనే ఆ మాట నే చెబుతాను.

బుచ్చ : యావఁని ప్రమాణం చెయ్యమన్నారు.

గిరీ : నా మీద ప్రమాణం చెయ్యి.

బుచ్చ : మీ మీద ప్రమాణమే! చెప్పండి.

గిరీ : అయితే విను. వొంటరిగా చూసి ఈ మాటే నీతో రహస్యంగా చెప్పుదావఁని కాచి కాచి వుండగా, యీవేళ, మీ తండ్రి వూరికి వెళ్ళడం, మీ తల్లి వాకిట వుండడం మంచి సమయం చిక్కింది. చెవి వొగ్గి విను. నీ చెల్లెలి పెళ్ళి తప్పడానికి ఒక్కటే సాధనం ఉంది. అది యేవిఁటంటే, నువ్వు ముందూ వెనకా ఆలోచించక నాతో లేచివచ్చి నన్ను పెళ్ళి చేసుకోవడవేఁ. లేకుంటే నీ చెల్లెలి పెళ్ళి తప్పదు.

బుచ్చ : (ముసి ముసి నవ్వుతో) నేను మీతో లేచివొస్తే మా చెల్లెలు పెళ్ళి ఆగిపోతుందీ ? యేవిఁ చిత్రాలు ?

గిరీ : ఆ మాట నీ చేతనే వొప్పిస్తాను కదూ. విను, పెళ్లికి తర్లి వెళుతున్నప్పుడు రెండోనాడు రాత్రి బండీవాడి చేతిలో నాలుగు రూపాయలు పెట్టి, నీ బండీ తోవతప్పించి అనకాపల్లి రోడ్డు పట్టిస్తాను. అక్కడ నుంచి రామవరం దాకా మా స్నేహితులు అంచీ బల్ళు బణాయిస్తారు. ఆడుతూ, పాడుతూ మనం దౌడాయించి రామవరంలో పెళ్ళా'డేసుకుని సుఖంగా వుందాం. ఇక మీ వాళ్ళ సంగతి యేవౌఁతుందీ ? మనం వుడాయించిన మర్నాడు తెల్లవారగట్ల నీ బండి కనపడక కలవిలపడి, మీ వాళ్లు నెత్తీనోరూ కొట్టుకుంటారు. నీ చెల్లెలు పెళ్ళి ఆగిపోతుంది. మరి రెండు రోజులికి మనం పెళ్ళాడా'వని తెలుస్తుంది. నిన్ను ముసలివాడికి కట్టబెట్టినందువల్ల కలిగిన చిక్కులు చూస్తూ, నీ తండ్రి, నీ చెల్లెలికి మళ్ళీ ముసలి సంబంధం చెయ్యడు. నీ తండ్రి ఒకవేళ మూర్ఖించి పెళ్ళి చేస్తానన్నా మన తమాషా విన్న తరవాత, నా అన్న నీ చెల్లెల్ని మరి పెళ్ళి చేసుకోడు. యిది సిద్ధాంతం. అవునా కాదా ?

బుచ్చ : అవును కాబోలు.

గిరీ : అయితే మరి అందుకు సమ్మతేనా ?

బుచ్చ : యెందుకు ?

గిరీ : నాతో వెళ్ళిపోయి రావడానికి.

బుచ్చ : అమ్మనాయనా, నా ప్రా'ణం పోతే నేను మీతో రాను.

గిరీ : రాకపోతే, మీ చెల్లెలికి యీ పెళ్ళీ తప్పదు, నాకు చావూ తప్పదు.

బుచ్చ : అలా అనకండి.

గిరీ : అనకపోతే మాత్రం చావు తప్పేదుంది గనకనా ? నిన్ను వొదిలి బతకలేను. అది వక చావు. నువ్వు నామీద వొట్టేసుకుని ఆ మాట తప్పితే నన్ను దేవుడు చంపేస్తాడు. అది రెండో చావు. మరి నాకు చావు యెలా తప్పుతుంది.

బుచ్చ : నా నుంచి మీరు చచ్చిపోతే, నేనూ చచ్చిపోతాను. చచ్చి పోకండి.

గిరీ : నా వశవాఁ ? అదుగో, నీ తమ్ముడు వొస్తున్నాడు. మరి మన యీ కష్టసుఖాలు మాట్లాడుకోవడానికి వీలు చిక్కదు. ఒక్కమాట చెప్పు. బతకమన్నావా ? చావమన్నావా ?

బుచ్చ : వెయ్యేళ్ళూ బతకండి.

గిరీ : అలాగైతే నాతో రావడం ఖాయవేఁనా ?

బుచ్చ : ఏం జేయమంటే అది చా'స్తాను.

(వెంకటేశం మిడతని పట్టుకుని ప్రవేశించును.)

వెంకటే : యిదిగో నండోయి, గొల్లభావఁని పట్టుకున్నాను.

గిరీ : చూశావూ, వొదినా! నీ తమ్ముడు చిన్న గుంటడయినా, అప్పుడే గొల్లభావఁల్ని పట్టుకుంటున్నాడు.

బుచ్చ : (ముసి ముసి నవ్వు నవ్వుతూ) మిడత!

గిరీ : (బుచ్చమ్మతో) యిన్నాళ్ళకి మిడతంభొట్లు చేతిలో చిక్కా'డు. (వెంకటేశంతో) యిలా తే. మిడతల్ని పట్టుకోవడం మంచి ఎడ్యుకేషన్, యిదే నా'చురల్ హిస్టరీ, ప్రకృతి శాస్త్రం అంటారు.

వెంకటే : అక్కయ్యా, కొంచం ఊరుపిండి!

బుచ్చ : అమ్మ చూస్తే తంతుంది.

వెంక : అమ్మ చూడదులే (ఊరుపిండి చేతిలో వేసుకుని నాలుకతో నాకి గెంతును.)

(తెర దించవలెను)

కన్యాశుల్కం

పంచమాంకము

1వ స్థలము : లుబ్ధావధాన్లు పడక గది.

(లుబ్ధావధాన్లు మంచంమీద పరుండి వుండును. నిద్రలో అరచి కాళ్లూ, చేతులూ కొట్టుకుని, లేచి కూచుని వణక నారంభించును.)

లుబ్ధా : అసిరిగా! అసిరిగా! అమ్మో! చంపేశాడ్రోయి. రామనామ తారకం రామనామ తారకం రామనామ తారకం యిది రెండోపెళ్ళి ముండే. దీని మొగుడు పిశాచవైఁనాడు; నా పీక పిసికి చంపేస్తాడు. ఏవిఁటి సాధనం? రామనామ తారకం రామనామ తారకం.

తలుపు ఆవలనుంచి అసిరిగాడు : ఏటిబాబూ ? ఏటిబాబూ ?

మీనా : ఏవిఁటి నాన్నా ? తలుపు తియ్యి.

లుబ్ధా : (తనలో) కాళ్లు ఆడవు. చేతులు వొణుకుతున్నాయి.

(తలుపు తీసి, అసిరిగాడితో) వెధవా, నువ్వు లోపలికి రాకు.

అసి : నాను పిలుస్తొచ్చినాను, (నిష్క్రమించును).

(మీనాక్షి, శిష్యుడు ప్రవేశింతురు).

లుబ్ధా : (మీనాక్షితో) ఆ ముండని అవతలుండమను.

మీనా : నువ్వు మన గదిలోకి వెళ్ళిపో అమ్మా! (శిష్యుడు గది అవతలికి వెళ్లును) యేవిఁటి నాన్నా ?

లుబ్ధా : యిహ నే బతకను.

మీనా : యేవొఁచ్చింది నాన్నా, కడుపు నొప్పా, కాలు నొప్పా!

లుబ్ధా : కడుపునొప్పీ కాదు, కాలునొప్పీ కాదు. వెధవముండని పెళ్ళా'డిన కుంకనపీనుగ బతకడం యలాగ ?

మీనా : యేవిఁటా వొగాయిత్యం మాటలు, నాన్నా! మీకు యీ లేని పోని అనుమానం యవరు పెట్టా'రు ?

లుబ్ధా : అనుమానవేఁవిఁటి ? నిజం, నిజం, నిజం – వూరంతా అదే మాట.

మీనా : యీ రావఁప్పంతులే యిలాంటి అపవాదులన్నీ వేస్తూ వుంటాడు. కనపడ్డవాడితో అల్లా వూసుపెడితే వూరంతా అనుకోరూ ? బంగారం లాంటి పిల్లని యిలాంటి మాటలని బెంబేలు పెట్టకండి. తండ్రి వెళ్ళిపోయినాడని అది రాత్రీపొగలూ యేడుస్తూంది.

లుబ్ధా : వెధవ తండ్రీ, బోడితండ్రీని! గాడిద' కొడుకు, రెండో పెళ్ళి ముండని నా పీకకి ముడేసి అమాంతంగా నా కొంప ముంచా'డు. యిహ బతకను, యిహ బతకను.

మీనా : 'రెండోపెళ్ళి' ముండ, రెండోపెళ్ళి ముండ' అని శుభమల్లే అనకండి. మీరే యిలా పాడుతూ వుంటే వూరంతా అనడం ఆశ్చర్యవాఁ ? మాటాడక వూరుకోండి.

లుబ్ధా : వూరుకోవడ వెఁలాగే ? మన వూరా, మన దేశవాఁ ? రెండో పెళ్ళిముండ కాకపోతే ఆ తండ్రి వెధవ, పేరయినా చెప్పకుండా పారిపోవడవేఁవి ?

మీనా : సిద్ధాంతితో చెప్పా'ట్టే పేరు ?

లుబ్ధా : వాడి శ్రాద్ధం చెప్పా'డు. సిద్ధాంతి గడియ కో పేరు చెబుతున్నాడు.

మీనా : అతగాడికి మాత్రం కొత్తవాడి పేరు జ్ఞాపకం వుంటుందా యేవిఁటి ? మన పిల్ల మన యింట్లో వున్న తరవాత అతగాడి పేరుతో మీకేం పని ?

లుబ్ధా : యీ పెళ్ళాం ముండ నా యింట్లో వుంటే నేను చచ్చిపోతాను, మరి బతకను.

మీనా : వెర్రికేక లెయ్కు. నోరు మూసుకుని వూరుకోండి. యిరుగు పొరుగు వారు నవ్వుగల్రు. మీ మావఁగారు యంత పండితుడు, యంత దొడ్డ మనిషి! లేనిపోని అనుమానాలు పెట్టుకోకండి. పసిపిల్ల బెంగెట్టుకోగల్దు.

లుబ్ధా : ఓసి భ్రష్టా! వాడు నీకేవఁయినా ఇచ్చాడా యేవిఁటే ? వాణ్ణి వెనకేసుకు మాట్లాడుతున్నావు ? నీకు నేను చచ్చిపోవాలని వుంది కాబోలు!

మీనా : యేవిఁటా మతిపోయిన మాటలు! అతగాడు నేడో రేపో వొచ్చి, యిలాంటి మాట్లన్నందుకు మన నోట్లో గడ్డి పెడతాడు.

లుబ్ధా : అతగా డెవడు, వొల్లకాట్లో రావఁనాథాయ ? మరెక్కడొస్తాడు వాడు! యిహా, నాకు చావు సిద్ధం.

మీనా : మీకు చావేం వొచ్చింది. యిప్పుడు ? ఒకవేళ రెండోపెళ్ళి పిల్ల అయితే మాత్రం గప్‌చిప్ అని వూరుకోవాలిగాని, అల్లరి చేసుకుంటారా ? యీ రోజుల్లో యంత మంది రెండో పెళ్ళి చేసుకుని సుఖంగా వున్నారు కారు ? పిల్ల బుద్ధిమంతురాలు. మీ అదృష్టం వల్ల దొరికింది. మాట్లాడక వూరుకోండి.

లుబ్ధా : నా అదృష్టం తగలబడ్డట్టే వుంది. నీకేం పోయేకాలం వొచ్చిందే ? నువ్వు కూడా యీ కుట్రలో చేరి, నీ తండ్రికి కళ్లు గప్పి వెధవ పెళ్ళి చేశావే ? అయ్యో, వెధవని పెళ్ళి చేసుకున్న కుంక వెధవా, నీ బుద్దెక్కడికి పోయిందిరా ? నీ చదువెక్కడికి పోయిందిరా ? నీ వేదం తగలబడనూ ? యిహ బతకను.

(మీనాక్షి నవ్వును)

లుబ్ధా : నవ్వుతావేఁవేఁ భ్రష్టాకారిముండా ? నువ్వూ, నీ సవిత్తల్లీ నన్ను చంపేసి రాజమహేంద్రం పారిపోయి, వెధవపెళ్ళి చేసుకుంటారు. నాకు తెలుసు. గిరీశంగాడు అన్నమాట నిజం. వెధవని, చెవిపె'ట్టాను కాను. నా సొమ్మంతా ఘటాశ్రాద్ధప వెధవల పాలవుతుంది. పో. నేను పడుకుంటాను. (పక్కమీద పడుకుంటూ) మళ్ళీ వొస్తాడు గాబోల్రా దేవుఁడా!

మీనా : యవరు నాన్నా ?

లుబ్ధా : నువు పో, నీ కెందుకు ? ఆ వెధవ నా పీక పిసికేస్తాడు. నీ కోరిక తీరుతుంది.

మీనా : మీరలా అంటే నాకు యేడుపొస్తుంది. నేనిక్కణ్ణించి కదలను. యవ డా పీక పిసికేవాడు ?

లుబ్ధా : అయితే యిక్కడే పక్కేసుకు పడుకో.

మీనా : పడుకుంటాను. యవడు మీ పీక పిసుకుతాడు ?

లుబ్ధా : ఆ ముండ మొదటి మొగుడే! యిందాకా నువ్వు రాకముందు, నా గుండెల మీదెక్కి పీక పిసికేప్పటికి ప్రా'ణం పోయిందనుకున్నాను.

మీనా : నిజంగానూ... కల గన్నారు కాబోలు నాన్నా.

లుబ్ధా : కలెక్కడి కలే! పీక నులుచుకుపోతేనూ!

మీనా : మొదటి మొగుడు మీకేం తెలుసును ?

లుబ్ధా : వాడే చెప్పాడే! "వెధవా, నా పెళ్ళాన్ని పెళ్ళా'డావు; నిన్ను చంపేస్తా"నన్నాడే.

మీనా : యలా ఉంటాడు ?

లుబ్ధా : గిరీశంగాడి మూడు మూర్తులూనే.

మీనా : కల కాబోలు నాన్నా ? అదే తలుచుకు పడుకుంటే, చిన్నబాబు కల్లోకొచ్చాడు కాబోలు!

లుబ్ధా : నేను చస్తే యవరికి విచారం!

మీనా : ఆ పిల్లని వెళ్లి అడుగుదునా ?

లుబ్ధా : వొద్దు, వొద్దు తొందరపడకు.

మీనా : నన్ను తిట్టేస్తున్నారు, దాని చచ్చిన మొగుడు మిమ్మల్ని చంపేస్తాడని భయపడుతున్నారు. యెందు కీ తంబళ అనుమానం! ఓ మాటు దాన్నే అడిగేస్తే ఉన్న నిజం తెలిసిపోతుంది.

లుబ్ధా : నిజం నీతో చెబుతుందీ ?

మీనా : నాతో నిజం చెబుతుంది. అది వొట్టి సత్యకాలప్పిల్ల. నాకు యంతో ఉపచారం చేస్తుంది ?

లుబ్ధా : దాన్ని పాడుచేస్తున్నావూ ?

మీనా : యిలాంటి మాటలంటేనే నాకు అసయ్యం. మీరు యక్కడో దడుసుకున్నారు కాబోలు, అంచేత దుష్టకల వొచ్చింది. అంతేగాని, రెండోపెళ్ళి, మూడోపెళ్ళి అని వెర్రులు వోడకండి. పూజారి గవరయ్యని పిలుస్తాను; అతగాడు యింత మంత్రించి వీబూది యిస్తాడు. రాసుకు పడుకోండి.

లుబ్ధా : కొంప తీస్తావా, యేవిఁటి ? వాడొస్తే, వాడితో యేవఁని చెప్పడం ? దాన్నే నిజం అడుగుదూ.

మీనా : నే నడగను నాన్నా. నన్ను అడ్డవైఁన మాటలూ అంటూంటే, నే నెందుకు అడుగుతానూ ? నేను దాంతో యిగ మాట్లే ఆణ్ణు.

లుబ్ధా : నా తల్లివి కదూ, అడుగమ్మా.

(మీనాక్షి పైకి వెళ్లును.)

లుబ్ధా : ఓ పన్నం యాకర బెట్టేదా ? గాయత్రీ స్మరణ చేసేదా ? వేదాలూ, మహామంత్రాలూ యీ దెయ్యాలకి పేలపిండి వొడియాలు, శాపర మంత్రాలు ఉపదేశం అవుదావఁంటే బెడిసిగొడతాయేమో అని భయం. యేవిఁ సాధనం! "రామనామ తారకం" స్మరణ చేస్తాను. రామనామ తారకం! భక్తిముక్తి దాయకం! జానకీ మనోహరం! సర్వలోక నాయకం! రామనామ తారకం! రామనామ తారకం! యీ ముండ యింట్లోవుంటే నే బతకను. రామనామ తారకం! రామనామ తారకం! రుద్రాక్షమాల యేదీ ? (మంచము అంచున కూచుని పరుపుకింద తడివిఁ, రుద్రాక్ష తావళం తీయుచుండగా, మీనాక్షి ప్రవేశించును.)

మీనా : మీ మాట నిజవేఁ నాన్నా.

లుబ్ధా : నిజవేఁ!

(మంచము మీదనుంచి కింద కూలబడును.)

మీనా : (లేవదీసి) నాన్నా! నాన్నా! పడిపోయినావేఁవి ?

లుబ్ధా : యేవీఁలేదు, నిజవేఁ!

మీనా : నిజవేఁను. ఆ మొగుడు యిప్పుడే దానిక్కూడా కనపడి "ముండా, మళ్ళీ పెళ్ళా'డావేఁ! నీ కొత్త మొగుణ్ణి పీక పిసికేస్తాను చూడు" అన్నాట్ట.

లుబ్ధా : అయ్యో! అయ్యో! రామప్పంతులు యిల్లు వొల్లకాడు కానూ! యక్కడ కల్పించాడే యీ మాయ పెళ్ళి నా కోసం! వీడి పిండం పిల్లులికి పెట్టా! అయ్యో! అయ్యో! ఆ మొగుడు వెధవ యలా వున్నాడందే ?

మీనా : వాడు రోజూ దానికి కనపడతాట్ట నాన్నా! వాడికి మీసాలూ, గిరజాలూ వున్నాయట. చావఁంచాయట.

లుబ్ధా : వాడేనే, వాడేనే! యేవిఁటే సాధనం ? యిహ నేఁ దక్కను.

మీనా : పూజారి గవరయ్యకు కబురు పెడతాను.

లుబ్ధా : వొద్దు, వొద్దు నా మాట విను. వా డొచ్చాడంటే యిల్లు తినేస్తాడు.

మీనా : తింటే తింటాడు, ప్రాణం కంటేనా యేవిఁటి ?

లుబ్ధా : నా కొద్దంటూంటే వినవు కదా. నా మంచం దగ్గిర పక్కేసుకు పడుకో! నువ్వు చదువుకునే భాగవతం పుస్తకం పట్రా; తలకింద పెట్టుకు

పడుకుంటాను. (మీనాక్షి వెళ్ళును) యీ ముండ నా యింట్లోంచి విరగడైపోతేగాని యీ పిశాచం వొదిలిపోదు. వేదం చదువుకున్న ముండాకొడుకుని నా మీదే పడ్డ తర్వాత, వీడు బ్రహ్మరాక్షసిగాని, వొట్టి దెయ్యం కాదు. పోనీ, ఆతడికే ప్రార్థన చేస్తాను – "నా పెళ్ళాం మొదటి మొగుడా; ఆ, నా పెళ్ళాం కాదు. లెంపలు వాయించుకుంటాను." ఈ పిల్ల మొగుడా ? నువ్వే నిజమైన మొగుడివి; నేను కాను. దాన్ని ముట్టను, తాకను. దాంచేత చాకిరీ అయినా చేయించను. నన్ను రక్షించి, పీక పిసికెయ్యకు; పీక పిసికెయ్యకు. యే పాపం చెయ్యబట్టో దెయ్యాని వైనావు. నన్ను చంపావంటే బ్రహ్మహత్య చుట్టుకుంటుంది, మరి జన్మ ఉండదు. బాబూ! నాయనా! తండ్రీ! నా జోలికి రాకు, నీ మావఁగారి పీక నులివెయ్యి. ఆ రామప్పంతులుగాడి పీక నులివెయ్యి. లేకపోతే..." (కేకలు, యేడ్పు వినబడును) ఓరి దేవుడా! మళ్ళీ వొచ్చాడు కాబోలు, (శిష్యుడు ఏడుస్తూ పరిగెత్తి వచ్చి లుబ్ధావధాన్లును గట్టిగా కౌగలించు కొనును, మీనాక్షి శిష్యుడ్ని చీపురుకట్టతో కొట్టబోవును. శిష్యుడు తప్పించుకోగా దెబ్బలు లుబ్ధావధాన్లుకు తగులును.)

మీనా : ముండా! నా మొహురు అక్కడ పడేస్తావా పడెయ్యవా ? నా తాళం యేదే లంజా ?

లుబ్ధా : నన్ను కొట్టేశావేవిఁటే ? (శిష్యుడితో) వొదులు, వొదులు, నన్ను ముట్టుకోకే తల్లీ! (మీనాక్షితో) దీని అపవిత్రపు వొళ్ళు తగిల్తే చచ్చిపోతాను. నన్ను వొదిలింపించెయి.

(మీనాక్షి శిష్యుడి రెక్కలుపట్టి లాగి, బుగ్గ గిల్లును. శిష్యుడు మీనాక్షి చెయ్యి కరచి పారిపోవును.)

మీనా : దానమ్మకడుపు కాలా. చెయ్యి కరిచేసింది నాన్నా! రక్తం బొట బొట కారుతూంది. దీన్ని హతవాఁరుస్తాను.

లుబ్ధా : యంత దారుణప్పని చేసిందీ, ముండ! యేదమ్మా, చెయ్యి (గుడ్డపీలికతో రక్తం తుడిచి) మొహురడిగావు గదా ఎక్కడి దేఁవిటి ?

మీనా : ఆ తండ్రి వెధవ నా కిమ్మని యీ ముండ చేతికి యిచ్చాడు. దీని నక్క వినయాలు చూసి నా పెట్టా బాడా దానికే వొప్పజెప్పి ఆ మొహురు

దాన్నే దాచమన్నాను. అనుమానవేఁసి యిప్పుడు నా మొహరు తెమ్మంటే, "బట్టల పెట్లో" పెట్టాను. తాళంపోయింది అంది. తాళం తా'కపోతే రోకలితో బుఱ్ఱ చితక బొడుస్తాను.

లుబ్ధా : చెయిజేసుకోకు. నీది వెఱ్ఱికోపం. చావగొట్ట గలవు. జాగ్రత్త!

మీనా : చస్తే యీడిచి పారేస్తారు. ముండ, యలా కరిచిందో చూడండీ! యింకా రక్తం కారుతూంది. మనిషికాటుకి మందు లేదన్నారు.

లుబ్ధా : కుంకం పెట్టమ్మా.

మీనా : దాని బుఱ్ఱ చితకబొడిచి మరీ పెడతాను. (వెళ్ళును.)

లుబ్ధా : గుండు గొమ్మల అనుమానం తీరిపోయింది. పీక నులివిఁ వాడైనా చంపేస్తాడు. కరిచి అదైనా చంపేస్తుంది. వీడిచేతో, దానిచేతో చావు తప్పదు. యెంత డబ్బెట్టి కొనుక్కున్నాఁర్రా, యీ చావు పెళ్ళి! అయ్యో! అయ్యో! దీన్ని పైకి తగలేస్తే వాడు కూడా విరగడైపోతాడు. అదే సాధనం. ఎక్కడికి తోలేయను ? బండిమీద ఎక్కించి పట్నం తోలేస్తాను. అక్కడగానీ తండ్రివెధవ కనపడకపోతే మళ్ళీ దెయ్యాన్ని నెత్తిన పెట్టుకుని ప్రత్యక్షం అవుతుందే! బండి అద్దె యిచ్చుకోవడవేఁ మిగులుతుంది. యేమి సాధనం? ... యేమి సాధనం ?.... రామప్పంతుల్ని సలహా అడుగుదునా ? ఆఁ! మంచి ఆలోచన తోచింది. రామప్పంతులు నాకు కట్టిపెట్టిన ఈ ముండని వాడి దగ్గరకే పంపించేస్తాను... సాని దాంతోపాటు దీన్ని కూడా వుంచుకుంటాడు. కావలిస్తే పదిరూపాయలు దక్షిణతో కూడా ఇచ్చేస్తాను.

(మీనాక్షి ప్రవేశించును)

మీనా : యక్కడా కనపడదు నాన్నా, గుంట.

లుబ్ధా : నూతులో పళ్ళేదు గదా ?

మీనా : యేమో ?

లుబ్ధా : పరిగెత్తికెళ్ళి గవరైని పిలవమను. దాన్ని నువ్వు చావగొట్టలేదు గదా ?

మీనా : కనపడితేనా ?

లుబ్ధా : యేవిఁటి నాయనా, కొత్త ఉపద్రవం! (నిష్క్రమింతురు)

2వ స్థలము : రామప్పంతులు యింట్లో కొట్టుగది.

(భుక్త, పోలిశెట్టి, సిద్ధాంతి, మధురవాణి పేకాడుచుందురు. పూజారి గవరయ్య ఆట చూచుచుందును.)

పోలి : యేం భష్టాకారి ముక్కలు యేశావయ్యా! యెప్పుడూ నువ్వింతేను.

భుక్త : చూసి వేశానా యేవింటి ? నీ దరిద్రదేవతని తిట్టు.

పోలి : గవరయ్యా! నీ ముఱుకు నా దగ్గిర యిలా యెట్టకు. లేచి పో, నీ పుణ్యె వుంటుంది.

గవ : నేను మధురవాణి దగ్గిర కూచుంటాను.

భుక్త : చూడూ, ముక్క తప్పు పడ్డట్టుంది.

పోలి : ఆఁ! బాపనయ్య పంచాలని తప్పు పంచుతున్నావు. తప్పు పంచితే బేస్తుమీద కుదే లెట్టిస్తాను.

భుక్త : ముక్కలు బాగా పడలేదన్నావే ?

పోలి : రెండోయేత నాలుగాసు లడకూడదా ?

భుక్త : (పోలిశెట్టికి ముక్కలు వేస్తూ) యిదుగో నాలుగాసు లేస్తున్నాను, జుర్రు.

పోలి : నీ యినపచేత్తో యేస్తే, పొల్లుముక్కలే పడతాయి; మంచి ముక్క లడతాయా?

భుక్త : తథాస్తు!

పోలి : అలా అనకు, యెంతశెడ్డా బాపనాడి శాపనాకారం మా శెడ్డది. (చూచుకొని) శీ! భష్టాకారి ముక్కలు.

సిద్ధాం : ఒకటి, రెండు.

పోలి : అదుగో, అలా శెప్పితే నే నొప్పను. ఒక్కొక్కటి శెప్పాలి.

సిద్ధాం : అయితే వకటి.

పోలి : ఒక్కటీ.

మధుర : ఒకటి.

భుక్త : వకటి

(సిద్ధాంతి ఆలోచించును.)

పోలి : యే టాలోసిస్తావు ? చే తరస! యెత్తవయ్యా!

సిద్ధాం : నీదేం పోయింది ? రెండు.

పోలి : లాంతరేశావు, యేటెత్తను ? రెండు.

మధు : రెండు.

భుక్త : రొండు.

(సిద్ధాంతి ఆలోచించును.)

పోలి : యేటాలోసిస్తావు ? చే తరస! యెత్తి బేస్తు గెలుసుకో.

సిద్ధాం : నువ్వు చెప్పావు గనక యెత్తుతాను.

పోలి : ఆఁ డబ్బుక్కడెట్టి మరీ యెత్తు. మూడో యెత్తుడపు బేస్తుఁ గా'పక వుందా ? బేస్తుమీద కుదేలెట్టి బాకీ లెట్టి యెగెయ్యడానికా ?

సిద్ధాం : (తన ముక్కలు యెత్తు ముక్కలమీద వేసి) కోవఁటాడి పిలక నిగుడుతూంది.

పోలి : తంతావా యేటి ?

సిద్ధాం : తన్నడవఁంటే, ఒహలాగనా ?

పోలి : నా ఆట శెడగొటేసినావు, బాపనయ్యా!

భుక్త : ముక్కలు పడలేదని యేడుస్తూ, మళ్ళీ యేవిఁటి, ఆటచెడగొట్టా'డని యేడుస్తావు ?

పోలి : ఈ ఆట బేస్తు చేయించకపోతే నా పేరు –

సిద్ధాం : కోవఁటాడా, నోరు మూసుకుంటావా, మూసుకోవా ?

పోలి : తెల్లాడి బావుటా యెగురుతుండగా, నీ జులు వేఁటి ? ముక్కలిియ్యడం యింతసేపయితే మరా టేటి ?

సిద్ధాం : నువ్వుగాని మళ్ళీ మాట్లాడా'వంటే, ముక్కలు కలిపేస్తాను.

(పోలిశెట్టి "నేను మాటాడను; నువ్వు ఆడు" అని సౌఁజ్ఞ చేయును. సిద్ధాంతి ఆడును.)

పోలి : మూడే తురుపులు పడ్డాయి బాపనాడా! "తమాషా దేఖో, లంకకే రాజా"

సిద్ధాం : ఆట పారెయ్యనా ?

పోలి : బుద్ధొచ్చింది; బుద్ధొచ్చింది. లెంప లోయించుకుంటాను. మరి మాటాడి తొౌట్టు.

పూజా : మా మధురవాణిమీద ఆశుకవిత్వం చెబుతాను.

రాణా,' డైమను రాణీ
రాణా,' యిస్పేటురాణి ? రాణి కళావ
ర్రాణా,' ఆఠీన్రాణీ ?
రాణి యన న్మధురవాణె, రాజుల రాణీ!

సిద్ధాం : గవరయ్యా! యేం విలువైన పద్యం చెప్పా'వోయి! నీ మీద నేను పద్యం చెబుతాను, విను.

"గవరయ్యా! నీ సరి మరి
యెవరయ్యా ?"

పూజా : "యెవరు లేరు. యిచ్చో నయ్యా!"

సిద్ధాం : యిదిగో రాజు.

పోలి : యిదిగో పాల్తు.
(మధురవాణి తురుపు రాణీ వేయును.)

పోలి : అదుగో, అదుగో యీ బాపనాడు కపీశం శెప్పి, మధురవోణి దగ్గిర రాణీ వుందని శెప్పేశాడు. గోరం, గోరం. గవరయగానీ మాటాడితే నే ఆటాణ్ణు.

పూజా : పోలిశెట్టిమీద కవిత్వం చెప్పి చాలా రోజులైంది. (పొడుం పీల్చి.)

"పోలిశెట్టి ముఖము పోలి రొట్టెను బోలు
పోలిశెట్టి ముక్కు పొడుము డొక్కు"

పోలి : వొద్దు! వొద్దు! వొద్దు! నా మాటిను. పా'నంపెట్టి సంపేస్తావాయేటి ? ఊరుకుంటి వొట్టాయినా, యిన్నావా ? యీ ఆట సిద్ధాంతి బేస్తెట్టి, నేను గెలిస్తే, నీ క్యాండబ్బిస్తాను, మరూరుకో.

సిద్ధాం : నీ సొద తగలడా, తురుపు మిగిలిపోయింది. బేస్తు (ముక్కలు చూపించి పారవేయును.)

పోలి : ఆఁ! మూడో యెత్తడబ్బేస్తు, గా'పకా లుంచుకొండయ్యా. చేతిహొరస, మంచి ముక్కలెయి, బాపనాడా! అంతసేపు కలపడవాఁ ? గోరం, గోరం!

సిద్ధాం : బులబులాగ్గా కలిపి, బేస్తు నీకిస్తా ననుకున్నావా ?

పోలి : తోలుసేత్తో ముక్క లేసినావు! "నరశింవ్వ, నీ దివ్వె నామ మంతరము శాత నరసింవ్వ నీ దివ్వె"...

సిద్ధాం : దివ్వే లేదు దీపం లేదు. ముక్కల్తియ్యి.

పోలి : గవరయ్య ముక్కలమీద కన్నేసి పిల్లంగెటేసున్నాడు! నరశింవ్వ నీ దివ్వె... (ముక్కలు యెత్తిచూసి) సీ! భష్టాకారి ముక్క లేశావు.

సిద్ధాం : (పంపకం ముగించి తన ముక్కలు తీసి చూచుకుని) మృత్తికాచమే!

పూజా : పోలిశెట్టి అంత అలక్కైతే, నే నింటికిపోయి పరుంటాను. (గవరయ్యా నిష్క్రమించును. మధురవాణి వెంటవెళ్ళి తిరిగి వచ్చును.)

పోలి : శని విరగడై పోయిందిరా, దేవుఁడా... ఒట్టి భష్టాకార ముక్కలు, ఒహటీ.

మధు : ఒకటి.

భుక్త : ఒహటి.

సిద్ధాం : ఒహటి.

పోలి : రెండు.

మధు : రెండు.

భుక్త : రెండు.

(సిద్ధాంతి ఆలోచించును)

పోలి : యెందు కా యెర్రాలోశన ? నా మాటిను. మూడో బేస్తెట్టకు. (వీధి తలుపు తట్టబడును.)

మధు : పంతులు!

పోలి : యివాళ రాదని సెప్పితివే ?

మధు : రారనుకున్నాను. వొచ్చారు. యేంచేదాం ?

సిద్ధాం : ఆట తీసెయ్యండి. (ముక్కలు పడవేయును)

పోలి : బేస్తెగెయడానికా ? నే నొప్పను; మధురోణీ! ఆటాడి మరీ తలుపు తియ్యి.

మధు : (ముక్కలు కిందబెట్టి; లేచి సన్నని గొంతుకతో) గోడ గెంతి పారిపోండి.

భుక్త : దిడ్డితోవంట వెళ్ళిపోతాం.

పోలి : నేను పట్టనే ? యేటి సాధనం ?

భుక్త : మేం దిడ్డితోవంట పోతాం, నువ్వు అటకెక్కు.

పోలి : నన్నెక్కించి మరీ యెళ్ళండి. కాలుజారితే యేటి సాధనం ?

సిద్ధాం : నీ కొడుకుది అదృష్టం.

(పెరటిలోకి వెళ్లును)

పోలి : గోరం! గోరం! యవడి ముక్కలు ఆడి దగ్గరే. ఆట కలపకండి.

(తలుపు తిరిగి తట్టబడును)

పోలి : నరశింవ్వ. నీ దివ్వె....

(మధురవాణి ఊరుకొమ్మని కోపరసంగా సౌంజ్ఞ చేయును. సిద్ధాంతి ప్రవేశించును.)

సిద్ధాం : దిడ్డీ తలుపు కప్పతాళం వేశుంది. మన్ని పట్టుకుందావఁనే పంతులు దిడ్డీ తలుపు తాళం వేశాడు.

పోలి : నరశింవ్వ, నీ దివ్వె....

మధు : (పోలిశెట్టిని ఉద్దేశించి) చస్! (సన్నని గొంతుకతో) ఉలక్కుండా పలక్కుండా యీ గదిలో కూచోండి; ఆయన పరున్న తరవాత వచ్చి తలుపు తీసి వొదిలేస్తాను.

(దీపములు ఆర్పి పైకి వెళ్ళి, గది తలుపువేసి గొళ్ళెము బిగించును. తలుపు తిరిగీ తట్టబడును.)

మధు : యేవీఁ గవరయ్య చాదస్తం! అదే తట్టడవాఁ ? (వీధి తలుపు దగ్గరికి వెళ్ళి) యెవరు ?

తలుపవతల మనిషి: యింత సేపేం ?

మధు : నిదరబోతున్నాను.

మని : పేక! పేక! పేక! నిన్నొదిలేస్తాను. నీ సంగతి నాకు తెలిసింది.

మధు : మరి, మీ మానాన మీరు పోయి, నిశిరాత్రివేళ వొక రైనీ నన్ను వొదిలేస్తే యీ అడవి వూళ్ళో నాకు భయం కాదా ? అంచేత పబ్లిగ్గా నలుగుర్నీ పిలిచి పేకాడుతున్నాను; తప్పేవుంది ? మంచుపడుతూంది లోపలికి రండి, (తలుపు గడియతీసి) రండి, నా ఆట మీరాడండి, నేను పరుంటాను.

మని : సొందాన్ని యవడు నమ్మమన్నాడు ? నీ కిద్దావఁని సంతోషంతో వక సరుకు తెచ్చాను. నీ చర్య చూసేప్పటికి నా మనస్సు చివుక్కుమని పోయింది.

మధు : యెంత న్యాయంగా సంచరించినా, మీ హృదయంలో కాసింత కనికరం లేదు గదా ? యీనాటి నుండి మీరు యెక్కడికి కమాను వెళుతూ వుంటే, అక్కడకల్లా నేను కూడా మీతో వొస్తూవుంటాను.

మని : మెడ పైకి ఉంచు. (మధురవాణి అటులచేయును. ఆ మనిషి మధురవాణి మెడలో కంటె వుంచును.)

మధు : ఔరా! యింద్రజాలి! పంతులు గొంతుక యెలా పట్టా'వు ? నన్నే మోసపుచ్చితివే ? (రెక్కపట్టుకొని) గదిలోనికి రా (గదిలోనికి తీసుకు వెళ్లును) యీ చిల్లంగి కళ్లు నీ కే దేవుఁడిచ్చాడు ? (ముద్దెట్టుకొనును.) వాళ్ళింట యేవేఁవి ? చిత్రాలు చేశావో చెప్పు.

శిష్య : ముద్దెట్టుకోనంటే చెబుతాను.

మధు : నీకు తగనో ?

శిష్య : ముద్దెట్టుకుంటే యెంగి లౌతుంది.

మధు : నిజం. నీకున్న బుద్ధి నీ పెద్దలకు లేదు. నన్ను నిష్కారణంగా భయ పెట్టా'వు. అందుకు నీ కేవి'టి శిక్ష ? బుగ్గ కొరికేతునా ?

శిష్య : పాలూ పంచదారా వుంటే ఇయ్యి.

మధు : తరవాత మేపుతాను. ముందు నీకు దాసరి వేషం వేస్తాను, కొత్త అగ్రహారం పోయి నీ గురువును జేరుకుందువు గాని.

(తెర దించవలెను)

(చీకటిగదిలో పోలిశెట్టి, భుక్త, సిద్ధాంతి వుందురు. అవతల నుంచి రామప్పంతులు గొంతుకతో శిష్యుడు – "ఈ గదిలో యవణ్ణో దాచావు"

మధు : రామ! రామ! యవ్వడూ లేడు.

(పోలిశెట్టి నిచ్చెన యెక్కును. భుక్త కూడా యెక్కబోవును. నాలుగు మెట్లెక్కి యిద్దరూ కింద బడుదురు.)

పోలి : సంపేశినావు. బాపనాడా!

భుక్త : నా మీద నువ్వుపడి, నేను వుక్కిరిబిక్కిరి ఔతూంటే నువ్వు సచ్చానంటా వేవింటి ? లేస్తావా, కరిచేదా ?

శిష్యు : (రామప్పంతులు గొంతుకతో) అదుగో, లోపల యెవళ్ళో మాట్లాడుతున్నారు, లంజా! అది కోవంటాడి గొంతుకలా వుంది. కప్పతాళం వేసి ఊరందరినీ లేవదీసుకొస్తాను.

మధు : కప్పతాళ వెందుకు ? లోపల యెవళ్లూ లేరు. దెయ్యాల కొంప; దెయ్యాలు దెబ్బలాడుతున్నాయి.

(మధురవాణి తలుపుతీసి గదిలో ప్రవేశించి అగ్గిపుల్ల వెలిగించును. శిష్యుడు ప్రక్కకి తొలగిపోవును.)

మధు : పోలిశెట్టి యేమి, పడుకుని లేవడు! మేలుకొలుపులు పాడనా ?

భుక్త : రామప్పంతులేడీ ?

మధు : రామప్పంతులూ లేరు. గీమప్పంతులూ లేరు. ఇంట్లో పని చేసేవాడు తలుపుకొట్టాడు' బెంగెట్టుకోకండిక.

భుక్త : అతగాడి మాటలు వింటేనే ?

మధు : నేనే ఆయన గొంతుకు పెట్టి మాట్లాడా'ను. ఏమి ధైర్యం ? ఏమి మగతనం!

పోలి : "నరశింవ్వ నీ దివ్వె" (లేచి) "నామాంతరము శాత"... యవడి ముక్కలాడి దగ్గరున్నాయా ?

(అంతా మళ్ళీ ఆటకు కూర్చుందురు.)

సిద్ధాం : ఆట కలిపేశాను.

పోలి : గోరం, గోరం! నాకు యిసిపేటు ఆసు దాడదొచ్చింది గదా, బేస్తులు గెలుచుకు పోదునే! గోరం, గోరం! మధురవాణి వొట్టినే బెంబేరు పెట్టేశింది. అటక మీంచి పడి నడుం విరిగిపోయిందిరా దేవుడా!

భుక్త : నీ కింద పడి నేను నలిగిపోయాను. నీకేం తీపు దిగ దీసింది ?

పోలి : కలిపి యెయ్యెయ్యి – ముక్కలు.

సిద్ధాం : నేను కలపను, నా వొంతు అయిపోయింది – నువు కలుపు.

పోలి : ఏటైపోయింది.

(రామప్పంతులు వీధితలుపు తట్టును.)

రామ : తలుపు, తలుపు.

మధు : యీా మాటు పంతులే.

పోలి : ఏటి సాధనం ?

మధు : గోడగెంతి వెళ్ళిపోండి.

పోలి : నేను గెంతలేనే ?

మధు : నిన్ను యీా గదిలో పెట్టి తాళం వేస్తాను.

పోలి : దీపం ఆరిపెయ్యి. నాకు బయంవేస్తుంది.

సిద్ధాం : గాజు పెంకులు గుచ్చుకుంటాయి; గోడ దాటడం యెలాగ ?

భుక్త : నాకు కాళ్ళు మేహవాతం నొప్పులు, నేను గెంతలేనే ?

మధు : (దీప వార్పి) యిలాగే వుండండి.

పోలి : నరశింవ్వ...

మధు : చస్.

పోలి : సచ్చాను.

మధు : (గది గొళ్ళెం వేసి, వీధితలుపు గడియ తీసి ఓరగా వుంచి) మాయగుంటని యెక్కడ దాచారు ?

రామ : మాయగుంట యేమిటి ?

మధు : యేం నంగనాచే! లుబ్ధావధాన్లు మాయపెళ్ళాన్ని వాళ్ళ యింట్లోంచి లేవదీసుకుపోయి యెక్కడ పెట్టారు ? యిదే కదూ రాత్రల్లా మీరు చేస్తూవున్న లౌక్య వ్యవహారం ?

రామ : నీ మాట నాకేవీఁ అర్థం కాకుండా వుంది. యింట్లోంచి లేవదీసుకు పోవడమేమిటి ? నేను దాచడమేమిటి ?

మధు : దాస్తే దాచారు, దాచకపోతే మానా'రు. నా కంటె యేదీ ?

రామ : నీ కంటా' ? మరచిపోయినా సుమా!

మధు : ఏమి చిత్రం! నన్ను మరిచారు. నా వస్తువని మరిచారు. మరిచి, ఆ గుంట కిచ్చారు. దాన్ని లేవదీసుకుపోయి ఎక్కడో దాచి, నిశిరాత్రివేళ పెద్ద మనిషిలా యింటికి వచ్చారు!

రామ : ఆ గుంట కనపడ్డదా యేవిఁటి ?

మధు : యేవిఁ నాటకం ? మీకు కనపడకేం ? మీరు పెట్టినచోటే వుంది.

రామ : మీనాక్షి తన్ని తగలేసిందా యేవిఁటి ? కంటెతో తగిలేస్తే చచ్చానే ?

మధు : యేవిఁ నాటకం! చావండి, బతకండి. ఆ కంటె తా'ందీ గడపలో కాలు పెట్టనివ్వను. (తలుపు వేయును.)

రామ : నాలుగు కోసులు గుఱ్ఱపసవారీ అయి యీసురోమని యిల్లు చేరుకుని, గుమ్మంలో అడుగు పెట్టేసరికి, మబ్బు లేని పిడుగు పడ్డది. మీనాక్షి ఆ గుంటని మన్ననిస్తుందని, నేను యెన్నడయినా అనుకున్నానా యేవిఁటి? ఆ గుంట పోతే పోయింది. వుంటే వుంది. నా కంటె పోకుండా వుంటే అదృష్టవంతుణ్ణి. కంటె అడగడానికి వెళ్ళితే, 'నువ్వే యీ పెళ్ళి కుదిర్చావు' అని కర్రుచ్చుకుంటాడేమో!

(నిష్క్రమించును)

3వ స్థలము : లుబ్ధావధాన్లు యింటి వాకిలి.

లుబ్ధా : (పచార్లు చేస్తూ) కనపడకపోతే యేవైనట్టు ? నూతిలోగాని పడిందా ? పోలీసువాళ్ళు యిల్లు దోచేస్తారు. నూతులో పడలేదా ? పడకపోతే యీవైనట్టు ? రామప్పంతులు యింటికి పోయుంటుంది. అంతే కావాలి...

యంత అందవైన పిల్లా! నాదిగాక దురదృష్టం! యంతట్లో వెన్నెల చీకటైంది. రేపో యెల్లుండో యెదిగొచ్చే పిల్లగదా అని సంబరపడ్డాను. ఒహవేళ అప్పుడే పెద్దమనిషైందేమో! అందుకు సందేహవేఁలా ? లా'కుంటే యింత యేపైనపిల్ల పెద్దపడుచు కాకుండా వుంటుందా ? యిలాంటివి ఎన్ని పెళ్ళిళ్లు చేసుకుని యందరు మొగుళ్ళని కడతేర్చిందో ? ఓరి కుంకపీనుగా, నీ కళ్ళు యేవైపోయినాయిరా రజస్వలాముండని చూస్తూ చూస్తూ యలా పెళ్ళాడా'వు'రా ? మరి నీకు గతులు లేవు. రాజమహేంద్రవరంలో వెధవ ముండల్ని పెళ్ళా'డిన వాళ్ళ సామాజికంలో చేరా'వురా ? అయ్యో! అయ్యో! దీనికి మరి ప్రాయశ్చిత్తం యక్కడిది ? ఒహవేళ చేయించుకుందావంటే శంకరాచార్యులు పాదకట్నం పెట్టమంటాడు. బ్రాహ్మలు యిల్లు తినేస్తారు. అంతకంటే పోలీసువాళ్లు నయం. అల్లరి కాకుండా హెడ్డు చేతిలో పాతిక రూపాయలు పెట్టి, రేపు రాత్రి బయల్దేరి కాశీపోయి గంగలో మునిగా'నంటే అన్ని పాపాలు పోతాయి. కాశీవాసవేఁ చేసుకుంటాను. భగవంతుడు బుద్ధొచ్చేటట్టు చేశాడు. లేకుంటే ముసలివెధవకి పెళ్ళి చేసుకోవడవు పోయీ కాలవేఁవి ? అన్ని విధాలా యీ రామప్పంతులు నా కొంప తీశాడు.

(రామప్పంతులు ప్రవేశించును.)

రామ : యేవిఁటి మావాఁ రావఁప్పంతులంటున్నారూ ?

లుబ్ధా : యేవీఁలేదు.

రామ : యింత రాత్రివేళ పచార్లు చేస్తున్నారేవిఁ ?

లుబ్ధా : ఏవీఁలేదు, నిద్దర పట్టక.

రామ : మావఁగారూ, ఆ కంటె యిప్పుడు తెమ్మని మధురవాణి భీష్మించుకుని కూచుంది. శ్రమ అని ఆలోచించక యిప్పించాలి.

లుబ్ధా : కంటేవిఁటి ?

రామ : మీ భార్యకి పెట్టిన కంటం'డీ ?

లుబ్ధా : నా భార్యకి నేను పెట్టలేదు.

రామ : మీరు పెట్టమంటే నేను యెరువు తెచ్చాను కానా ?

లుబ్ధా : నేను పెట్టమన్లేదు.

రామ : అయితే దొబ్బేస్తావా యేవిఁటి ? మీ భార్య మెళ్ళో ఇప్పుడా కంటె'లేదూ?

లుబ్ధా : నా భార్య యెవరు ? నా భార్య నాడే చచ్చింది.

రామ : మొన్న మీరు పెళ్ళిచేసుకున్న పిల్ల మీ భార్య కాదటయ్యా ?

లుబ్ధా : రెండోపెళ్ళి ముండ నాకు భార్య యేవిఁటి ?

రామ : రెండోపెళ్ళి ముండేవిఁటి ?

లుబ్ధా : రెండో పెళ్లిముండ అని నువ్వే అన్నావు ?

రామ : మాట మీద మాటొచ్చి వొట్టినే అంటే, అదో దెప్పా ?

లుబ్ధా : వొట్టినే అనలేదు. గట్టే అన్నావు. ఇదంతా ఆ గుంటూరు శాస్తుల్లూ, నువ్వూ చేసిన కుట్ర. నాకు నిజం తెలిసిపోయింది. ఆ ముండ నీ యింటికే వెళ్లింది. మధురవాణిని వుంచుకున్నట్లు దాన్ని కూడా నువ్వే వుంచుకో. నా జోలికి రాకు. నీకు పదివేల నమస్కారాలు.

రామ : నా కంటె నా కియ్యమంటే యీ వెర్రివెర్రి మాట లేవిఁటయ్యా ?

లుబ్ధా : నీ మాయగుంటా, నీ కంటా' నీ యింట్లోనే వున్నాయి.

రామ : యీ వేషాలు నాకు పనికిరావు. నిలబెట్టి నా కంట'పుచ్చుకుంటాను.

(తడిసిన పుస్తకం పట్టుకుని మీనాక్షి; చేతిలో కఱ్ఱా, నెత్తిమీద పసుపు రాసిన కుండా, అందుమీద అఖండంతో అసిరిగాడూ; చేతిలో సీసా పట్టుకుని, తడి బట్టలతో పూజారి గవరయ్యా ప్రవేశింతురు.)

పూజా : హ్రా! హ్రీం! హ్రూం! ఓంకార భైరవీ!

(రామప్పంతులు భయమును కనపర్చును.)

మీనా : యక్కడా కనపళ్ళేదు నాన్నా! యీ పుస్తకం నూతులో పడేసింది.

(లుబ్ధావధాన్లు భయమును కనపర్చును.)

రామ : కనపడకపోవడం యవరు ?

మీనా : నా సవిత్తల్లి. గవరయబాబు నూతిలో దిగి అంతటా గాలించాడు. నూతిలో మరేవీఁ కనపడలేదు. (లుబ్ధావధాన్లు భయం తగ్గును) బ్రహ్మరాక్షసిని గవరయబాబు యీ సీసాలో బిగించాడు నాన్నా!

రామ : (సీసాకి యడంగా నిలబడి) బ్రహ్మరాక్షసి యేవింటి ?

లుబ్ధా : వేరే ఓ బ్రహ్మరాక్షసి వొచ్చి మా అమ్మిని భయపెట్టింది.

మీనా : నన్ను కాదు; మా నాన్న పీకె పిసికింది.

రామ : గవరయగారూ, పిల్ల యావైంనట్టు ?

గవ : దాని మొగుడు యగరేసుకుపోయినాడు.

మీనా : యక్కడికి యగరేసుకుపోయినాడు ? వాడు యీ సీసాలోనే వున్నాడన్నారే?

గవ : (కొంచెం ఆలోచించి–చిరునవ్వు నవ్వి) అదీ యీ సీసాలోనే వుంది.

మీనా : మనిషి సీసాలోకి యలా వొచ్చింది ?

గవ : అయ్యో సత్యకాలవా! అది మనిషా అనుకున్నావు ? అది కామినీ పిశాచం. అంచేతనే నేను మీ యింటి కొచ్చినప్పుడల్లా దూరంగా వెళ్ళిపోయేది. యేమి చెప్మా, అనుకునేవాణ్ణి.

మీనా : యిద్దర్నీ వో సీసాలో పెడితే దెయ్యప్పిల్లల్ని పెడతారేమో ?

గవ : పంతులుగారూ, చిత్తగించండి. రెండు మనుషుల బరువుందో లేదో చూడండి.

రామ : మొర్రో! నా దగ్గిరికి తేకయ్యా.

గవ : అసిరిగా, నువ్వు పట్టుకో.

అసి : నాకు బయవేంటి ? పైడితల్లి చల్లగుండోది. (సీసా పట్టుకుని) ఓలమ్మ! యంత బలువుందోస్సి!

గవ : సీసా, అఖండం తులసికోట దగ్గిర దించు.

లుబ్ధా : బాబ్బాబు! సీసా నా యింట్లో పెట్టకు. మీ యింట్లో పెట్టించండి.

గవ : మా పిల్లలు తేనె సీసా అని బిరడా తీసినట్టాయనా, రెండు దెయ్యాలు వొచ్చి మళ్ళీ మీ యింట్లోనే వుంటాయి.

లుబ్ధా : అయితే సీసా భూస్థాపితం చెయ్యండి.

గవ : భూస్థాపనం మజాకా అనుకున్నారా యేంవిటి ? భూస్థాపితం చెయ్యడానికి యంత తంతుంది! పునశ్చరణ చెయ్యాలి, హోమం చెయ్యాలి, సంతర్పణ చెయ్యాలి...

లుబ్ధా : నా యిల్లు గుల్ల చెయ్యాలి.

గవ : మీ కలా తోస్తే నాకేం పోయింది. యీ మూత తీసేసి నా మానాన నేను వెళ్ళిపోతాను.

లుబ్ధా : మూతెందుకు తీసెయ్యడం ? నాకు కలిగినది తృణవోఁ పణవోఁ యిస్తాను. ఆ మూత తియ్యకుండా ఆ సీసా అలా వుంచి వెళ్ళండి.

పూజా : యేవీ! అవధాన్లుగారి గడుస్తనం! నే పోగానే పాతిపెట్టడానికా యెత్తు ? ఆ సీసా తగిన శాంతి చెయ్యందీ భూస్థాపితం చేశారంటే, నేను రౌరవాది నరకాలకి పోనా ? యిప్పుడే బిరడా తీసేస్తా.

లుబ్ధా : తియ్యకు, తియ్యకు! ఆ శాంతేదో రేపు తగలేతుగాని.

గవ : అష్లాగైతే యీ రాత్రల్లా యీ సీసా దగ్గర పెట్టుకు పెరట్లో పడుకుంటాను. మీరు వెళ్ళి నిర్భయంగా పడుకుని నిద్రపోండి. (నిష్క్రమించును.)

రామ : మావాఁ! ఓ మాట.
(రామప్పంతులు, లుబ్ధావధాన్లూ పక్కకి వెళ్ళి మాట్లాడుదురు)

రామ : నా కంటె మాటేవిఁటి మావాఁ ?

లుబ్ధా : మీ కంటె మీ యింట్లోనే వుంది.

రామ : మీ పెళ్ళాం మా యింటికి వెళ్ళిందని మీరంటున్నారు గాని, అక్కడికి ఆ పిల్ల రాలేదు. కంటా తా'లేదు.

లుబ్ధా : ఆయితే యేవైఁందో నాకేం తెలుసును ?

రామ : వొద్దు సుమండీ.... నా కంటె నా కిచ్చెయ్యండి... నేను మా కానివాణ్ణి.

లుబ్ధా : కంటె, గింటె నాకు తెలియదు.

రామ : నీకు తెలియకపోతే మరెవరికి తెలుసును ? గవరయ్య నీ పెళ్ళాం దెయ్యవైఁందన్నాడు గదా! నువ్వూ నీ కూతురూ కలిసి దాన్ని చంపేశారు కాబోలు.

లుబ్ధా : ఓరి గాడిద కొడుకా! (కఱ్ఱతో కొట్టబోవును.)

రామ : నా కంటె అపహరించావు గదా ? నీ పని పట్టిస్తాను వుండు. (నిష్క్రమించును.)

లుబ్ధా : (తనలో) కంటె యావైఁనట్టు చెప్మా' (పైకి) అమ్మీ!

మీనా : యేం నాన్నా ?

లుబ్ధా : కంటె యేం జేసిందే ?

మీనా : యేం జేసిందో ? పెట్లో దాచిందోఁ ? దాని వొంటినే వుంది గాబోలు నాన్నా!

లుబ్ధా : వొంటి నుంటే, దెయ్యానికి కంటెందుకూ ?

మీనా : యేం ? తీపు దిగదీసిందా యేవిఁటి ? పెట్టుగుంటుంది.

లుబ్ధా : నూతిలో దిగి గవరయ్య నుయ్యంతా గాలించాడూ ?

మీనా : గడియసేపు గాలించాడు.

లుబ్ధా : నీవు చూశావూ ?

మీనా : చూశాను.

లుబ్ధా : అది రావఁప్పంతులు యింటికి వెళ్ళిందేమోనే!

మీనా : గవరయబాబు సీసాలో బిగించాడు గదా, యలా వెళుతుంది ?

లుబ్ధా : యేమో, నాకేం పాలుపోకుండా వుంది. రా పరుందాం... మన ప్రారబ్ధం యిలా వుంది.

(నిష్క్రమింతురు)

4వ స్థలము : రామచంద్రపురం అగ్రహారంలో

సారాయి దుకాణం వెనక తోట.

(ఆ తోటలో కాళీమందిరం యెదటి మంటపం. మంటపంలో కాళీ విగ్రహానికి యెదురుగుండా ఒక పెద్ద పీటమీద మూడు సీసాలతో సారాయి, చుట్టూ గళాసులు, పీటనిండా పువ్వులదండలు, మంటపంలో వకవైపు పులి చర్మంమీద యోగదండమును ఆనుకొని సమాధిలో వున్న వొక బైరాగి. యోగిని వొకతె సారాయి అందరికీ అందించును. గ్రామ మునసబు సామినాయుడు చిలుం పీల్చుచుండును. సాతాని మనవాళ్ళయ్య, జంగం వీరేశ, దుకాణదారు రాందాసు చెదిరి కూర్చుందురు.)

మున : ఆకాశం ముందు పుట్టిందా ? బూవిఁ ముందు పుట్టిందా ?

మన : సుత్తి ముందా, కారు ముందా ?

మున : పంగనామాలు ముందా, పట్టెవొర్దనాలు ముందా ? నామాలోడా, నా సవాలేటి ? నీ జవాబేటి! ఆకాశానికి మట్టా బూవిఁ ? బూవిఁకి కప్పా ఆకాశం ? సదువుకున్నో డెవడో సెప్పండొస్సి.....

ముని : యేటీలేదా ? గుడ్డోళ్ళకి యేటీలేదు. తెల్లోడు యెర్రోడా ? పట్టణంలో గొట్టావెట్టి ఆడే సూస్తాడే ఆకాశం కేసి ?

మన : శాస్త్రంబులలోని రహస్యంబులు మ్లేచ్ఛుల కెట్లు తెలియును ?

ముని : అల్లాండం, బెల్లాండం, శక్కరపొంగలి తినడవఁనుకున్నావా, నామాలోడా ? తెల్లోడి మహిమ నీకేటి తెలుసును! తెల్లోడి సారాయికి, తెనుగోడి సారాయికి యెంత భేదం వుందో, తెల్లోడికి నీకూ అంత భేదం వుంది.

మన : గణితశాస్త్రంబునం దాకాశంబన సున్న... సున్న యన శూన్యంబు... యేమీ లేదన్నమాట.

వీరే : చాత్రంలో మన్ను, మిన్ను అని అన్నాడు కాడా ? మన్ను లేదా ? మన్నుంటే మిన్నుండదా ?

ముని : యీరేచ మా మేలయిన పలుకు పలికినాడు.

వీరే : "ఆకాశం బొక్కడ్డది" అంటారు గదా, ఆకాశం లేకపోతే బొక్కడ్డవెఁలాగ?

ముని : శబాసు యీరేచ! నామాలోడు పలకడేం ? నోరు కట్టడ్డది.

వీరే : (శంఖం పూరించును.)

హెడ్డు : (దుకాణదారునితో) యేవిఁటీ అల్లరి భాయి ?

ముని : యీరేచం గెల్చుకున్నాడు గదా. చంకం వోగించడా ?

దుకాణ : గురోజీగారి సమాధికి బంగం వొస్తే శపించిపోతారే ?

బైరా : (కళ్ళు తెరచి) శివబ్రహ్మాం! శివబ్రహ్మాం! శివోహం....

వీరే : చూచావు నేస్తం, శివబ్రహ్మాం అన్నారు.

బైరా : రామబ్రహ్మాం! రామబ్రహ్మాం! రామోహం!

మన : మొదటి మాటను రెండవ మాట రద్దు చేయును. రామానుజా! రామానుజా!

వీరే : చివచివా, చివచివా!

దుకా : యెందుకు కాట్లాడతారు ? నీ శివుఁడూ నిజవేఁ. అడుగో ఆ శీసాలో యెలుగుతున్నాడు. నీ రాముడూ నిజవే. అడుగో ఆ శీసాలో యెలుగుతున్నాడు. వినలేదా తత్తం.

గాజుకుప్పెలోను గడగుచు దీపంబు
యెట్టులుండు గ్యాన మట్టులుండు
తెలిశినట్టివారి ద్రేహంబులందును
యిశ్వదాభిరామ యినర వేమా॥

బైరా : సత్యం. సత్యం.

దుకా : గురోజీ! తమకి అంతా యిశదవేఁ! ద్రేహం గాజుకుప్పె, ద్రేహంలో వుండేది పరవాఁత్వ! గాజుకుప్పెలో వుండేది అన్నసారం. యీ అన్నసారం ద్రేహంలో పడితేగాని పరవాఁత్వఁ పెజ్జలించదు. యేం శలవు ?

బైరా : యీ పరమరహస్యం నీకు యెలా తెలిసింది తమ్ముడా ?

దుకా : తమవంటివారి ద్రయవల్ల గురూ! (నలుగురివైపూ చూసి) చూశారా బాయీ. నేను యెప్పుడూ యీ మాటే గదా చెపుతావుంటాను ? ఆఖరాకి ఒస్తేగాని పరబ్రెమ్మం పట్టుపడ్డం యెలాగు ?

బైరా : అమృతమనేంది యేవిటి! సారాయే! నాడు యిదే గదా తాగడానికి దేవాసురులు తన్నుకు చచ్చారు.

వీరే : చివచివా! చివచివా!

మన : రామానుజ! రామానుజ!

మున : కొట్లాట మాని ఘూ'నం యినం డొస్సి, యెర్రి గొల్లోళ్ళు.

హెడ్డు : గురూ! మరివొక రసలింగం చేయించి, శిష్యుడికి దయ చెయ్యాలి.

బైరా : అలాగే.

మున : గురూ! బంగారం సేస్తారు గదా. అదెట్టి హరిద్దోరంలో మటం కట్టించక మాలాటోళ్ళని డబ్బెందు కడుగుతారు ?

బైరా : మేం చేశే స్వర్ణం మేమే వాడుక చేస్తే తల పగిలిపోతుంది.

హెడ్ : అవి వేరే రహస్యాలు. వూరుకోండి మావాఁ! గురోజి! హరిద్వారంలో చలి లావు గాబోలు ?

బైరా : నరుల క్కద్దు. మాబోటి సిద్ధులకు చలీ, వేడి, సుఖం, దుఃఖం యెక్కడివి?

హెడ్ : అహా! అదృష్టవఁంటే సిద్ధుల్దే అదృష్టం.

మును : గురు హరిద్దోరంనించి ఎప్పుడు బైలెళ్ళోరు ?

బైరా : రెండురోజు లయింది. మొన్న వుదయం ప్రయాగ, నిన్ను వుదయం జనగ్నాథం శేవించాం. ఖేచరీగమనమ్మీద ఆకాశ మార్గానపోతూ వుండగా మీ వూరి అమ్మవారు వనం దగ్గిర గమనం నిలిచిపోయింది. యేమి చెప్మా అని యోగదృష్టిని చూచేసరికి అమ్మవారి విగ్రహము కింద ఆరు నిలువుల లోతున, మహాయంత్రం వొకటి స్థాపితమై కనపడ్డది. అంతట భూమికి దిగి! అమ్మవారిని శేవించుకొని ప్రచ్ఛన్నంగా పోదావంటూంటే యీ భక్తుడు మమ్మల్ని పోల్చి నిలిపేశాడు.

దుకా : చూడగానే, నేను సిద్ధుల్ని పోలుస్తాను గురూ!....

మును : సుక్కేసేవోళ్ళని మాబాగా పోలుస్తావు. మా వూరమ్మోరు జగజ్జనని! మా చల్లని తల్లి.

బైరా : బ్రహ్మోహం! బ్రహ్మోహం!

హెడ్ : ఆహా! యోగమహాత్యం! స్తానాల్చేసి, ముక్కు బిగించే బ్రాహ్మలకి లేవు గదా యీ సిద్ధులూ ?

బైరా : వేషానికీ, జ్ఞానికీ దూరం కాదా తమ్ముడా ? మా తాతగారు చెప్పలేదా ? 'ఆత్మశుద్ధిలేని యాచార మదియేల' అని ?

హెడ్ : వేమన్న తమ తాతా, గురూ ?

బైరా : అవును. వారు పరమపదించి ఆరువొందల సంవత్సరాలు కావొచ్చింది.

హెడ్ : తమ వయస్సెంత ? గురూ ?

బైరా : ఆదీ అంతూ లేనిదానికి లెఖ్ఖేవిఁటి తమ్ముడా ? పరమాత్మకెన్నేళ్ళో అన్నేళ్ళు.

మున : ఏం యిలవైనమాట లింటున్నాం!

(వీరేశ శంఖం పూరించును)

హెడ్ : (శంఖం లాక్కొని పక్కను వుంచి) అట్టే పట్టెయ్యకండి భాయి!

దుకా : ఆట్టే యెక్కడ భాయీ! పరవశవైఁందాకా తాక్కుంటే తాగడవేటి! వేమన్న చెప్పలేదా ?

"తాగి, తాగి, తాగి ధరణిపై బడుదాక
తాగెనేని తన్ను తాను తెలియు,
తాగలేనివాడె తాగుబో తరయంగ
యిశ్వదాభిరామ ఇనర వేమ॥

భైరా : కాశీలో రెండువందల యాభై సంవత్సరముల క్రిందట అలంగీర్ పాదుషా వారి హయాంలో, ఒక శేటు మాబోటి సిద్ధులనందరిని కూటానికి పిలిచాడు. గంగానదిని పడవమీద పీపాలలో సారాయి భరాయించి, బంగారపు గిన్నెలతో అందిచ్చాడు. రెండు ఝాములరాత్రి అయే సరికి పీపాలు కాళీ అయిపోయినాయి. అంతా పడిపోయినారు.

హెడ్ : ఏమి ఆశ్చర్యం!

భైరా : మేమూ, ఒక నేపాళపు బ్రాహ్మడూ మిగిలాం. "తే! తే!" అన్నాడు ఆ బ్రాహ్మణుడు. "తెస్తావా, శపించేదా ?" అన్నాడు. శెట్టి యెక్కడ తెస్తాడూ! వాడు మా కాళ్ళు పట్టుకునేప్పటికి ఫర్వాలేదు నిలవమని చెప్పి, మేము ఒక పుణికి మంత్రించి, గంగ భరాయించిన కొద్దీ ఆ గంగ సారా అయిపోయింది. ఆ బ్రాహ్మణుడు సహస్ర పుణికిలు తాగి జిర్రున తేన్చాడు. బ్రాహ్మల్లో కూడా మహాత్ములుంటారు. కనుక్కోగలిగిన జ్ఞానికి గంగానది అంతా సారాయి కాదా ?

మనం : రామందాసోహడు, గంగ బరాయించడానికి గురువు, ఒక దరావుఃకి పద్దరావులు పేరుస్తాడు.

(హవల్దారు అచ్చన్న ప్రవేశించును)

దుకా : గురూ! వీరు హవల్దార్ అచ్చన్నగారు. మంచిగ్యాని, మునసబుగారికి మేనల్లుడు.

హవ : రామ్! రామ్!

భైరా : రామ్! రామ్!

హవ : (యోగినితో) పిల్లా, హుక్కా లావ్. (హెడ్‌తో) భాయీ, గుంటూరు శాస్తుల్లుగారి పత్తాయేమైనా తెలిసిందా ?

హెడ్ : లేదు భాయి!

దుకా : రామప్పంతులంటాడు.... పెళ్ళికూతురు రెండో పెళ్ళిపిల్ల, దాన్ని అమ్మి డబ్బు చెయి చిక్కించుకుని....

హెడ్ : ఆ మాటలు మనకెందుకు భాయి ?

మున : పోలీసోళ్ళకి అక్కర్లేక, బాపనోళ్ళకి అక్కర్లేక యెదవముండని బాపనాడు పెళ్ళిచేసుకుంటే లోకం అంతా వూరుకోవడవేఁనా ?

హెడ్ : డబ్బు యిచ్చినవాడికీ, పెళ్ళి ఆడినవాడికీ లేని చింత మనకేల మావాఁ? కాక, యీ రోజుల్లో బ్రాహ్మణ్యం యెక్కడుంది ? యెక్కడ చూసినా పిల్లల్ని ముసలాళ్ళకి అమ్ముకోడాలూ-రండాగర్భాలే కదా ?

హవ : కలికాలం గదా భాయీ! యెంత చెడ్డా బ్రాహ్మలు మనకి పూజ్యులు.

హెడ్ : అన్నా, యవరంత వారు. జ్ఞానం, నీతి ప్రధానంగాని, జాతిలో యేవుఁంది ? వేమన్న యేవఁన్నాడు ?

మున : ఏవఁన్నాడా ? నీతికి పోలీసోణ్ణి, ఘానానికి సాతానోణ్ణి అడగమన్నాడు.

హెడ్ : మావాఁ! వెక్కిరించండిగాని, నేను యెన్ని తాలూకాల్లో నౌకరీ చేశానో అన్ని తాలూకాల్లోనూ రండాగర్భాలు యెన్నని చెప్పను ? నన్నడిగితే వెధవలు పెళ్ళిచేసుకోవడమే ఉత్తమం అంటాను. మా సూపరెంటు పిల్లలతో వున్న రెండోపెళ్ళి దొరసాన్ని పెళ్ళాడి సుఖంగా వుండలేదా ?

మున : మావఁగారి అబిప్పురాయం, పెయ్యతో టొచ్చిన ఆవు మేలు కదా అని. అందుకనే, ముసలిబాపనోడు యెధవగుంటని పెళ్లాడితే, మీ నేస్తం కరణప్పోణ్ణి, ఆ ముసలాడి యెధవ కూతుర్ని పెళ్ళాడమని బోద సెయ్యరాదా ?

హవ : మనకేల మావాఁ ? గవునర్‌మెంటూ, దేవుళ్ళూ, బ్రాహ్మలూ, వారి నేరాలు వారివి. వాటితో మనకి పనిలేదు. మన భక్తి మనకుండాలి. (హెడ్‌తో) భాయీ ? తెల్లా నల్లా వొకటా ? తెల్లవాడికి క్రీస్తు వొక పద్ధతి పెట్టాడు. ముసల్‌మాన్‌కి పై గంబరు వొక పద్ధతి పెట్టాడు. నల్లవాడికి రాముడు వొక పద్ధతి పెట్టాడు. భగవంతుడు తెల్లవాడితో యేవన్నాడూ ? వెధవని పెళ్ళాడు అన్నాడు. రాముడు తెలుగువాడితో యేవఁన్నాడూ ? వెధవని పెళ్ళాడొద్దన్నాడు. చెప్పన్న దేశాలూ చూశాను భాయీ! పరిపరివిధాల ఆచారాలు, వ్యవహారాలు వున్నాయి గాని నీతి వకటీ, భగవంతుడొకడూ, అంతటా ఒక్కటే.

మున : రాముడు యెధవముండల్ని కాని పనులు సెయ్యమన్నాడూ ? మన్లో మారుమనువు లుండేవి కావా ?

హవ : పిల్లా! చిలుం భరాయించి, తే.

మున : నామాలోడు మూలకి తీసికెళ్ళి, పిల్లని ముద్దెట్టుకుంటున్నాడు.

యోగిని : (చెయ్యి పట్టు విడిపించుకొని సిగ్గుతో) ఏకాంత ఉపదేశం చేస్తున్నారు.

మున : యేదో ఆ వుప్పుదేశం! తనెఁట వాయువేగంగా రమ్మనా ?

దుకా : యేమిటి భాయీ ? అనరాని మాట్లు అంటున్నారు. మన యోగిని పరమ భక్తురాలు.

మున : లెంప లోయించుకుంటాను. పిల్లా ? ఆ నామాలోడు సెప్పిన ఉప్పు దేశవేఁటో నా చెవులో కొంచెం సెప్పరాదా ?

(యోగిని సారాగళాసు హవల్దార్ యెదుట వుంచును)

మున : నామాలోడి వుప్పుదేశంతో పిల్లకి మతోయింది.

భైరా : హవల్దారుగారు అమృతం సేవించరా ?

హవ : (చిరునవ్వు నవ్వి) తాక్క సోజరువాడు చెడ్డాడు. తాగి, సిపాయివాడు చెడ్డాడు. జ్ఞానికి జ్ఞానపత్రి, తాగుబోతుకు సారాయి.

మున : పించను పుచ్చుకుంటివి గదా, యింకా సిపాయీనా సెయ్యాల్నుందా అల్లుడోడా ?

హవ : కుంపిణీ నమక్ తిన్న తరవాత, ప్రా'ణం వున్నంత కాలం కుంపిణీ బావుటాకి కొలువు చెయ్యాలి. రేపు రుషియాలో యుద్ధ వొస్తే పించను ఫిరకా యావత్తూ బుజాన్ని తుపాకీ వెయ్యవాఁ ?

మున : రుస్సా'వోడి వోడ నీట్లో మునిగి నడుస్తాది గదా, నువ్వు తుపాకుతో యవణ్ణి కొడతావు ?

హవ : మొన్నగాక మొన్న యింగిలీశ్, రుషియా దేశానికి దండెత్తిపోయి రుషియాని తన్ని తగలలేదా ? అప్పుడేవైఁందో. యిప్పుడూ అదే అవుతుంది. మా రాణీ చల్లగా వుండాలి.

దుకా : సీవంరాణి ఆ కాశీమాయి అవుతారం కాదా ?

హవ : కాళీ, గీళీ జాంతేనై, ఆ రాముడి అవతారం.

దుకా : గురూ! హవల్దారుగారు తత్తకీర్తనలు మా యింపుగా పాడతారు. (యోగినితో) తల్లీ నా తంబూరా తెచ్చి భాయిగారికి ఇయ్యి.

మున : యీ తూరి యీరేచ ఉప్పుదేశం చేస్తున్నాడు.

దుకా : గొప్పవారున్నప్పుడు ఆస్యాలేటి భాయీ!

మున : వున్న మాటాడితే ఆస్సా'లా ? నాకెవడూ సెయడేం ఉప్పుదేశం ? యీరేచ ఉప్పుదేశం గట్టిగా బిగిసింది; మరి సెయ్యొద్దల్లు.

(యోగిని కష్టంమీద చెయ్యి వొదిలించుకొని తంబూరా తెచ్చి యిచ్చును.)

దుకా : అవన్నీ గ్యానరహశ్శాలు. బ్ర'మ్మానందవంంటే యేటి ? కడుపునిండా సారా, ముక్కునిండా పొగ, పక్కని పడుచుపిల్లా కదా!

మున : ఘూ'నం యినండొస్పి...

హవ : పామరం! పామరం! రాముడు పఠం కాళీ నెత్తిమీద పెట్టకపోతే కుంపిణీ సిపాయన్నవాడు యిక్కడికి వొచ్చునా ?

హెడ్ : భాయి! ఓ కీర్తన శలవియ్యండి.

హవ : (పాడుచు) పింజర్మె రహకర్ ఛుప్ నై రహ్నా

క్యారే బుల్బుల్ కహెూ ముల్కిసునా ॥క్యారె॥

యెక్కడికి వెళతావు ? యేమి చెప్పవు బోలో పింజర్మె!

(వీరేశం శంఖం మనవాళ్ళయ్య తీసి పూరించును)

హవ : (పాటమాని, తంబూరా క్రిందబెట్టి) గద్దా!

హెడ్ : (శంఖం లాక్కొని) శంఖం అగ్గిలో పడేస్తాను. ఎందుకు తా'విస్తావు భాయి ?

దుకా : ఒద్దంటే వినడు.

హెడ్ : వినకపోతే దుకాణానికి రానియ్యకండి. అల్లరైతే మాకు మాట కదా ?

దుకా : పది శంకాలు దాచేశాను; మళ్ళీ తెస్తాడు. యేం జెయ్యను. బేరం గదా భాయీ ?

మున : దిట్టంగా పట్టెయి. తత్తఘ్ఘా'నం తల కెక్కాలి ?

దుకా : (తంబూరా తీసి పాడును)

నాగా దిగురా – నా తండ్రి దిగురా
దిగుదిగు నాగన్నా – దివ్యసుందర నాగ
ముదముతో రేపల్లె – ముద్దుల నాగ
ఊరికి ఉత్తరాన–ఊడల మర్రి కింద
కోమపుట్టలోని కోడినాగన్నా–

(పాడుచుండగా రామప్పంతులు ప్రవేశించి ఎడంగా నిలిచి యోగినికి సౌంజ్ఞ చేయును. యోగిని రామప్పంతులతో మాటలాడి వచ్చి, హెడ్ చెవిలో చెప్పును.)

మును : పిల్ల హెడ్‌గారికి వుప్పుదేశం సేస్తూంది ముసలోణ్ణినా...

యోగిని : (మునసబు చెవిదగ్గిర నోరు పెట్టి చెవి గిల్లును)

మున : పిల్లా! సాంత్రోజులైంది మునిసిబు నాయుడికి యీపాటి వుప్పుదేశం తగిలి.

(హెడ్డు కనిష్టీబు రామప్పంతులు దగ్గిరకు వెళ్ళి యడంగా యిద్దరూ మాట్లాడుదురు.)

హెడ్ : కొత్తవారు ఎవరూ లేరే ? బావాజీగారు వుంటే మీకు భయవేఁవిఁటి ?

రామ : కొత్తా, పాతా ఆలోచించుకోలేదు. కొంప మునిగింది మీ సాయం కావాలి.

హెడ్ : డబ్బేఁవై నా పేల్తుందా ?

రామ : మీ చాతైతే. పేల్తుంది.

హెడ్ : యేమిటొచ్చిందో చెప్పు.

రామ : లుబ్ధావధాన్లు పెళ్ళాడిన గుంట మధురవాణి తాలూకు కంటె తీసుకుని యెక్కడికో పారిపోయింది.

హెడ్ : ఎందుకు పారిపోయిందో ?

రామ : మీనాక్షి చావగొడితే పారిపోయింది. యెక్కడ వెదికినా కనబడలేదు. ముందు మీ జవాన్లని దౌడాయించండి.

హెడ్ : యీ రాత్రివేళ మా జవాన్లు మాత్రం పట్టుకోగల్రా ? పోలీసు జవానంటే పది కళ్ళూ, పది కాళ్ళూ వుంటాయనుకున్నావా యేవిఁటి ?

రామ : దాని సిగ్గోసిరి; దాన్ని పట్టుకోవడం నా కెందుకు ? నా కంటె నా కిప్పిం చెయ్యండి.

హెడ్ : యేవిఁటి నీ మాటలూ! ఆ కంటె పట్టుకు ఆ పిల్ల పరారీ అయిందని చెపితివి. నేను కంటె యెలా యిప్పిస్తాను ?

రామ : ముసలాణ్ణి అడిగితే, అది పట్టుకు పోయిందంటాడు గాని, నిజంగా వాడు పెట్టెలో దాచేసి యివ్వకుండా వున్నాడు.

హెడ్ : నన్నేం చెయ్యమంటావు ?

రామ : కూనీ కేసని ముసలాణ్ణి బెదిరిస్తే, నా కంటె నా కిచ్చేస్తాడు; మీ చెయ్యీ కూడా తడౌతుంది.

హెడ్ : అలాగనా ? గాని నువ్వన్నట్టు ఆ పిల్లగానీ, కంటె పట్టుకు పరారీ అయిపోయి వుంటే....

రామ : పోనీండి! దాని ఖరీదు ఇప్పించెయ్యండి.

హెడ్ : వాడిస్తాడా ?

రామ : మరి మీ సాయం యెందుకు కోరాను ?

హెడ్ : యిస్తాడని నాకు నమ్మకం లేదు. ఐనా చూస్తాను. కేసని యెత్తు యెత్తడానికి యిద్దరు ముగ్గురు సాక్షులుండాలి.

రామ : మందిరంలో ఉన్నవాళ్ళో ?

హెడ్ : వీరేశం, మనవాళ్ళయ్యా మూడో కాలంలో వున్నారు. హవల్దారు అబద్ధం ఆడమంటే తంతాడు. మునసబునాయుడు యింత రాత్రివేళ అంత దూరం నడిచి రాలేడు. యిహ ఆడనూ పాడనూ రామందాసు వొక్కడే గదా ?

రామ : ఆ బైరాగాడు సాక్ష్యం పలకడేం ?

హెడ్ : వేషం వేసుకు ముష్టెత్తుకునే బైరాగా డనుకున్నావా యేఁవిటి ? ఆయన గొప్ప సిద్ధుడు, నిలువెత్తు ధనం పోస్తే అబద్ధవాడ్డు.

రామ : సాక్ష్యం పలకావొద్దు, యేవీఁవొద్దు. దగ్గిర నిలబడితే చాలును, పిల్చుకు రండి.

(కనిష్టీబు వెళ్ళి దుకాణదారునూ, బైరాగినీ తీసుకు వచ్చును)

బైరా : సాక్ష్యం అంటే మావంటి వాళ్ళే చెప్పాలి. యోగదృష్టి వల్ల చూశానంటే యెక్కడ జరిగినదీ, యెప్పుడు జరిగినదీ కళ్ళకు కట్టినట్టు అప్పుడు కనపడుతుంది గనక మేం కూడా వస్తాం. యేవైఁనా దొరికితే హరిద్వారంలో మఠానికి పనికొస్తుంది.

రామ : జరిగినదాని ముండా మోశిరి. కొంచెం కల్పనుంటే గాని కథ నడవదు. అంచేత హెడ్డుగారు ముసలాడితో చెప్పే మాటలు నిజం అని సెలవివ్వాలి.

వైరా : వెర్రి! వెర్రి! నిజవేఁవిఁటి ? అబద్ధ వేఁవిఁటి ? మేం సిద్ధులం; అబద్ధం నిజం చేస్తాం. నిజ’ం అబద్ధం చేస్తాం. లోకవేఁ పెద్ద అబద్ధం. పదండి.

(నిష్క్రమించును)

5 వ స్థలము : దేవాలయం గుమ్మం దగ్గర

(హెడ్డుకనిష్ఠీబు, రామప్పంతులూ మాట్లాడుచుందురు. మరి ఒక కనిష్ఠీబు, బైరాగి, దుకాణదారు కొంత యడముగా నిలుచుందురు.)

హెడ్ : నా నౌఖరీ పోగొట్టు కుంటానా భాయీ ?

రామ : కొంచెం బెదిరిస్తే నౌఖరీ పోతుందా అన్నా ? పోలీసుద్యోటీ అంటే బెదిరింపే గదా ? మీరు అలా తప్పించుకుంటే నేనేం అనుకోను ?

హెడ్ : (చేతిలో నులుపుఁతున్న కాగితపు ముక్కలు విసిరేసి) భాయి! లుబ్ధావధాన్లు చంటి పిల్లాడా, దుక్కి ముచ్చా బెదిరించటానికి ? కూనీ కేసని నాకేవైఁనా ఆశ వుంటే పోలీసువాణ్ణి నేను వూరుకుంటానా ? పట్టుకుంటే నాకు యెంత కారక్టు కాదు ? ఈ జనాన్ని ఈ చీకటి రాత్రిలో నూతిలో దింపాను గానా ? కూనీ గీని అంటే యవరైనా నవ్వుతారు. మీనాక్షి చేతికి వెరచి, ఆ పిల్ల యిరుగింట్లోనో, పొరుగింట్లోనో పడుంది. మీ యింట్లోనే వుందేమో... ముసలాడు అన్నట్టు ?

రామ : దేవుఁడు తోడు! మా యింటికి రాలేదు. యిరుగింటో పొరుగింటో అని మీరు వూరుకుంటే, యలాగ ? మీ ధైర్యవేఁవిఁటో నాకు బోధపడదు.

వెతికించవయ్యా ? అంటే, వెతికించారు కారు. ఆ యిరుగింటి వాళ్ళూ పొరిగింటివాళ్ళూ పిల్ల నిద్దరపోతూ వుండగా కంటె చెపాయిస్తే నా గతేమిటి ? కంటె యింటికి పట్టుకు వెళ్ళక పోతే మధురవాణి గుమ్మంలోంచి గెంటుతుంది. అనగా, గెంటుతుందని కాదు - యేడుస్తుంది; ప్రాణం తినేస్తుంది. విన్నారా ?

హెడ్ : అయితే నా సలహా విన్నారా ?

రామ : ఏదో చెప్పండి మరి.

హెడ్ : ఆ కంటె యిచ్చిందాకా, కదలకుండా లుబ్ధావధాన్లు యింటి మీద కూర్చోండి.

రామ : యిదా సలహా! పీకమీద కూచున్న దాకా నాకేం పట్టింది ? యింటి కెళ్ళి సుఖంగా పడుకుంటాను.

హెడ్ : మధురవాణి బాధ పడుతుందని కదూ ?

రామ : అని మీకు కనికారం కాబోలు ? రేపుగానీ వాడు కంటె యివ్వకపోతే, అవుధాన్లుమీద సివిల్ దావా పడేస్తాను. మీ దగ్గిర కంటె మాట వొప్పుకున్నాడు గదా, మిమ్మల్ని సాక్ష్యం వేస్తాను.

హెడ్ : ఓహో యిదా వేషం ? పోలీసు ఆఫీసర్ని నేను సాక్ష్యాలకీ సంపన్నాలకీ తిరిగితే నా నౌఖరీ నిలుస్తుందా ? కావలిస్తే లుబ్ధావధాన్లు కంటె హరించాడని నా దగ్గిర ఫిరియాద్ చెయ్యండి. కేసు చేసి నా తమాషా చూపిస్తాను.

రామ : కంటె మాట మీ దగ్గిర అతడు వొప్పుకున్న తరవాత, మీరు బోనెక్కి యలా అబద్ధం అడగ్రలో చూస్తాను గదా ?

హెడ్ : పంతులూ, అక్కరమాలిన లౌక్యాలు చెయ్యకు. వాడు కంటె మాట తనకేవీఁ తెలియదన్నాడు. కావలిస్తే ఆ మాట సాక్ష్యం పలుకుతాను.

రామ : యిదా మీరు చేసిన సాయం ?

హెడ్ : యెందుకు అక్కరమాలిన ఆందోళన పడతావయ్యా ? రేపు నీ కంటె నీ యింట్లో వుండకపోతే నన్ను అను.

రామ : మధురవాణితో యిప్పుడు యేం జెప్పను ?

హెడ్ : అయితే నన్నేం జెయమంటారు ?

రామ : మళ్ళీ లుబ్ధావధాన్లు యింటికి రండి; యీ మాటు మన మిద్దరం వెళ్ళి పీడిద్దాం.

హెడ్ : రెడ్డొచ్చాడు, మొదలాడు అన్నాట్ట–నిరర్థకంగా రాత్రల్లా నిద్దర్లేకుండా చంపావు. మరి నేను రాజాలను. నువ్వెళ్ళి వాడి యింటిమీద కూచోవయ్యా అని చెప్పాను, కానా ? నా మాట విని అలా చెయ్యండి. అదే సలహా. పిసినిగొట్టు ముండాకొడుకు, మా నలుగురికీ నాలుగు మూళ్ళు పజ్యండు రాళ్ళు పారేశాడు. యివి పెగిలేటప్పటికి నా తలప్రాణం తోకకి వొచ్చింది. నా వొంతు మూడూ మీ కిచ్చేస్తాను.

రామ : కంటె పోయి యేడుస్తూ వుంటే యీ వెధవ మూడు రూపాయలూ నా కెందుకూ ?

హెడ్ : మీకు అక్కర్లేకపోతే పోనియ్యండి. గురోజీ గారికి ఇద్దాం.

రామ : కొంచెం చిల్లర ఖర్చుంది. ఏం చెయ్యను ? యిలా పారెయ్యండి. (పుచ్చుకొనును.)

హెడ్ : గురోజీ, తమకో తులసిదళం.

భైరా : తృణం, కణం ఏవొఁచ్చినా మఠానికే అర్పణం.

హెడ్ : (దుకాణాదారు తోనూ, కనిష్టీబుతోనూ) మీకో మూడు, నీకో మూడూ (చేతులు దులిపి) సాఫ్‌ఝూడా–నాకు తిప్పటే మిగిలింది.

దుకా : (భైరాగిని పక్కకి పిలిచి) యీవేళే చెన్నపట్టం నించి ఫస్టురకం బ్రాందీ వొచ్చింది. చిత్తగించి మరీ కాశీ వెళుదురుగాని.

హెడ్ : గురోజీ, రాం! రాం! పంతులూ, ముసలాణ్ణి వెళ్ళి పట్టుకోండి. భాయీ, స్టేషనుకి పోవాలి. (జవానుతో) రావోయి కామయ్యా!

(హెడ్, జవానూ ఒక వైపున్నూ, దుకాణాదారూ, భైరాగీ మరి ఒక వైపున్నూ వెళ్ళుదురు.)

రామ : కంటె పోయిందంటే మూడురూపాయలా చేతులో బెడతాడు. (నీరసంగా నవ్వును.) వీడి తాళం పడతాను. (హెడ్ పారేసిన కాగితపు ముక్కలు యేరి) ఇనస్పెక్టరుకి ఒకటి తాసిల్దారుకి ఒకటి ఆకాశ రామన్న అర్జీలు పంపుతాను. వెధవ, మధురవాణి దగ్గిరికి వెడతాడేమో ? నేను ఇంటికిపోతే అరుగుమీద పడుకోవాలి గాని ఆ తిక్కలంజ తలుపు తియ్యదు. లుబ్ధావధాన్లు ఇంటికి వెళ్ళితే వాడు కర్రుచ్చుకుంటాడు. ఈ దేవాలయంలో పరుండునా ?.... పురుగూ బుట్రా కరిస్తే... కరిస్తే... ఛీ! ఈ సానిముండని వొదిలేస్తాను. ఆ గుంట యావైఁనట్టు ? నా అదృష్టం వల్ల యవళ్ళింట్లో నైనా దాగి రేపు గాని కళ్ళబడితే ? కంటె పోకూడదు. ఒకవేళ చస్తే ? – చచ్చు'ండదు – నూతులో పడలేదు. గవరయ్యా, కావఁయ్యా కూడా గాలించారు. ఒకవేళ అది రెండోపెళ్ళి పిల్ల అయి, దాని ఆ తండ్రి కానికీగా వొచ్చి బండీ యెక్కించుకు దౌడాయించాడేమో ? అలా ఐతే కంటె కూడా వుడాయించడా ? మీనాక్షిని పట్టుకుంటే కొంత ఆచోకి తెలుస్తుంది. అది కనపడ్డవెఁలాగ ? తలుపు తట్టితే ముసలాడే వొస్తాడేమో? (రోడ్డు దాటి లుబ్ధావధాన్లు ఇంటి గుమ్మం యదట నిలుచుని) ఆకలి దహించేస్తూంది. మీనాక్షి దొరికితే యేవైఁనా ఫలహారం యిచ్చును. యవడు చెప్మా రావిచెట్టు కింద చుట్ట కాలుస్తున్నాడూ ? (నాలుగు అడుగులు ముందుకు వెళ్ళి) అసిరీ, నువ్వా ?

అసి : నాను బాబు (చుట్ట పారవైచును)

రామ : నిమ్మళంగా వున్నావురా ?

అసి : ఏట్నిమ్మళం బాబూ, పానమ్మొచ్చింది, ఈ యమ్మకాసి సూడ్డం మానేసినారు. డబ్బిచ్చే దాతేడి బాబూ ?

రామ : అసిరి, అడక్కపోతే, అమ్మైనా పెడుతుందిరా ?

అసి : ఆ సానమ్మ మా సెడ్డ మనిషి బాబూ!

రామ : యేవిఁటి యేవిఁటి ? చెప్పొరే. చాలా రోజులైంది నీకు డబ్బిచ్చి – యింద యీ రూపాయి పుచ్చుకో.

అసి : నూరు దండాలు బాబూ!

రామ : మధురవాణి మాట యేవిట్రా చెప్పబోయినావు ?

అసి : మా సెడ్డమనిషి బాబూ!

రామ : ఎవడెళతాడ్రా దాని దగ్గిరికి ? అసిరి – ఎవడెళతాడ్రా ?

అసి : యవడెళ్నా, ఈపు పెట్లగొడతాది బాబూ!

రామ : చెడ్డ మనిషన్నావు ?

అసి : కాదా ? మొన్న హెడ్డుగా రెళితే, ఏపికూన్ని ఉసు గలిపింది కాదా ?

రామ : నిజం చెప్పావు. నీ మీద ఎప్పుడైనా కోప్పడ్డదిట్రా ?

అసి : మాలాటోళ్ళ మీద ఎందుకోప్పడితాదీ! బాపనోళ్ళొస్తే తిడతాది.

రామ : నువ్వు ఎప్పుడూ నిజవేఁ చెబుతావురా అసిరిగా ?

అసి : సీ! అబద్ధవాడిఁతే బగవంతుడు ఒల్లకుంటాడా బాబూ ?

రామ : మీ బుగత ఏం చేస్తున్నాడ్రా ?

అసి : తొఁంగున్నాడు బాబూ!

రామ : నీకు మరో రూపాయి యిస్తాను. మీనాక్షిని సావిట్లోకి పిలుస్తావురా ?

అసి : నా శక్కవాఁ బాబూ ? ఆ యమ్మ అయ్యగదిలో పక్కేసుకు తొఁంగున్నారు.

రామ : నువ్వు చిటికేస్తే యక్కడున్నా లేచొస్తుంది. నే నెరగనట్రా!

అసి : తెండి బాబూ, చూస్తాను.

(రామప్పంతులు రూపాయి యిచ్చును. ఉభయులూ యింట్లో ప్రవేశింతురు)

6వ స్థలము : లుబ్ధావధాన్లు యింటి నడవ, తలుపు జారవేసి వుండును.

(మీనాక్షి ప్రమిఁదతో దీపం తెచ్చి గూటిలో వుంచును. రామప్పంతులు వొత్తి తగ్గించి, మీనాక్షిని ముద్దు పెట్టుకొనును.)

మీనా : తోవ తప్పొచ్చారో ?

రామ : బుద్ధి తక్కువ చేత, గడ్డి తిని ఇన్నాళ్ళూ తోవ మరచాను.

మీనా : మధురవాణి యలా రానిచ్చింది ?

రామ : మధురవాణి సిగ్గోసిరి; దాన్ని వొదిలేస్తాను. ఆకలి దహించుకు పోతూంది. ఫలహారం యేవైఁనా వుందీ ?

మీనా : యేవుంది! వొడపప్పూ, కొబ్బరిముక్కా కావాలా ?

రామ : ఏదో ఒహటి తెస్తూ.

(మీనాక్షి మూకుడులో వడపప్పూ, కొబ్బరి ముక్కలూ తెచ్చును. రామప్పంతులు తినుచుండును.)

మీనా : మధురవాణ్ణి వొదిలేస్తారో ?

రామ : వొదిలేయడం నిశ్చయమై పోయింది.

మీనా : కనిష్టీబు మాట తెలిసిందో ?

రామ : తెలిసింది.

మీనా : యవరు చెప్పారు ?

రామ : అసిరిగాడు.

మీనా : మా అసిరిగాడా ?

రామ : మీ అసిరిగాడే.

(అసిరిగాడు వీధి తలుపు కొంచం తీసి తొంగి చూచును.)

అసి : దెయ్యాని కెట్టింది తింతున్నావయ్యా ?

రామ : దెయ్యానికా పెట్టారు ?

మీనా : (అసిరిగాడితో) వూరుకో వెధవా ?

రామ : నీకు న్యాయవేఁనా, దిగదుడుపు కూడు పెట్టడం ? (వీధిలోకి వెళ్ళి వమనము చేసికొనుటకు ప్రయత్నము చేసి తిరిగి ప్రవేశించి) వమన మైఁంది కాదు. యేం సాధనం ?

మీనా : దిగదుడుపు కాదంటే నమ్మరు కదా ?

రామ : మూకుళ్ళో తగలేశావు ?

మీనా : దెయ్యం తిని సచ్చిందా యేమిటి ?

రామ : ఆడవాళ్ళు దారుణం మనుషులు ?

మీనా : అసిరిగాడేం చెప్పా'డు మధురవాణి మాటఁ ?

అసిరి : (తిరిగి తొంగి చూసి) ఆ పారేసిం దట్టుకు పోదునా బాబూ!

రామ : పట్టుకు పో.

(అసిరిగాడు పట్టుకు పోవును.)

మీనా : వాడికి మీ కంటె ధైర్యం వుంది.

రామ : అపవిత్రం ముండాకొడుకు యేవైఁనా తింటాడు. బ్రాహ్మలం, పవిత్రమైన వాళ్ళం గదా ?

మీనా : పవిత్రం అంటే, మీదీ నాదే ?

రామ : అదేం అలా అంటున్నావు ?

మీనా : నేను వెధవముండనీ, మీరు సరసులున్నూ, మనకంటే మరి పవిత్రం అయిన వారు యవరుంటారు ?

రామ : ఆ కళంకం తీసెయ్యడానికే యీ వేళొచ్చాను.

మీనా : యలా తీసేస్తారు!

రామ : మన యిద్దరం పెళ్ళా'డితే మరి అపవిత్రత యెక్కడుంటుంది ?

మీనా : యేవిఁటీ ?

రామ : మనం పెళ్ళాడదాం.

మీనా : నిజంగాను!

రామ : యేం వొట్టె వేసుకోమన్నావు ?

మీనా : ఆ దీపం ఆర్పెయ్యండి.

రామ : యీ కాగితం ముక్కలు చదివి మరీ ఆర్పేస్తాను. (కాగితం ముక్కలు జేబులోంచి తీసి చదివి) గాడిద'కొడుకు. తన బాకీ తాలూకు నోటు లాగి, నన్ను దగా చేశాడు; వీడి తాళం పడతాను ?

మీనా : యవడు ?

రామ : అది వేరే కథ.

మీనా : అసిరిగాడు కనిష్ఠీబు మాట యేం జెప్పాడు ?

రామ : మధురవాణి హెడ్డుమీద కుక్కని వుసిగొలిపిందని చెప్పాడు.

మీనా : యెందుకూ ?

రామ : నేను లేనప్పుడు వాడు యింట్లో చొరబడితేను.

మీనా : అయ్యో తెలివా ? అసిరిగా!

అసి : (ప్రవేశించి) యేటమ్మా ?

మీనా : వెధవా, నిజం చెప్పూ, పంతులు యింట్లో లేనప్పుడల్లా కనిష్ఠీబు మధురవాణితో వుంటాడని నువ్వు నాతో చెప్పలేదూ ?....

అసి : (బుఱ్ఱగోక్కుంటూ) సెప్పినాను.

రామ : దొంగ వెధవా! కుక్కని వుసిగొలిపిందన్నావు ?

అసి : బాబు.. నౌఖరోడు నోరు మూసుకోవొద్దా బాబు ? సానమ్మడిగితే, మీ మాట సెప్పుతానా బాబూ ?

మీనా : వెధవా' నువు చెపితే నాకు భయవఁనుకున్నావా ? యేవిఁటి

రామ : ఓరీ అబద్ధపు వెధవా! యెవరితోనూ మా మాట మాత్రం చెప్పకు, రూపాయి యిచ్చాను కానూ ?

మీనా : యందు కిచ్చారు రూపాయి ?

అసి : పిల్లలోణ్ణిగందా! (పైకి వెళ్ళును)

రామ : దొంగముండ, ద్రోహం చేస్తుందేం ?

మీనా : తెలుసునన్నారు ?

రామ : యింతని యెరగదు.

మీనా : ఆడది నీతి తప్పిన తరువాత అంతేవిఁటి – యింతేవిఁటి ? తెగించిన దానికి సగుడు మోకాలుబంటి–అందులో సొంది ఖాయిదాగా వుండాలను కోవడం మీ బుద్ధితక్కువ.

రామ : బుద్ధి తక్కువంటే బుద్ధి తక్కువా! ముండని బుఱ్ఱ చితకవొడిచెయ్యాలని వుంది. దీనికింద యెంత సొమ్ము తగలెట్టా'నూ!

మీనా : యెప్పుడు తోలేస్తారు ?

రామ : యెప్పుడోనా ? రేపే!లంజ, యంత పతివ్రత వేషం వేసింది!

మీనా : మనవెఁప్పుడు వెళ్ళిపోవడం ?

రామ : యక్కడికి ?

మీనా : మతి పోతూందా యేవిఁటి ? రాజమేంద్రం!

రామ : అవును. రేపు దాన్ని తోలేస్తానా! యెల్లుండి మనం వుడాయిద్దాం గాని, నీ సరుకులు తెచ్చుకుంటావా! ముసలాడికి వొదిలేస్తావా ?

మీనా : నా కున్నదల్లా నా సరుకులే. యెలా వొదిలేస్తాను ? నా సరుకుల పెట్టె తాళం మా నాన్న దగ్గిరుంది గదా, యేవిఁగతి ?

రామ : నా ప్రయోజకత్వం నీకేం తెలుసును ? యిదుగో, యీ రింగున వున్న యినప ములికితో నీ చిత్తవొఁచ్చిన పెట్టె తాళం తీసేస్తాను. గాని నా కంటె యక్కడుంది ?

మీనా : గుంటకి పెట్టిందా ? రాత్రివేళ నా బట్టల పెట్లో పెట్టేది.

రామ : నీ పుణ్యముంటుంది. ఆ బట్టలపెట్టె వోమాటు తీసి చూతూ. రేపు దాని కంటె మధురవాణి కిచ్చి, ముండని తగిలేస్తాను.

మీనా : ఆ గుంట బట్టలపెట్టె తాళం పారేసింది.

రామ : ములికితో తీసేస్తాను.

మీనా : నా సరుకుల పెట్టె తాళం కూడా తీసేసి పెడతారూ ?

రామ : అద్దే!

మీనా : నన్ను పెళ్ళా'డతానని ప్రమాణం చేశారు కారే ?

రామ : దీపం ఆర్పేస్తే పెట్టె తియ్యడం యలాగ ?

మీనా : అగ్గిపుల్ల వుంది.

రామ : ఐతే యిదిగో, నిన్ను తప్పకుండా పెళ్ళా'డతానని ఈ దీపం ఆర్పేస్తున్నాను (దీపం ఆర్పి మీనాక్షిని కౌగిలించుకుని ఎత్తును.) యిలా యెత్తుకు తీసుకుపోతాను రాజమహేంద్రవరం.
(లుబ్ధావధాన్లు చీకటిలో వచ్చి కఱ్ఱతో రామప్పంతులు కాళ్ళమీద కొట్టును. మీనాక్షి క్రింద పడును.)

లుబ్ధా : బందిపోటు గాడిద కొడకా!

రామ : సచ్చాన్రా. (వీధిలోకి కుంటుకుంటూ పోవును.)

లుబ్ధా : పో ముండా, నువ్వు కూడా నా యింట్లోంచి, (మీనాక్షిని పైకి తోసి తలుపు గడియ వేయును).

రామ : అసిరిగా! చంపేశాడ్రా. కాలెవిఁక విరిగి పోయిందిరా ?

అసి : (నిమ్మళంగా) దెయ్యాని కెట్టింది తింటే యేటౌతది బాబూ ?

(గట్టిగా) కానేళ యిల్లు జొరబడితే బుగత తన్నడా ?

రామ : (మీనాక్షితో) నువ్వు యింట్లోకి వెళ్ళిపో.

మీనా : మరి యింట్లో అడుగుపెట్టను. నా సరుకులు లేకపోతే పాయను, రండి. రాజమహేంద్రం పోదాం.

రామ : తలచినప్పుడేనా తాతకి పెళ్ళి ?

మీనా : మీ యిష్ట వొచ్చినప్పుడు పెళ్లా'డుదురుగాని, యింట్లోంచి లేవదీసు కొచ్చారు గదా ? యిహ నేను మీతో ఉండవలసిన దాన్నే, పదండి.

రామ : వెర్రి కుదిరింది రోకలి తలకి చుట్టుకోమన్నాట్ట! బతిమాలుకుంటాను, ఇప్పటికి యింట్లోకి వెళ్ళిపో.

మీనా : మరి యీ జన్మంలో ఈ ఇంట్లో అడుగుపెట్టను.

రామ : అసిరిగా! మీనాక్షి వొక్కర్తా వుంటుంది. కాపాడి, బుగత తలుపు తియ్యగానే లోపలికి తీసికెళ్ళు, (పరిగెత్తును. మీనాక్షి వెంట పడును.)

(రామప్పంతులు ఇంటి యదట.)

రామ : (తలుపు తట్టి) వేగిరం... వేగిరం తియ్యి.

మధు : (తలుపు అవతల నించి) యేవిఁటా తొందర ?

రామ : ఆకు చిట్టెడ వెంట తరువుఁతూంది.

మధు : చిట్టెడ కనపడగానే తలుపు తీస్తాను ?

రామ : తలుపేసుకు కూచుంటే నీక్కనపడ్డం యలాగ ? నువ్వు తలుపు తీసేలోగా నన్ను కాటేస్తుంది.

మధు : నా కంటేదీ ?

రామ : కంటె కంటె అని తపిస్తున్నావేవింటి ? నిలబడ్డ పాటున నూరు కంటెలు కురిపిస్తాను.

మధు : మీ నూరు కంటెలూ మీరు వుంచుకుని, నా ఒక్క కంటె నా కిచ్చి మరీ యింట్లో అడుగు బెట్టండి.

రామ : రేపు పొగలు గాని కంటె యివ్వనన్నాడు లుబ్ధావధాన్లు.

మధు : రేపే ఇంట్లో కొత్తురుగాని, మించి పోయిందేవీం లేదు.

రామ : యింతటిలో చిట్టెడ మీద పడితే ?

మధు : సకేశా ? అకేశా.

రామ : పిలికి చెలగాటం; యలక్కి ప్రాణ పోకటా ?

(మీనాక్షి ప్రవేశించి రామప్పంతులు రెక్కపట్టుకొనును.)

మీనా : దీపం ఆర్పి ప్రమాణం చేశావు–తప్పితే తల పగిలిపోతుంది.

రామ : పో ముండా!

మీనా : మీ కాగల పెళ్ళాన్ని గదా, ఎక్కడికి పోతాను ?

మధు : కాగల పెళ్ళావేంవిటి ?

మీనా : నిన్ను వొదిలేసి, నన్ను రాజమేంద్రం తీసుకుపోయి పెళ్ళా'డతా నన్నాడు... దీపవాంర్పి ప్రమాణం చేశాడు... మరెలా తప్పుతాడు ?

మధు : యీావిడేనా ఆకు చిట్టడ ?

రామ : ముండా నా చెయ్యొదిలెయ్, నిన్ను నే పెళ్ళాడతానన్నానే! కలగన్నావా యేమిటి ? (మీనాక్షిని విడిపించుకొనగా, మీనాక్షి కిందపడును.)

మధు : ఆడదాని మీదా చెయి జేసుకుంటారు ? ఏమి పౌరుషం! అబద్ధవాడక అన్నమాట నిలబెట్టుకోండి, ఏం ? కులం తక్కువా, రూపం తక్కువా ? ఆమె బతుకు భ్రష్టు చెయ్యనే చేశారు; పెళ్ళాడి తప్పు దిద్దుకోండి. ఆవిడ్ని పెళ్ళాడి వొస్తేనే నేను తలుపు తీస్తాను.

మీనా : పంతులు నన్ను కౌగలించుకొని యెత్తుకుంటే మా నాన్న చూసి, తన్ని యిద్దర్నీ యింట్లోంచి తగలేశాడు. నువ్వు హెడ్డు కనిష్ఠీబుతో పోతున్నావు, నిన్నొదిలేసి నన్ను పెళ్ళాడతానని వొట్టేసుకున్నాడు. నన్ను లేవదీసుకొచ్చి, నన్ను పెళ్ళాడక తప్పుతుందా యేమిటి ?

మధు : అవశ్యం పెళ్ళాడవలసిందే. పెళ్ళాడకపోతే నువ్వు మాత్రం వూరుకుంటావూ ? దావా తెస్తావు. పంతులు గారికి దావాలంటే సరదానే!

రామ : మధురవాణీ! నీకు మతి పోతూంది. నా యింటికి నువ్వా యజమానివి ? తలుపు తియ్యి.

మధు : నిలబడండి. కర్పూరం వెలిగించి మంగళహారతి పళ్ళెం తెస్తాను. (తలుపు దగ్గిరనుంచి లోనికి వెళ్ళును.)

రామ : (తలుపు సందులో నుంచి చూసి; తరవాత మీనాక్షిని ముద్దెట్టుకుని) యెంతపని చేశావు! దాంతో చెప్పేశావూ! రహస్యంగా లేచి పోయి పెళ్ళి చేసుకోవాలిగాని, అల్లరి చేసుకుంటే యెలాగ ?

మీనా : యెప్పుడైనా అందరికీ తెలిసేదే కదా ?

రామ : నా మాట విని యిప్పుడు యింటికి వెళ్ళిపో.

మీనా : యిహ మా యింటికి వెళ్ళను. యిదే మా యిల్లు. మధురవాణి తలుపు తీస్తుంది, లోపలికి వెళదాం.

రామ : అయితే యిక్కడ వుండు. యిప్పుడే వొస్తాను. (కొన్ని అడుగులు వీధంట నడచి, నిలచి) నిజంగా మంగళహార్తి తెస్తుంది కాబోలు పెంకె లంజ ? అది తలుపు తియ్యక పోయెనా, మీనాక్షి నన్ను వెతకడానికి బయల్దేరుతుంది. తెల్లవార వచ్చింది. చెరువ్వేపు పోయి కాలకృత్యాలు తీర్చుకుని ఆపై చర్య ఆలోచిద్దాం. రెండ్రోజులు పైకి వుడాయించానంటే మళ్ళీ వొచ్చేసరికి, కొంత అల్లరి సర్దుకుంటుంది. తలుపు తీసినట్లు కాన రాదు. యవడిల్లు ? యవర్తె యిది నన్ను అడ్డడానికి ? ఆశ్చర్యం !

(కొంత దూరంగా వీధిలో నిలబడి, దాసరి వేషంతో శిష్యుడు చితారు మీటి పాడును.)

శిష్యు : చరణం– "యిల్లు యిల్లనియేవు యిల్లు నాదనియేవు
నీ యిల్లు యెక్కడే చిలకా ?"

రామ : యిది నా యిల్లు కాదా ?

శిష్యు : "ఊరికి ఉత్తరాన సమాధి పురములో
కట్టె యిల్లున్నదే చిలుకా"

రామ : వొల్లకాట్లోనా ?

శిష్య : పల్లవి- "యెన్నాళ్ళు బ్రతికినా
యేమి సాంమ్రాజ్యమే
కొన్నాళ్ళకో రామచిలుకా ?"

అనుపల్లవి- "మూణ్ణాళ్ళ బ్రతుకునకు
మురిసేవు త్రుళ్ళేవు
ముందుగతి కానవే చిలుకా"

రామ : ఏవిఁటీ అపశకునం పాటా ?

శిష్య : "కక్రలే చుట్టాలు! కట్టెలే బంధువులు!
కన్నతల్లెవ్వరే చిలుకా ?"

రామ : చుట్టాలా ? వొక్క అప్ప వుంది. అది యెప్పుడూ నా గుమ్మంలో అడుగు బెట్టలేదు. యిప్పుడు యింటికి యజమాని యెవరూ ? తలుపవతల సానిలంజా, తలుపివతల సంసారి వెధవ లంజానూ! యిద్దరూ కలిసి యిల్లు చేరకుండా నన్ను తగుల్తున్నారు.

శిష్య : "నిన్ను మోసేరు నలుగురు
వెంబడిని పదిమంది"

రామ : వెఱ్ఱిముండా పాటా! పోదాం. (గబ గబ కొంతదూరము నడచి, నిలుచుని) యీ తోవనే వొస్తున్నాడు కాబోలు... అదిగో, పాట వినబడుతూంది.

శిష్య : పాట- "నువ్వు కాలిపోయేదాకా
కావ లుందురు గాని
కడకు తొలగొత్తురు
వెంట నెవరూ రారు చిలకా॥"

రామ : వెఱ్ఱిముండా పాటా!

శిష్య : (మీనాక్షి గొంతుకతో) పంతులుగారూ! యక్కడున్నారు ?

రామ : పరుగుచ్చుకోకపోతే పట్టుగుంటుంది. (పరుగెత్తును.)

కన్యాశుల్కం

షష్ఠాంకము

1వ స్థలము : రామచంద్రపురం అగ్రహారంలో

(చెరువుగట్టున వున్న తోటలోనికి పెళ్ళివారి బళ్ళు వచ్చును. గట్టుమీద ఒకవైపు అగ్నిహోత్రావధానులు, రెండవవైపు పళ్ళు తోముకొనుచు రామప్పంతులును.)

అగ్ని : బళ్ళు దింపండి. బళ్ళు దింపండి. సాయేబూ! యేనుక్కి కావలసినంత రొడ్డ, చెరువు స్నానానికి బహు బాగా వుంది. యెవరయా చెరువు గట్టుమీద ?

రామ : (తనలో) అరే ? మరచితిని. యీ వేళే కదా పెళ్ళివారు రావలసిన రోజు ? (పైకి) నా పేరు రామప్పంతులంటారు.

అగ్ని : లుబ్ధావధాన్లుగారు మిమ్మల్ని పంపించారా యేమిటి ?

రామ : యెందుకండి ?

అగ్ని : మే వొస్తున్నావని యెదురుగా యవర్నీ పంపలేదా ? నా పేరు అగ్ని హోత్రావధాన్లు అంటారు.

రామ : మీరేనా అగ్నిహోత్రావధాన్లుగారు ? యేం వచ్చారేమిటి ?

అగ్ని : పెళ్ళిమాట మీకు తెలియదా యేమిటి ?

రామ : పెళ్ళెవరికండి ?

అగ్ని : మీ దీవూరు కాదా యేమిషండీ ? మా పిల్లని లుబ్ధావధాన్లు గారి కిస్తావుః.

రామ : లుబ్ధావధాన్లుగారికి పెళ్ళయిపోయిందే!

అగ్ని : తమరు హాస్యాలాడుతున్నారు. హాస్యాలకేం గాని, ప్రయత్నాలు యలా జరుగుతున్నా యేమిషండి ?

రామ : మీరే హాస్యలాడుతున్నట్టుంది. పెళ్ళి అయి పది రోజులైంది. లుబ్ధావధాన్లుగారి సంబంధం అక్కర్లేదని మీరు రాశారట. అందుపైని యవడో గుంటూరు నుంచి వొచ్చిన ఓ శాస్తుల్లు కొమార్తెని పన్నెండు వొందలిచ్చి పెళ్ళాడాడు.

అగ్ని : అన్నగారూ, హాస్యం ఆడుతున్నారు. న్యాయం కాదు, మనకి బావగారి వరసా యేమిషండి ?

రామ : ఏమిటి మీ మాటలు ? నేను యెన్నడూ అబద్ధవాడి యెరగను. నా మాట నమ్మకపోవడం ధర్మవేఁనా ?

అగ్ని : ప్ర'మాణం చెయ్యండి ?

రామ : గాయత్రీ సాక్షి.

అగ్ని : అయ్యో! అయ్యో! యేవీఁ దురంతం! రండీ. వెళ్ళి, గాడిదకొడుకు యెఁవికలు విరగ్గొడతాను.

రామ : నేను రానండి. ఆ గుంటూరు సంబంధం చెయ్యవొద్దన్నానని నాతో మాట్లాడడం మానేశాడు. మీరు వెళ్ళిరండి. మీరు తిరిగీ వొచ్చిందాకా యిక్కడే కూచుంటాను.

అగ్ని : ఆ గాడిద కొడుకు యింటికి నాకు తోవ తెలియదే ?

శిష్య : (చెరువు గట్టు యెక్కుతూ పాడును)
"తా నెవ్వరో తనవా రెవ్వరో ?
మాయజీవికి తనువుకు తగులాయ గాకా॥"

(రామప్పంతులు నిలబడి భయము కనపర్చును.)

అగ్ని : యేవిఁ అలా చూస్తున్నారు ?

రామ : శవాన్ని మోసుకుపోయే పాట!

శిష్య : "దినమూ, మరణమని తెలియూడీ."

రామ : (శిష్యునితో) వూరుకో. (అగ్నిహోత్రావధాన్లుతో) అన్నా ఓ కాని వుందా ?

శిష్య : మిమ్మల్ని తీసుకురమ్మంది.

రామ : చచ్చానే. వొస్తుందా యేవిఁటి ?

శిష్య : కంటె పోతే పోయింది; రమ్మంది.

రామ : బతికాను.

అగ్ని : చావడం యెందుకు, బతకడం యెందుకు ?

రామ : అది వేరే కథ.

శిష్యు : చిట్టపులి పిల్లని తండ్రొచ్చి పండక్కి తీసుకుపోయినాడట.

అగ్ని : యీ వూళ్ళోకి పుల్లొస్తాయా యేమిటి ?

రామ : విరగడై పోయింది. (శిష్యునితో) యింద రూపాయి.

శిష్యు : (తీసుకుని) దాసుణ్ణి బాబూ! (పాడును.)

"చిత్తా స్వాతి వాన, జోడించి కురియగ"

అగ్ని : యేవింటీ వెధవ పాట ? వూరుకుంటావా. వూరుకోవా ? నీకు రూపాయి చాలదురా గుంటకక్కగట్టా ?

శిష్యు : తమరు దయచెయ్యరా బాబూ ?

అగ్ని : నేనివ్వను. అన్నా! తోవ యవరు చూపిస్తారు ?

రామ : (శిష్యుడితో) నీకు లుబ్ధావధాన్లు యిల్లు తెలుసునా ?

శిష్యు : తెలుసును, తండ్రీ!

రామ : అవధాన్లుగారు ఓ కాని డబ్బిస్తారు. యిల్లు చూపించు.

శిష్యు : ముందిస్తేగాని చూపించను.

అగ్ని : యింద, యేడువు ?

(శిష్యుడు ముందూ, అగ్నిహోత్రావధాన్లు వెనకా కొన్ని అడుగులు వెళ్ళిన తరవాత, శిష్యుడు పాడును.)

శిష్యు : "నీలాలకా యేల నీ యలుకా ?

అగ్ని : యలకేవింటి నీ శ్రాద్ధం!

శిష్యు : యలక్కాదు, పిల్లి (పాడును)

"పిల్లన్న తెయితక్క లాడంగనూ
యలక లేరు గట్టి దున్నంగనూ"

అగ్ని : యేవింటీ ?

శిష్యు : "మేకపిల్ల లెండు మేళాం గట్టుకుని
మేరంగి తీర్థాని కెళ్ళంగనూ."

అగ్ని : యేవిఁటి శ్రాద్ధం పాట ?

శిష్యు : "తొండాయ నేస్తూడు దొనిగర్ర బట్టుకుని
తోటమల్లీ పువ్వు లేరంగను."

అగ్ని : పాడావంటే తంతాను.

శిష్యు : అయితే నీకు మరి యిల్లు చూపించను.

అగ్ని : పాడగట్టా.... (కొట్టబోవును)

శిష్యు : (తప్పించుకు పోతూ) "గట్టుకిందా నున్న
పందాయ నేస్తూడు మరిగబుకూ! మరిగుబుకూ! (నిష్క్రమించును)

అగ్ని : వీడి శ్రాద్ధం చెట్టుకింద బెట్టా! తోవ యిటా ? అటా ! (తెరదించవలెను)

2వ స్థలము : చెరువుగట్టు తోట.

(అగ్నిహోత్రావధాన్లు, రామప్పంతులు, వెంకమ్మ యితరులూ)

అగ్ని : గాడిద కొడుకుని మాచెడ్డ దెబ్బలు కొట్టి వేశాను. యేనుగులూ, గుర్రాలూ తెచ్చాను వీడి శ్రాద్ధం మీదకి! తోవ ఖర్చయినా వొక దమ్మిడీ యియ్యడష.

వెంక : మన ప్రారబ్ధం... నే న్నోచిన నోవులు ఇలా వుండగా, మరోలా యలా అవుతుంది ? యీ సమ్మంధం వొద్దని పోరితే విన్నారూ ? నేను భయపడుతూనే వున్నాను. బయల్దేరినప్పుడు పిల్లి యెదురుగుండా వొచ్చింది.

అగ్ని : పింజారీ, వూరుకో... ఆడ ముండలకేం తెలుసును ? అన్నగారూ, క్రిమినల్ కేసు తా'వడానికి అవకాశం వుంటుందా ? మా దగ్గిర అయ్యవారు ఒకాయన వున్నారు. ఆయనకి లా భోగట్టా మా బాగా తెలుసును. ఆయన్ని కూడా సలహా చేదాం.

రామ : కోర్టు వ్యవహారంలో ఆరితేరిన మీకు ఒకరు సలహా ఇవ్వాలండీ ? స్థలజ్ఞుణ్ణి గనుక సాక్ష్యం గీక్ష్యం తేవడానికి నేను సాయం చేస్తానన్నాను గానీ, అయ్యవార్లూ గియ్యవార్లూ మీకూ నాకూ సలహా చెప్పేపాటి వాళ్ళా ? గుంటకక్కగట్లు రెండు యింగిలీసు ముక్కలు చదువుకున్నారు గనుక ముక్కస్యముక్కార్థః అని తర్జుమాలు మట్టుకు చేస్తారు. గాని యేదయినా

యెత్తు యెత్తావఁంటే తమలాంటి యోధులు యెత్తాలి. నా లాంటి నియ్యోగపాడు నడిపించాలి. క్రిమినలుకి అవకాశం వుందా అని అడుగుతా రేవిఁటి ? మీకు తెలియదా యేవిఁటి ? అటుపైని సులభ సాధ్యంగా మూడు నాలుగువేలు డా'మేజి కూడా సివిల్లో లాగేస్తారు.

అగ్ని : అదే నా ఆలోచన.

రామ : తీరిపాయె; మళ్ళీ యిహ సలహాకేఁవుంది ? వెంటనే వెళ్ళి ముక్క తగిలించేద్దాం. ఖర్చులకి సొమ్ము పట్టుకుని బయలు దేరండి.

అగ్ని : నా దగ్గిర దమ్మిడీ లేదు; ఏమి సాధనం ? యీ గాడిద కొడుకు రూపాయలిస్తాడని నమ్మి, నేనేమీ తేలేదు.

రామ : యింటికి వెళ్ళి లెక్కపట్టుకు వొచ్చేటప్పటికి పుణ్యకాలం మించి పోతుంది. "శుభస్య శీఘ్రం" అన్నారు. మీ ఆలోచనేవిఁటి ?

అగ్ని : యిదేదో అయితే గాని, యింటి మొహం చూసేది లేదు. మా అమ్మి సరుకేదయినా యీ వూళ్ళో తాకట్టు పెడదాం.

రామ : అయితే పట్టుకు రండి; పోలిశెట్టి దగ్గర తాకట్టు పెడదాం; పోలిశెట్టిని మనం కొంచం మంచి చసుకోవడం ఆవశ్యకం. మీరు లుబ్ధావధాన్లుని కొట్టినప్పుడు పోలిశెట్టి వున్నాడు గనుక, లుబ్ధావధాన్లు మీ మీద ఛార్జి చేసినప్పుడు పోలిశెట్టిని తప్పకుండా సాక్ష్యం వేస్తాడు. శెట్టిని మనం విడతియ్యడం జరూరు-యేవంటారు ?

అగ్ని : మీ సలహా మా బాగా వుంది. నాకూ అదే భయం వేస్తూంది.

రాము : చూశారా. ప్రతివాడికీ సలహా చెప్పడం చాతౌతుందండీ ? అందులో యీ యింగిలీసు చదువుకున్న అయ్యవార్లని సలహా అడిగితే, కేసులే తావొద్దంటారు, దొంగసాక్ష్యాలు తావొద్దంటారు. వాళ్ళ సొమ్మేం పోయింది ? యే మాలకూడూ లేకపోతే కేసులు గెలవడం యలాగ ?

అగ్ని : మా అయ్యవారు మట్టుకు మంచి బుద్ధిమంతుడూ, తెలివైనవాడూ నండి. కోర్టు వ్యవహారాలలో అతనికి తెలియని సంగతి లేదండి. అంత బుద్ధి మంతుణ్ణి నేను ఎక్కడా చూడలేదు. ఆయన్ని చూస్తే మీరూ అలాగే అంటారు.

రామ : యెంత బుద్ధిమంతుడైనా మీ కొహాదు సలహా చెప్పే వాడున్నాడండీ ? (చెవిలో) మరోమాట – మీ అయ్యవారు గిరీశంగాడు కాదండీ ? వాడు లుబ్ధావధాన్లు పింతల్లి కొడుకు గదా ? మీకా వాడు యీ కేసుల్లో సరైన సలహా చెబుతాడు ?

అగ్ని : అవునండోయి!

రామ : నియ్యోగపాణ్ణి. నా మాట కొంచెం ఖాతరీ చెయ్యండి. గనక, ఆ అయ్యవార్ని తోడిచ్చి, పిల్లల్ని యింటికి పంపించెయ్యండి. యెకా యెకిని మనం తక్షణం వెళ్ళిపోయి, లుబ్ధావధాన్లు కన్నా ముందు ముక్క తగిలిం చెయ్యాలి. యేదో ఓ సరుకు వేగిరం పట్టుకు రండి.

అగ్ని : యేదీ, అమ్మిని యిలా పిలు.

వెంక : అమ్మేది చెప్మా ? బద్ధకించి బండిలో పడుకుంది కాబోలు. పిలువమ్మా.

అగ్ని : మనకి డా'మేజీ దిట్టంగా వొస్తుందా ?

రామ : వొస్తుందంటే అలాగా యిలాగానా ?

ఒకడు : అమ్మన్నగారి బండీ యక్కడా కనపడదు. బండీ వెనక పడిపోయింది కాబోలు.

వెంక : అడుగో, అబ్బి వున్నాడే! వీడెలా వొచ్చాడు ? అబ్బీ, నువ్వు అక్కయ్య బండిలో కూచోలేదురా ?

వెంకటే : లేదు, నేను యేనుగెక్కా'ను.

అగ్ని : దొంగ గాడిద'కొడకా, అయ్యవారేడ్రా!

వెంకటే : యెక్కడా కనపడ్డు.

అగ్ని : గుఱ్ఱం వొచ్చిందా ? గుఱ్ఱపాడేడీ ?

వెంకటే : గుఱ్ఱపాడు చెప్పాడు...

అగ్ని : యేవిఁట్రా వెధవా, చెప్పా'డూ ?

వెంకటే : మాష్టారూ.... రాత్రి...

అగ్ని : నోటంట మాట పెగల్దేం ?

వెంకటే : గుర్రం దిగి.... బండీ యెక్కా'ట్ట.

వెంక : అయ్యో, దాన్ని లేవదీసుకు పోలేదు గదా ?

దగ్గిరున్నవారు : ఆఁ! ఆఁ!

వెంక : కొంప మునిగిపోయింది, మరేవిఁటి! (చతికిలబడును.)

అగ్ని : (కోపముచేత వణుకుచు) అయ్యవారు పకీరు ముండని లేవ తీసుకు పోయాడూ ? నగలపెట్టె ? నా కోర్టు కాగితాలో ?

వెంకటే : అక్కయ్య పెట్లో నా పుస్తకాలు కూడా పెట్టా'ను.

అగ్ని : దొంగ గాడిద' కొడకా ? నువ్వే వాణ్ణి యింట్లో పెట్టా'వు. రవంత ఆచోకీ తెలిసింది కాదు. దొంగ వెధవని చంపేసి పోదును. గాడిద' కొడుకును అమాంతంగా పాతిపెట్టేద్దును.

రామ : (దగ్గిరకు వచ్చి) అయ్యవారు మహాదొడ్డవాడని చెప్పారే ? యేమి యెత్తుకు పోయినా దేమిటండి ?

అగ్ని : యేవిఁ యెత్తుకుపోయినాడా ? నీ శ్రాద్ధం యెత్తుకుపోయినాడు. ఫకీరుముండని యెత్తుకు పోయినాడు. యీ గాడిద కొడుకు యింగిలీసు చదువు కొంప ముంచింది.

(వెంకటేశం జుత్తు పట్టుకుని కొట్టబోవుచుండగా తెరదించవలెను)

3వ స్థలము : విశాఖపట్టణములో మధురవాణి బస యెదటి వీధి

(రామప్పంతులు, అగ్నిహోత్రావధాన్లు ప్రవేశింతురు)

అగ్ని : మనం పోలిశెట్టి దగ్గిర బదులు తెచ్చిన రూపాయలన్నీ అయిపోయినాయి; యప్పటికీ ఖర్చులు ఖర్చులే అంచారు; నా దగ్గిర వక దమ్మిడీ లేదు.

రామ : ఖర్చు కానిదీ కార్యాలవుతాయిటయ్యా ? మీ కడియం యెక్కడైనా తాకట్టు పెట్టండి.

అగ్ని : యీ వూళ్లో మనం యెరిగిన వాళ్ళెవరున్నారు ?

రామ : మధురవాణి దగ్గిర తాకట్టు పెడదాం.

అగ్ని : రండి, చేసేవి మాఘస్నానాలూ, దూరేవి దొమ్మరికొంపలూ అని, జటాంతస్వాధ్యాయిని నన్ను ముండలిళ్ళకి తీసుకు వెడతావషయ్యా ?

రామ : మరి యే కొంపలూ తిరక్కపోతే కేసులు గెలవడం యలాగ ? అది అందరు ముండల్లాంటిదీ అనుకున్నారా యేమిటి ? సంసారి వంటిది. అయినా రావడం ఇష్టం లేకపోతే నా చేతికివ్వండి. నేనే తాకట్టుపెట్టి సొమ్ము తీసుకొస్తాను.

అగ్ని : అలాక్కాదు; నేను కూడా వస్తాను.

రామ : యేదీ కడియం ఇలా గివ్వండి.

అగ్ని : యిది మా తాతగార్నాటిది. ఇది యివ్వడమంటే నాకేమీ యిష్టం లేకుండా వుంది. డబ్బు వూరికే ఖర్చు పెట్టించేస్తున్నారు. మీరు కుదిర్చిన వకీలు తగినవాడు కాడష; ఇంగ్లీషు రాదు. యేమీ లేదూ.

రామ : ఆయన్లాంటి చెయ్యి ఈ జిల్లాలో లేదు. ఆయన్ని చూస్తే డిప్టీకలక్టరుగారికి ప్రాణం. ఇంతకీ మీరేదో పట్టుదల మనుషులనుకున్నాను గాని, మొదటున్న వుత్సాహ మీ్మకు యిప్పుడు లేదు. మీకు డబ్బు ఖర్చుపెట్టడం యిష్టం లేకపోతే మానేసాయెను. "యావత్తయిలం, తావద్వ్యాఖ్యానం" అన్నాడు. మరి నాకు శలవిప్పించెయ్యండి.

అగ్ని : (ఆలోచించి) అయితే తాకట్టు పెట్టండి. (నిమ్మళముగా కడియము తీసి ఇచ్చును.)

రామ : (తన చేత నెక్కించుచు) మీ కేసుల్లో యిలాగు శ్రమపడుతున్నాను కదా నాకొక దమ్మిడీ అయినా యిచ్చారు కారుగదా ?

అగ్ని : అయితే, నా కడియం వుడాయిస్తావా యేమిటి ?

రామ : నేను మీకు యెలాంటి వకీల్ని కుదిర్చాను! ఆయన మీ విషయమై యంత శ్రమ పడుతున్నాడు! ఇదుగో, ఆయన వస్తున్నాడు.

(నాయుడు ప్రవేశించును.)

రామ : (తనలో) యేమిటి చెప్మా, వీడు మధురవాణి బస పెరటి దిడ్డీ వేపునించి వస్తున్నాడు! వీడు కూడా మధురవాణిని మరిగాడా యేమిటి ? వీణ్ణి యీ కేసులో నుంచి తప్పించెయ్యాలి.

నాయు : యేమండీ రామప్పంతులన్నా, మిగతా ఫీజు యిప్పించారు కారుగదా ?

అగ్ని : మీరు రాసిన డిఫెన్సు బాగుందికాదని భుక్తగారన్నారష.

రామ : యెవడా అన్నవాడు ? గుడ్లు పీకించేస్తాను. రామప్పంతులన్నగారూ, చూశారండీ– డిఫెన్సు యెంత జాగ్రత్తగా తయారు చేశానో. నా దగ్గిర హైకోర్టుక్కూడా ప్లయింట్లు రాసుకు వెళ్ళిపోతారు. యీ కుళ్ళు కేసనగా యేపాటి ? నే చెప్పినట్టల్లా పార్టీ నడిస్తే నే పట్టిన కేసు పోవడమన్న మాట యెన్నడూ లేదు. యీ డిఫెన్సు చిత్తగించండి (చంకలోని రుమాల్ కట్టతీసి విప్పి, అందులో ఒక కాగితము తీసి చదువును.) "ఫిర్యాదీ చెప్పిన సంగతులు యావత్తూ అబద్ధం కాని, యెంత మాత్రం నిజం కావు" చూశారూ ఆ వక్క మాటతోనే ఫిర్యాదీవాదం అంతా పడిపోతుంది. "ఫిర్యాదీ నా మీద గిట్టక దురుద్దేశంతో కూహకం చేసి కేసు తెచ్చినాడు కాని, యిందులో ఎంత మాత్రం నిజం లేదు."

రామ : డిఫెన్సు మాట కేమండిగాని అవధానులుగారు పైసా లేదంటున్నారు.

నాయు : పైసా లేకపోతే పనెలా జరుగుతుంది ?

రామ : ఒక సంగతి మనవి చేస్తాను. ఇలా రండి.

(రామప్పంతులు, నాయుడు వేరుగా మాటలాడుదురు.)

రామ : నాయుడుగారూ, మీ వకాల్తీ యీయన కేమీ సమాధానం లేదు. నే యెంత చెప్పినా వినక భీమారావు పంతులుగారికి వకాల్తీ ఇచ్చాడు. మీకు ఇంగ్లీష్ రాదనీ, లా రాదనీ యెవడో దుర్బోధ చేశాడు.

నాయు : సాల్మెట్ దొరగార్ని మెప్పించిన ముండా కొడుకుని నాకు లా రాకపోతే యీ గుంట వెధవలకుటోయ్ లా వస్తుంది ? పాస్ పీసని రెండు యింగ్లీషు ముక్కలు మాట్లాడటంతోటే సరా యేమిటి ? అందులో మన డిప్టీకలక్టరు గారికి యింగ్లీషు వకీలంటే కోపం. అందులో బ్రాహ్మడంటే మరీని. ఆ మాట ఆలందరికి బోధపర్చండి.

రామ : మరి కార్యం లేదండి. నే యెంతో దూరం చెప్పా'ను; తిక్క ముండా కొడుకు విన్నాడు కాడు.

నాయు : అయితే నన్నిలాగు అమర్యాద చేస్తారూ ? యీ బ్రాహ్మడి యోగ్యత యిప్పుడే కలక్టరుగారి బసకు వెళ్ళి మనవి చేస్తాను.

(తెర దించవలెను)

4వ స్థలము : లుబ్ధావధాన్లు బస.

లుబ్ధా : (ప్రవేశించి) ఏమి దురవస్థ వచ్చిందీ! నా అంత దురదృష్టవంతుడు లోకంలో యవడూ లేడు. యేల్నాటి శని రాగానే కాశీకి బయల్దేరి పోవలసింది. బుద్ధి తక్కువ పని చేశాను. యిలా రాసి వుండగా ఎలా తప్పుతుంది ? సౌజన్యారావుపంతులు దేవుడు. ఆయన లాంటివాళ్ళు వుండబట్టే వర్షాలు కురుస్తున్నాయి. ఆయన శలవిచ్చినట్టు తప్పంతా నా యందు వుంచుకుని విధిని నిందించడవెందుకు ? ఇంత డబ్బుండిన్నీ, డబ్బుకి లోభపడి ఒక్కగానొక్క కూతుర్ని ముసలివానికి అమ్మాను. నా జీవనానికి ఉసూరుమంటూ అది కానితిరుగులు తిరిగిందంటే దాని తప్పా ? బుద్ధి తక్కువ వెధవని, ముసలితనంలో నాకు పెళ్ళేం ? దొంగముండా కొడుకని తెలిసిన్నీ ఆ రాఁవప్పంతుల్ని నే నమ్మడవేఁవి? ఆ మాయగుంట పారిపోవడవేఁవి ? కంటెకి ఆ అల్లరేమి ? ఆ యినసిపికటరు కూనీ చేశావఁని మమ్మల్ని సలపెట్టడవేఁవిటి ? అంతా ఘోరకలి! కలి నిండిపోతూంది. ఒక్క సౌజన్యారావు పంతులు సత్యసంధుడుగా నాకు కనపడుతున్నాడు. కడవంతా - వకీళ్ళూ, పోలీసులూ - పచ్చి దొంగలు. ఆయన చక్రం అడ్డువేసి మమ్మల్ని యీ ఆపదలోంచి తప్పించారంటే కాశీవాసం పోతాం-యేమి చిత్రాలు! వెధవలకి మఠం కట్టారట! యన్నడూ వినలేదు. అమ్మిని వెళ్ళి ఆ మఠం చూడ మంటాను. దానికి యిష్టం కలిగిందా, దానికి కావలసిన డబ్బు యిస్తాను, ఆ మఠంలో వుంటుంది. లేకుంటే నాతో పాటు కాశీవాసం.

(రామప్పంతులు ప్రవేశించును)

లుబ్ధా : కంటె గింటె అని నాతో మీరు ప్రశంసించి కార్యం లేదు.

రామ : ఆ కంటె మాట ప్రశంసించటానికి రాలేదు మావాఁ! ఆ కంటె మధురవాణిది, మీరెరగరా ? అదీ, మీరూ యేంజేసుకుంటారో నాకేం కావాలి ? కంటె సిగకోసిరిగాని మీకు ఓ గొప్ప సాయం చెయ్యడానికి వొచ్చాను. మీ అవస్థ చూస్తే గుండె నీరైపోతూంది.

లుబ్ధా : మహాప్రభో! నీకు పదివేల నమస్కారాలు. యిక యీ పకీరు వెధవని వదిలెయ్యి. "రామనామ తారకం! భక్తి ముక్తి దాయకం! జానకీ మ..."

రామ : రామ! రామ! యంతమాట అంటివయ్యా! మీరు ఆపదలో వుండి విరక్తిచేత యేమి మాటలన్నా, అవి పడి పని చెయ్యడం నాకు విధి. చెప్పేమాట చెవిన బెట్టండి. ముందూ వెనకా చూడడానికి యిహ టైము లేదు. వ్యవహారం అంతా సూక్ష్మంగా పొక్తుపరుచుకు వొచ్చాను. రెండు సంచులతో కూనీ కేసంతా మంచు విడిపోయినట్లు విడిపోతుంది. ఒక్క యినస్పెక్టరుతో కుదరలేదు. డిప్టీకలెక్టరికి కూడా చెయ్యి తడిచెయ్యాలి. మీ దగ్గిర ఇప్పుడు సొమ్ము లేదంటిరా, ఒకచోట వ్యవహారం కూడా పొక్తుపర్చాను. ప్రాంసరీ నోటుమీద యెన్ని రూపాయలు కావలిస్తే అన్ని రూపాయలిస్తారు.

లుబ్ధా : నేను ఒక దమ్మిడీ యివ్వను. రామనామతారకం, భక్తి ముక్తి దాయకం! జానకీ మనోహరం! సర్వలోక నాయకం.

రామ : నా మాట విను. యంతో ప్రయాస మీద యీ ఘట్టం కుదిర్చాను. తాసీల్దారు మీ దగ్గిర లంచం పుచ్చుకుని కూనీకేసు కామాపు చేశాడని యినస్పెక్టరు డిప్టీ కలెక్టరికి గట్టిగా బోధపర్చాడు. కలెక్టరు సలహామీద యినస్పెక్టరు చాలా పట్టుదలగా పనిచేసి, సాక్ష్యం అంతా రెడీ చేశాడు. కేసు రుజువైనట్టాయనా యావొఁతుందో ఆలోచించుకోండి.

లుబ్ధా : నీ కెందుకు నా యేడుపు ?

రామ : డిప్టీ కలెక్టరు బ్రహ్మద్వేషి, తాసిల్దారు తాడు ముందు తెగుతుంది. తరవాత మిమ్మల్నీ, మీనాక్షినీ కమ్మెంటు కట్టేస్తాడు. వురి సిద్ధం. నాకూ యినస్పెక్టరికీ వుండే స్నేహం చేత యీ ఘట్టానికి ఒప్పించాను. గనక నా మాటకి చవొగ్గి యీ ఆపద తప్పించుకోండి.

లుబ్ధా : నన్ను బాధపెట్టక నీ మానాన నువ్వు పోదూ, “రామనామతారకం! భక్తి ముక్తి దాయకం!

రామ : నీ అంత కర్కోటకుణ్ణి నేను యక్కడా చూడలేదు. నీ మాటకేం, పెద్దవాడివి పసిపిల్ల, కడుపునకన్న మీనాక్షికి, వురి సిద్ధం అయితే, ముండా డబ్బుకి ముందూ వెనకా చూస్తావు! తలుచుకుంటే నా హృదయం కరిగిపోతూంది.

(సౌజన్యారావు పంతులు ప్రవేశించును)

రామ : తమరు ధర్మస్వరూపులు. లుబ్ధావధాన్లుగారి యందు అకారణమైన దయచేత యీ కేసులో పని జేస్తున్నాను. కేసంతా వొట్టి అన్యాయమండి. ఒక్క పిసరయినా నిజం లేదు. శెలవైతే గట్టి డిఫెన్సు సాక్ష్యం...

సౌజ : నీ సంగతి నాకు తెలుసు, అతలకి నడు.

రామ : తమరు యోగ్యులూ, గొప్పవారూ అయినా, ఏకవచన ప్రయోగం...

సౌజ : నడు!

(రామప్పంతులు నిష్క్రమించును)

సౌజ : ఈ దౌల్బాజీని తిరిగీ ఎందుకు రానిచ్చారూ ?

లుబ్ధా : పొమ్మంటే పోడు బాబూ!

సౌజ : యేవొంచ్చాడు ?

లుబ్ధా : యినస్పికటర్కీ, డిప్టీకలకటరికీ లంచం యిమ్మంటాడు.

సౌజ : డిప్టీకలక్టరుగారు లంచం పుచ్చుకోరు. ఆయన నాకు స్నేహితులు; నాకు తెలుసు. లంచాలూ, పంచాలూ మీరు ఇచ్చినట్లయితే, మీ కేసులో నేను పనిచెయ్యను.

లుబ్ధా : తమ శెలవు తప్పి నడిస్తే చెప్పుచ్చుకు కొట్టండి. నాకు భగవంతుడిలాగ తమరు దొరికారు, 'పాలను ముంచినా మీరే, నీళ్ళను ముంచినా మీరే' అని మిమ్మల్ని నమ్మి ఉన్నాను.

సౌజ : మీరు నేరం చెయ్యలేదని నాకు పూర్తి అయిన నమ్మకం వుంది. నిజం కనుక్కోవటానికి చాలా ప్రయత్నం చేస్తున్నాను గాని ఆ గుంటూరి శాస్తుల్లు యెవడో భేదించలేకుండా వున్నాను. మీరు జ్ఞాపకం మీద చెప్పిన చహరా గుంటూరు వ్రాసి పంపించాను. అక్కడ అలాటి మనిషి యెవడూ లేడని జవాబు వొచ్చింది.

లుబ్ధా : అదేం మాయో బాబూ! మీ సాయం వల్ల ఈ గండం గడిచి నా పిల్లా, నేనూ ఈ ఆపదలోంచి తేలితే, నా డబ్బంతా మీ పాదాల దగ్గిర దాఖలు చేసి కాశీ పోతాను.

సౌజ : మీ డబ్బు నాకక్కరలేదని మీతో మొదటే చెప్పాను. నే చెప్పిన మాటలు మీకు నచ్చి, ముసలివాళ్ళు పెళ్ళాడకూడదని, కన్యాశుల్కం తప్పనీ యిప్పటికయినా మీకు నమ్మకం కలిగితే, యిలాంటి దురాచారాలు మాన్పడానికి రాజమహేంద్రవరంలో వక సభ వుంది. ఆ సభకి కొంచవో గొప్పో మీకు తోచిన డబ్బు యివ్వండి. వితంతువుల మఠానికి మీ పిల్లని పంపడం నా సలహా.

లుబ్ధా : తమ చిత్తం, తమ శలవు. చేసిన తప్పులు, తప్పులని కల్యాల్ని పట్టి పోయింది. బుద్ధివొచ్చింది బాబూ!

సౌజ : ఆ గుంటూరు శాస్తుల్లుకి పడవcట దేశపు యాస వుండేదా ? బాగా జ్ఞాపకం చేసుకు చెప్పండి.

లుబ్ధా : (ఆలోచించి) లేదండి!

సౌజ : బాగా జ్ఞాపకం తెచ్చుకోండి.

లుబ్ధా : లేదండి.

(తెర దించవలెను)

5వ స్థలము : విశాఖపట్టణములో

(మధురవాణి యింటి యదటి వీధికొసను కరటకశాస్త్రి, శిష్యుడూ ప్రవేశింతురు)

కర : నువ్వు ఆ కంటె వాళ్ళ నెత్తిని కొట్టకుండా లేచి రావడం నుంచి ఈ ముప్పంతా వొచ్చినట్టు కనబడుతుంది.

శిష్య : మధురవాణి కంటె మధురవాణికి యివ్వటం తప్పా అండీ ?

కర : తప్పు కాదా ? నువ్వు యిచ్చావని, మరి అది వొప్పుకుందా ? "తే, థగిడీకే, కంటె తెస్తావా, చస్తావా ?" అని రామప్పంతుల్ని పీకి పిండెట్టింది. దాని బాధ పడలేక ఆ రావప్పంతులు కూనీ కేసని ఎత్తు ఎత్తాడు. ఆ ముసలోడికి శిక్ష అయిపోయిందంటే, బ్రహ్మహత్య నా మెడకి చుట్టుకుంటుంది. నువ్వు అంటూ ఆ కంటె వాళ్ళ యింట వొదిలేస్తే నాకు ఈ చిక్కు లేకపోవును గదా ?

శిష్య : వెధవముండ గూబ గదలేస్తూంటే కంటె గింటె యవడికి జ్ఞాపకం వస్తుందండి ? చెయ్యి కరిచి, పెట్టె తీసి, మొహురు అంకించుకుని

చెంగున గోడ గెంతాను. పజ్యండు వందలు మీరు పట్రాగా, నాకు పెళ్ళిలో పెట్టిన కంటె నేను తెచ్చాననా తప్పు పట్టుతున్నారు ? ఆ కంటె అయినా దక్కిందా ? చూస్తూనే మధురవాణి లాక్కుంది.

కర : నేను హాస్యగాణ్ణేగానీ, యీ కూనీ గడబిడతో నా హాస్యం అంతా అణిగిపోయింది. గనుక యిక హాస్యం మాను. నేను తీసుకున్న రూపాయలు ఎప్పటికైనా లుబ్ధావధాన్లుకి పంపించడానికే తలచాను. అంతేగాని, అపహరిద్దామని అనుకోలేదు. మధురవాణిని యలాగైనా లయ చేసి కంటె యెరువు పుచ్చుకుని, ఆ కంటా–ఈ రూపాయలూ బంగీకట్టి అవధాన్లుకి పంపించేస్తే కూనీ నిజం కాదని పోల్చుకుంటారు. నాకు ఈ బ్రహ్మహత్య తప్పిపోతుంది.

శిష్యు : మీ నాస్తులు సౌజన్యారావు పంతులుగారితో నిజం చెప్పెయ్యరాదా అండీ?

కర : వెర్రి కుదిరింది, రోకలి తలకి చుట్టమన్నాట్ట! వెనకటికి యవరో పోలీసు, తల్లి కూరగాయలు పుచ్చుకుంటే జుల్మానా వేశాట్ట! సౌజన్యారావు పంతులు అలాంటివాడు. ఆయనతో మనం వున్నమాట చెప్పావంటే, ఆయన నిజం కోర్టులో చెప్పేస్తాడు. ఆ పైని లుబ్ధావధానులు పీక వురి, మన పీకకి తగులుకుంటుంది.

శిష్యు : "మన" అంటున్నా రేవిఁటి ?

కర : మాట పొరపాటురా, రావఁప్పంతులు ఊరికి వెళ్ళిన మాట నిజవేఁనా ?

శిష్యు : నిజవేఁ.

కర : వాడికంట పడ్డావంటే....

శిష్యు : పడితే!

కర : మరేం లేదు. మధురవాణి గాని కంటె మనకి యెరువు యివ్వడానికి ఒప్పుకుంటే ఆంజనేయస్వామికి పదిశేర్లు నెయ్యి దీపారాధన చేస్తాను.

శిష్యు : కడుపులోకి వెళ్ళవలసిన నెయ్యి, కాల్చెయ్యడం నా కేవీఁ యిష్టంలేదు. అమృతగుండీ మొక్కుకొండి.

కర : హాస్యం చాలించు, బెడిసికొడుతుంది. (నిష్క్రమింతురు).

6వ స్థలము : మధురవాణి బసలో గది.

(మధురవాణి కుర్చీమీద కూచుని యుండును.
కరటకశాస్తుల్లు, శిష్యుడూ ప్రవేశింతురు. మధురవాణి నిలబడును.)

మధు : గురువుగారికి పదివేల దండాలు, శిష్యుడి కొక చిన్న ముద్దు! (శిష్యుని ముద్దుపెట్టుకొనును.)

కర : నీ పుణ్యం వుంటుంది. నా అల్లుణ్ణి చెడగొట్టకు.

మధు : అల్లుడెవరు ?

కర : మా పిల్లని యితగాడికి యిచ్చి, కన్యాదానం చేస్తాను.

మధు : జెయిలు నుంచి వొచ్చిన తరవాత పెళ్ళా ? లేక పెళ్ళి చేసుకొని మరీ మఠ ప్రవేశవాఁ ?

శిష్యు : జ'యిలేవిఁటండోయి ?

కర : వొట్టి హాస్యాని కంటూంది.

మధు : పాపం ఆ పసిపిల్లవాడికి వున్న నిజస్థితి చెప్పండి. తన వాళ్ళని వెళ్ళి చూసయినా వస్తాడు.

శిష్యు : (కరటక శాస్త్రితో) కొంప ముంచారో ?

మధు : ముంచడం అంటే అలాగా యిలాగానా ?

కర : నీ పుణ్యం వుంటుంది. హాస్యం చాలించు. లేకపోతే కుర్రవాళ్ళకి పెద్దల యందు భక్తి చెడుతుంది.

శిష్యు : నేనేం తప్పు చేశాను ? గురువుగారు చెప్పిన పని చేశాను. ఆ తప్పూ వొప్పూ ఆయందే.

మధు : యవరేవిఁ చేసితిరో నాకు తెలియదు గాని, మీ యిద్దరి కోసం హెడ్ కనిష్టీబు గాలిస్తున్నాడు. దొరకగానే మఠప్ర'వేశం చేస్తాడట. యీ మాట మట్టుకు నాకు రూఢిగా తెలుసును.

శిష్యు : యిదేనా మీరు నాకు చేస్తానన్న పెళ్ళి ?

కర : ఏమైనా జట్టీ వస్తే నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు వెయ్యనట్రా ?

మధు : వొస్తే జట్టీ గురుశిష్యులకు యిద్దరికీ వొక్కమారే వస్తుంది గాని ఒకరికి రావడం, ఒకరు అడ్డుపడడం అన్నమాట వుండబోదు. యెప్పుడైనా మీ యిద్దరి ప్రాణాలకి నేను కనికరించి, అడ్డుపడాలి గాని, మరి యవడికీ సాధ్యం కాదనుకుంటాను.

శిష్యు : మా గురువుగారి మాటకేం, ఆయన పెద్దవారు, యేవొఁచ్చినా సర్దుకోగలరు. నేను పాపం పుణ్యం యెరుగని పసిపిల్లవాణ్ణి. నా ప్రాణానికి నీ ప్రాణం అడ్డువేశావంటే, కీర్తి వుండిపోతుంది.

మధు : నీ గురువుని వొదిలేసి నా దగ్గిర శిష్యరికం చేస్తావా ?

శిష్యు : యిదిగో యీ నిమిషం వొదిలేస్తాను. (బుగ్గలు గాలితో పూరించి, పిడికిళ్ళతో తట్టి, గురువుతో) మీ నేస్తం యీ వేళతో సరి, మరి ఆడవేషం యీ జన్మలో వెయ్యను.

మధు : నాటకంలో కూడా వెయ్యవా ?

శిష్యు : మరి నాటకం గీటకం నాకొద్దు ?

మధు : నా దగ్గిర శిష్యరికం అంటే యేవేం జెయ్యాలో తెలుసునా ?

శిష్యు : నీళ్ళు తోడుతాను, వంటజేస్తాను, బట్టలు వుతుకుతాను. గాని బ్రాహ్మణ్ణి గదా, కాళ్ళు పట్టమనవు గద ?

మధు : (విరగబడి నవ్వి) యిదా నీ గురువు దగ్గిరి చేసే శిష్యరికం ?

శిష్యు : మరచిపోయినాను, చీడప్పొక్కులు కూడా గోకుతాను.

మధు : (నవ్వి) ఇంకా!

శిష్యు : యే నౌఖరీ చెయ్యమంటే ఆ నౌఖరీ చేస్తాను.

మధు : నన్ను ముద్దెట్టుకొమ్మన్నప్పుడల్లా ముద్దెట్టు కోవాలి.

శిష్యు : ముద్దెట్టుకుంటాను.

కర : వాడు కుర్రవాడు; వాణ్ణెందుకు చెడగొడతావు ? ఆ శిష్యరికం యేదో వాడి తరపునా, నా తరపునా కూడా నేనే చేస్తాను. చాతనైతే చక్రం అడ్డెయి.

మధు : "గురువు శిష్యుడాయె, శిష్యుడు గురువాయె." మీరు శిష్యులు కావాలంటే యిస్కూలుజీతం యిచ్చుకోవాలి.

కర : పిల్లికి చెలగాటం, యలక్కి ప్రాణ పోకటా!

మధు : మీరా యలక ?

కర : అవును.

మధు : మీరు యలక కాదు, పందికొక్కు. మీ శిష్యుడు యలక.

కర : పోనీ, వాణ్ణయినా కాపాడు.

మధు : అదే ఆలోచిస్తున్నాను.

కర : బుద్ధీ బుద్ధీ కలిస్తే రాపాడుతుంది. నీ ఆలోచన యేదో కొంచెం చెబితివట్టాయనా, నా ఆలోచన కూడా చెబుతాను, కలబోసుకుందాం.

మధు : మీ ఆలోచన ముందు చెప్పండి.

కర : మరేమీ లేదు. నేను పుచ్చుకున్న పజ్యండు వొందల రూపాయల నోట్లూ, ఆ కంటా పోస్టుద్వారా భీమా చేసి గుంటూరు శాస్త్తుల్లు పేరిట లుబ్ధావధాన్లుకి పంపిస్తాను. దాంతోటి కూనీ కేసు నిజం కాదని' సౌజన్యారావు పంతులుగారు పోల్చుకుంటారు. ఆ పైని దైవాధీనం!

మధు : మీకు కంటె యలా వొస్తుంది ?

కర : నువ్వు అనుగ్రహిస్తేను.

మధు : (ముక్కు మీద వేలు వుంచుకుని) చిత్రం! బ్రాహ్మలు ఎంతకైనా తగుదురు.

కర : యేవి అలా అంటున్నావు ?

మధు : ఆ కంటె తిరిగి నేను కళ్ళచూడడం యెలాగ ?

కర : సౌజన్యారావు పంతులుగారు నీ వస్తువ నీకు యిచ్చేస్తారు. ఆయన బహున్యాయమైన మనిషి.

మధు : అంత మంచివాడా ?

కర : అందుకు సందేహ వేమిటి ?

మధు : యెంత మంచివాడు ?

కర : అంత మంచి మనిషి మరి లోకంలో లేడు.

మధు : ఆయన్ని నాకు చూడాలనుంది. తీసికెళ్తారా ?

కర : నా ఆబోరుంటుందా ? ఆయన సానివాళ్ళని చూడరు.

మధు : యాంటీనాచ్చి కాబోలు ?

కర : యింగిలీసు చదువుకున్నవాళ్ళకి కొందరికి పట్టుకుంది యీ చాదస్తం! అయినా అందులోనూ దేశకాలాలను బట్టి రకరకాలు లేకపోవడం లేదు.

మధు : సౌజన్యారావు పంతులుగారిది యే రకం ? గిరీశంగారిది యే రకం ?

కర : యేమి సాపత్యం తెచ్చావు ? కుక్కకీ, గంగిగోవుకూ యెంతవారో, వాడికీ, ఆయనకూ అంత వార. సౌజన్యారావు పంతులుగారు కర్మణా, మనసా, వాచా, యాంటీనాచ్చి. "వేశ్య" అనేమాట యేమరి ఆయన యెదుట పలికితి నట్టాయనా, "అసందర్భం!" అంటారు. ఆయనలాంటి అచ్చాణీలు అరుదు. మిగిలినవారు యధాశక్తి యాంటీనాచులు. ఫౌంజు ఫౌంజంతా మాటల్లో మహావీరులే. అందులో గిరీశం అగ్రగణ్యుడు. కొందరు బంట్లు పొగలు యాంటీనాచి, రాత్రి ప్రోనాచి. కొందరు వున్నవూళ్ళో యాంటీనాచి పరాయివూళ్ళో ప్రోనాచి. కొందరు శరీరదార్ఢ్యం వున్నంతకాలం ప్రోనాచి, శరీరం చెడ్డతర్వాత యాంటీనాచి. కొందరు బతికి ఉన్నంత కాలం, ప్రోనాచి, చచ్చిపోయిన తరవాత యాంటీనాచి; కొందరు అదృష్టవంతులు చచ్చిన తరవాత కూడా ప్రోనాచే. అనగా యజ్ఞం చేసి పరలోకంలో భోగాలికి టిక్కట్లు కొనుక్కుంటారు. నాబోటి అల్ప ప్రజ్ఞ కలవాళ్ళు లభ్యం కానప్పుడల్లా యాంటీనాచే.

మధు : మీ యోగ్యత చెప్పేదేమిటి! గాని, హెడ్డుగారి మాటలు చూస్తే, సౌజన్యారావుపంతులుగారు లుబ్ధావధాన్లుగారిని కాపాడడానికి విశ్వ ప్రయత్నం చేస్తూ వున్నట్లు కనబడుతుంది. యేమి కారణమో ?

కర : చాపలు యీదడానికి, పిట్టలు ఎగరడానికి యేం కారణమో అదే కారణం.

మధు : పరోపకారం ఆయనకు సహజగుణమనా ?

కర : కాకేవిఁ ?

మధు : మీ రెండుకు, కొంచెం ఆ యీదడం, యెగరడం నేర్చుకోకూడదు ?

కర : నీ మాట అర్థం కాలేదు.

మధు : యీ కేసులో నిజవేఁదో సౌజన్యారావు పంతులుగారితో చెప్పి మీరు కూడా లోకోపకారం చెయ్యరాదా ?

కర : మా మంచి సలహా చెప్పావు! తనకు మాలిన ధర్మమా ? "స్వయంతీర్ధః పరాం స్తారాయతి" అన్నాడు. నిజం చెపితే పంతులు యేవంటాడో నీకు తెలుసునా ? "శాస్తుల్లుగారూ, మీరు నేరం చేశారు. నే నేమిఁ చెయ్యగలను? మిమ్ము‌ను గురించి నాకు చాలా విచారంగా వున్నది" అని వగుస్తూ పోలీసువాళ్ళతో చెప్పి, జైలులోకి వప్పచెప్తాడు. జైలునుంచి తిరిగి వచ్చిందాకా మాత్రం నెలకో పాతికో, పరకో కనికరించి నా భార్యకు యిస్తూ వుంటాడు. అలాంటి ప్రమాదం లేకుండా కార్యసానుకూలం కావఁడం కోసమే యీ యెత్తు యెత్తాను.

మధు : సరే. సౌజన్యారావు పంతులుగారు మంచివారు గనుక, ఆయనదాకా వస్తే నా కంటె నాకు యిప్పించేస్తారు. గాని, లుబ్ధావధాన్లు ఆ రూపాయలూ, కంటా పెట్లో పెట్టుకుని ముంగిలా మాట్లాడకుండా వూరుకుంటేనో ?

కర : దాని ఖరీదు నే నిచ్చుకుంటాను ?

మధు : తమరు ఒకవేళ మఠంలో ప్రవేశిస్తే మరి నాకు కంటె ఖరీదు యిచ్చే వారెవరు ? అందుచేత ఆ కంటె నాకు తిరిగి వచ్చే వరకూ మీ శిష్యుణ్ణి నా దగ్గిర తాకట్టు వుంచండి.

కర : అలాగనే.

శిష్యు : మీ సొమ్మేం పోయింది ? నా పెళ్ళో ?

కర : నాలికా, తాటిపట్టారా ?

శిష్యు : మీరోవేళ జయిల్లోకి వెళితే...

మధు : గురువుకు తగిన శిష్యుడి వౌదువు!

కర : అంత ఉపద్రవం వొస్తే, నీ పెళ్ళిమాట నా పెళ్ళాంతో యరేంజిమెంటు చేసి మరీ వెళతాను.

శిష్యు : యేమో! ఘోరమైన ప్రమాణం చేశారు గదా ?

కర : మధురవాణీ, కొంచెం శ్రమచేసి కంటె తేవా ?

మధు : యేవొచ్చింది తొందర ?

కర : హెడ్డుగాని, రావఁప్పంతులుగాని వొచ్చారంటే నా కొంప మునుగుతుంది.

మధు : మునిగితే తేలుస్తాను.

కర : అంత చాకచక్యం నీకు లేదని కాదు.

(మధురవాణి లోనికి వెళ్ళును.)

కర : అది చెప్పిందల్లా చెయ్యక, కొంచెం పై ఒచ్చేది కాని, మరీ నడుస్తూ వుండు. యేమైనా వుంటే, నా చెవిని పడేస్తూండు.

శిష్యు : యవరిదగ్గిర వున్నప్పుడు వారు చెప్పిందల్లా చెయ్యడవేఁ నా నిర్ణయం. మీరు యేం పై కాని, నా చేత ఆడవేషం వేయించి పెళ్ళి చేశారో.

కర : ప్రమాదో ధీమతామపి, యంతటి వాడికైనా ఒకప్పుడు కాలు జారుతుందిరా!

(మధురవాణి కంటె పట్టకు ప్రవేశించును)

మధు : తాకట్టు వస్తువ తప్పించుకు పారిపోతేనో ? కుక్కా నక్కా కాదు గదా గొలుసులు వేసి కట్టడానికి ?

కర : నీ వలలోపడ్డ ప్రాణి మరి తప్పించుకోవడం యలాగ ? దానికి వున్న పటుత్వం యే వుక్కు గొలుసులకూ వుండదు.

మధు : వలలో ముత్యపు చిప్పలు పడితే లాభం గాని నత్తగుల్లలు పడితే మోత చేటు!

కర : యంతసేపూ డబ్బు, డబ్బేనా ? స్నేహం, వలపూ అనేవి వుంటాయా ?

మధు : స్నేహం మీలాంటివారితోటి, అందుచేతనే కష్టపడి అర్జించిన కంటె మీ పాలు చేస్తున్నాను. మా తల్లి చూస్తే భవిష్యం వుంచునా ? యిక వలపో ? బతుకనేది వుంటే, వలపు వన్నె తెలుస్తుంది. అంగడివాడికి మిఠాయి

మీద ఆశ, సానిదానికి వలపూ మనస్సులోనే మణగాలి. కొద్దికాలం వుండే యవ్వనాన్ని జీవనాధారంగా చేసుకున్న మా కులానికి వలపు ఒక్కచోటే!

కర : యక్కడో ?

మధు : బంగారం మీద. శృంగారం వన్నె చెడిన దగ్గిర నుంచీ, బంగారం గదా తేటు తేవాలి; ఆ బంగారం మీకు ధారపోస్తూ వున్నప్పుడు నా స్నేహం యెన్ననేల ?

కర : నీ స్నేహం చెప్పేదేఁవిటీ ? గాని నీ యౌవనం, నీ శృంగారం అంతా దేవతాస్త్రీలకు శాశ్వతంగా వుంటాయి.

మధు : మా తల్లి ధర్మవాఁ అని ఆమె నా చెవిలో గూడు కట్టుకుని బుద్ధులు చెప్పబట్టిగాని, లేకుంటే మీలాంటి విద్వాంసుల యిచ్చకాలకి మైమరచి, యీపాటికి వూళ్ళో సానులవలె చెడివుండనా ?

కర : మీ తల్లి అనగా యెంత బుద్ధిమంతురాలు! దాని తరిఫీదు చేతనే నువ్వు విద్యా సౌందర్యాలు రెండూ దోహదం చేసి పెంచుతున్నావు.

మధు : అంతకన్న కాపు మనిషినై పుట్టి, మొగుడి పొలంలో వంగ మొక్కలకూ, మిరపమొక్కలకూ దోహదం చేస్తే, యావజ్జీవం కాపాడే తన వాళ్ళన్న వారు వుందురేమో ?

కర : యేమి చిన్నమాట అన్నావు! మధురవాణి అంటూ ఒక వేశ్యాశిఖామణి యీ కళింగరాజ్యంలో వుండకపోతే భగవంతుడి సృష్టికి యెంత లోపం వచ్చి వుండును ?

మధు : సృష్టికి లోపం వచ్చినా, రాకపోయినా, యిప్పటి చిక్కులలో మీకు మట్టుకు కించిత్ లోపం వచ్చి వుండును.

కర : మమ్మల్ని తేల్చడానికి నీ ఆలోచన యేదో కొంచెం చెప్పావు కావు గదా ?

మధు : నన్ను సౌజన్యారావుపంతులుగారి దగ్గరకు తీసుకు వెళ్ళటానికి వొప్పారు కారు గదా ?

కర : ఆయన నిన్నూ, నన్నూ యింట్లోంచి కఱ్ఱ పుచ్చుకు తరుముతారు.

మధు : కోపిష్టా ?

కర : ఆయనకి కోపవఁన్న మాటే లేదు ?

మధు : ఐతే భయమేల ?

కర : చెడ్డవారివల్ల చెప్పుదెబ్బలు తినవచ్చును గానీ, మంచి వారివల్ల మాట కాయడం కష్టం.

మధు : కొత్త సంగతి వకటి ఈనాటికి నాకు తెలిసింది. సృష్టికల్లా వన్నె తెచ్చిన మధురవాణి అనే వేశ్యాశిఖామణి గిరీశంగారి వంటి కుక్కల పొత్తుకే తగివున్నదిగాని, సౌజన్యారావు పంతులుగారి వంటి సత్పురుషులను చూడడమునకైనా అర్హత కలిగి వుండలేదో. గిరీశంగారు దాని యింట అడుగు బెట్టగానే, మీ చెల్లెలుగారి యింట అడుగు బెట్టడానికి ఆయనకు యోగ్యత తప్పిందని మీ నిర్ణయం, తమలాంటి పండితోత్తములు మాత్రం కార్యావసరం కలిగినప్పుడు వూరువాడా వెతికి మధురవాణి దగ్గిర లాచారీ పడవచ్చును. అయితే డిప్టీకలక్టరూ కుక్కేనా ?

కర : లంచం తినడుగాని ఆయనకు స్త్రీ వ్యసనం కద్దు. పెద్ద వుద్యోగస్థుడు గనక సీమకుక్క అని అందాం. ఆయన్నిగానీ వలలో వేశావా యేవిఁటి ?

మధు : వేస్తే ?

కర : బతికానన్న మాట. ఆయన సాయం వుంటే, కేసు మంచులా విడిపోతుంది, తెలిసింది– యిదా, నువు చేసిన ఆలోచన ? యెంత గొప్పదానివి!

మధు : ఆయన నాయుడుచేత రాయబారాలు పంపుతున్నారు.

కర : వెళ్ళు, వెళ్ళు, వెళ్ళు. యింకా ఆలోచిస్తావేఁవిటి ? నీ అదృష్టం యేవఁని చెప్పను ?

మధు : వెళ్ళదలచుకోలేదు.

కర : చంపిపోతివే! ఆయన ఒక్కడే మమ్మల్ని కాపాడ గలిగిన వాడు.

మధు : యిటుపైని వూరకుక్కలనూ, సీమకుక్కలనూ దూరంగా వుంచడానికి ఆలోచిస్తున్నాను.

కర : ఆయనని హాస్యానికి సీమకుక్క అని అన్నాను గాని, ఎంత రసికుడను కున్నావు ? చేతికి యెముక లేదే! హెడ్డు కనిష్టీబు సాటి చేశాడు కాడా ?

మధు : పట్టణం వొదిలి పల్లెటూరు రాగానే మీ దృష్టిలో పలచనైతినో ? హెడ్డును నౌఖరులా తిప్పుకున్నానుగాని అధికం లేదే ? ఆ నాలుగు రోజులూ, సర్కారు కొలుపు మాని అతడు నా కొలువు చేశాడు. అతడి సాయం లేకపోతే, మీరు ఆ వూరి పొలిమేర దాటుదురా ? ఈ దాసరి దాటునా? లోకం అంతా యేమి స్వప్రయోజకపరులూ!

కర : అపరాధం! అపరాధం! కలక్టరుని చూడనంటే మనస్సు చివుక్కుమని అలా అన్నాను. నువ్వు ఆ గ్రామం గ్రామం సమూలంగా రాణిలాగ యేలడం నేను ఈ కళ్ళతో చూడలేదా ?

మధు : నేను కలక్టరును చూడనంటే, మీ మనస్సు చివుక్కుమనడం యెట్టిది ? యేమీ చిత్రం! సౌజన్యారావు పంతులుగారు ఈ మాట వింటే సంతోషిస్తారు కాబోలు!

కర : పీక వుత్తరిస్తారు.

మధు : అదేదో చూస్తాను.

కర : బ్రహ్మహత్య కట్టుకుంటావా యేవిఁటి ?

మధు : ఆహా! ఏమి బ్రాహ్మలూ!.... అయినా పోలిశెట్టి చెప్పినట్టు, యెంతచెడ్డా బ్రాహ్మలు గదా ? యిందండి – (కంటె యిచ్చును) తిలోద కాలేనా ?

కర : యెంతమాట! పువ్వులలో పెట్టి మళ్ళీ రాదా ? నీ యెదుట అనవలసిన మాట కాదు! నీలాంటి మనిషి మరి లేదు. కించిత్ తిక్క లేకుంటేనా ?

మధు : ఆ తిక్కే గదా యిప్పుడు మీకు వుపచరిస్తూంది ?

కర : యేం వుపచరించడం ? చంపేశావు! ఆ డిప్టీకలక్టర్నీ ఒక్కమాటు చూసి యీ బీదప్రాణిని కాపాడితే...

మధు : చాలించండి. ఇక విజయం చెయ్యండి. (వెళ్ళిపొమ్మని చేతితో సౌంజ్ఞ చేయును. కరటకశాస్తుల్లు, శిష్యుడు నిష్క్రమించుచుండగా) శాస్తుల్లుగారూ!

(కరటకశాస్తుల్లు తిరిగి ప్రవేశించును)

మధు : మీ పిల్లని మహేశానికి యిస్తారా ?

కర : యిస్తాను.

మధు : అయితే నా కో ఖరారు చేస్తారా ?

కర : చేస్తాను.

మధు : యిక అతణ్ణి నాటకాలాడించీ, ముండలిళ్ళ తిప్పీ చెడగొట్టకండి.

కర : యిటుపైని చెడగొట్టను.... నాకు మాత్రం అక్కర్లేదా ? (పొడుం పీల్చి) నీది గురూపదేశం, మధురవాణీ!

మధు : బ్రాహ్మలలో ఉపదేశం లావూ, ఆచరణ తక్కువా. ఖరారేనా ?

కర : ఖరారే.

మధు : బ్రాహ్మలు కాగానే దేవుడి కంట్లో బుగ్గి పొయ్యలేరు అనుకుంటాను.

కర : చివాట్లకి దిగావేవింటీ!

మధు : చిత్రగుప్తుడికి లంచం యివ్వగలరా ? అతడి దగ్గిరకి మధురవాణిని పంపి, చేసిన పాపాలు అన్నీ తుడుపు పెట్టించటానికి వీలుండదు కాబోలు ?

కర : మధురవాణీ! జరూరు పని వకటుంది. మరచిపోయినాను... వెళ్ళి రేపు మళ్ళీ వస్తాను.

మధు : (నవ్వుచేత కుర్చీమీద విరగబడి, తరవాత నవ్వును సమాళించుకొని) ఒక్క నిమిషం ఆగండి. శిష్యుడా! (శిష్యుడు ప్రవేశించును) యేదీ, నాడు నువ్వు రామచంద్రపురం అగ్రహారంలో రామప్పంతులు యింటి బైటనూ, నేనూ, మీనాక్షమ్మా తలుపు యివతలా అవతలా రణాయించి వుండగా, తెల్లవారుఝావుఁన నిశ్శబ్దంలో ఆకాశవాణిలా పాడిన చిలకపాట పాడి నీ మాఁవగారికి బుద్ధి చెప్పు. తమ మూలంగా ఒక ముసలి బ్రాహ్మడికి ముప్పు వస్తూంటే తమ శరీరం దాచుకుంటున్నారు.

శిష్య : (పాడును) "యెర్రని ముక్కు గలది రామచిలుక! దాని...

మధు : (బెత్తముతో కొట్టబోయినట్టు నటించి) చెప్పిన పని చెయ్యకపోతే జయిలు సిద్ధం.

శిష్య : ("యెన్నాళ్ళు బతికినా" అను పాట పాడును. రెండు చరణములు పాడిన తరవాత)

కర : అతిజరూరు పని వుంది మధురవాణీ, మరో మాటు వస్తాను. (నిష్క్రమించుతూ) తల వాయుగొట్టింది. తెల్లవెంట్రుకలు లావయినాయి. మనస్సు కొంచం మళ్ళించుకుందాం.

7వ స్థలము : సౌజన్యారావు పంతులు యింట్లో కచేరి గది.

(సౌజన్యారావు పంతులు, అగ్ని హెూత్రావధాన్లు ప్రవేశించును.)

సౌజ : ఇక మిమ్ములను జయించిన వాడు లేడు. పిల్లల్ని అమ్ముకోవడం శిష్టాచారం అంటారండీ ?

అగ్ని : ఆహా, మా మేనత్తల్ని అందరినీ కూడా అమ్మారండి. వాళ్ళంతా పునిస్త్రీ చావే చచ్చారు. మా తండ్రి మేనత్తల్ని కూడా అమ్మడవేఁ జరిగిందష యిప్పుడు యీ వెధవ యింగిలీసు చదువు నుంచి ఆ పకీరు వెధవ దాన్ని లేవదీసుకు పోయినాడుగాని, వైధవ్యం అనుభవించిన వాళ్ళంతా పూర్వకాలంలో యెంత ప్రతిష్టగా బతికారు కారు.

సౌజ : పసిపిల్లల్ని కాలం గడిచిన వాళ్ళకి పెళ్ళి చేస్తే వైధవ్యం రాక తప్పుతుందా? నింపాది చేసి కొంచెం యోచించండి.

అగ్ని : ప్రారబ్ధం చాలకపోతే ప్రతి వాళ్ళకి వస్తుందది – చిన్నవాళ్ళ కిచ్చినా, పెద్దవాళ్ళకిచ్చినా రాసిన రాత యెవడైనా తప్పించగలడా ?

సౌజ : మీరు చదువుకున్నవారు గదా, ప్రారబ్ధమని పురుష ప్రయత్నం యే వ్యవహారంలో మానేశారు ? కేసు, "విధికృతం యలా వుంటే అలా అవుతుం"దని వకీల్ని పెట్టడం మానేశారా ? కన్యలను అమ్ముకోవడం శాస్త్రదూష్యం కాదా ? డబ్బుకి లోభించి పిల్లల్ని ముసలివాళ్ళకి కట్టబెట్టి విధికృతం అనడం న్యాయవేఁనా ? శలవియ్యండి.

అగ్ని : యిప్పుడు మీ లౌక్యుల్లో వెయ్యేసి, రెండేసి వేలు వరకట్నాలు పుచ్చుకుంటు న్నారు కారండీ ? గిరీశంగారు చెప్పినట్లు – వాడి పిండం పిల్లులికి పెట్టా – మీలో ఆడపిల్లలకి యిన్ని తులాలు బంగారం పెట్టాలి, యిన్ని తులాలు వెండిపెట్టాలి అని నిర్ణయించుకోవడం లేదా ? అది మాత్రం కాదేం కన్యాశుల్కం ?

సౌజ : అలా చెయ్యడం మంచిదన్నానా యేమిటండి ? "గిరీశం గారు" చెప్పినట్టు అని అన్నారేఁవిటి ?

అగ్ని : ఆ వెధవ పేరు నా యదట చెప్పకండి.

సౌజ : కానీండిగాని, మీ రెండో పిల్లకి తగిన వరుణ్ణి చూసి పెళ్ళి చెయ్యండి. యేం సుఖపడుతుందని ముసలివాళ్ళకి యివ్వడం, శలవియ్యండి.

అగ్ని : అదంతా మీ కెందుకయ్యా ? ఓహో, యిందుకా నన్ను పిలిపించారు ? మీ గృహకృత్యాల వూసుకి. నే నొచ్చానా యేవింటి ? నా గృహకృత్యాల వూసు మీ కెందుకూ ?

సౌజ : తొందరపడకండి అవధాన్లుగారూ, దూరం ఆలోచించండి. మీ కడుపున బుట్టిన పిల్ల యొక్క సౌఖ్యం ఆలోచించి సలహా చెప్పాను గాని, నా స్వలాభం ఆలోచించి చెప్పలేదు గదా, పెద్ద పిల్లకి సంభవించిన అవస్త మీ కళ్ళతో చూడనే చూశారు. యికనైనా వృద్ధులకు పిల్లని కట్టబెట్టడపు ప్రయత్నము చాలించండి.

అగ్ని : నా పిల్లభారం అంతా మీదైనట్టు మాట్లాడుతున్నారేమిటి ? ఆ సంత మీ కెందుకూ ?

సౌజ : నన్ను తమ స్నేహవర్గంలో చేర్చుకోండి. పరాయివాణ్ణిగా భావించకండి. దయచేసి నా సలహా వినండి. మర్యాద గల యింట పుట్టిన బుద్ధిమంతుడగు కుర్రవాణ్ణి చూసి మీ చిన్నపిల్లకి పెళ్ళి చెయ్యండి. యిక పెద్దపిల్లమాట– ఆమెకు వితంతువుల మఠంలో సంఘ సంస్కారసభవారు విద్యాబుద్ధులు చెప్పించుతారు. మీ కడుపున పుట్టినందుకు యెక్కడయినా ఆమె సుఖంగా వుండడం కదా! తండ్రైనవారు కోరవలసినది ? ఆమె తాలూకు కొంత ఆస్తి తమ వద్ద ఉన్నది. మా స్నేహితులున్నూ, స్త్రీ పునర్వివాహ సభ కార్యదక్షులున్నూ అయిన రామయ్యపంతులుగారు నా పేర వ్రాసినారు. ఆ ఆస్తి, చిక్కులు పెట్టక, తాము ఆ పిల్లకి పంపించి వెయ్యడం మంచిది.

అగ్ని : యేవింటీ ముండా యేడుపు సంత! వాడెవడు ? వీడెవడు ? మీ రెవరు? అదెవర్త ? నా పిల్లేవింటి పకీరుముండ ? రేపు యింటికి వెళుతూనే ఘటాశ్రాద్ధం పెట్టేస్తాను.

సౌజ : యిప్పటి ఆగ్రహం మీద మీరు అలా శలవిచ్చినా, నిడివిమీద మీకే కనికరం పుడుతుంది. యిప్పట్లోనే మీరు కనికరిస్తే కొంత మీకు నేను ఉపకారం చెయ్యగలను.

అగ్ని : కనికరం గాకేం. కడుపులో యేడుస్తున్నాను కానూ ? ఆస్తీ, గీస్తీ యిమ్మంటే మాత్రం యిచ్చేవాణ్ణి కాను. ఆ వెధవని పెళ్ళి చేసుకోకుండా యిల్లు జేరితే, యింట్లో బెట్టుకుంటాను, అంతే.

సౌజ : అది మరి జరగదు.

అగ్ని : యిది అంతకన్న జరగదు.

సౌజ : ఆమె ఆస్తి మీరు యిచ్చివెయ్యకపోతే దావా పడుతుంది. నిష్కారణం ఖర్చులు తగులుతవి.

అగ్ని : నేను అగ్రహారపు చెయ్యిని, దావా గీవా అని బెదిరించితే భయపడేవాణ్ణి కాను.

సౌజ : నా మాట విను ఆస్తి యిచ్చివేసి, గిరీశంగారి మీద గ్రంథం చెయ్యడపుఁ ప్రయత్నము మానుకుంటే లుబ్ధావధాన్లుగారు మీమీద తెచ్చిన కేసు తీయించి వేస్తాను. మీ పిల్లమీద దయాదాక్షిణ్యాలు లేకపోతే, స్వలాభవైఁనా ఆలోచించుకోండి.

అగ్ని : వెధవముండని లేవదీసుకుపోయిన పకీరు వెధవ పక్షం మాట్లాడుతావు, యేవిఁ పెద్దమనిషివయ్యా ? నే నా కేసు వొదులుకుంఛాను ? ఆ వెధవకాని కంటికి కనపడితే ? కూనీ చేస్తాను. పెద్ద ప్లీడరు ప్రత్యుత్థానం చేసి పిలిపించాడంటే, కేసుల్లో యేవిఁ సలహా చెబుతాడో అని భ్రమపడ్డాను. వెధవముండలకి పెళ్ళి చెయ్యేడవు పోయీకాలం పట్టుకుందేవిఁ పెద్ద పెద్ద వాళ్ళకి కూడాను ?

సౌజ : లుబ్ధావధాన్లుగారి తరపున మీమీద గ్రంథం నేనే నడిపించవలసి వుంటుంది. మీకు వృథాగా డబ్బు తట్టుబడీ, శిక్షా, క్షూణతా కూడా సంభవిస్తాయి గదా అని యింతదూరం చెప్పాను. మంచికి మీరు మనుషులైనట్టు కనబడదు. గనక నా శాయశక్తులా పనిచేసి మీకు గట్టి శిక్ష అయేటట్టు గ్రంథం నడిపిస్తాను. పిల్లదాని ఆస్తి విషయం దావా కూడా నేనే పడేస్తాను.

అగ్ని : నీ యింట కోడి కాల్చా!

సౌజ : మీరు యేవఁన్నా నాకు కోపం లేదు. యింటికి వెళ్ళి ఆలోచించుకొని, నా సహాయం కావలసి వుంటే తిరిగి రండి.

అగ్ని : (నిష్క్రమించుతూ, తనలో) వీడికి వెర్రి గాబోలు!

(తెర దించవలెను.)

కన్యాశుల్కం

సప్తమాంకము

1వ స్థలము : విశాఖపట్టణంలో వీధి

(బైరాగి, వెనుక పదిమంది శూద్రులు ప్రవేశింతురు)

రామన్న : యెక్కణ్ణించి యిజయం సేస్తున్నారు గురూ ?

బైరా : కాశీ నుంచిరా.

రామ : ఎన్నాళ్ళయింది గురూ ?

బైరా : పాతఃకాల గంగను సేవించి బయల్దేరాముురా.

రామ : యింత యేగిరం యెలా గొచ్చినారు, గురూ ?

బైరా : పవనం బంధించి వాయువేగం మీద వచ్చాముురా.

బుచ్చన్న : యోగులకి సిద్ధులుండవురా ? యీయనేఁరా, ఉప్పాకలోనూ!, సింవాచలం లోనూ మొన్న సివరాత్రికి వొక్కమాలే అగుపడ్డారు.

లక్ష్మన్న : తెల్లోడు. తీగటపా యేసినాడు కాడ్రా ? నిమేటికి వుత్తరం దేశదేశానికి యెల్లదా.

బైరా : పామరులు! పామరులు!

రామ : వూరుకొస్సి – నీ కేటెరిక – యెర్రినాకొడకా!

బైరా : ఈ వూళ్ళో తీర్థపురాళ్ళ రేవున రెండుమైళ్ళలో సబురున ధర్మరాజు వారు ప్రతిష్ఠ చేసిన శివాలయం, కంచు దేవాలయం ఒకటి ఉన్నది. రాత్రి ఆ దేవుణ్ణి సేవించుకుని, రేపు రామేశ్వరం వెళ్ళిపోతాం. సదావృత్తి యక్కడ దొరుకుతుంది ?

రామ : ఈ ఊళ్ళో మఠం లేదు గురూ! మేవంతుండగ తమకి లోప మేటి గురూ! కాశీ కబుర్లేటి గురూ ?

బైరా : నాలుగురోజుల క్రిందట విశ్వేశ్వరుడి కోవిలలో ఒక బంగారపు రేకు ఆకాశం మీంచి పడ్డది. దానిమీద వ్రాసిన లిపి బ్రాహ్మలకి ఎవరికీ బోధ

అయిందికాదు. మేం చిత్తగించాం. సిద్ధుల భాషని దానిమీద బంగారం చేసే యోగం వకటి, కలకాలం బతికే యోగం వకటి వ్రాసి వున్నాయి.

రామ : యేవాఁచ్ఛర్రెం! గురూ, భోజనం యేటారగిస్తారు!

బైరా : పాలూ పంచదారా, అరటిఫలములూ, ఈ ప్రకారం ఒక పక్షం ఫలహారం చేస్తాము. మరి పదిహేను రోజులు వాయుభక్షణ చేస్తాము.

రామ : ఒక్క మిట్టకాయలో పలారం జాగర్త సేస్తాం గురూ, మా రాంమందిరానికి దయసెయ్యాలి.

బైరా : పద... ఈ వూరి వింత లేవిఁటి ?

లక్ష్మ : యేఁటీ లేవ్... రామశంద్రపురం అగ్గురోరంలో ముసల బాపణోడు ఆల్ని సంపేసినాట్ట ఆడికి, దొంగ సాచ్చికం పలికి నోళ్ళకీ, తాసీలుగోరికీ సిచ్చైపోతాదిట.

బైరా : ఈ వూరు పాపంతో నిండివున్నట్టు కనబడుతంది. ఈ వూళ్ళో మేము నిలవము.

రామ : లచ్చువుఁడు వెర్రోడు గురూఁ ఆడిమాట నమ్మకండి. మీరెళ్ళిపోతే మాలాటోళ్ళు తరించడం యలాగ్గురూ ? ఆళ్ళీ వూరోళ్ళు కారు.

బుచ్చ : ఆ ఊరి దుకాణాదారుగారు అరుగో వొస్తున్నారు.

బైరా : ఈ వూళ్ళో తాగడం లావుగా వున్నట్టు కనబడుతుంది. మేము తాగుబోతులతో మాట్లాడం, ఆ దుకాణాదారు వచ్చేలోగా ఈ సందులోకి వెళ్ళిపోదాం రండి.

(దుకాణాదారు పరుగున వచ్చి కలిసి బైరాగి మొలలో చేయివేసి పట్టుకొనును)

దుకా : రూపాయలు కక్కి మరీ కదలాలి.

బైరా : ఏవిఁటీ నాటకం! వీడు తప్పతాగి పేలుతున్నాడు. నేను మొదటే చెప్పలేదా యీ ఊరి సంగతి ? అంతా పాపంతో నిండి వుంది. వేమన ఏవఁన్నాడు? "తాగుబోతు తోడ తగదెందు నేస్తంబు."

రామ : (దుకాణదారుతో) భాయీ! మీకేటి, మతోయిందా ? గురువు గోరికి దణ్ణవెట్టి లెంప లోయించుకోండి.

దుకా : గురువూ లేదు, గట్రా లేదు. వూరుకోస్సి, ఈ డెక్కడ గురువు ? నా దుకాణంలో సారా అంతా చెడతాగి డబ్బియ్యకుండా ఎగేసినాడు.

రామ : మీకు మతోయిందా భాయి ? ఆరేటి, మీ దుకాణంలో తాగడవేఁటి ? కాశీనించి యిప్పుడే వచ్చినారు గదా ?

దుకా : ఆకాశం బొక్క చేసుకుని వొచ్చాడు కాదూ ? (బైరాగితో) డబ్బిచ్చి మరీ కదులు.

బైరా : మావంటి సాధువులతో నీకు వాదెందుకు అబ్బీ ? యవర్ని చూసి మేవఁనుకున్నావో! మమ్మల్ని పోలిన దాసరి వాడొకడు. బైరాగి వేషం వేసుకుని ఈ దేశంలో తిరుగుతున్నాడు. కిందటి మాటు మేం దేశ సంచారం చేసినప్పుడు చూచి చివాట్లు పెట్టాం. నీకు డబ్బు మీద అంత కాపీనం వుంటే తులం రాగి తెచ్చుకో, బంగారం చేసి ఇస్తాం. సంగోరు ధర్మ ఖర్చు చేసి, సంగోరు తిను. లేకుంటే తల పగిలి పోతుంది.

రామ : యేం యెర్రిముండా పని చేసినారు భాయీ! బంగారం చేసే సిద్ధులికి డబ్బు లచ్చంటోయి ? ఆరి కాళ్లమీద పడి అలక తీరుసుకొండి.

దుకా : వుండోస్సి... యేడిసినట్టే వుంది. నీ సొమ్మేం పోయింది ?

(హెడ్ కనిష్టీబు ప్రవేశించును).

హెడ్ : యేమండోయి గురోజీ! మీరు దొరకడం నాకు దేవుఁడు దొరికినట్టయింది. ఇక బతికాను. మీతో కొన్ని జరూరు సంగతులు మాట్లాడాలి రండి.

బైరా : భాయీ, మీరు వెనక్కుండండి. (దుకాణదారు తప్ప తక్కినవారు దూరముగా వెళ్ళుదురు)

దుకా : నా డబ్బిచ్చి మరీ మాట్లాడండి.

బైరా : నలుగురిలోనూ మర్యాద తియ్యడం ధర్మవేఁనా తమ్ముడా ? యోగ రహస్యాలు పామరులు దగ్గిరా వెల్లడి చెయ్యడం ?

దుకా : డబ్బు యెగ్గెయ్యడపు యోగం నా దగ్గిర పారదు. రహస్యవేఁటి ? ఆ విద్యకి అంతా గురువులే ?

బైరా : వెర్రి నరుడా! బైరాగివాళ్ళకి మాకు డబ్బుమీద తమి వుంటుందటోయి? ఒకళ్ళకి యిచ్చేదీ కానం, పుచ్చుకొన్నదీ కానం.

హెడ్ : భాయీ! నీ రూపాయలు నేనిస్తాను. తెలివిమాలిన మాటలాడకు. గురువు గారికి కళ్ళు మొయ్యా ఆగ్రహం వస్తే మనం మండిపోతాం. మీరకుండా వెళ్ళండి. (బైరాగితో) గురోజీ! కూనికేసు పీకల మీద కొచ్చింది. కేసూ, యే బుగ్గీ లేనిదే ఆ రాత్రి నాలుగురాళ్ళు తడువుఁకుందావఁని మనం ఆ ముసలాణ్ణి అల్లరి పెట్టామా! ఆ తరువాత తాసిల్దారొచ్చి "హాత్ హూత్" అని బెదిరించి పదిరాళ్ళు లాగాడు. తన తాలూకు కంటె పెగిలింది కాదని రావఁప్పంతులుగాడు యినస్పెక్టరికీ, పోలీసు సూపరెంటుకీ అర్జీలు కొట్టాడు. నిజంగా కూనీ కేసు జరిగి వుండగా, మేవు కామాపు చేశామని తాసిల్దారు మీదా, నా మీదా యిప్పుడు పితూరీ చేస్తున్నారు.

బైరా : మే వుఁండగా, మీకేం భయం, భాయి ?

హెడ్ : అందుకే గదా, నా పాలిటి దేవుఁళ్ళా మీరు దొరికారన్నాను.

బైరా : మీ శత్రువులకు వాగ్బంధం చేస్తాను. వాళ్ళ పేర్లు వ్రాసి యివ్వండి. యినస్పెక్టరుకి మీ మీద యిష్టవఁని చెప్పేవారే ?

హెడ్ : ఈ పెద్ద వుద్యోగస్థులకి దయలూ, దాక్షిణ్యాలు యేవిఁటి గురూ! వాళ్ళకి యంత మేపినా, వాళ్ళకి కారక్టు వొస్తుందని గాని, ప్రమోషను వొస్తుందని గాని ఆశ పుట్టినప్పుడు తెగని కత్తితో పీకలు తెగగోస్తారు. మా యినస్పెక్టర్‌కి సూపరెంటుపని కావాలని ఆశుంది' తాసిల్దారికీ, వాడికీ బలవద్విరోధం వుంది. ఆ విరోధం మధ్య నన్ను కొట్టేస్తూంది.

బైరా : చూస్తూ వుండండి. రేపటి నుంచి పతకం తిరిగి పోతుంది.

హెడ్ : మీ దయ, గురూ! సౌజన్యారావు పంతులుగారని ఓ గొప్ప వకీలు గారు ఉన్నారు. ఆయన నాకు చాలా సాయం చేస్తున్నారు. కేసు తేలిపోయే సాధనం ఆయన వొకటి చెప్పారుగాని, అది కుదరక తల్లడిల్లుతున్నాం.

బైరా : యేమిటండి ఆ సాధనం ?

హెడ్ : పరారీ అయిపోయిన ఆ పిల్లదాని తండ్రి – గుంటూరు శాస్త్రుల్లని ఒకడు వున్నాడు. అతగాడు దొరికితే, కేసు పోతుంది. వాడు యక్కడా కనపడ్డు.

బైరా : యిదెంత పని ? రాత్రి అంజనం వేసి ఒక్క క్షణంలో కన్నుకుంటాను.

హెడ్ : అలా రక్షించు గురూ! ఆ కుఱ్ఱాడు - అనగా ఆ "చిన్నది యిప్పుడు యెక్కడుందో కనుక్కోగలరూ, గురూ ?

భైరా : అదీ అంజనంలోనే కనబడుతుంది.

హెడ్ : అది మొగాడయినా, ఆడదయినా కూడా కనపడుతుందా గురూ ?

భైరా : ఆడది మొగాడెలా అవుతుంది భాయీ ?

హెడ్ : (తనలో) చెబితే యేం ప్రమాదవో, (పైకి) ఈ చిక్కుల్నించి మతి పోతూంది గురూ! దయచేయండి, యింటికెళదాం.

భైరా : యీ శిష్యులకి కొంచం జ్ఞానోపదేశం చేసి మరీ వస్తాను. మీరు ముందు నడవండి.

హెడ్ : యీ కార్యం అయిందాకా మీ పాదాలు వొదలను- కార్యమైంతే తమరు హరిద్వారంలో కట్టిస్తూన్న మఠానికి నూటపదహార్లు దాఖలు చేస్తాను.

(అందరు నిష్క్రమింతురు.)

2వ స్థలము : డిప్టీకలక్టరు కచేరీ.

(డిప్టీకలక్టరు, వకీళ్ళు, బంట్రోతు మొదలైనవారు ప్రవేశింతురు.)

భీమారావు : నాకు మునసబు కోర్టులో కేసున్నది. వొక అర్జీ దాఖలు చేసి శలవు పుచ్చుకుంటాను.

కలె : కోర్టువారికి అవకాశం అయ్యేవరకూ వుండలేని వకీళ్ళు కేసు యెందుకు దాఖలు చేయవలె ? ఇది చెప్పినట్టల్లా వచ్చే కోర్టనా మీ అభిప్రాయం ?

భీమా : చిత్తం. చిత్తం. తమ ప్రిడిశేసర్లు అలాగు గడుపుతూ వచ్చేవారు.

కలె : ఆఫీస్‌పని చూచుకుని పిల్చేవరకూ వుండండి.

అగ్నిహోత్రావధాన్లు : (రామప్పంతులుతో) యేవండోయ్, మన కొత్త వకీల్ని కోప్పడుతున్నారే ?

రామ : యీ అధికార్ల నైజం యేమిటంటే, యెవళ్ళ మీద దయ వుండి యెవళ్ళపక్షం కేస్ చెయ్యాలంటే వాళ్ళని కరవొచ్చినట్టు కనపడతారు. మీరు కోరట్ల సంగతంతా తెలుసునంటారే ? యిదేనా మీ అనుభవం ?

అగ్ని : (గట్టిగా) అవునవు న్నాకు తెలుసును.

కలె : యెవ రా మాట్లాడుతున్న మనిషి ?

నాయుడు : (లేచి) తక్‌షీర్ మాఫ్ చేస్తే మనవి చేస్తాను. యీయన కృష్ణారాయపురం అగ్రహారం కాపురస్తుడు. నులక అగ్నిహోత్రావధాన్లుగారు. మహా (అ) యోగ్యమైన బ్రాహ్మడు. జటాంతస్వాధ్యాయి. యీయనే లుబ్ధావధాన్లుగారికి తన కుమార్తెను పద్దెనిమిది వందల రూపాయలకు కన్యాదానం చేయడానికి బేరమాడుకుని, కాబోయే అల్లుడికి దేహశుద్ధి చేశారు. అందుకే యీ మధ్య లుబ్ధావధాన్లుగారు యేలినవారి కోర్టులో ఛార్జీ దాఖలు చేశారు. అందులో ముద్దాయి యీ మహానుభావుడే! మల్లవరం సహస్రమాసజీవైన వక బ్రాహ్మణ శ్రేష్టుడుంటే, ఆయనకు తన పెద్ద కుమార్తెను కన్యాదానం చేసి, రెండు పిల్లికూనలు స్వీకరించేటప్పటికి పెళ్ళిలోనే ఆ బ్రాహ్మడి పుణ్యం అంతా మూడి పరంపదం వేంచేశాడు. ఆ పిల్లదాని తరఫున భూముల కొరకు దావా తెచ్చారు. వీరు తమ వంటి గవర్నమెంట్ ఆఫీసర్లకి తరచుగా పని కలుగచేసి ప్లీడర్లని పోషిస్తూ వుంటారు. వీరి యోగ్యత లేమి, వీరి దయాంతఃకరణ లేమి, వీరి సరసత లేమి మరి యెన్నడమునకు శేషుడికైనా అలవికాదు. వారి తరఫున కేసు దాఖలు చెయ్యడం కోసమే భీమారావు పంతులుగారు కోర్టుకు దయచేశారు. (విరసముగా నవ్వి కూరుచొనును.)

కలె : బలె శబాష్! (గుమస్తాతో) ఏదీ, భీమారావు పంతులుగార్ని ఫిర్యాదు అర్జీ దాఖలు చేయమను.

(గుమస్తా పుచ్చుకొని దాఖలు చేయును.)

కలె : (కాగిత మందుచుకొని) యేమిటయ్యా, కేసు స్వభావం ?

భీమా : చిత్తం. ఈయన వెధవ కుమార్తెని ఈయన కొమారుడికి చదువు చెప్పే గిరీశం అనే ఆయన అలంకారాలూ, ఆస్తితో కూడా లేవతీసుకు వెళ్ళిపోయినాడు.

అగ్ని : దస్తావేజులూ, కోర్టు కాయితాలూ కూడా నండి.

కలె : యేమిటి ? అ, హా, హా, హా, హా, (నవ్వుచు బూట్సు నేలపై తట్టును.) బలే శబాష్! (అర్జీ చూచుకొని) యిన్నాళ్ళేమి చేస్తున్నారు ?

భీమా : తహస్సీల్దారిగారి దగ్గర నేరం జరిగిన మూడోరోజునే మునసబు కోర్టు వకీలు వెంకట్రావు పంతులుగారు చార్జీ దాఖలు చేస్తే ఆ తహస్సీలుదారు గారు కేసు స్వభావం యేమిటని అడిగినారు. ఎబ్‌జక్షన్ అని వెంకట్రావు పంతులుగారు చెప్పేసరికి ఇంగ్లీషు రాకపోవడం చాత, తహస్సిల్దారుగారు ఆ మాట యెప్పుడూ వినలేదని చెప్పారు. తరవాత కేస్ స్వభావం తెలుగు చేస్తే – ఈలాటి నేరం మా జూరిస్‌డిక్షన్‌లో జరగదు. తోవలో రోడ్డుమీద ఏ తాలూకా సరిహద్దులో యెత్తుకు పోయినాడో అని అర్జీ దాఖలు చేసుకున్నారు కారు. లుబ్ధావధాన్లుగారి కూనీకేసు కామాప్ చేసిన తహస్సీల్దారుగారే ఈయనండి.

నాయు : ఇంగిలీసు రాకపోతే నేమండి ? తహస్సీల్దారు యెంత ప్రాజ్ఞులు! పూర్వపు యూరోపియన్ అధికార్లని ఎంతమందిని మెప్పించారు! ఆయన లుబ్ధావధానులుగారి కేసు కామాప్ చేశారని భీమారావు పంతులుగారు అంటున్నారు. యింకా యిన్క్వైరీ అవుతూన్న కేసులో అలా అన్నందుకు యీయనపైని తహస్సీల్దారుగారు పరువు నష్టం ఛార్జీ తేవడమునకు వీలు వున్నది.

కలె : (భీమారావువైపు జూచి) పిల్లకు పదహారు సంవత్సరములకు లోపు యీడని రుజు వున్నదా ?

భీమా : జాతకం వుందండి.

నాయు : కోర్టువారు ఆ జాతకం దాఖలు చేసుకోవాలి.

భీమా : ఈ కేసులో ఆయన మాట్లాడుతూ వుంటే నే ఎంత మాత్రం వొప్పేది లేదు.

నాయు : ఈ కేసులో నాక్కూడా వకాల్తినామా వుందండి. (దాఖలు చేయును.)

భీమా : (అగ్నిహెూత్రావధాన్లుతో) ఏమయ్యా, ఈయన క్కూడా వకాల్తీ యిచ్చావయ్యా!

అగ్ని : మొదటా, రామప్పంతులు ఈయన కిప్పించారు.

భీమా : అయితే యేడువు.

(అగ్నిహెూత్రావధానులు తెల్లబోయి చూచును.)

కలె : యేదీ, జాతకం దాఖలు చెయ్యండి.

(భీమారావు పంతులు దాఖలు చేయును)

నాయు : కోర్టువారితో వక సంగతి మనవి చేసుకొంటాను. ఈ జాతకం విశ్వామిత్రుడంత యోగ్యుడైన బ్రాహ్మడిచేత తయారు చెయ్యబడ్డది. అదుగో! ఆ మూల నిలబడ్డ రామప్పంతులుగారికి ఈ జాతకంలో మంచి ప్రవేశం ఉందండి.

భీమా : నేను పేస్‌డ్ వకీల్ని, కేసు హీరింగు నేనే చేయవలెను గాని, నాయుడుగారు చేస్తే నేనెంత మాత్రం వొప్పేది లేదు.

నాయు : స్మాలెట్ దొరగారి దగ్గిర్నుంచీ ఏజన్సీ కోర్టులో వకాల్తీ చేస్తున్నాను. డబ్బుచ్చుకున్నందుకు నా పార్టీ తరఫున నాలుగు మాటలు చెప్పి తీరుతాను గాని యింగిలీష్ చదువుకున్న కొందరు వకీళ్ళలాగ నోటంట మాత్రాకుండా కొయ్యలాగ నిలబడనండి.

కలె : (అగ్నిహెూత్రావధాన్లు వైపు చూచి) మీ కుమార్తె ఏ సంవత్సరమందు పుట్టిందయ్యా ?

అగ్ని : ఆంగీరస.

కలె : జాతకంలో భావ వుందే ? బ్రాహ్మణ్యం పరువంతా తీసేస్తిరే ? గడ్డి తిని పిల్లనమ్ముకున్నారు. సరే కాని, యిలాటి ఫోర్జరీలు కూడా చేయిస్తావూ ? బ్రాహ్మల్లో ఉన్నంత ఖంగాళీ, మాలకూడూ మరెక్కడా లేదు. నీ దుర్మార్గత వల్ల నీ కుమార్తెను ఈ అవస్థలోకి తెచ్చి, మళ్ళీ ఎబ్‌జక్షన్ కేసు కూడానా! నీ పొట్ట కరగించేస్తా నుండు. (గుమాస్తాతో) కేసులో నోటీసులు చెయ్యి.

గుమా : (చార్జి కాగితం జూచి) యిందులో ముద్దాయి యింటి పేరూ, సాకీనూ లేదండి.

నాయు : (లేచి) ఈ అర్జీ వల్లకాట్లో రామనాధాయ వ్యవహారం లాగుంది. ఇంగ్లీషు వకీలు దాఖలు చేసే కాగితాలు ఈ రీతినే ఉంటాయండి.

భీమా : (గుమాస్తాతో రహస్యంగా) తరవాయీలు నింపించలేదుటయ్యా ? (పైకి) యిలా నాయుడుగారు నన్ను తూలనాడుతూంటే కోర్టువారు ఊరుకోవడం న్యాయం కాదు.

కలె : నాయుడుగారు మిమ్మల్నేమీ అన్లేదే ?

భీమా : (తనలో) యిక్కడికి నేను రావడం బుద్ధిపొరపాటు.

క్లార్కు : (భీమారావు పంతులుతో) ఇంటి పేరూ, సాకీనూ యేమిటండీ ?

భీమా : (అగ్నిహోత్రావధాన్లుతో) ఏమిటయ్యా ?

అగ్ని : ఆయన పేరు గిరీశం, మరంత కంటె నాకు తెలియదు.

కలె : శాబాష్! బాగా వుంది! అవధాన్లుగారి కొమార్తెని యెవడో తీసుకు పోయినాడు కనక వాడి వూరూ, పేరూ యెరిగినవాళ్ళు తెలియ చెయ్యవల సిందని దండోరా కొట్టించి. గేజట్లో వేయించండి. పోలీసు వారికి ఎందుకు నోటీసివ్వలేదూ ? సాకీనూ మొదలైనవి లేనిదీ కేసు యడ్మిట్ చేయడానికి వీలులేదు. టిఫిన్‌కి వేళయింది. లేదాము (లేచి వెళ్ళిపోవును)

అగ్ని : (భీమారావు పంతులుతో) ఏమండోయ్ కేసు అడ్డంగా తిరిగిందే ?

(భీమారావు పంతులు మాట్లాడడు.)

అగ్ని : యేమండోయి, మీతోటి మాట్లాడుతున్నాను.

భీమా : ఇచ్చిన ఫీజుకు పనైపోయింది; మళ్ళీ ఫీజిస్తేకాని మాట్లాడేది లేదు.

అగ్ని : యేం పనైంది ఆఘోరం పని ? కలక్టరు చివాట్లు పెడుతూంటే ముంగిలా మాట్లాడక వూరుకున్నావు.

భీమా : బంట్రోత్! ఇతన్ని నా దగ్గిరకు రాకుండా గెంటెయ్.

అగ్ని : ఓహో, బాగుంది వ్యవహారం! రామప్పంతులేడి ?

నాయు : (మెల్లగా వెనకనుండి వచ్చి) ఫోర్జరీ మాట రాగానే సన్న సన్నంగా జారారు. యీపాటికి వారి ఊరికి సగం తోవలో వుంటారు.

అగ్ని : అయ్యో, కొంప తీశాడే!

నాయు : ఇంగ్లీషు వకీలు సరదా తీరిందా ? ఫోర్జరీకి తమక్కూడా మఠప్రవేశం అవుతుంది.

అగ్ని : అయ్యో! నీ యింట కోడికాల్చా!

నాయు : రోజూ కాలుస్తూనే వుంటారు. (తెర దించవలెను).

3వ స్థలము : సౌజన్యారావు పంతులు కచేరి గది.

(సౌజన్యారావు పంతులు, పోలిశెట్టి ప్రవేశింతురు)

సౌజ : చూశారా శెట్టిగారూ, యిప్పటి రోజుల్లో దేవ బ్రాహ్మణభక్తి కోమట్లలోనే వున్నది. లుబ్ధావధాన్లుగారు బ్రాహ్మలు, వృద్ధులున్నూ. ఆయనను కాపాడితే మీకు చాలా సుకృతం వుంటుంది.

పోలి : బాబూ, తమ శలవు కబ్బెంతరవేఁటి ?

సౌజ : చూసారా. మీరు సాక్ష్యం చెప్పి ఆయన్ని ఈ ఆపదలోంచి తప్పించకపోతే, నిజం దాచినందువల్ల ఆయనకి యేమి ప్రమాదం వచ్చినా, ఆ పాపం మిమ్మల్ని చుట్టుకుంటుంది.

పోలి : అబ్బెంతరవేఁటి బాబూ ?

సౌజ : నిజంగా కూనీ జరగలేదని మీ నమ్మకవేఁ కదూ ?

పోలి : అబ్బెంతరవేఁటి బాబూ ?

సౌజ : ఆ పిల్ల గోడ దాటి పారిపోవడం మీరు చూశారు గదూ ?

పోలి : అబ్బెంతరవేఁటి బాబూ ?

సౌజ : మీరు అప్పుడు గుడ్డె మీదికి బాహ్యానికి వెళ్ళి వున్నారు.

పోలి : అబ్బెంతరవేఁటి బాబూ ?

సౌజ : మీరు బాహ్యానికి వెళ్ళినప్పుడు సహాయానికి మీ నౌకరును కూడా తీసుకు వెళ్ళారు ?

పోలి : అబ్బెంతరవేఁటి బాబూ ?

సౌజ : (కలం కాగితం తీసి) యీ సంగతులే వ్రాస్తాను చెప్పండి.

పోలి : యేటి బాబూ ?

సౌజ : మీరు చెప్పబోయే సాక్ష్యానికి స్టేటుమెంటు కట్టుగుంటాను, జరిగినది అంతా చెప్పండి. వ్రాస్తాను.

పోలి : మా యింటోళ్ళకి ఉడ్డోలవైన జబ్బుగా వుందని కబురెట్టారు బాబూ, నాకు సేతులు కాళ్ళు ఆడకుండున్నాయి. బండీ కుదుర్చుకొచ్చాను శలవిప్పించండి. యీ సాచ్చీకాల్లో తిరిగితే పిల్లా పేకా బతుకుతారా బాబూ!

సౌజ : యింతసేపూ చెప్పారు కారేమి ? రుగ్మత నిజమే ఐతే చాలా విచారమైన సంగతి. మీకు సాక్ష్యం యెలాగా తప్పదు. చెప్పే మాటలు ముందు వ్రాసుకుంటే మంచిది. లేకుంటే బోనెక్కిన తరవాత తత్తరపడి పోతారు. పది నిమిషములు పట్టదు. చెప్పండి వ్రాస్తాను.

పోలి : సాచ్చీకం తప్పదా బాబూ ?

సౌజ : యలా తప్పుతుందీ! నిజం తెలిసినవారు సాక్ష్యం పలకకపోతే మరి యెవరు పలుకుతారు ?

పోలి : బాబూ, తమరు పెద్ద వొకీళ్యూ, కోవఁటోడి మాటని కొట్టెయక యింటారా ?

సౌజ : వినకేమి ?

పోలి : నిజవేఁటి బాబూ ? అబద్ధవేఁటి బాబూ ? నేను చూసి నిజవాఁ చెప్పి నాను ? గుడ్డెమీదికేటి, నిశిరాత్రివేళ నేను బైటకెల్ల వేఁటి ? జువ్విచెట్టు మీద పిశాచం అమాంతంగా సంపేసిపోదా బాబూ ? యేటిబాబూ, సాచ్చీకానికి ముండపోలిశెట్టి పోలిశెట్టి సెప్పాలా సాచ్చికం బాబూ ? తమంటి అధికార్లని చూస్తే, ప్రాణం యెగిరిపోతుంది గదా ? తమరు తలిస్తే సాచ్చికాని క్కొదవా ? బాపనోళ్ళు నచ్చాపనచ్చులు, కొంచెం సెయి తడిజేస్తే సాచ్చీకం చెప్పేసి పోతారు బాబూ.

సౌజ : ఈపాటికి చాలించండి. దొంగ సాక్ష్యాలు నా దగ్గిర పనికిరావు. నిజం తెలిసిన సాక్షులే నాకు కావాలి.

పోలి : ఆపాటిమాట యెవరు సెప్పినారుకారు బాబూ, నిజం నాకేమీ తెల్దు, యే దేఁవుడు నెత్తికొట్టమంటే ఆ దేఁవుడు నెత్తికొడతాను బాబూ!

సౌజ : మరి యెరుగుదువఁని యెందుకు చెప్పారూ ?

పోలి : బాబూ! సెప్పనంటే కనిష్టీబోళ్ళు ఊరుకుంటారా ?

సౌజ : యిప్పుడు మాత్రం ఊరుకుంటారా ?

పోలి : చెప్పితే! యీన్నిసిపికటరు పీక పిసికెయ్యు బాబూ!

సౌజ : చెప్పకపోతే హెడ్డు కనిష్టీబు పీక పిసకడా ?

పోలి : అధికార్లేటి సెయ్యంటే, మాలాటోళ్ళు అదల్లా సెయ్యాలి గదా బాబూ – లేకుంటే పీక్కురి గదా! "పోలిశెట్టీ, సాచ్చీకం సెప్పాలి" అని హెడ్డుగారంటే,

"సిత్తం బాబూ" అనాలి. "పోలిశెట్టీ, కబడదారు, సాచ్చీకం సెప్పితే సంపేస్తాను" అని యిన్నీసిపికటరుగారు అంటే "సిత్తం బాబూ" అనాలి. "హెడ్డుగారిని బదిలీ చేస్తా. మరి భయపడకు" అంటే "సిత్తం బాబూ" అనాలి. ఆ రాత్రి నే నూళ్ళో వున్నానా బాబూ ? లింగోరం సంతకి పోలేదా ?

సౌజ : మీ సాక్ష్యాన్ని నమ్ముకుని, లుబ్ధావధాన్లుగారికి నేను ధైర్యం చెప్పానే ?

పోలి : గొప్పధికార్లు! తమరు తలిస్తే, ఆరికి నోటేటి బాబూ! కోవింటాడి మాట కొట్టెయ్యండి బాబూ, తమ వంటోరు తలిస్తే, బాపన సాచ్చీకాలు నచ్చాపనచ్చులు!

సౌజ : మీ యోగ్యత తెలిసింది. చాలు, ఈపాటి కెళ్ళండి.

పోలి : (లేచి నిలబడి) కోపవాఁబాబూ! మేం బతగ్గలవాఁ ? ఆవు నెయ్యి బాబూ – గుమగుమలాడేది... ప్రతో'రం పంపించుకుందునా బాబూ ?

సౌజ : మీ యినస్పెక్టరుకి పంపండి.

పోలి : (వెళ్ళిపోతూ) ఆరంతోరు ఆరూ, తమంతోరు తమరూ, మాకిద్ద రొహాటి గాదా ?

సౌజ : చాలును వెళ్ళండి. వెళ్ళండి.

పోలి : తమ క్కోపవొఁస్తే బతగ్గలఁవా బాబూ! (గుమ్మం దిగుతూ) బతిగా'న్రా దేవుఁడా పెందరకాళే యింటికి పోయి వెంకటేశ్వర్లుకి అరశటాకు నెయ్యి దివ్వెలిగిస్తాను. (నిష్క్రమించును.)

4వ స్థలము : వీథి

(అగ్నిహోత్రావధానులు, నాయుడు ప్రవేశింతురు)

అగ్ని : అషైతే కేసు మానుకొమ్మంఛారూ ?

నాయు : లేకపోతే మీకు చాలా వుపద్రవం సంభవిస్తుంది. ఈ యింగిలీసు వకీలు అంతా పాడు చేశాడు.

అగ్ని : అయితే రామప్పంతులు ఉడాయించేసినట్టేనా ?

నాయు : అందుకు సందేహవేవింటి ?

అగ్ని : నా కడియం పట్టుకుపోయి తాకట్టు పెట్టాడు.

నాయు : దానికి నీళ్ళధారే.

అగ్ని : అయ్యో! ఆ కడియం మా తాత నాటిది. మీరు మొన్న దిడ్డీ తోవంట వొచ్చారే, ఆ సొందాని యింట్లో తాకట్టు పెట్టాడు!

నాయు : రామ! రామ! ఆ సరుకు దాని దగ్గర వుంచలేదు. మీది మిక్కిలి దాని తాలూకు కంటె ఒకటి వాడే తీసుకుపోయి యక్కడో తాకట్టు పెట్టాడు. ఆ తాగుబోతు మీకెలా దొరికాడు!

అగ్ని : రావఁప్పంతులు తాగుతాడా ?

నాయు : మరి కడియం, కంటె కూడా తాగేశాడు కాడా ?

అగ్ని : వీడి సిగతరగా!

నాయు : అవునుగాని, మీ మీద ఫోర్జరీ కేసు ఖణాయించకుండా డిప్టీకలక్టరుగారితో సిఫార్సు చేశాను. గదా, నా కేమిస్తారు ?

అగ్ని : యేవిఁచ్చేది ? నాభి. కొనుక్కోవడానికి దమ్మిడీ అయినా నా దగ్గిర లేదు. వూరికి చేరితేగాని డబ్బు పెగల్దు.

నాయు : పోనియ్యండి. ఒక ప్రామిసరీ నోటు రాయండి. రూపాయలు యిప్పిస్తాను.

అగ్ని : నా ప్రాణం పోతే నోటు రాయను. అప్పుపత్రం రాయనని మా తండ్రి చచ్చిపోయేటప్పుడు నాచేత ప్రమాణం చేయించాడు.

నాయు : అయితే మీతో కూడా మీ ఊరు వస్తాను, వక బండెడు ధాన్యం యివ్వండి.

అగ్ని : డబ్బూ, దినుస్సూ కూడా వొకీళ్ళ నెత్తిన కొడితే యేటి కేడాదీ బతకడం యలాగు ? రెండు పుట్లు మిరపకాయలిస్తాను.

నాయు : అదైనా యెంతకాదు. ఖరారేనా ?

అగ్ని : అగ్నిహొూత్రావధాన్లు అన్నమాట తప్పుతాడా ? లుబ్ధావధానులు నన్ను ఫకీర్ని చేశాడు. వాడికి శిక్ష కాదేం ?

నాయు : అవునుగాని, సౌజన్యారావు పంతులుగారు అతడికి సాయం చేస్తున్నారు. అధికార్లంతా ఆ పంతులుమాట వింటారు.

అగ్ని : ఆ పంతులు అవధాన్లు కూతుర్ని పెళ్ళాడతాడా యేవిఁషి ?

నాయు : ఆయన ప్రారబ్ధం, దాన్ని పెళ్ళాడతారా ?

అగ్ని : మరి యెందుకు లుబ్ధావధాన్లు మీద పడి యేడుస్తాడు ?

నాయు : సౌజన్యారావు పంతులుగారు మహాదొడ్డవారు. కోట్లలో యెన్నవలసిన మనుషులు. ఆపదలో వున్న యెవరికైనా ఆయన ఉపకారం చెయ్యవలసిన వారే!

అగ్ని : ఆషైతే వెధవముండని పెళ్ళాడిన చవాటు పీనుగును వెనకేసుకుని, నా పీక యెందుకు నొక్కుచున్నాడు ? అడుగో ఆ గాడిద కొడుకు!

(గిరీశం తొందరగా ప్రవేశించును. అగ్నిహోత్రావధాన్లు పక్కనుంచి గిరీశం మీద పడును. గిరీశం తప్పించుకుని కిందికి జారి, అగ్నిహోత్రావ ధాన్లు కాళ్ళుబట్టి లాగి "మావఁగారికి నమస్కారం" అని పరుగుచ్చు కొనును. అగ్నిహోత్రావధాన్లు కిందబడును.)

నాయు : అల్లుడుగారా యేవిఁటండి ? (లేవదీసి వొళ్ళు దులుపును.)

అగ్ని : వీడి శ్రాద్ధం చెట్టుకిందబెట్టా! యేడీ ? వెధవని చంపేస్తాను.

నాయు : అల్లుణ్ణి హతవారిస్తే కూతురు డబ్బిల్ వెధవౌతుంది. శాంతించండి.

అగ్ని : నీ యింట కోడికాల్చా!

వాయు : అమోఘాశ్వీర్వచనము! పదండి.

5వ స్థలము : లుబ్ధావధాన్లు బస.

లుబ్ధా : రామనామతారకం! భక్తి ముక్తి దాయకం!

(గిరీశం ప్రవేశించి లుబ్ధావధాన్లును కౌగలించుకొని "అన్నయ్యా" అని యేడ్చును.)

లుబ్ధా : యిదేవిఁట్రా!

గిరీ : నీ మీద కూనీకేసు వొచ్చిందని తెలిసి నిద్రాహారం లేకుండా యకాయకీని వొచ్చాను. మా అన్నయ్యకీ వాళ్ళకీ కబురు పంపించావు కావేవిఁ ?

లుబ్ధా : యెవడేం జెయ్యాలి ? అన్నిటికీ సౌజన్యారావుపంతులుగారే వున్నారు. అయితే అబ్బీ, అగ్నిహోత్రావధాన్లుగాడి కూతుర్ని లేవదీసుకు పోయినా వట్రా ? వాడికి తగిన శాస్తి చేశావు దాన్నిగానీ పెళ్ళి మాత్రం ఆడలేదుగద!

గిరీ : నేనంత తెలివితక్కువ పని చేస్తాననుకున్నావా, అన్నయ్యా! నువ్వు నన్నేదో పెంచుకుంటావనీ.... పెళ్ళి చేస్తావనీ మావాళ్ళు కొండంత ఆశ పెట్టుకున్నారు గదా ?

లుబ్ధా : యీ గండం గడిస్తే పెంపకం మాట ఆలోచించవచ్చును.

గిరీ : (గద్గద స్వరంతో) సౌజన్యారావుపంతులుగారు చెప్పిన మాటలు చూస్తే, ఈ గండం గడుస్తుందని నాకు ధైర్యం తాళకుండా వుంది. నీకు కావలసిన వాణ్ణీ. చదువుకున్నవాణ్ణి, బుద్ధిమంతుణ్ణీ, గనక నీకు మంచి సలహా చెప్పమని సౌజన్యారావుపంతులుగారు నాతో మరీ మరీ చెప్పారు.

లుబ్ధా : ఆయన్ని చూశావురా ?

గిరీ : చూశావా అనా అడుగుతున్నారు ? ఆయన దగ్గరికి పెద్ద సిఫార్సు తీసుకు వచ్చాను. ఆయనకి నా మీద పుత్రప్రేమ. ఆయనకేమీ పాలుపోకనే, నన్ను మీతోటీ, హెడ్డుకనిష్టీబుతోటి మాట్లాడి, మంచి సలహా ఇమ్మని పంపించారు. గనక నా మాట విను. యెందుకైనా మంచిది, ఒక దత్తత పత్రిక రాయి – కన్నకొడుకు లేనందుకు వుత్తరగతి చూసుకోవాలా, లేదా ?

లుబ్ధా : నాకున్న బంధువులంతా నా దగ్గిర డబ్బు లాగాలని చూసేవారేగాని, నా కష్టసుఖాలకి పనికివొచ్చేవాడు ఒక్కడయినా కనపడ్డు.

గిరీ : ఒహణ్ణెత్తినైనా యెన్నడైనా ఓ దమ్మిడీ కొట్టిన పాపాన్ని పోయినావూ ? నే నొక్కణ్ణే గద నీమీద అభిమానం పెట్టుకు దేవులాడుతున్నాను. మిగతా నీ బంధువులకి యెవరికైనా నీమీద పిసరంత అభిమానం వుంది ? చెప్పు.

లుబ్ధా : లేకపోతే పీడా నాడాకూడా పాయెను.

గిరీ : నే మట్టుకు నీ దగ్గిర ఒక్క దమ్మిడీ యెన్నడూ ఆశించలేదు. నీ పరం కోసం దత్తత చేసుకోమన్నాను. నన్ను కాకపోతే మరొకణ్ణి చేసుకో.

లుబ్ధా : యిహం యింతబాగా వెలిగింది, పరంమాట బతికి వుంటే ముందు చూసుకుందాం.

గిరీ : సౌజన్యారావుపంతులుగారు నీకు మంచి సలహా యిమ్మని శలవిచ్చారు గనక నీతో యీ మాట చెప్పాను. అంతేగాని, ఆప్తులు చెప్పిన మాట నువ్వు వినవన్నమాట నాకు బాగా తెలుసును, పోనియ్యి మరోమాట చెబుతాను. అది ఐనా చెవినిబెట్టు. నీ కొకవేళ శిక్ష అయితే నీ తరఫున నీ వ్యవహారాలూ నవహారాలూ చూడడానికి యవడైనా ఒకడు వుండాలా, లేదా ? నీ బంధువుల్లోకల్లా యింగిలీసు వొచ్చినవాణ్ణి వ్యవహారజ్ఞానం కలవాణ్ణి నేను వొక్కణ్ణే గద ? నాకో పవరాఫ్టర్నామా గొలికి యిచ్చెయ్యి.

లుబ్ధా : నువ్వెందుకు నన్ను–దుఃఖంలో వున్నవాణ్ణి–మరింత దుఃఖ పెడతావు ? అన్నిటికీ నాకు సౌజన్యారావు పంతులుగారు వొక్కరే వున్నారు. ఆయన యెలా చెబితే అలా చేస్తాను.

గిరీ : నే నన్నమాట. అదే కదూ ? ఆయన చెప్పినట్టు నువ్వేవిఁటి ? నే నేవిఁటి, యవరయినా వినవలసిందే. ఈ రెండు సంగతుల విషయమయీ, ఆయన సలహా తప్పకుండా అడిగి, వారు యలా శలవిస్తే అలా చేదాం, యేమంటావు ?

లుబ్ధా : యిప్పటి నా చిక్కుకు పనికొచ్చేమాట ఒక్కటీ లేదు గద.

గిరీ : మరి ఎందుకొచ్చాననుకొన్నావు ఇంత దూరం ? నేను నాడు వ్రాసిన వుత్తరపు సంగతులు ఆలోచనలలోకి తెచ్చివుంటే ఈ చిక్కులు నీకు రాకపోనుగదా ?

లుబ్ధా : అప్పుడు గడ్డి తిన్నాను.

(హెడ్డు కనిష్టీబు, దుకాణదారు ప్రవేశింతురు)

హెడ్ : అవధాన్లూ, ఈయనెవరు ?

లుబ్ధా : నా తమ్ముడు.

హెడ్ : నాకేం తోచకుండా వుంది. బైరాగీ మాయవైఁపోయినాడు.

లుబ్ధా : అయ్యో! మరేవిఁటి సాధనం ?

హెడ్ : అదే ఆలోచిస్తున్నాను.

లుబ్ధా : యెక్కడికి వెళ్ళాడో ?

హెడ్ : శ్రీ జగన్నాథస్వామివారి శలవౌతుంది అని ఈ ఉదయం నుండీ అంటూ వొచ్చాడు.

దుకా : సారాదుకాణాల్లో యెతికితే దొరుకుతాడు.

హెడ్ : అదేంమాట భాయీ ? సిద్ధులు యేంచేసినా, వారికి తప్పు లేదు. యే దుకాణంలోనూ కూడా కానరాలేదు.

దుకా : అలాగైతే అనకాపల్లి రోడ్డు కాసి యెతకండి.

గిరీ : బైరాగి ఎందుకయ్యా ?

హెడ్ : ఆయన అంజనం వేసి గుంటూరు శాస్త్రుల్లునీ, వాడి కూతుర్నీ చూపించాడు.

గిరీ : డామ్ నాన్సెన్సు, గ్రోస్ సూపర్‌స్టిషన్, యీ వెర్రి కబుర్లు యే దొర నమ్ముతాడు ?

హెడ్ : దొర్లు నమ్మకపోతే పోయేరు. ఆ గుంట బతికివుందనీ, ఫలానాచోట వుందని మనకి ఆచోకి తెలిస్తే చాలదా ?

గిరీ : ఇగ్నోరెన్స్. యేమి ఆచోకీ తెలిసింది ?

హెడ్ : ఆ పిల్ల ఒక పూరియింట్లో కుక్కి మంచంమీద కూచుని యేడుస్తూన్నట్టు కనపడ్డది.

గిరీ : మీకే కనపడ్డదా ?

హెడ్ : నాకెలా కనపడుతుంది ? పాపం, పుణ్యం యెరగని చిన్నపిల్లవాళ్ళకే కనపడుతుంది.

గిరీ : లోకం అంతటా పూరిళ్ళూ, కుక్కిమంచాలూ వున్నవి కదా, యే వూరని పోల్చడం ?

హెడ్ : ఈ రాత్రి మళ్ళీ అంజనం వేసి వూరు పేరు చెప్పిస్తానన్నాడు.

గిరీ : యవిడెన్సు యాక్టులో అంజనాలూ, పిశాచాలూ సాక్ష్యానికి పనికొస్తాయిటయ్యా.

హెడ్ : ఆ బైరాగిని మీరెరుగరు. ఆయన గొప్ప సిద్ధుడు. యేం చెయ్యాలంటే అదీ చెయ్యగల్డు. అతడు పక్కని వుంటే నాకు కొండంత ధైర్యం వుండేది. జగన్నాథస్వామిని సేవించుకుని సాయంత్రానికి ఆయన ఒస్తే, నేను అదృష్టవంతుణ్ణి.

గిరీ : పదిరోజులు ప్రయాణం గదా, ఒక్కరోజుకి పోవడం రావడం యలాగ ?

హెడ్ : ఆయనకి వాయువేగం వుంది.

దుకా : అప్పులాళ్ళు అగుపడితే, వాయువేగంగా యెగేస్తాడు. నా బాకీ వొసూలు చేసుకోనిచ్చినారు కారుగదా భాయీ!

హెడ్ : వెధవ బాకీ – యీ గండం తప్పితే, నేను యిచ్చేస్తాను భాయీ!

దుకా : గండం తప్పేదేటి; నా సొమ్ము నా చేతిలో పడేదేటి భాయీ!

హెడ్ : మీ అందరి సాయం వుంటే దాటకేం భాయి ?

దుకా : ప్రాణం పెడతాను భాయి, సాక్ష్యం మాట మాత్రం శలవియ్యకండి.

హెడ్ : సాక్ష్యం పలకరా యేవింటి ?

దుకా : దుకాణవేఁసుకు బతికేవాళ్ళకి సాక్షికాలెందుకు భాయీ ? ఈ తిరగడం నించి బేరం చెడ్డాది. ఈవేశ వూరికి పోకుంటే దుకాణం యెత్తిపెట్టాలి.

హెడ్ : యిదేనా మీ స్నేహం, నేస్తం ?

దుకా : మీ వెంట తిరిగితే కొత్త హెడ్డుగారు...

హెడ్ : కొత్త హెడ్డేవింటి భాయి ?

దుకా : యినిసిపికటరుగారు చెప్పినారు. నా సొమ్ము మాటేమిటి భాయి ?

హెడ్ : యినస్పెక్టరుగాడు అన్నిందాలా నా కొంప తీశాడు!

దుకా : ఆ బైరాగాడు నా కొంప తీసినాడు, యిహ నా డబ్బు నా చేతిలో పడేదేటి ? (నిష్క్రమించును.)

(అసిరిగాడు ప్రవేశించును)

అసి : (బుర్ర గోక్కుంటూ) బాబూ, మా ముసల్దానికి సావొచ్చిందట. కబురెట్టింది బాబూ!

హెడ్ : వెధవా, సాక్ష్యం యివ్వందీ. వెళ్ళిపోతావా యేమిటి ?

అసి : సాచ్చీకం అయిందాకా బతికుంతాదా బాబు ?

హెడ్ : ఓరి వెధవా, దొంగమాట లాడుతున్నావు. గుండె పగల గొడతాను. నీ కెవడ్రా కబురుతీసుకొచ్చాడు ?

అసి : మనవూరు బండోళ్ళొచ్చినారు బాబు.

హెడ్ : గాడిదకొడకా, యిల్లు కదిలావంటే వీపు పెట్లగొడతాను.

అసి : యెళ్ళితే మీరు తంతారు, యెళ్ళకుంటే ఆరు తంతారు.

హెడ్ : ఆ రెవడ్రా ?

అసి : యినిసిపిక్కిటోరు.

హెడ్ : యీ యినస్పెక్టర్ మరి సాక్ష్యం రానివ్వడు ?

గిరీ : అసిరీ! నా దెబ్బ నీకు తెలుసును. యినస్పెక్టరూ సనస్పెక్టరూ జాంతేనై. విన్నావా ? తిన్నగా బోనెక్కి నిజవేఁదో సాక్ష్యం పలక్క పోతివట్టాయనా, పీక నులివేసి నిన్ను నూతిలో పారేస్తాను.

అసి : యేటి బాబూ! మీరో తెన్నా, ఆరో తెన్నా, యీరో తెన్నా నా కేటెరిక బాబూ ? మీ నౌకరీకి దణ్ణం. పోతాను. బాబూ! ఆయమ్మ గోడ గెంతడం నేను సూడలేదు. బాబూ! గవరయ్యగోరు దెయ్యాన్ని సీసాలో యెడితే, గోడ గెంతడం ఏటి బాబూ వొట్టి అబద్ధం! నాకు సూపులేదు బాబు.

గిరీ : వాడు చూడందీ సాక్ష్యం యలా పలుకుతాడు అన్నయ్యా ?

లుబ్ధా : నా ప్రాలుబ్ధం... యేవఁని జెప్పను ?

హెడ్ : యవ రీయనా ? కేసుల మొహం అంటే యీయనకేమైనా తెలుసునా ?

గిరీ : కేసుల మొహం నాకు తెలియదు. నిజం మొహం పోలీసు వాళ్ళకీ తెలియదు. అబద్ధ సాక్ష్యాలవల్ల తప్పించుకోవడం కన్నా జెయిల్లో కూచోడవేఁ ఉత్తమం. ధనప్రాణాలు రెండూ పోయినా మనిషి అన్నవాడు అసత్యం ఆడకూడదు, ఆడించకూడదు.

హెడ్ : యేవిఁటండీ యీయన శల్య సారథ్యం! యవరితడు ?

గిరీ : నేను లుబ్ధావధాన్లుగారి తమ్ముణ్ణి. నా పేరు గిరీశం అంటారు. నేను పరీక్షలు పాసైనవాణ్ణి తెలిసిందా ?

హెడ్ : వెధవముండని తగులుకుపోయిన మహానుభావుడివి నువ్వేనా ?

గిరీ : డిఫమేషన్ అంటే మీ కేమో తెలుసునా ? నేను సౌజన్యారావు పంతులుగారి స్నేహితుణ్ణి. సాక్ష్యాలు యే రీతిగా వున్నాయో కనుక్కుని, అన్నయ్యగారికీ, మీకూ సలహా చెప్పమని పంతులుగారు నన్ను పంపితే వచ్చాను.

హెడ్ : అలా అయితే మాకు మీరు సాయం చెయ్యాలిగాని, అబద్ధం లేకుండా సాక్ష్యం కావాలంటే యీ భూప్రపంచకమందు యెక్కడైనా సాక్ష్యం అన్నది వుంటుందా ? నా నెత్తిమీద యెన్ని వెంట్రుకలు వున్నాయో అన్ని సాక్ష్యాలు చూశాను. పెద్ద పెద్ద వకీళ్ళు తయారుచేసిన సాక్ష్యాలు కూడా చూశాను. మీరు అనుభవం లేక నీతులు చెబుతున్నారుగాని, హైకోర్టు వకీళ్ళు కూడా తిరగేసి కొట్టమంటారు. నీ పుణ్యం వుంటుంది బాబూ! నిజం, అబద్ధం అని తేలగొట్టక, యేదో ఒక తడక అల్లి తయారుచేస్తేగాని ఆబోరు దక్కదు.

గిరీ : అన్నయ్యకీ, మీకు సహాయం చెయ్యడం కోసం కాకపోతే యింతదూరం నుంచి నేను యెందుకు వచ్చాను ? మీ ఇష్టఁవొచ్చినట్టల్లా మీకు పనికివొచ్చే అబద్ధాలు. మీరు పలికించడమునకు నా అభ్యంతరము యెంత మాత్రం లేదు. సబ్‌స్టాక్టు ట్రూత్ అనగా శుద్ధసత్యఁవనేది, సాక్షాత్తూ

భగవంతుడితో సమానమైన వస్తువు అన్నమాట మాత్రం మరచి పోకూడదని నా అభిప్రాయము. నేను మట్టుకు నిజం కోసం సమయం వొస్తే సంతోషముతో ప్రాణం యిచ్చేస్తాను. "లోకో భిన్న రుచిః" అన్నారు. కొందరికి కందిపప్పు పచ్చడి రుచి, కొందరికి పెసరపప్పు పచ్చడి రుచి; కొందరు అదృష్టవంతులికి రెండు పచ్చళ్ళూ రుచి. అలాగనే, కొందరికి అబద్ధం రుచి; కొందరికి నిజం; చాలామందికి రెండింటి కలగలపు రుచి; ఇది లోకస్వభావం. గనక అవసరం కలిగినప్పుడు తఱుకూబెఱుకూ లేకుండా, అబద్దం ఆడవలసిందే. ప్రస్తుతాంశంలో, అసిరిగాడిచేత అబద్ధం ఆడించడం నాది పూచీ. అసిరీ నా తడాఖా జ్ఞాపకం వుందా ? కబడదార్. సాక్ష్యం యివ్వకపోతే చంపేస్తాను.

హెడ్ : అలా తోవలోకి రండి భాయీ. చర్మం చెప్పులు కుట్టి యిస్తాను. (లుబ్ధావధాన్లుతో) ఆ చండాలుడు రావఁప్పంతులుని నమ్మక, యిలాంటి కావలసిన వాళ్ళ మాట వింటే; మీకూ ఈ గతి రాకపోవును గదా ?

గిరీ : మా వాడు కావలసినవాళ్ల సలహా వింటాడండీ ? దత్తత చేసుకుంటానని యెన్నాళ్ళాయో అంటున్నాడు. దత్తత చేసుకుంటే కనిపెట్టి వుండనా ? "పోనీ, ఓ పవరాఫ్‌టర్నామా అయినా నా పేర వ్రాయి, నీ వ్యవహారాలు చూస్తాను" అంటే, చెవి పెట్టడు.

హెడ్ : యేవండీ, అవుధాన్లుగారూ! అలా చెయ్యరాదటయ్యా ?

లుబ్ధా : వెనకనుంచి ఆలోచించుకుందాం.

గిరీ : అతాత్తుగా జెయిలులోకి లాక్కుపోతే, ఆ పైన చేసే పనేవింఁటి ?

హెడ్ : జెయిలు సిద్ధపరిచారూ ?

గిరీ : మాట వరస కన్నాను. కీడెంచి మేలెంచాలి. యినస్పెక్టరు కుట్ర బలంగా వుంది. పోలిశెట్టి సాక్ష్యం పలకనని సౌజన్యారావు పంతులు గారితో చెప్పి ఊరికి వెళ్ళిపోయినాడు.

హెడ్ : అయ్యో, మరేమిటి గతి ?

గిరీ : అదే పంతులుగారూ, నేనూ విచారిస్తున్నాం.

(పూజారి గవరయ్య ప్రవేశించును.)

హెడ్ : గవరయ్యగారూ, గురోజీ కనబడ్డారా ?

గవ : యిదుగో నాతో వొస్తూంటేనే! మీ పెరటి అరుగు మీదే యింతసేపూ సమాధిలో వున్నారు.

హెడ్ : నాకు పెరటి అరుగు మీద కనపడలేదే ? పోనీండి. ఆయన వొచ్చాడంటే బతికాను అన్నమాట, యేరీ ?

గవ : ఏమి అలా అడుగుతున్నారు ? యిదుగో, మీ యెదటా! (కాళీ జాగావేపు చూపును) మీకు కనపడలేదా యేమిటి ? (కాళీ జాగావైపు చూసి) యేం గురోజీ, తిరస్కరణీ విద్య అవలంబించా'రేమి ? ఓహో, మీ గురువుగారి ఆజ్ఞ ఐందనా ? అయితే నాకెలా కనబడుతున్నారు. నాకు మంత్రసిద్ధి కలద'నా ? అయితే యెన్నాళ్ళు యిలా కనపడకుంటా వుంటారు ? ఒక్క పక్షవాఁ ? (హెడ్డుతో) అదీ వారు శలవిచ్చినమాట.

హెడ్ : యీలోగా మా పీకకి ఉరి అయిపోతుందే ?

గవ : (కాళీ జాగావైపు చూసి) యేం శలవు గురూ ? (హెడ్‌తో) మీకేమీ పర్వాలేదన్నారు.

హెడ్ : యీ రాత్రి అంజనం వేయిస్తాఁనన్నారు గదా. యెలాగ ?

గవ : (కాళీ జాగావైపు చూచి) యేం శలవు ? (హెడ్డుతో) అన్ని పనులూ నాచేత చేయిస్తామన్నారు.

హెడ్ : వారు కనబడితే బాగుండును.

అసి : అదేటి బాబూ, ఆరు నా కగుపడుతున్నారు!

గవ : సిద్ధులూ, పిశాచాలూ మాలాంటి మాంత్రికులకి కనబడతారు. వాడిలాంటి మూఢభక్తులకు కనబడతారు. పాపం పుణ్యం యరగని పసిపిల్లలకి కనబడతారు. ఇతరులకు కనబడరు.

గిరీ : డా'మ్ హంబగ్. (కర్రతో గవరయ్య పక్కని కాళీ జాగా కొట్టి) యవడున్నాడిక్కడ ? హెడ్డుగారూ, ఇదంతా గ్రాండిచ్చీ ఆఫ్ బేడెన్.

గవ : నువ్వు రెండు యింగిలీసు ముక్కలు చదువుకుని నాస్తికుడివి కాగానే, మహాత్మ్యాలు పోతాయనుకున్నావా యేవిఁటి ? నువ్వు సొట్టకర్ర తిప్పితే సిద్ధులికి తగుల్తుందా ? నీలాగే పెద్ద కబుర్లు చెప్పిన రిజిస్టరికి, స్మశానంలోకి తీసికెల్లి దెయ్యాన్ని చూపించేసరికి, ఆర్నెల్లు వూష్టం పెట్టుకున్నాడు. సిద్ధుల్ని నిందిస్తే బుర్ర పగుల్తుంది.

అసి : అరేటి బాబూ, బైరాగోరు!

గిరీ : (అసిరిగాడిపైని ఉరికి) వెధవా, యేడిరా ?

అసి : లేదు బాబూ, లేదు బాబూ, ఉత్తినన్నాను.

గిరీ : దొంగ గాడిద కొడకా! (హెడ్డుతో) మీరు సాక్ష్యం కుదుర్చుకోవడం మానేసి, యీ గవరయ్య మాయల్లో పడితే మరి తేల్తారా ?

హెడ్ : అన్నా, అలా అనకండి. వీరి సాయం వల్లనే మనం వొడ్డెక్కాలి. (చెవిలో) గవరయ్యగారు మనకు ముఖ్యమైన సాక్షి.

గవ : కిరస్తానప భ్రష్టులు చేరినచోట మాంత్రికులూ, సిద్ధులూ వుండ తగదు. (కాశీ జాగావైపు చూసి) రండి గురోజీ. మన తోవని మనం పోదాం.

లుబ్ధా : గవరయ్యన్నా యెక్కడికి వెళతారు ?

గవ : నాకు తోచిన చోటికి.

లుబ్ధా : మరి సాక్ష్యవోఁ ?

గవ : "అవధాన్లుగారు పెళ్ళాడిన కామినీ పిశాచం. అది మనిషీ, గోడ గెంతి పారిపోయింది" అని నేను అబద్ధపు సాక్ష్యం చెప్పానంటే మరి మంత్రం అన్నది నాకు మళ్ళీ పలుకుతుందా ? నా వొంతు ఆ గిరీశాన్ని సాక్ష్యం పలకమను.

"నమ్మి చెడినవారు లేరు!
నమ్మకపోతే, పోయేరు॥

(గిరీశంతో) యినిసిపికటరు నీకంటే యెక్కువ యింగిలీసు చదువుకున్నా ఆయనకి మన శాస్త్రాల్లో నమ్మకాలు పోలేదు.

హెడ్ : ఆయన దగ్గిరికి వెళతారా యేవిఁటి ?

గవ : (వెళుతూ) కబురంపించారు.

హెడ్ : రండి రండి. గవరయ్యగారూ! చిన్నమాట.

గవ : (వెళుతూ) ఆ చిన్నమాటేదో (గిరీశంను చూసి) ఆ మహానుభావుడితో చెప్పండి. (నిష్క్రమించును)

హెడ్ : (గిరీశంతో) ఈ సాక్ష్యం మీరు మాట దక్కించుకున్నారు. మరి సాక్ష్యవఁన్నది లేదు.

గిరీ : ఆ మాటకొస్తే–నేనే సాక్ష్యానికి దిగి, కేసు నీళ్ళు కారించేస్తాను. నా శక్తి చూతురుగాని, సౌజన్యారావు పంతులుతో మాత్రం ఆ మాట యింకా చెప్పకండి. (తెర దించవలెను).

6వ స్థలము : సౌజన్యారావు పంతులు యిల్లు.

(మేడపైన పంతులు పడక గది. ఒక బల్లపైని సన్నని గాజుదీపము కొంచెము వెలుతురు కలుగజేయును. గది మధ్యను మెట్లవైపునున్న గుమ్మమునకు యెదురుగా దోమతెర మంచము ఉండును. దానిపైని సౌజన్యారావు పంతులు మేలుకుని పరుండి యుండును. మంచము రెండవపక్కను చిన్న రౌనుబల్లపైని గిల్టు కవరూ అంచులూ గల భగవద్గీత పుస్తకము, పక్కని కుర్చీమీద గిరీశము కూర్చుని యుండును.)

గిరీ : నా మనసు డైలెమ్మాలో పడి చాలా ఖేదిస్తూందండి. యే రీతినైనా నా అన్నగారు ఈ ఆపద దాటుదురా అని ఆతృత వొకపక్కా. అసత్యము నా కార్యసాధనంగా చేసుకోవడం అనే జిగీష వొకపక్కా నన్ను పీడిస్తున్న వండి. "అబద్ధపు సాక్ష్యం వొద్దు, నిజమైన సాక్ష్యం జాగ్రత్త చెయ్యండి" అని హెడ్డుకనిష్టీబుతో నేను అనేసరికి నా పైని కొండంత కోప్పడ్డాడండి నిజమైన సాక్ష్యం ప్రయత్నిస్తే దొరకదా అండి ?

సౌజ : నిజవైఁన సాక్ష్యం! ఏం సత్యకాలం! నిజవాఁడేవాడు సాక్ష్యానికి రాడు, సాక్ష్యానికొచ్చినవాడు నిజవాఁళ్ళేడు.

గిరీ : యెంచేత ఆళ్ళేడండీ ?

సౌజ : వాదిని బాధించే నిజం వాది తరఫు వకీలికి అక్కర్లేదు. ప్రతివాదిని బాధించే నిజం ప్రతివాది వకీలికి అక్కర్లేదు. క్రాసెగ్జామినేషను ఆరంభం అయ్యేసరికి యెంతటిసాక్షి కవిత్వం ఆరంభిస్తాడు. అంచేతనే పెద్దమనుషులు బోనెక్కడానికి భయపడతారు.

గిరీ : వకీళ్ళు అబద్ధాలాడిస్తే న్యాయం కనుక్కోవడానికి జీతం పుచ్చుకునే జడ్జీ యేం జేస్తాడండి ?

సౌజ : ఉభయ పార్టీల వకీళ్ళు ఆడించే అబద్ధాలూ చేయి పీకేటట్టు రాసుకుంటాడు.

గిరీ : అయితే యెందుకండి ఈ కోర్టులు ?

సౌజ : నేను అదే చాలా కాలవాఁయి ఆలోచిస్తూ వుంటిని. పెద్ద పెద్ద వకీళ్ళు కూడా సిగ్గుమాలి బరిపెట్టి దొంగసాక్ష్యాలు పాఠం చెబుతారు. కొందరు

మృదువర్లు తిరగేసి కొట్టమంటారు. నా వంటి చాదస్తులం ఇంకొక కొందరం అట్టి పాపానికి వొడికట్టుకోంగాని, మా పార్టీల తరఫు సాక్షులు కూడా అబద్ధం చెబుతున్నారని యెరిగిన్నీ వూరుకుంటాం. యిలాటి అసత్యానికి అంగీకరించవలసి వస్తుందనే, నేను ప్రాక్టీసు చాలా తగ్గించు కున్నాను. క్రమంగా ఈ వృత్తే మానుకోవడపు సంకల్పం కూడా వుంది.

గిరీ : అందరూ తమ వంటి వకీళ్ళే అయితే, అసత్యమన్నది వుండనే వుండదండి. వకాల్తీలో యింత అక్రమం వుందన్నమాట నే నెరగనండి. యేమైనా సహించగలనుగాని అసత్యం అన్నది సహించలేనండి.

సౌజ : వొక్క అసత్యంతో కుదరలేదు. సాధారణంగా వకాల్తీలో దురాచారాలు చాలా వున్నాయి. యాంటీనాచ్ లాగానే, యాంటీ వకీల్ అని వక మూవ్‌మెంట్ మన దేశంలో స్టార్టుచెయ్యడపు ఆవశ్యకత కలిగేటట్లు కనపడుతుంది. హెడ్‌కానిస్టీబుది తప్పు కాదు. దొంగసాక్ష్యం కలిగిస్తేనే గాని కేసులు గెలియవు. మీరు సత్య మార్గంలో తరిఫీదైన మనుషులు ఔటచేత మీకు కేసులు నడిపించే మార్గాలు ఏహ్యంగా వున్నాయి.

గిరీ : మరి మా అన్నగారి గతి ఏవిఁటండి ?

సౌజ : ఒకటే సాధనం వుంది. ఆ గుంటూరు శాస్తుల్లు యెవరో పోల్చి పట్టుకుంటే యితర సాక్ష్యం అవసరం వుండదు.

గిరీ : పట్టుబడే మార్గం యేదో తమరు శలవిస్తే మూడు లోకాలు గాలించి అయినా పట్టుగుంటానండి.

సౌజ : మీ యోగ్యతకు నాకు చాలా సంతోషంగా వుంది. మీ లాంటి యెంగ్‌మెన్ లావుగా వుంటే మనదేశం బాగుపడును. మీ ప్రయత్నం సానుకూలం కాతగిన బందోబస్తు యావత్తూ నేను చేస్తాను. మీ స్వంత చిక్కులు కూడా వదిలినవి గనుక మీరు వెంటనే బయలుదేరి వెతకడం ఆరంభించ వచ్చును. ఈ కారణం చేత మీ వివాహం పోస్ట్‌ఫోన్ కావలసి వస్తుందిగదా అని మాత్రం విచారిస్తున్నాను.

గిరీ : అట్టి విచారం తాము పడక్కరలేదు. మా గురువుగారి వుపదేశం డ్యూటీ ముందూ, ప్లెజర్ తరవాతనండి. అందులో నేను చిన్ననాటి నుంచీ కొంచెం కాన్‌సెన్‌ట్రేషనూ, ఇంద్రియ నిగ్రహమూ అభ్యాసం చెయ్యడం చాతనూ, వొళ్ళుమరచి యెల్లప్పుడూ యేదో ఒక వ్యాపకంలో కొట్టుకుంటూ

వుండటం చాతనూ స్త్రీ సుఖముల యెడల నాకు విముఖత లావండి. అందుచేతనే మా వాళ్ళంతా నాకు నెపోలియన్ ఆఫ్ యాంటినాచ్ అని పేరు పెట్టారు. ఈ జీవిత కాలమంతా సోషల్ రిఫారమ్ కింద వినియోగ పరుద్దావఁనే నిర్ణయంతో వివాహం మాని మా గురువుగారి దగ్గిర లెఫ్టెనెంటుగా ప్రవేశించానండి. బుచ్చమ్మ యొక్క హృదయ నైర్మల్యమూ, ఆమె దురావస్థా చూచిన్నీ, నా శిష్యుడి యందు నాకు వుండే ప్రేమాతిశయం చేతనున్నూ, ఆమెయందు కూడా ప్రేమాతిశయం నాకు కలిగి, ఆమెను వివాహం కావడముకు ఒప్పుకున్నాను గానండి. ఇంద్రియ సుఖముల నపేక్షించి కాదు. ఆమె కూడా నన్ను ప్రేమించి విధవా వివాహము కూడుననే నిశ్చయముతో నన్ను వివాహము కావడముకు అంగీకరించారండి. గనుక మా మారియేజి అనేది ట్రూ లవ్ మారియేజి గాని, సాధారణపు విడో మారియేజి కాదండి.

సౌజ : మీ గురువుగారూ అలాగే వ్రాశారు. గాని మీరు విడో మారియేజి చేసుకుంటే మీ అన్నగారు మిమ్మల్ని పెంచుకోరేమో!

గిరీ : తమ మాటను ఆయన అతిక్రమించబోరండి. ఒకవేళ ఆయన వప్పకపోతే, దత్తత వదులుకుంటానుగాని, ప్రాణ సమానురాలైన బుచ్చమ్మని విడవనండి.

సౌజ : ఆమె అదృష్టవంతురాలు.

గిరీ : అట్టి స్త్రీ రత్నము... (చడి లేకుండా ఒక మనిషి, మెట్లెక్కి వచ్చి ద్వారము దగ్గర తనకు యెదురుగా నిలిచి వుండడము చూచి నిర్ఘాంతపోయి మాట మాని నోరు తెరచును.)

సౌజ : (ఆ వైఖరి కనిపెట్టి) యేవిఁటి అలా చూస్తున్నారు. (గిరీశం చూస్తూవున్న వేపు తానును దృష్టి తిప్పి, వచ్చిన మనిషిని చూచును.)

గిరీ : యిట్టి స్త్రీ రత్నము దొరికిన కారణము చేత నేనే అదృష్టవంతుణ్ణి అని భావిస్తాను. అయితే "పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం" అన్న న్యాయప్రకారం, ఒకర్ని కాపాడి వుపకారం చెయ్యడం వుత్కృష్టమైన పుణ్యం. నిష్కారణంగా వాడి మానాన్న వాడు బతుకుతున్న వాడికి అపకారం చెయ్యడం పాపానికి కారణం. గనుక మా అన్నయ్యని యెంత కష్టపడి అయినా నేను కాపాడడం విధి అని యెరుగుదునండి.

సౌజ : (కొత్తగా వచ్చిన మనిషితో) యెవరు మీరు ?

కొత్త : జరూరు ప్రయోజనం కలిగి వచ్చానండి. వర్తమానం చెయకుండా వచ్చినందుకు క్షమించవలెను. కింద నౌఖర్లు కానరాలేదండి.

సౌజ : రండి. కూర్చోండి.

గిరీ : (లేచి వెళ్ళి ఒక కుర్చీ తెచ్చి, తన కుర్చీ పక్కను వేసి) దయ చెయ్యండి.

కొత్త : (కూచోక) అక్కరలేదు.

సౌజ : కూచోండి. (కొత్త మనిషి కూచొనును) తాము యవరండి ?

కొత్త : నేనెవరో మనవి చేయక తీరదా అండీ ?

సౌజ : యే కారణం చేతనైనా పేరు చెప్పడం యిష్టం లేకపోతే, చెప్పనక్కర లేదు.

కొత్త : నే వచ్చిన పనికి నా పేరుతో పనిలేదండి. కొన్ని కారణముల చేత నా పేరు చెప్పడము వీలు లేదండి. క్షమించవలెనని ప్రార్థన.

గిరీ : షేక్స్పియర్ అన్నాడు కాడా అండి. "వాట్సిన్ నేమ్!" అని, దానిని నేను చిన్న గీత ముక్కగా తర్జుమా చేశానండి. "పేరులోన నేమి పెన్నిధి యున్నది!" మన శాస్త్రాల్లో కూడా ఎవరి పేరు వారు గట్టిగా వుచ్చరించితే పాపవన్నారు. తమకు విశదమే.

కొత్త : మరి వొకరితో అయితే కల్పించి మారు పేరు చెప్పుదును. తమచోట అబద్ధం ఆడజాలనండి.

గిరీ : భోజరాజు ముఖం చూస్తే కవిత్వం పుట్టినట్టు, తమ ముఖం చూస్తే యెట్టివాడికైనా నిజవేఁ నోటంట వొస్తుందండి!

కొత్త : ఒకానొకరికి తప్ప.

గిరీ : "సచే మాన్ ఈజ్ టు బి పిటీడ్" అనగా అట్టి మనిషి వుంటే ఆ మనిషి యెడల మనం కనికరం కలుగజేసుకోవాలి. అంతే.

సౌజ : అసత్యవఁనేది యెవరితోనూ ఆడకూడదు.

కొత్త : మంచివారి యెడల మంచిగాను, చెడ్డవారి యెడల చెడ్డగానూ వుండమని మా తల్లిగారు వుపదేశం చేశారు. అందుచేత తమతో అబద్ధవాఁడ నన్నాను.

సౌజ : మీ తల్లిగారు పూజ్యులేగాని, వారి వుపదేశంలో మీరు మొదటి సగమే అవలంభించి కడం సగమూ మార్చి మనం చెడ్డవారని అనుకునేవారి యెడల కూడా మంచిగా వుండుటకు ప్రయత్నము చేస్తే, దయా పరిపూర్ణుడైన భగవంతుడు సృజించిన యీ లోకము మీకు మరింత యింపుగా కనపడుతుంది. మీరూ, మీ పరిచయం కలిగిన వారికి మరింత సౌఖ్యము కలుగుతుంది. కాక, మంచిచెడ్డలు యేర్పరచ గలిగినవారు యెవరు ? మంచిలోనూ చెడ్డ వుంటుంది, చెడ్డలోనూ మంచి వుంటుంది.

గిరీ : ఏమి విలువైన మాటలు! ఒక చెడ్డ మనిషి వున్నాడనుకోండి. ఒకణ్ణి అనడవెందుకు ? నేనే ఆ చెడ్డవాణ్ణి అనుకోండి. అట్టి చెడ్డవాడనైన నా యెడల మంచిగా వుండడమే యోగ్యత, తమవంటి మంచివారి యెడల అంతా మంచిగానే వుంటారు. "అపకారికి నుపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి సుమతి" అని కవి అన్నమాట పర్ ఫెక్ట్ జెమ్ కాదా అండి ?

సౌజ : నా భావం మాబాగా ఉపన్యసించారు.

కొత్త : (సౌజన్యారావు పంతులుతో) తమ వాక్యం గురూపదేశంగా భావించి, యిటుమీదట, చెడ్డవారి యెడల కూడా మంచిగా వుండడముకు ప్రయత్నిస్తాను. తమ శిష్యరికం లభించడం నాకు పెన్నిధి. సత్పురుషుల దర్శనం సద్యోఫలం కలది. తాము మంచిలో చెడ్డ వుంటుందని శలవిస్తిరి; పరిపూర్ణమైన తమ మంచిలో చెడ్డలేదని వింటున్నాను.

సౌజ : పరిపూర్ణమైన మంచి ఒక్క భగవంతుడి యందే కలదు. నా చెడ్డ లోకవే వెఁరుగును ?

గిరీ : మిషనరీ ఒరిజినల్ సిన్ అంటాడండి, మనవాళ్ళు దుష్కర్మ అంటారు. దాంతస్సాగొయ్యా – బెగ్ యువర్ పార్డన్ – ఆ ఒరిజినల్ సిన్ లేక కర్మ అనేది యెంత మంచివాడినైనా, ఎంత కట్టుదిట్టవైఁనవాడినైనా రెక్క పట్టుకుని తప్పుతోవలోకి లాగుతుంది. తమకు విశదము కానిది యేమున్నది ?

సౌజ : "బలవా నింద్రియగ్రామో విద్వాంసమసికర్షితి" అని గీత చెబుతూంది. ఎవడిచెడ్డ వాడు దాచుకుని, మంచినే పైకి కనపర్చుతాడు.

కొత్త : ఒకానొకరు లేని మంచిని కూడా వున్నట్లు ప్రచురపరచి లోకాన్ని భ్రమింప చేస్తారు.

సౌజ : సత్యం. అందుచేతనే మంచి చెడ్డలు మనసే యెరగవలె గాని లోకవేఁ వెరుగును అని అన్నాను.

కొత్త : నటన వల్ల కొద్దికాలవేఁ లోకానికి కళ్ళు కప్పవచ్చును గాని, నిడివిమీద బంగారాన్నీ, యిత్తడినీ లోకం యేర్పేస్తుందండి (గిరీశంతో) యేమంటారు ?

గిరీ : పంతులుగారికి నిద్రాభంగం ఔఁతుంది. మీరు వచ్చిన పనేఁదో....

కొత్త : (సౌజన్యారావు పంతులుతో) స్వాభావికంగా మంచి లోకం గుడ్డికి; చెడ్డ వెతకడానికి చారెడు కళ్లు, గనక చూస్చూసి, లోకం ఈయన మంచివారు అని నిర్ధారణ చేసిన తరువాత వారు మంచివారు కాక తీరదండి. తమవంటి మంచివారు వలవేస్తే యెక్కడా కనపడడం కష్టం అండి. గనక తమ దర్శనం నాకు కావడం వల్ల ఈ రోజు, నా జన్మాని కల్లా సుదినంగా భావించి సంతోషిస్తున్నాను.

గిరి : సందేహఁవేవిఁటి ?

సౌజ : మంచిగా వుందావఁని ప్రయత్నిస్తున్నాను, అంతకన్న నా యందు యోగ్యతేమీ లేదు. మీరు వచ్చిన పని చెప్పారు కారు.

గిరీ : నేను కనుక్కుని తమతో ఉదయం మనవి చేదునా ?

సౌజ : జరూరు పనిమీద వచ్చిన వారూ, పేరు చెప్పనివారూ, మీతో వారి కార్యం చెబుతారా! మీది ఎంత సత్యకాలం!

గిరీ : వారికి నే నేమైనా సాయం చేయడానికి అవకాశం వుంటుందేమో అనీ, తమకు నిద్ర వేళయిందని మనవి చేశాను.

కొత్త : గిరీశంగారు లోకోపకారపరులు.

సౌజ : మీకు కృతపరచితులా ?

కొత్త : వారిని యెరగని వా రెవ్వరండి ?

గిరీ : వారు నా యందు వుండే దయచేత అలా శలవిస్తున్నారు గాని, నన్ను అంతా యెరగడానికి నే నేపాటి వాణ్ణండి ? అయినా తరుచుగా లెక్చర్లు యిస్తూ వుండడంచాత వీరివంటి సత్పురుషులు నన్ను యెరిగి వుండడం కద్దుఁ సత్కరించడం కద్దు. వీరిని కూడా నేను చూచి వుందును. అందుచేతనే వీరు కనపడగానే, యెవరు చెప్మా చూచినట్టుందీ... అని

కలవిలపడ్డాను. వారు కూడా ప్రచ్ఛన్నులై వుందామని నిశ్చయించు కున్నారు గనక, నేను జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నం చెయ్యను. నేను పోయి పరుంటాను. తాము ఉభయులు మాట్లాడుకోవచ్చును.

సౌజ : అలాగే చెయ్యండి.

గిరీ : (సౌజన్యారావు పంతులుతో) నమస్కారం. (కొత్త మనిషితో) మీరు బ్రాహ్మలా ?

కొత్త : కాదు.

గిరీ : (కొత్త మనిషితో) అయితే దాసోహం–టు ద అన్నోన్ ? (నిష్క్రమించుతూ గుమ్మం దగ్గరకు వెళ్ళి, తిరిగి చూసి కొత్తమనిషిని బతిమాలు కున్నట్లు అభినయించి వెళ్ళును.)

సౌజ : గిరీశంగారు కవి; మహాయోగ్యమైన చిన్నవాడు.

కొత్త : వితంతువులను పెళ్ళాడడం; యాంటీనాచీ కూడా, మంచికి ఆవశ్యకవేఁనా అండి ?

సౌజ : వితంతువులను యిష్టమైతే పెళ్ళాడవచ్చును. లేకుంటే మానవచ్చును. మంచితో దానికి పనిలేదు, గాని వేశ్యాసంపర్గం కలవాడు యెన్నడూ మంచివాడు కానేరడు.

కొత్త : అంతేనా అండి, లేక వేశ్యను చూడరాదు! వేశ్యతో మాటాడరాదు, వేశ్యపాట వినరాదు అని నిర్ణయం కూడా వున్నదా అండి ?

సౌజ : అలాంటి నిర్ణయం వుంటే మరీ మంచిది.

కొత్త : తమరు యాంటీనాచ్ అనుకుంటాను.

సౌజ : ఔను.

కొత్త : (చిరునవ్వు నవ్వుతూ) గిరీశంగారూ యాంటీనాచే కదా అండి.

సౌజ : మీకు తెలియదా ? ఆయన యాంటీనాచికి గురువు.

కొత్త : ఆయన నాకు కూడా గురువులేనండి.

సౌజ : అలాగనా ? నాకు చాలా సంతోషం.

కొత్త : ఈ విషయంలో చాలా కాలవాఁయి నాకు ఒక్క సందేహం వుండిపోయింది; క్షమిస్తే మనవి జేస్తాను.

సౌజ : చెప్పండి... తప్పేమి ?

కొత్త : వేశ్యలను పాటకు పిలవకపోతే, వాళ్ళు బతకడం యెలాగండి ?

సౌజ : పెళ్ళి చేసుకుంటే సరి.

కొత్త : గిరీశం లాంటివారిని అనా తమ అభిప్రాయం ?

సౌజ : యేమి మాట అన్నారు! రేపో, నేడో ఆయన ఒక పవిత్రమైన వితంతువును పెళ్ళి కానై యున్నారు గదా, వేశ్యనా పెళ్ళాడతారు ?

కొత్త : జపాన్ దేశంలో గెయిషాలని వేశ్యలు వున్నారనీ, వాళ్ళని గొప్పగొప్ప వారు కూడా పెళ్ళాడతారనీ, ఈ గిరీశంగారే కాబోలు చెప్పగా విన్నాను. జపాన్ దేశం గొప్ప దేశం అని అంటారండి ?

సౌజ : ఔనుగాని, గొప్పదేశంలో వున్న చెడ్డనే మనం అవలంభించాలా ? గిరీశంగారు అట్టి అపవిత్రమైన పనికి ఇయ్యకొనరు.

కొత్త : అయితే పెళ్ళిచేసుకోగోరిన వేశ్యలకు కోరతగిన వరులు దొరకడం యెలాగండి ? లేక యెట్టివారయినా సరే అని తమ అభిప్రాయమా అండి ?

సౌజ : ఈ సంగతి యింకా నేను బాగా ఆలోచించ లేదు. వేశ్యలు విద్యలు నేర్చి, ఇతర వృత్తుల వల్ల సత్కాలక్షేపము చెయ్యరాదా ?

కొత్త : అట్లాచేస్తే, తమవంటివారు వాళ్ళను వివాహమౌదురా ?

సౌజ : ఏం ప్రశ్న ? నేను యెన్నడూ వేశ్యను పెళ్ళాడను. నా యెత్తు ధనం పోస్తే వేశ్యను ముట్టను.

కొత్త : ప్రమాదం వల్ల వేశ్య శరీరం తమకు తగిలితే ?

సౌజ : (నవ్వుతూ) తగిలిన శరీరం కోసేసుకుంటాను. చిత్రమైన ప్రశ్నలడుగు తున్నారు.

కొత్త : వేశ్యజాతి చెడ్డకావచ్చును. గాని తాము శలవిచ్చినట్లు, చెడ్డలో మంచి వుండకూడదా ? మంచి యెక్కడున్నా గ్రాహ్యం కాదా అండి ?

సౌజ : మంచి యెక్కడున్నా గ్రాహ్యమే. గాని మీరు వచ్చిన పని చెప్పారు కారు?

కొత్త : నా పనిమట్టుకు మిమ్మల్ని చూడడమే.

సౌజ : చూడడానికి నిశీథి వేళ రావలెనా ?

కొత్త : మీ పని మించిపోకూడదని అట్టి వేళ వచ్చాను.

సౌజ : మించిపోయే పనులేవీ నా పనులు లేవే ?

కొత్త : దురవస్థలో వున్నవారి పనులల్లా తమ స్వంత పనులుగానే యోచింతురని లోకుల వల్ల విన్నాను, మరేం లేదు. అవధాన్లుగారి కేసులో గట్టి సహాయం చెయ్యగలిగిన వారి నౌకరిని నేను యెరుగుదునండి.

సౌజ : అలాగయితే మిమ్మల్ని మా పాలిట దేవుణ్ణిగా భావిస్తాం.

కొత్త : అంత మాట నాకు దక్కాలి గదా అండి ?

సౌజ : యేమి అలాగ అంటున్నారు ?

కొత్త : మరేమీ లేదు. ఆ కార్యసాధనము ఒక వేశ్యవల్ల కావలసి వున్నది. అదీ చిక్కు.

సౌజ : డబ్బు యిద్దాం.

కొత్త : ఆ వేశ్య ద్రవ్యానికి సాధ్యురాలు కాదండి.

సౌజ : అయితే మరేమి కోరుతుంది ?

కొత్త : ఆమె కోరిక అసాధ్యవఁని తలుస్తానండి.

సౌజ : అయినా యేమిటో చెప్పండి.

కొత్త : చెప్పితే మీకు ఆగ్రహం రావడమే కాని, కార్యం వుండదనకుంటానండి.

సౌజ : తనను వుంచుకోమంటుందా యేమిటి ? అది యెన్నడూ జరిగే పని కాదు.

కొత్త : ఆ ముసలి బ్రాహ్మడి దురదృష్టం ? మనవేఁం చేయగలవండి ?

సౌజ : యెంత బుద్ధిహీనురాలు! అసందర్భమైన యిలాటి కోరిక కోరతగునా ? మీరెలా మోసుకొచ్చారు, యింత అసంభావితమైన మాట ?

కొత్త : వ్యవహార విషయములు మాట్లాడుతూన్నప్పుడు మంచైనా చెడ్డయినా ఉన్న మాటలు నాలుగూ అనుకోవడం విధాయకం గదండి. ఆ మనిషి తలకి తగని వెర్రికోరిక పెట్టుకుంది అనే మాట అన్నం తినే మనిషల్లా యెరగడా అండి ?

సౌజ : నేను మన్మథుణ్ణనా నన్ను వలచింది ?

కొత్త : మిక్కిలి మంచి వారని కాబోలు.

సౌజ : సాని దానికి మంచితో పని వుండదు. అది యేదో యెత్తయి వుండాలి.

కొత్త : మృచ్ఛకటిక చదివిందేమోనండి.

సౌజ : వసంతసేనలాంటి మనిషి వెర్రికవీశ్వర్ల కల్పనలో వుండాలి గాని లోకంలో వుండదు. యేదో యెత్తు, అందుకు సందేహం వుండదు–సాధనాంతరం లేదో ?

కొత్త : తమరు ప్రశ్నలు అడుగుతారు, విన్నమాట మనవి చేస్తే ఆగ్రహిస్తారు, యేం సాధనం ?

సౌజ : శ్రీకృష్ణుడి అనుగ్రహం వల్ల ఆగ్రహమనే వస్తువును చంపుకోవడముకు సదా ప్రయత్నం చేస్తున్నాను. స్ఖాలిత్యం కనపర్చారు కృతజ్ఞుడను. చెప్పవలసినది చెప్పండి.

కొత్త : తమకు వుంచుకోవడం మనస్కరించకపోతే, తనను వివాహము కావచ్చునని కూడా ఆ మనిషి అభిప్రాయము.

సౌజ : మంచి వారిని హేళన చెయ్యవలసినదని కూడా మీ తల్లిగారి ఉపదేశం కాబోలు ?

కొత్త : మీ కృష్ణుని మీద ఆన, మీ యెడల నాకు అమాయకమైన భక్తి కలదు; తమరి యెడల తృణీకారభావము నా హృదయ మందు యెన్నడూ పుట్టదు. నమ్మండి. రాయబారి మోసుకువచ్చే మాటలకు రాయబారిని తప్పు పట్టడం ధర్మం కాదు. యివి జరిగే మాటలని నేను మనవి చెయ్యలేదు. వున్నమాట మనవి చేస్తే వకీళ్ళు గనక వేశ్య పెట్టిన చిక్కు విప్పజాలక పోతారా అని మనవి చేశాను.

సౌజ : వేశ్యలకు వకీళ్ళు సమదంతా అనా ? (నవ్వి) నేను మట్టుకు వోడిపోయానని వొప్పుకుంటున్నాను. యెగతాళిలో దించకండి. వేశ్య డబ్బొల్లకపోదు. ద్రవ్యం కోరమనండి. ఆయనైనా ఇస్తారు. నేనైనా ఇస్తాను.

కొత్త : అందాకా యెందుకండి ? తమ దాకా అక్కర లేదు. ఆ బ్రాహ్మడికి ఉపకారార్థం నేనే యిస్తును. మనిషి ద్రవ్యానికి సాధ్యురాలు కాదని మనవి చేశాను, నమ్మరా ?

సౌజ : అన్నట్టూ, మీరు గిరీశంగారి శిష్యులమంటిరి గదా! మీరు యాంటీనాచ్ కారా ? అయితే వేశ్యవల్ల యీ భోగట్టా యావత్తూ ఎలా మీకు వొచ్చింది ? యిదంతా యెగతాళా ? కుట్రా ?

కొత్త : నమ్మిన వారితో ఏమి చెప్పను ? యిది కుట్రా కాదు, యెగతాళీ కాదు. నేను అక్షరాలా యాంటీనాచ్ నే! వివేకలేశం వున్నవారు యెవరు యాంటీనాచ్ కారండి ? గాని, విధికృతం చేత నాకు వేశ్యా సంసర్గం తప్పింది కాదు.

సౌజ : యేమిటో ఆ విధికృతం ?

కొత్త : ఇది! (నెత్తిన వున్న పాగా తీసి, జుత్తును జార విడిచి వెనకకు తిరిగి, తొడుగుకున్న కోటు విడిచి, కప్పుకున్న శాలువ వల్లెవాటుగా వేసికొని సౌజన్యారావు పంతులు వేపు తిరిగి) నా వూరూ పేరూ అడిగితిరి. వూరు విజయనగరం; పేరు మధురవాణి.

సౌజ : (మొదట ఆశ్చర్యమగ్నుడై, యోచన పైని కోపావేశము కలిగి నిలిచి) యేమి మోసము జరిగినది!

మధు : గురువుల వుపదేశం గురువులే మరవకూడదు. చెడ్డలో కూడా మంచి వుండవచ్చును. కాక, మంచి చెడ్డలు యెంచే వారెవరు ?

సౌజ : యేమి దగా!

మధు : నిర్మలమైన అంతఃకరణంతో వస్తిని. నిజం దేముడెరగవలె. దగా అని తోచినది, యేమి చెయ్యగలను ? వెళతాను.

సౌజ : శీఘ్రముగా వెళ్ళవచ్చును.
(మధురవాణి పాగా, కోటూ విడిచి గుమ్మము వరకు వెళ్ళును.)

సౌజ : నిలు. నిలు.
(మధురవాణి తిరిగి వచ్చి కొంచము యెడముగా యెదుట నిలుచును.)

సౌజ : పాగా, కోటు మరిచి పోయినావు.

మధు : అంతేనా! మనసే మరచి పోయినాను. కొదవేమింటి (తిరిగి రెండడుగులు వెళ్ళును.)

సౌజ : మాట!

మధు : (తిరిగి చూసి) ఈ మాటు యేం మరచానండి ?

సౌజ : నువ్వు మరవలేదు, నేను మరిచాను. లుబ్ధావధాన్లుగారి మాటేమిటి ?

మధు : తమ మంచి లోకప్రసిద్ధమైనప్పటికీ, ఆయన యందు తమకు అట్టే అభిమానం భగవంతుడు పుట్టించలేదు.

సౌజ : ఆయనను కాపాడడముకు న్యాయమైన పని యేమి చెయ్యమన్నా చేస్తాను. అనేక సంవత్సరములాయె, వేశ్య అన్నది నా యింటికి రాలేదే. నేను వేశ్యతో యెన్నడూ మాట్లాడ లేదే, యీ నాటికి వ్రతభంగమైనది గదా అని అపారమైన విచారములో మునిగి యున్నాను.

మధు : తమరు ప్రాజ్ఞులు; వ్రతభంగమేది ?

సౌజ : నిశిరాత్రివేళ పడకింటిలో వేశ్యను పెట్టుకుని మాట్లాడడం కన్న యింకా యేమి కావలెను ?

మధు : తమరు నన్ను రప్పించ లేదే ? వేశ్యలు పార్టీలైతే, వకీళ్ళు కేసులు పట్టరో ?

సౌజ : బడతాం, పట్టం. ఏమైనా నువ్వు పార్టీవైనా కావే ?

మధు : కాను గాని – మీ పార్టీని కాపాడే మనిషిని. నేను యెవతె నైతేనేమి. నన్ను చూడ కూడదా ? అది అలా వుండగా వేశ్యలము దేవాలయములలో భగవంతుణ్ణి చూడడమునకు పోవచ్చును గదా ? సత్పురుషులైన తమ వంటి వారి దర్శనమునకు మాత్రము నిరోధమా ?

సౌజ : "మంచివారు, మంచివారు" అని పలుమారు అంటూ వుంటే నాకు లజ్జగా వుంది. ఆ మాట మరి అనకు. చూడ రావచ్చుగాని, రాత్రివేళ పడకింట్లోనా!

మధు : వేశ్యనని వర్తమానం చేస్తే పగటి వేళ చూతురో ?

సౌజ : నా శత్రువులు యెవళ్ళో నిన్ను నా దగ్గరకు పంపారు. (నఖశిఖ పర్యంతం నిదానించి) యెంతటి వాళ్ళయిన వుంటారు!

మధు : అలాగైతే తమ మంచే తమకు శత్రువై ఉండాలి. మీ కార్యం నిర్వహించి డబ్బు ఒల్లనప్పుడు కుట్రా, కూహకం లేదని నమ్ముదురా ?

సౌజ : అంత మనిషివి అయితే, పాపము ఆ బ్రాహ్మడికి ఉపకారం నీవు చెయ్యరాదా ? మధ్య నాకు గండగత్తెరేమి ?

మధు : నేను మంచి దాననని నమ్మగలరా ?

సౌజ : ఆ బ్రాహ్మణ్ణి కాపాడితే నమ్మనా ?

మధు : అయితే, ఒక తుని తగవు మనవి చేస్తాను.

సౌజ : అట్టేసేపు నువ్వు నా యెదురుగానీ నిలిచి వుంటే నువ్వు యే తగువు తీరిస్తే ఆ తగవుకు వొప్పుదల అవుతానేమో అని భయవేఁస్తూంది.

మధు : (ముఖము పక్కకు తిప్పి) ఒక్క చిన్న ముద్దుకు కరువో ?

సౌజ : అంతటితో కార్యం నిర్వహిస్తావా ?

మధు : యేం జెయనూ, మరి ?

సౌజ : నా వ్రతభంగం చెయ్యడవేఁనా నీ పట్టుదల ?

మధు : అడుగుమెట్టుకు దిగానని మెప్పు లేదు గదా ? యిష్టం లేని పని యేల చేయించవలె ? శలవు. (రెండు అడుగులు వెళ్ళును.)

సౌజ : ఆగు. (మంచం మీద కూచుని, దుప్పటి కప్పుకుని) కూచో.

మధు : కూచోను.

సౌజ : వెయ్యి రూపాయలిస్తాను. తీసుకుని బ్రాహ్మణ్ణి కాపాడు.

(మధురవాణి తిరిగి వెళ్ళబోవును)

సౌజ : వెళ్ళకు. నీకు ముద్దా కావాలి ? యేం వెఱ్ఱి మనిషివి! ఏమి లాభం ?

మధు : నాకు తెలియదు.

సౌజ : తప్పదూ ?

మధు : తప్పదనుకుంటాను.

సౌజ : అయితే, విధి లేక వొప్పుకుంటున్నాను. చిత్రం! వెయ్యి రూపాయల కంటె వక ముద్దు యెక్కువ విలువా ? ... సరే... నువ్వు చేసే సాయఁవేదో చెప్పు.

మధు : తెల్లబియ్యం పాటిమానికా.... లుబ్ధావధాన్లుగారు వివాహఁవైఁన పిల్ల ఆడపిల్ల కాదు.

సౌజ : (ఆశ్చర్యముతో) యేమిటీ!

మధు : మరిచితిని. అందులో సంబంధించిన వారికి యెవరికిన్నీ హాని రాకుండా కాపాడతాఁనని శలవిస్తేనే కాని పేర్లు చెప్పజాలను.

సౌజ : లేకుంటే చెప్పవా ?

మధు : చెప్పను.

సౌజ : లుబ్ధావధాన్లుగారి వల్ల యెవరికిన్నీ బాధ లేకుండా కాస్తాను. ఆయనకు కాక యితరులు యెవరికైనా హాని చేసివుంటే నా వశం కాదు.

మధు : చాలును. యిహ చెపుతాను. కరటకశాస్తుల్లుగారు వారి శిష్యుడికి ఆడవేషం వేసి పెళ్ళి చేశారు.

సౌజ : కరటకశాస్తుల్లా గుంటూరు శాస్తుల్లూ!

మధు : అవును. కొంచెం చిరిగెడ్డం అంటించుకున్నారు. అంతే భేదం.

సౌజ : ఔనా! అతగాడి దారుణం!

మధు : అతని వల్ల తప్పు లేదండీ; అగ్నిహోత్రావధాన్లుగారి కూతురు ఆయన మేనకోడలు, ఆ పిల్లని లుబ్ధావధాన్లుగారికి యివ్వడానికి నిశ్చయమైన సంగతి విశదమే తమకు. ఆ సమ్మంధం తప్పించుటకు కరటకశాస్తుల్లు గారు యీ ఎత్తు ఎత్తారు. ఆయనకు మాత్రం హాని రానీకండి.

సౌజ : ఔర! ఏమి చిత్రము! మేలుకున్నానా, నిద్రబోతున్నానా ?

మధు : నా ఫీజు యిచ్చి మరీ నిద్రపోండి.

సౌజ : బీదవాణ్ణి, యిచ్చుకో లేనే ?

మధు : నాకు లోకంలో ధనవఁంతా అదే అనుకున్నానే ?

సౌజ : నీవు సొగసరివి. ముద్దు చేదని కాదు. వ్రతభంగం గదా అని దిగులు. (ముద్దు పెట్టుకొన బోవును)

మధు : ఆగండి.

సౌజ : ఏమి ?

మధు : నా వ్రతమో ?

సౌజ : యేమిటది ?

మధు : చెడనివారిని చెడగొట్టవద్దని మా తల్లి చెప్పింది.

సౌజ : చెప్పితే!

మధు : అందుచేత, మిమ్మల్ని ముద్దు పెట్టుకోనివ్వను.

సౌజ : కృతజ్ఞుడనై వున్నాను.

మధు : ఆ పుస్తకము నేను చూడ వచ్చునా అండి ?

సౌజ : చూడు.
(మధురవాణి పుస్తకము విప్పి చదువును.)

మధు : భగవద్గీత. యిది మంచి వారు చదివే పుస్తకమా అండి ?

సౌజ : యిది చెడ్డవారిని మంచివారిగా చేసే పుస్తకం.

మధు : దానిలో యేముందండి ?

సౌజ : అది చదివిన వారికల్లా విలువ లేని గొప్ప స్నేహితుడొకడు దొరుకుతాడు.

మధు : ఎవరండి ఆ స్నేహితుడు ?

సౌజ : శ్రీకృష్ణుడు.

మధు : శ్రీకృష్ణుడు సానిదానితో కూడా స్నేహం కడతాడా అండి ?

సౌజ : శ్రీకృష్ణుడు తన్ను నమ్మిన వారితో అల్లా స్నేహం కడతాడు, పరమాత్మకు జాతిభేదం లేదు.

మధు : శ్రీకృష్ణుడు యాంటీనాచి కాదా అండి ?

సౌజ : యేవి పెంకెవు!

మధు : అయితే యీ పుస్తకం చదువుతాను, చదివి మంచిదానను అవుతాను.

సౌజ : కావలిస్తే ఆ పుస్తకం తీసుకు వెళ్ళు.

మధు : కృతార్థురాలను, శలవా ?

సౌజ : (వెన్ను కుర్చీవైపు చూచి యోచించి) నువ్వు మంచి దానివి. ఎవరో కాలుజారిన సత్పురుషుల పిల్లవై ఉంటావు. ఈ వృత్తి మానలేవూ ? స్థితి లోపమా ?

మధు : దైవానుగ్రహం వల్ల లోపం లేదు. నా వృత్తి యొక్క హైన్యత గుర్తెరుగుదును. సత్పురుషుల దయ సంప్రాప్తమైన తరవాత దుర్వృత్తి యేల వుంటుంది ?

సౌజ : (భగవద్గీత పుస్తకము మీదనున్న శ్రీకృష్ణుని విగ్రహమును వేలును జూపి) సత్పురుషుడనే నామము సార్థకముగా గల ఈ సత్పురుషుణ్ణి నీకు యిచ్చాను. ఆయన స్నేహం బలమైన కొలదీ మా బోంట్లను తలచవు.

మధు : అప్పుడప్పుడు తమ దర్శనము చేసుకోవచ్చునా ?

సౌజ : (తటపటాయించును)

మధు : వృత్తి మానినా, మంచి....

సౌజ : అయితే రావచ్చును.

మధు : కృతార్థురాలను. (పుస్తకము వక్షమున ఆన్చి చేతులు జోడించి) శలవు.

సౌజ : మరో మాట ? (మధురవాణి ప్రశ్నార్థకముగా కనుబొమలెత్తి చూచును) నీకు గిరీశంగారి పరిచయం యెక్కడ ?

మధు : క్షమించండి.

సౌజ : చెప్పవా ?

మధు : తాము చెప్పక తీరదని ఆజ్ఞాపిస్తే దాటగలనా ? పాపము, ఆయనను బతకనియ్యండి.

సౌజ : అతడి బతుకు మాట ఆలోచించుతున్నావు. వీడు అవ్యక్తుడైతే, పాపము ఆ బుచ్చమ్మ బతుకు చెడుతుంది. అది ఆలోచించావు కావు.

మధు : (ఆలోచించి) అవును. ఆయన నాకు కొంతకాలం ఇంగిలీషు చదువు చెప్పేవారు. కొంతకాలం వుంచుకున్నారు కూడాను.

సౌజ : యెన్నాళ్ళ కిందట ?

మధు : మొన్న మొన్నటిదాకా.

సౌజ : చిత్రం! ఒక్క నిమిషము ఆగు ? (పైకి వెళ్ళి గిరీశమును వెంట బెట్టుకుని వచ్చి) నెపోలియన్ ఆఫ్ యాంటీనాచ్ గారూ! యీమెను మీరు యెరుగుదురా ?

గిరీ : కొంతకాలం కింద గిరీశం అనే ఫూలిష్ యంగ్‌మాన్ ఒకడు వుండేవాడు. మధురవాణి అనే బ్యూటిఫుల్ నాచిడెవిల్ ఒకతె వుండేది. దురదృష్టంవల్ల దాని వలలో చిక్కి మైమరచి, అంధకారంలో పడిపోయిన మాట సత్యము. గురువుల ఉపదేశం కొంతకాలానికి జ్ఞప్తికి తెచ్చుకొని ఆ అంధకారంలోంచి

వెలువడి గురువుల పాదములు చేరుకుని, గతం కలగా భావించి, మరచి, మంచి తోవలో పడ్డాడు. ఆ గిరీశవేఁ యీ గిరీశం – ఆ మధురవాణే యీ మధురవాణి! స్వర్గానికి ఒక్క చీడీ తరవాయిగా వున్న నన్ను నరకానికి లాగడానికి తిరిగి యిక్కడ నా పురాకృతం వల్ల ఆవిర్భవించింది. ఐ టర్న్డ్ ఆల్టుగెదర్ న్యూ లీఫ్. పాపంలో కాలుజారి, పశ్చాత్తాప పడి రిఫార్ము అయినాను. నా వంటి సిన్నర్‌స్‌కి సహాయము చేసి మంచివాళ్ళని చెయ్యడం తమ బిరుదు గాని, బ్రతుకు చెరచడం న్యాయం గాదు. ఐ క్రేవ్ యువర్ మెర్సీ.

సౌజ : యెన్నాళ్ళయింది చీకట్లోంచి వెలుతురులోకి వురికి ?

గిరీ : (వూరకుండును).

సౌజ : (మధురవాణితో) నువ్వు చెప్పగలవు.

గిరీ : యెన్నాళ్ళయితే నేమండీ ? ట్రూ రిపెంటున్సు ట్వంటీ ఫోర్ అవర్సు చాలదా అండి ?

సౌ : ఔరా! నీలాంటి అషాఢభూతులవల్ల నీ గురువుగారు యెంత సులభంగా దగా పడతారూ! అరె, నన్ను కూడా భ్రమింపజేస్తివే. నిన్ను మరి చేరనివ్వద్దనీ, బుచ్చమ్మను పూనాలో విడోస్ హోముకు పంపమనీ, మీ గురువుగారి పేర టెలిగ్రాం యిస్తాను. ఆమె చదువుకుని ప్రాజ్ఞురాలై తన ఇష్టము వచ్చిన వారిని పెళ్ళి చేసుకుంటారు. లేకుంటే మానుతారు. రిఫారము అయితి వనిగదా నీవు చెప్పితివి. నిజమైతే కాలేజీలో ప్రవేశించి పై పరీక్షలకు చదువుకో. నీ ప్రవర్తన బాగున్నంత వరకు ద్రవ్య సహాయం చేస్తాను. బుద్ధి తెచ్చుకుని బతుకు. మధురవాణిని డెవిలంటివే ? నీవే డెవిల్. ఆమె నీ అయోగ్యత అయినా, నొక్కి అడిగితేనే చెప్పింది కాదు. వక సత్యకాలపు బ్రాహ్మడిని కాపాడడమే కాకుండా దుర్మార్గుడవైన నీ చేతిలో పడకుండా బుచ్చమ్మని కాపాడింది. నాకు వక మహోపకారం కూడా చేసినది. గనుక నా సంతోషమును తెలియజేయుటకు, ఇదిగో ఆమెతో షేక్‌హేండ్ చేస్తున్నాను. (షేక్ హేండ్ చేయును) నెపోలియన్! తక్షణం యింట్లో నుంచి పైకి పో

గిరీ : (గది గుమ్మము దాటి) డా'మిట్ కథ అడ్డంగా తిరిగింది!

(తెర దించవలెను)

మనుచరిత్ర
వసుచరిత్ర
ఆముక్తమాల్యద
కళాపూర్ణోదయం
శృంగారనైషధం
కుమార సంభవం
శృంగార శాకుంతలం
విజయ విలాసము
కాదంబరి
రఘువంశం
మేఘసందేశం
కాశీఖండం
క్షేత్రయ్య పదాలు
అర్థశాస్త్రము
కళలు
గీతాంజలి
గ్రీకు తత్త్వవేత్తలు
దేశభక్తి గేయాలు